ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 4 | సంచిక 4 అక్టోబర్–డిసెంబర్ 2024

మమత-సమత-మానవత
www.gurajada.org

## నవయుగ దార్శనికుడు

# గురజాడ



*“ Desamante Mattikadoi
Desamante Manushuloi ”*

*A Country is not made of land;
a country is made of it's people-1910*

*~ Mahakavi Gurajada Apparao*



*Gurajada Appa Rao's House*

## సంపాదక వర్గం



**కీ.శే. శ్రీ గురజాడ అప్పారావు**
వ్యవస్థాపక సంపాదకులు

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు

**ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు**
వరిష్ఠ సంపాదకులు

**ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి**
సంపాదకులు

**డా. సుంకర గోపాలయ్య**
సంపాదకులు

**శ్రీ మండలి బుద్ధప్రసాద్**
ప్రధాన సలహాదారు

సలహాదారులు
**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్**
**డా.వి.ఆర్.రాసాని**
**శ్రీ విహారి**
**శ్రీ గురజాడ రవీంద్రుడు**
**శ్రీమతి అరుణ గురజాడ**

**ISSN 2766-0168**
అంతర్జాల త్రైమాస పత్రిక
www.prakasika.org
editor@prakasika.org

– సంపాదకీయం –

# ధన్యోస్మి

గత నాలుగు సంవత్సరాలుగా ప్రకాశిక త్రైమాస డిజిటల్ పత్రికగా వెలువడుతోంది. ఎంతోమంది సహాయ సహకారాలతో, మరెంతోమంది రచయితల రచనలతో అందరినీ అలరిస్తున్న సమగ్ర, సామాజిక, సాహిత్య పత్రిక ప్రకాశిక. పాత, కొత్తల మేలు కలయికగా, అటు సంప్రదాయ కవిత్వ విశ్లేషణలనూ, ఇటు నేటి సమాజ సమస్యలని ప్రతిబింబిస్తూ వస్తున్న వచన కవితలని, వ్యాసాలనీ ప్రచురిస్తున్నాము.

ఈ సంచిక కు సంపాదకీయం ఏదో ఒక అంశం మీద రాసేకంటే ధన్యవాద ప్రకటన సముచితం అని భావిస్తున్నాను. మొదటి సంచికనుండి శతక సాహిత్యాన్ని, ప్రాచీన సాహిత్యంలోని కొన్ని ముఖ్య పద్యాలని, పరిచయం చేస్తూ, ప్రతిపదార్ధ పూర్వక, విశ్లేషణాత్మక వాసాలు రాస్తున్న శ్రీ ఎన్. సి. హెచ్. చక్రవర్తిగారికి ప్రత్యేక. ధన్యవాదాలు. యువ సాహితీవేత్తలని ప్రోత్సహించాలనే ఆయన ప్రయత్నంలో భాగంగా ఆయన నిర్వహిస్తున్న శీర్షికని శ్రీమతి పాలపర్తి హావీలా గారికి అప్పగించారు. హావీలా గారికి స్వాగతం, చక్రవర్తిగారికి ధన్యవాదాలు.

'మేటి కథలు, లోతైన వ్యాఖ్యలు' అనే శీర్షికతో, గత రెండు సంవత్సరాలుగా, మంచి కథలను పరిచయం చేస్తూ, వాటి మీద వ్యాఖ్యలు రాయించే మహా యజ్ఞాన్ని పూర్తిచేసిన డాక్టర్ రాసాని గారికి ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు.

నోబెల్ బహుమతి పొందిన మహిళా శాస్త్రవేత్తల పరిశోధనలను శాస్త్రవేత్తలు కాని వారికి అర్థమయ్యేలా ప్రకాశిక కోసం రాస్తున్న డాక్టర్ చాగంటి కృష్ణకుమారి గారి కృషి అభినందనీయం. ఎంతోమంది ఈ శీర్షికని ఇష్టపడుతున్నారు. ఆవిడకి ధన్యవాదాలు.

సహాయ, సహకారాలు అందిస్తున్న సంపాదకవర్గ సభ్యులకు, వ్యాసాలు రాసిన, రాస్తున్న రచయితలకు, పత్రికని ఆకర్షణీయమైన కూర్పుతో అందిస్తున్న శ్రీ వెంకట్ గారికి, అందమైన ముఖచిత్రాలతో ప్రతీ సంచికనీ ముస్తాబు చేస్తున్న శ్రీ శివాజీ గారికీ అభినందనలు, ధన్యవాదాలు.

ప్రకాశికని మరెన్నో విలక్షణమైన శీర్షికలతో, వ్యాసాలతో పాఠకులకు అందించే ప్రయత్నంలో మరెందరో, మీరందరూ, పాలుపంచుకుంటారని ఆశిస్తున్నాను.

భవదీయుడు

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ**

ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

# ముఖచిత్రం

నవయుగదార్శనికుడు
గురజాడ




## లోపల

రంకె ................................................................ 6
మాంత్రిక వాస్తవికతలో రైతు “రంకె” .............................. 24
కవి రేడు మన గురజాడ..! ............................................ 29
తెలుగు, గుజరాతీ అనుబంధాలు–ఒక పరామర్శ ...................... 31
నా భూమి చదరమా? ................................................. 41
ఓగు ..................................................................... 54
త్యాగయ్య, అన్నమయ్య రచనలలో సామాజిక ధోరణి .................. 57
క్షీరదాల ఘ్రాణేంద్రియ వ్యవస్థ ఎలా పని చేస్తుంది ?–
వైద్య రంగంలో 2004 సంవత్సరపు నోబెల్ పరిశోధన ............... 77

**గురజాడ రచనలలో భాషా విశేషాలు**

గురజాడ కథలు–నిర్మాణ కుశలత, భాషా సౌరభం ..................... 89
గురజాడ గ్రాంథిక ప్రయోగాలు ........................................ 101
తెలుగుజాడ గురజాడ ................................................. 110
కన్యాశుల్కంలో భాషా వైవిధ్యం – ఆంగ్ల అనువాదాల పరిశీలన..... 131
గురజాడ గాత్ర హారం, ముత్యాల సరం ................................. 150

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు, ఆయా రచయితల స్వంతం. పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధమూ లేదు.

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# రంకె



శ్రీ బండి నారాయణస్వామి
✆ 88865 40990

"నేను చచ్చిపోయి ఇప్పటికి ఎనిమిది దినాలయ్యింది" అనుకున్నాడు వరదప్ప. అతడు కళ్ళు నులుముకుని లేచేటప్పటికి ఒక కాంతి వృక్షం కింద ఉన్నాడు. ఏ అగాథాల్లోని నక్షత్ర వివహమో భళ్ళుమని ముంచెత్తుతున్న పాలపుంత వెలుగుల్లోంచీ ఆ కాంతి వృక్షం విడిగా లేదు. ఆ చెట్టు కింద కాంతి చర్మంతో మేల్కొన్న వరదప్ప కూడా విడిగా లేడు. ఆకాశమూ, వృక్షమూ, వరదప్ప అన్నీ ఒకే కాంతితో తయారై, ఆ ఒకే కాంతిలోనే మునిగిపోయి కన్పిస్తున్న పారదర్శక అద్భుతం.

వరదప్ప హృదయంలో చల్లగా వెలిగే చిత్తకాంతి – తాను భూమ్మీద బతికి ఉండగా ఎప్పుడైనా కలిగిందా ఈ చిత్తకాంతి? ఎట్లా కలుగుతుంది. అనంత రైతుగా జన్మ ఎత్తింతరువాత!



'హమ్మయ్య! నేను మంచిపనే చేసినాను. పురుగుల మందు తాగి చచ్చిపోయి! లేకపోతే ఈపాటికి ఇంకా ఆ అప్పులోళ్ళ మధ్యే నరకం అనుభవిస్తూ ఉందును' అని తేలిక పడిన మనసుతో గుండెనిండా గాలి పీల్చుకోబోయినాడు. కానీ ఆ లోకంలో గాలి లేదు. కాంతిని మాత్రం పీల్చవచ్చు.

వరదప్ప శాంతిగా కూర్చుని కాంతిని శ్వాసిస్తూ ఉండగా అతని చుట్టూ అలుముకున్న కాంతిలోంచి దోసెడు కాంతి,

పదార్థం మాదిరి ఘనీభవించి రెండు కాంతి ఆకారాలుగా సాగినాయి.

దేవతలు ప్రత్యక్షమైనట్టు అబ్బురపడి లేవబోయినాడు వరదప్ప. చూసుకుంటే అప్పటికే తాను నిలబడి ఉన్నాడు. లేచి నిలబడటానికి తాను చేసిన ప్రయత్నం ఏమీ లేదు. నిలబడల్ల అనుకున్నాడు. నిలబడి ఉన్నాడు. అనుకున్నాడు. జరిగింది! అంతే!!

స్వర్గానికి పోవలసిన ఈ రైతుకు శిక్ష విధిస్తున్నందుకు బాధపడుతున్నాను. అయినా తప్పదు. చట్టం చట్టమే

"రైతుల్ని న్యాయవిచారణ చెయ్యం. రైతుల్ని ఎక్కడా ఆపకుండా స్వర్గానికి తీసుకుపోవాలని మీకు తెలీదా?" అని కఠినంగా దండించినాడు దేవదేవుడు.

దేవదూతలు వినయంగా చేతులు జోడించి –

"ప్రభువా! మమ్మల్ని అంత కఠినంగా దండించవద్దు. భూమిపుత్రులను స్వర్గానికి తీసుకుపోవాలని మాకు తెలుసు. కానీ ఈ వరదప్ప భూమికి తన పూర్తికాలం సేవ చేయకుండానే మధ్యలో పారిపోయి వచ్చినాడు. తాను మోయవలసిన సంసారం బరువును ఒక్క భార్య మీదికే తోసేసి వచ్చినాడు. పురుగుల మందు తాగి వ్యవసాయం నుంచి విముక్తి పొందాలనుకున్నాడు" అని విన్నవించుకున్నారు దేవదూతలు.

లక్షల సూర్యుళ్ళ కాంతిని కూడా అధఃకరించగల ఆ దేవదేవుని ముఖం దిగులుగా మారిపోయింది.

"స్వర్గానికి పోవలసిన ఈ రైతుకు శిక్ష విధిస్తున్నందుకు బాధపడుతున్నాను. అయినా తప్పదు. చట్టం చట్టమే" అని సాలోచనగా చూసినాడు దేవదేవుడు. అప్పుడు వరదప్ప చేతులు జోడించి విన్నవించుకున్నాడు.

"నన్ను ఆకాశం మోసం చేసింది. సరే! ఆకాశానికి నేను ఓటేయలేదు కదా! వ్యవసాయం మార్కెట్టు మోసం చేసింది. సరే! వ్యాపారస్తులకూ నేను ఓటు వేయలేదు కదా! మరి దేవా? నాతో ఓట్లేయించుకున్న రాజకీయ నాయకులు కూడా నన్ను మోసం చెయ్యొచ్చా?"

రైతుగా తనను భూమ్మీద ఇంకా ఎవరెవరు ఎట్లెట్ల మోసం చేసిందీ వరదప్ప వివరించబోతుంటే మధ్యలో అడ్డుకుని దేవుడు దయగా నవ్వినాడు.

కాంతి లోకం లోంచి మట్టి ఆవరణంలోనికి అడుగు మోపగానే వరదప్ప కాంతి శరీరం గాలి శరీరంగా మారిపోయింది.

“నీకు జరిగిందంతా నాకు తెలుసయ్యా. కానీ, చివరికి నువ్వు చేసిందేమిటి? అంతా కలిసి నిన్ను మోసం చేస్తే నువ్వు నీ ఆలుబిడ్డలను మోసం చేస్తావా? అప్పుల బరువును నీ ఆలుబిడ్డల మీద మోపి నువ్విట్లా హాయిగా చేతులూపుకుంటూ రావడం న్యాయమా? ఒకసారి భూమ్మీదకి పోయిరా! అక్కడ నిన్ను నమ్ముకున్నవాళ్ళు ఎన్ని బాధలు పడుతున్నారో చూసిరా! అప్పటికీ నువ్వు ఆత్మహత్య చేసుకోవడమే మంచిదయింది అని నీకు తోస్తే నువ్వు కోరుకున్నట్లే నిన్ను స్వర్గానికి పంపుతా!”

★★★

వరదప్ప ఎదురుగా వెలుగు వాతావరణంలో చుక్క ఏర్పడి, అది చిల్లిగా మారి ఆ తరువాత చీకటి సొరంగంగా ఏర్పడితే, ఈసారి వరదప్ప ఆ సొరంగంలోకి దూరి జారుతూ జారుతూ వస్తున్నాడు కిందికి.

ప్రయాణం చేస్తున్నట్లే ఉంది. కానీ ప్రయాణం చేయడానికి తనకంటే వేరుగా స్థలం లేదు. అసలు స్థల కాలాలు మనిషిలో ఉన్నాయా? లేక స్థల కాలాలలో మనిషి ఉన్నాడా?

కాంతి లోకంలోంచి మట్టి ఆవరణంలోనికి అడుగు మోపగానే వరదప్ప కాంతి శరీరం గాలి శరీరంగా మారిపోయింది.

ఏవేవో పూర్వ వాసనల్! అనుభవాల జ్ఞాపకాల్! సంబంధ బాంధవ్యాల్! ఇష్టానిష్టాల్! అలవాట్లూ, అభిరుచుల్! భూగోళమ్మీద మనిషికి తప్ప ఇతర ఏ జీవికీ లేని అప్పుల బాధల జ్ఞాపకాల్!

‘నా భూమి! నా భూమి... నా భూమి అట్లే ఉందా? లేక కొంజేటి నారాయణశెట్టి తన్నుకుపోయనాడా?’



అప్పటికి తన భూమిలోని వేపచెట్టు కింద దయ్యం మాదిరి కూర్చొని ఉన్నాడు వరదప్ప. లేచి మట్టివాసన చూసినాడు. అది తన భార్యాపిల్లల చమట వాసన!

అమ్మయ్య! ఇదినా భూమే! అని నిశ్చయం చేసుకొన్నాడు.

అది నాలుగెకరాల ఎర్రనేల! తన చావుకు కారణమైన బోరుబావి అదిగో, వంకకు ఆనుకొని ఉన్న ఈశాన్యపు మూల. వంక పారక పజ్జెనిమిదేళ్ళు దాటింది. అయినా ఇసుక పర్రల్ని మొండిగా కరచి పట్టుకున్నాయి పొట్టి ఈతచెట్లు.

ఎండిపోయిన ఏరును చూస్తే తన తండ్రి గుర్తొస్తాడు వరదప్పకి. ఏరు ప్రవహించే కాలంలో దాని పక్కన గుంత తోడి, ఆ గుంతలోకి నీళ్ళు మళ్ళించి, ఆ గుంతలోని నీళ్ళని తోలుబొక్కెనతో కాలవలోకి తోడి, పంటచేను తడిపేవాడు, అతని తండ్రి! అతడు రాత్రి వల వేసి పొద్దునికి కొడదలు పట్టి తెచ్చేవాడు. ఒకసారి ఏట్లో నిలబడి తండ్రి నవ్విన నవ్వు ఇప్పటికీ వరదప్పకు జ్ఞాపకం – ఏట్లో కాళ్ళకు తాబేలు తగిలి, దాన్ని పట్టబోయి, అది చేతుల్లోంచి జారిపోతుంటే కాళ్ళతో తొక్కిపట్టి దాని కదలికల స్పర్శకు పగలబడి నవ్వి, రెండు చేతుల్తో పట్టి ఎత్తి గబుక్కున గట్టున విసిరేస్తే కాసేపటికి బోర్లించిన చిప్పలోంచి నిగిడిన తాబేలు మెడ విచిత్రంగా! ఇప్పుడు ఆ ఏరూ లేదు. నీళ్ళూ లేవు. వప్పూరి రామాచార్యులు చెప్పిన ఆ గుడ్డి మేఘమే గతి!!

రెండు దినాల కిందట వాన వచ్చి పదునైంది. భూమిని తిరగ్గొట్టినారు. విత్తేదానికి సిద్ధంగా ఉన్నారు. వేపచెట్టు కింద కూర్చున్న వరదప్పకు అల్లంతలో కనిపించిన దృశ్యం.

అతని భార్య విత్తనం వేసే గొర్రును భుజమ్మీద మోసుకొని వస్తూ ఉంది. తన పదహారేండ్ల కూతురు విత్తనం కాయల మూటను మోయలేక మోసుకొస్తూ ఉంది. ఆరో తరగతి కొడుకు బడి ఎగ్గొట్టి ఎద్దును తోలుకొని వస్తూ ఉన్నాడు.

ఇంకొక ఎద్దు ఏదీ?



అయ్యో! అప్పులవాళ్ళు పట్టుకుపోయినట్లున్నారు. లేకపోతే తన ఇంట్లో వాళ్ళే తన అంత్యక్రియలకు దాన్ని అమ్మిపారేసినారేమో!

మల్ల ఇప్పుడు వీళ్ళు ఏం చేస్తారు? ఒక ఎద్దుతో సేద్యమా?

ఆ ఎద్దు నుదుట కూతురు కుంకుమ పూసింది. కొడుకు గొర్రుమోటికి కొబ్బరికాయ కొట్టినాడు. ఎద్దుకు బెల్లపుంటను ప్రసాదంగా తినిపించింది భార్య. అట్ల భూమికి పూజ చేసి అదే ప్రసాదం బొరుగుల్ని తాము పంచుకొని తిన్నారు. ఆ తర్వాత ఆకాశానికి మొక్కుకుని పని ప్రారంభించినారు వాళ్ళు ముగ్గురూ.

వరదప్ప భార్య లేచింది. కొంగు బిగించి బొడ్లోకి దోపుకుంది. గుంటకకు ఒకవైపు ఎద్దును కట్టింది. మరోవైపు కాడిని తన మెడ మీద మోపుకుంది. కూతురు గోచి పోసుకుని గోచిలో ఇత్తనాలు నింపుకొని గొర్రు పట్టుకుని విత్తడానికి సిద్ధంగా ఉంది.

"అదిలించరా ఎద్దుని"

ఒక కాడిని ఎద్దు ఈడిస్తూ ఉంది. పక్కన ఇంకొక కాడిని వరదప్ప భార్య ఈడుస్తా ఉంది.

తన భార్య ఎద్దు మాదిరి కష్టిస్తుంది. ఇప్పుడు నిజంగా ఎద్దే అయింది. ఎవరికోసం? తన కూతురు కోసం. తన కొడుకు కోసం! అయ్యో! నేను చచ్చిపోకుండా ఉంటే, ఇప్పుడు నా భార్య మోసే కాడిని నేను మోసేవాన్ని కానా??

కాలం గడుస్తా ఉంది. సేద్యం చేసిన చాళ్ళలో బెత్తెడు బెత్తెడు దూరంగా వేరుశనగ విత్తనాలు పడుతున్నాయి. కూతురు పిడికిట్లోంచీ.

ఆ చల్లటి పొద్దుటిపూటే తన భార్య తలలోంచీ చెమటలు పుట్టి, ధారాపాతంగా కొప్పుల్లోంచీ మెడ కిందికి జారిపోతూంటే..

“అమా! మా! కొంచెంసేపు అలుపు తీర్చుకో! నేను మోసుకుంటా కాడి?” అని వెనుకనుంచీ కూతురు అరిస్తే,

“ఇంకొంచెం సేపు పోనీయమ్మా! తర్వాత నీకెట్లా తప్పదు కదా” అని ఎద్దుతో బాటు కాడి మోసుకుని, ఆ కాడిని రెండు చేతుల్తో పెనవేసుకుని ఈడుస్తున్న భార్య.

వరదప్పలో ఏదో తప్పు చేసినాను అన్న భావం తొలిచివేస్తూ ఉంది. అయినా తన గాలి శరీరానికి కన్నీళ్ళు రావే! ఎంత ప్రారబ్ధం?

గంట గడిచింది.

కాడి తన మెడ మింద మోసుకుని ఈడ్చేది మొదలుపెట్టింది కూతురు.

మొదటగా కూతురు పుడితే, ఇంటికి మహాలచ్చిమి వచ్చిందని ఆ పేరే పెట్టుకున్నాడు వరదప్ప.

కూతురు గుంటకను ఈడుస్తా ఉంటే, తల్లి గోసిలో ఇత్తనాలు పోసుకుని ఒకటీ రెండూ జారవిడుస్తా ఉంది.

ఏదో అనుమానమొచ్చి, చప్పున ఆగింది కూతురు. మెడనుంచీ కాడిని దించి వెనక్కి వచ్చి చాలులో ఇత్తనాలను తేరిపార జూసి అరిచింది.



“మా! అందుకే నిన్ను మా నాయన తిడతాండె. చూడు, పడినచోట నాలుగైదు ఇత్తనాలు పడినాయి. లేనిచోట లేనేలేవు. ఇట్లేనా ఇత్తనమేసేది?”

భోరున ఏడుస్తా కిందికి కూలబడింది తల్లి.

“ఇత్తనమేస్తుంటే మీ నాయనే గుర్తుకొస్తున్నాడే లచ్చిమీ! తిట్టే! మీ నాయన బదులు నువ్వన్నా తిట్టే!”

“అమా! మా!!” అని ఏడుస్తా, తల్లని భయంతో చుట్టేసుకుంటున్న కొడుకు.

> నాకంటే నా కొడుకే మేలు. వాని మాదిరి మాట సాయం చేసేదానికి కూడా నాకు రాదే! ఉత్త గాలినోరు!!

వరదప్ప గాలి శరీరంలో, ఇంకా ఏమూలో హృదయం మిగిలి ఉన్నట్లు నొప్పి! దుఃఖం!!

గంటయినా, రెండుగంటలయినా తల్లి బతిమాలుతున్నా మెడమీద కాడిని వదలకుండా ఈడుస్తున్న తన కూతురు! తన ఇంటి మహాలచ్చిమి!!

ఆ ముగ్గురూ వేపచెట్టు కింద చేరి, ముద్దను అరచేతిలో పెట్టుకుని, విరిచి విరిచి ఊరిబిండిలోకి అద్దుకు తింటూ వారు మాట్లాడే మాటలూ, నెమరేసుకునే జ్ఞాపకాలూ అన్నీ వరదప్ప చుట్టుకారమే తిరుగుతున్నాయి.

"నాయన బీడీ ముట్టించే ముందు కాఫీ అడుగుతాండె కదామా?" అంటున్న కూతురు.

'అయ్యో! నేనంటే ఎంత నెర్లు వీల్లకు. ఆ కాంతిలోకంలో వీళ్ళు గుర్తుకు కూడా రాలేదే నాకు? ఎంత నమ్మకద్రోహిని. పైగా స్వర్గానికి ఎందుకు పంపవు నన్ను అని ఆ దేవునితో బుద్ధి లేకుండా వాదులాడితినే! నేను మనిషిని కాను, నాకంటే పసరం మేలు' అని తల్లడిల్లిపోయినాడు వరదప్ప.

ఆ మధ్యాహ్నం ఎండ ముఖం మీద కొడతావుంటే, గొర్రును మెడమీద మోసుకుని ఈడుస్తున్న భార్య దగ్గరకు పరుగెత్తింది వరదప్ప గాలి శరీరం.

"ఏమే! తీ! ఇడుసు! కాడి ఇడిసిపెట్టు. నేనున్నానే! నేను ఈడుస్తానే" అని కాడిని చేతుల్తో పట్టుకుంటే... చేతులేవీ? గాలిచేతులు!

"నేనూ కొంచెం సేపు ఈడుస్తామా!" అని ఉబలాటపడుతున్న కొడుకు. ఆ మాటకే తల్లి మురిసిపోతుంటే;

'నాకంటే నా కొడుకే మేలు. వాని మాదిరి మాట సాయం చేసేదానికి కూడా నాకు రాదే! ఉత్త గాలినోరు!! అనుకుని కుమిలిపోయినాడు వరదప్ప.

హఠాత్తుగా కళ్ళు బైర్లు కమ్మి కాడి వదిలేసి కుప్పకూలిపోయింది భార్య. కూతురూ, కొడుకూ ఏడ్పుగొంతుతో అరుస్తున్నారు. తల్లిని అటూ ఇటూ కుదుపుతూ.

'అయ్యో నువ్వు పోతే ఎట్లనే? పిల్లోల్ల గతి ఏం కావల్లనే? సావద్దే! బతుకే!' అంటూ ఆమె శరీరం చుట్టూ వెర్రిగంతులేస్తున్న వరదప్ప గాలి శరీరం.

స్వర్గం నుంచీ కిసుక్కున నవ్వినట్లున్న గొంతు.

"ఏం వరదప్పా? నువ్వేమో హాయిగా చచ్చిపోవచ్చు. నీ భార్య మాత్రం నీ పిల్లల కోసం బతికి ఉండాల్నా? నీ సంసారం బరువును నీ భార్య ఒక్కతే మోయల్నా? ఏం న్యాయమయ్యా నీది?"

ఘూత్ బేవార్సి నా కొడకా! అని ఒడిలో కూర్చున్న కొడుకుని విదిలించి పారేసింది తల్లి.

★★★

ఆ దినం మధ్యాహ్నం చంకల్లో పిగిలిపోయిన రవికను సూదీ దారంతో కుట్టుకుంటూ ఉంది కూతురు! కొడుకును కూర్చోబెట్టి వంగదీసి తలలో పేన్లు చూస్తా ఉంది వరదప్ప భార్య.

అవునవును. అప్పుడప్పుడు ఇది నన్నూ ఇట్లే వంగదీసి తలలో పేన్లు చూసేది. చిక్కంటితో దువ్వి ఈపులు ఇరిసేది అని వరదప్ప తన గాలి తలను గాలి చేత్తో నిమురుకుంటూ ఉండగా.

"నాయనా! రేపు నీవు చేన్లోకి పోవల్ల. సాల్లలో ఏసిన ఇత్తనాలను ఆ పాడు కోతులు తవ్వుకుని తింటాయి. దాన్లని అదిలించల్ల."

"పోమా! ఇప్పటికే మూడు దినాలు ఎగిరిపోయింది బడి. లెక్కలు చానా అయిపోయింటాయి."

"బడి ఇడిసిపెట్టు నాయనా! మన పరిస్థితి బాగా లేదు."

"ఏమో పో! నేను బడికి పోతా! బాగా సదువుకుని అయ్యవారు కావల్ల అని చెప్తాండె నాయనా!"

"ఘూత్ బేవార్సి నా కొడకా!" అని ఒడిలో కూర్చున్న కొడుకుని విదిలించి పారేసింది తల్లి.

ఈ సంసారం బరువంతా నేనొక్కదాన్నీ మోయాల్నా? ఏడీ పిలుసు మీ నాయన్ను!

"నీ సదువుకు మీ నాయన ఇక్కడ ఏమన్నా మూటా ముల్లె గంటేసి పోయినాడేంరా? ఇంట్లో పెండ్లి కెదిగిన పాపను పెట్టుకుని, ఆ పాపను ఒక అయ్య చేతిలో ఎట్ల పెడదామా అని నేను ఎత పడుతుంటే సదువో సదువో అని అంగలారుస్తావేమిరా ముదనష్టం నా కొడకా!"

చిన్న గొంతుతో మూలిగినాడు కొడుకు.

"కోతుల కాయిలికి అక్కను పంపితేనేమో!"

"ఈడొచ్చిన ఆడపిల్లను అడవిలోకి ఒంటరిగా పంపేది ఎట్లరా, దున్నపోతా?" అని అరిచింది అసహనంగా.

తెగించినట్లు దృఢంగా అన్నాడు కొడుకు

"ఏమో పో! నేను పొయ్యేదే! నాయనే బతికింటే నన్ను సదువు ఇడిపించేవాడా?"

"ఎవడ్రా మీ నాయన? పురుగుల మందు తాగి సచ్చి ఆయన స్వర్గానికి పోతే, ఈ సంసారం బరువంతా నేనొక్కదాన్నీ మోయాల్నా? ఏడీ పిలుసు మీ నాయన్ను! తండ్రీ కొడుకులిద్దరినీ కలిపి పరకతో కొడతా!"

రోషపడుతూ చూసినాడు కొడుకు.

"మా నాయన్ను ఏమన్నా అన్నావంటే చూడు."

"ఏం చేస్తావురా? ఏం చేస్తావు?" తల్లి పొయ్యి పక్కనున్న ఊపుడుగొయ్యి తీసుకుని కొడుతుంటే, ఆ కొడుకు అలవాటు ప్రకారం –

"నా! నాయనా! అమ్మ నన్ను సంపేస్తాంది. రా! నాయనా!" అని అరుస్తుండగా కొడుకును ఆర్తిగా చుట్టేసుకున్నాడు వరదప్ప! గాలి శరీరం!! తండ్రి గాలి శరీరంలోంచీ దూరి ఊపుడుగొయ్యి దెబ్బలు పడుతుంటే 'రా! నాయనా' అని అరుస్తున్న కొడుకు.

వరదప్ప గాలి శరీరమంతా పాపపు మూటైంది. కొడుకు చేను నుంచీ

కోతులు తోలుతూ తల్లి దెబ్బలకు అడ్డం పెట్టిన చేతివేళ్ళకు పడిన ఊపుగుడొయ్యి దెబ్బలు చూసుకుంటూ ఎక్కిళ్ళు పట్టి ఏడుస్తూ...

'నా చిట్టీ చేతులు చక్కటి రాతలు నేర్వలేదయ్యో!..'

వరదప్ప గాలి శరీరంలో ఖేదం నిప్పులా రాజుకుంది.

అయ్యో! తన కొడుకు రాత కూడా ఇంతేనా? తన తండ్రి మాదిరీ తన మాదిరీ తన కొడుకు కూడా సేద్యంలో కూరుకుపోవలసిందేనా? వ్యవసాయ వృత్తికే కాదు. తమ ఆత్మహత్యలకు కూడా తన కొడుకు వారసత్వం పొందవలసిందేనా?

చేను పక్క ఏరు ఎండిపోయిన అయిదేండ్లకు వరదప్ప తండ్రి బావి తవ్వించినాడు. తవ్వించిన అయిదేండ్లకు ఆ బావి ఒక్క నీటిచుక్క లేకుండా ఎండిపోయింది. బావి మీద చేసిన అప్పే వరదప్ప తండ్రికి ఉరితాడయింది.

ఇరవై ఏండ్లు గడిచినాయి. వరదప్పకు ఒకదినం అత్యాశతో కూడిన ఆలోచన వచ్చింది. తన చేనులో బోరు వేయించి పంట పెట్టాలనే కోరిక అతని బుర్రను కుమ్మరిపురుగు మాదిరి తొలిచేసింది. ఇన్నూరు అడుగులు పైపులు దింపినా బోరులో చుక్క నీరు పడలేదు. వ్యవసాయ బోరు మీద చేసిన అప్పే వరదప్పకు పురుగుల మందు అయింది.

★★★



వరదప్ప పెళ్ళాం కూరగాయల మండీకి పోయి గంపెత్తి అరుస్తూ వీధి వీధి తిరుగుతూ ఉంది.

అవునవును. పెళ్ళాం కూరగాయలు అమ్ముతానంటే రోషమొచ్చి, మనం రైతులమే! యాపారస్తులం కాదు. అని గర్జించిన సందర్భం లేదా? ఇప్పుడూ.. ? దానికి స్వేచ్ఛ! కూరగాయలు అమ్మీ బతకొచ్చు. పిండి మిరపకాయలు చేసుకుని బతకొచ్చు. ఇప్పుడది బతికేదానికి తన మీసాలు అడ్డం రావు.

బెండకాయల్, బీరకాయల్, టమోటాలూ, వంకాయల్, కోతిమీరా, కరివేపాకమ్మో...! అని మెడను నలగదీసే ఆ గంప కింద ఆయమ్మ కూతలేస్తుంటే, ఏం సహాయం చేయలేని అసమర్థుడై గాలి శరీరంతో వెంబడిస్తున్న వరదప్ప.

"ఓ కూరగాయలాయమ్మో! ఇక్కడ రా!" అనే పిలుపు ముంగిట పెళ్ళాం ఆగి గంప దింపుతుంటే – వద్దు వద్దు. ఇక్కడ ఆగవద్దే! నాశనమైపోతావే!! అని అరుస్తున్న వరదప్ప.

దేవుడా నన్ను క్షమించు. కట్టుకున్న భార్య బోగం కొంపల పాలబడుతుందని తెలిసివుంటే, నేను ఆత్మహత్య చేసుకునేవాణ్ణా?

ఆ ఇల్లు ఎవరిది? ఎవరిదీ కాదు. పల్లెటూళ్ళ నుంచీ బతకడానికి వచ్చిన రైతు ఇల్లాళ్ళు వేశ్యా వ్యాపారం చేసుకునే ఇల్లు!

తన చుట్టుకారమూ ఏనుగుమాదిరి బలిసి ఉంది ఆ బ్రోకర్ ఆడమనిషి. ఏదో అడుగుతా ఉంది. తన భార్య వెతలు వెల్లబోసుకుని కంట్లో నీళ్ళు కొంగుతో ఒత్తుకుంటూ ఉంది. బ్రోకరాడమనిషి తన భార్య కష్టాలను విచారించి అట్లా జాలి ఒలకబోస్తుంటే –

'అయ్యో! ఇక్కడ వద్దే! పో! ఇది బోగం కొంప! మోసపోతావ్! నిన్ను ఉచ్చులోకి లాగుతారు. పో! పోయే!!' అని భార్య చెవిలో ఇల్లు కట్టుకుని అరిచినా, తన గాలిమాటలు వినపడవే, 'దేవుడా నన్ను క్షమించు. కట్టుకున్న భార్య బోగం కొంపల పాలబడుతుందని తెలిసివుంటే, నేను ఆత్మహత్య చేసుకునేవాణ్ణా?'

★★★

తన ఇల్లు చేరి చంకలో మోచేత్తో అదుముకున్న ఉత్త గంపను మూలకు పెట్టి పైటచెంగుతో చెమట ముఖాన్ని ఊపుకుంటూ బైటికి రాగా –

ఇంటిముందు అరుగు పక్కన ఆడంగుల వికవికలు, పకపకలు.

రోషమొచ్చిన తల్లి ఇంట్లోకి దూరి "ఏమే లచ్చిమీ? ఎవడొచ్చినాడు ఇంట్లోకి నేను లేనప్పుడు? ఎవన్ని రానిస్తివే? నీ పెండ్లి కోసరం నేను పడరాని పాట్లు పడుతుంటే, ఎవనితో నీ సరసం గ్రంథ సాంగురాలా?" అంటూ కూతుర్ని దభీదభీ మని గుద్దింది.

“అయ్యో? నా మహాలచ్చిమిని సంపొద్దే! అది తన అయ్యవారే వస్తే నీళ్ళిచ్చి కూర్చోబెట్టి మాట్లాడిచ్చి పంపించింది. నాకు తెలుసు. నేను అప్పుడు దాని పక్కనే ఉన్నా! నా మాట వినవే!!” అని వరదప్ప తన గాలి శరీరంతో చుట్ర గాలి మాదిరి కొట్టుకుంటున్నా ఆయమ్మ చెవిలో పడక –

“మీ నాయన బతికుంటే ఇంత బరితెగించేదానివా? ఎందుకే నీ బతుకు, సావక...?”

“అయ్యో! నా బిడ్డని అంత మాట అనొద్దే!” అని వరదప్ప అడ్డం పోయినా, కూతుర్ని మళ్ళీ పిడికిళ్ళతో గుద్దబోతుంటే..

“అమ్మా! నాకేం తెలీదమ్మా!” అని ఆ పెళ్ళీడు పాప. “నాయనా! ఎక్కడున్నావు నాయనా! నేను తప్పు చేయలేదని అమ్మకు చెప్పు నాయనా” అని దుఃఖంతో అరుస్తుండగా...

వరదప్ప ఆత్మలో దుఃఖపు మూలుగు – అమ్మా! తల్లీ!! లచ్చిమీ!!!

ఆ సాయంత్రం...

‘నాయనా! నాయనా! నువ్వుంటే నాకిట్లా జరిగేదా? నా మీద ఇంత నింద వేస్తే, చూస్తూ ఊరుకునేవానివా?? నేనూ నీ దగ్గరికే వస్తా నాయనా?’ అని కూతురు రోషపడి ఏడుస్తూ, ఎండిన చెరువు కట్టమీద గన్నేరుకాయలు నూరుతుండగా –

వరదప్ప గుండెలో గునపాలు దిగినట్లు – ‘తల్లీ! వద్దమ్మా!’ అని అరిచినాడు.

నూరినదంతా గిన్నెకెత్తుకుని నీళ్ళు కలుపుకుని తాగబోతూ ఉంది కూతురు.

తన కూతురి చేతిలోని విషం గిన్నెను పక్కకు తోసివేసే బలం లేని గాలిచేతుల్తో గాలితల బాదుకుంటూ...

వరదప్ప కాంతి కాంతిగా పొంగి విరిగి నలుపు నలుపుగా మారి, కూతుర్ని కాపాడుకోలేని బేలతనంతో ఒక్కపెట్టున అరిచినాడు.

‘దేవుడా తప్పు చేసినాను. నా కూతుర్ని కాపాడు.’

★★★

వరదప్ప ఎదురుగా గాలి వాతావరణంలో తెల్లటి చుక్క ఏర్పడి పాలసుడిలా గింగిరాలు తిరిగి, కాంతి సొరంగం ఏర్పడితే దాంట్లో వరదప్ప కాంతి శరీరం పొంది తేలిపోతున్నాడు పైకి!

అతనికి రెండువైపులా దేవదూతలు తేలుతూ దారి చూపించగా దేవదేవుని ముందు చేతులు కట్టుకుని నిలబడినాడు.

ఆత్మహత్య చేసుకుని భార్యాబిడ్డలకు నరకం చూపించిన నాకు స్వర్గానికి పోయే అర్హత ఎక్కడుంది మహాదేవా?

''చెప్పు వరదప్పా! నువ్వు ఆత్మహత్య చేసుకుని ఏం సాధించినావో చెప్పు!'' అన్నాడు దేవుడు. భూమ్మీద కిసుక్కున వినిపించిన ఆ గొంతే ఇప్పుడు పరమ గంభీరంగా మారిపోయింది.

''నేను, ఆత్మహత్య చేసుకోవడం తప్పే అని తెలిసివచ్చింది దేవదేవా!'' తల వంచుకున్నాడు వరదప్ప.

''మరి నిన్ను స్వర్గానికి పంపించమంటావా?''

చదువు చంక నాకిపోయిన కొడుకూ, బోగం కొంపల ముంగిట్లో భార్యా, గన్నేరుకాయలు నూరుకునే కూతురూ...భూమ్మీద జ్ఞాపకాలకు తల విదిలించినాడు వరదప్ప –

''ఆత్మహత్య చేసుకుని భార్యాబిడ్డలకు నరకం చూపించిన నాకు స్వర్గానికి పోయే అర్హత ఎక్కడుంది మహాదేవా?''

దేవుడు సాలోచనగా చూసినాడు –

''స్వర్గానికి పోనంటావ్. అది నీ ఇష్టం. రైతును నరకానికి పంపించకూడదు. అది నా సూత్రం. మరి నీకు ఏ శిక్ష వెయ్యమంటావో చెప్పు.''

వరదప్ప చేతులు జోడించి ప్రార్థించినాడు –

''దేవా! నాకు స్వర్గమూ వద్దు. నరకమూ వద్దు. నన్ను నా భూమి మీదికే పంపు.''

దేవుడు ప్రసన్నంగా నవ్వినాడు.

“సరే. అట్లే పంపుతా. ఈసారైనా సత్యం బోధపరుచుకో! నువ్వు భూమమ్మ రుణం తీర్చుకోవాలంటే రెండే మార్గాలు. ఒకటి, మనిషి కోసం పోరాడేది. రెండు, మనిషికి సేవ చేసుకుంటూ బదికేది. ఈ కర్మ మార్గాల్లో నువ్వు దేన్ని ఎన్నుకుంటావో చెప్పు.”

దేవుని ముఖం చప్పున మారిపోయింది. కళ్ళు కుంచించుకుపోయి, తీక్షణమైన చూపుతో అతని పాత జ్ఞాపకాల్ని కెలికినట్లుగా చూసినాడు.

వరదప్ప మెదడులో జ్ఞాపకాల కంతి పగిలింది. మాటలూ దృశ్యాలూ స్రవించి కళ్ళముందుకు కొట్టుకొస్తున్నాయి. అప్పుడు ఇరవై ఏండ్లు వరదప్పకు. ఇంకా పెండ్లి కాలేదు. తల్లీ తండ్రీ మాట్లాడుతుంటే, పశువులకు నీళ్ళు తాపుతూ వింటున్నాడు.

తల్లి అంటా ఉంది – “బావీ గీవీ అని లంపటం యాల పెట్టుకుంటావే! ఆ నాలుగెకరాలూ అమ్మి నాలుగు రూకలు చేతిలో పెట్టుకుందాము. పామిడికి పోయి బట్టలు తీసుకొచ్చి అమ్ముదాము.”

దానికి తండ్రి ఏమన్నాడు?

“మనం రైతులమే పనికిమాలిన ముండా! యాపారస్తులం కాదు” అని అరిచినాడు.

“తెలుగుదేశం గవర్నమెంటు వచ్చింది. హంద్రీనీవా తెస్తుందంట. హంద్రీనీవా కాలువ మన భూమి పక్క వంకలోనే పోతుందంట. ఇంక చూస్కో, నీల్లే నీల్లు! సంవత్సరానికి రెండు పంటలు!!” అని ఉబ్బి తబ్బిబ్బయినాడు.

ఇప్పుడు నలభై అయిదెండ్లు వరదప్పకు. పెండ్లామూ, పిల్లలూ ఏర్పడినారు. పెండ్లాం మాట్లాడుతుంటే, వింటున్నాడు.

భార్య అంటా ఉంది –

“బోరూ, గీరూ అని ఊరికే ఉన్న మెడకు ఉరి ఎందుకు పెట్టుకుంటావే? ఆ నాలుగెకరాలూ అమ్మి టౌను చేరదాం. ప్లాట్ల యాపారం చేస్తే లచ్చలు సంపాదిచ్చుకోవచ్చంట!”

దానికి వరదప్ప ఏమన్నాడు?

“మనం రైతులమే దర్వేసిముండా! యాపారస్తుం కాదు” అని రంకెలేసినాడు.

“ఈ కాంగ్రెసు గవర్నమెంటులో హంద్రీనీవా గ్యారెంటీ. ఈ అయిదేండ్లూ బోరు ఏపిచ్చుకుని భూమిని కాపాడుకుంటే చాలు. ఇంక చూస్కో! నీల్లే నీల్లు. మనం ఇల్లు బంగారుపొగ ఎగరల్ల” అని కుశాలపడినాడు.

బంగారుపొగ ఏమోగానీ, హంద్రీనీవా ఆశతోనే పొగ చూరిపోయిన దశాబ్దాలు! అయిదారు ప్రభుత్వాలు వచ్చిపోయీా, కొనసాగుతూనే ఉన్న నీళ్ళ లేని సీమ సేద్యపు తమాషాలు! బోరుబావుల అప్పుల కింద అనంత రైతుల ఆత్మహత్యలు!



కాంగ్రెస్ పోయి తెలుగుదేశమొచ్చె డుం డుం డుం.

తెలుగుదేశం పోయి కాంగ్రెస్ వచ్చె డుం డుం డుం.

ఇరవై అయిదేండ్లుగా హంద్రీనీవాతో ఆడుకున్నది వాళ్ళే!

రైతు ఆత్మహత్యలకు కారణం వాళ్ళే!

ఒక ఇంట్లో రెండు ఆత్మహత్యల రహస్యం గుప్పిళ్ళు విప్పుకుంది.

వరదప్పకు కర్తవ్యం బోధపడింది.

ధార్మికమైన ఆవేశంతో అతని వదనం గంభీరమంది.

ఒక్క వీక్షణంతో తన కర్మమార్గాన్ని తనకు గుర్తుచేసిన దేవునికి చేతులెత్తి నమస్కరించినాడు వరదప్ప.

“నీ గుంజకు కట్టివేసిన ఎద్దుని! నీ చేతిలోని పనిముట్టును. నన్ను వాడుకో!”

చిద్విలాసంగా నవ్వి “తథాస్తు” అన్నాడు దేవుడు!

★★★

యాగంటి!

యాగంటి గుట్టల నిశ్శబ్దాల మధ్య పాతాళ గంగమ్మ జలారావాలు. లోనంతా నిండి బైటికి పొర్లే కోనటి నీటి మధ్య ఒంటరి రాతిమంటపం.



చీకటి గుండె అదిరేటట్లు యాగంటి బసవయ్య కళ్ళు తెరిచింది. బసవయ్య రాతి శరీరంలో మెత్తగా విచ్చుకున్న కనుగుడ్లు. యాగంటి బసవయ్య కనుగుడ్లలోని ఎరుపు జీరలు వరదప్ప క్రోధమే!!

రాతి బసవయ్య లేచి నిలబడి మూపురాన్ని విదిలిస్తే, పెఠిల్లుమని నాలుగు రాతి పెచ్చులు ఎగిరిపడినాయి.

బసవయ్య రాతి తోక నిగిడ్చింది. రాతి మెడను వంచి ఒక్క రంకె వేసింది. బసవయ్య రాలు దువ్విన గిట్టల రాపిడికి నేల మీంచీ నిప్పురవ్వలు లేచినాయి.

తన వృత్తికి అదనంగా నాలుగైదు వ్యాపారాలు చేసుకునేవానికి, డబ్బు పట్ల ప్రేమ ఉంటుంది కానీ, తన వృత్తి పట్ల, స్వధర్మం పట్ల బాధ్యత ఎందుకుంటుంది? వ్యాపారాలూ కంట్రాక్టుల్లో మునిగితేలే నాయకులు హంద్రీనీవా ఎప్పుడు తెస్తారు? ఈరోజుతో వాళ్ళకు భూమ్మీద నూకలు చెల్లిపోయినాయి.

రాజ్యాన్ని పరిపాలించవలసింది సన్యాసులూ, దేశభక్తులూ మాత్రమే!!!

కాలవ కాంట్రాక్టులూ, బస్సులు వ్యాపారాలూ, లిక్కర్ షాపులూ, సెజ్ లూ, భూ ఆక్రమణలూ, ఇనుమూ, గ్రానైట్, సుద్దరాయి ఖనిజాల వ్యాపారాల మధ్య దుమ్ము లేపుతూ యాగంటి బసవయ్య హుంకరిస్తూ ఉంది.

మోర వంచి తల ఊపితే మెడ గంటల మృత్యుఘోష!

కాలు దువ్వి రంకెస్తే, చీకటి భళ్ళున పగిలిన మిరుమిట్లు!!

యాగంటి బసవయ్య పద్నాలుగు బసవన్నలుగా విడిపోయింది.

ఎన్నికల ఋతువు కదా...!

ప్రజల అవసరాలకు మించి మద్యమోత్పత్తులు పెచ్చుతున్న వేళ.

ప్రజలు ఓటర్లుగా ప్యూపా దశలోకి మారుతున్న వేళ.

రాజధానికీ నియోజకవర్గాలకూ మధ్య

సూటుకేసుల పంపకాలు జరుగుతున్న వేళ...

అందరు రాజకీయ వ్యాపారస్తుల్నీ ఒక్క కుమ్ము కుమ్మింది ఒక్కొక్క బసవన్నా!

ఖద్దరు రెడ్లూ, పసుపు పచ్చల నాయుళ్ళూ, వారి నల్ల నల్లటి ముడ్డీలను నాకే రిజర్వేషన్ ఎమ్మెల్యేలూ, పైవారి పబ్బం గడపడానికి ఉపయోగపడే బిసి శిఖండీలూ...

అందరిలోని ఆ వ్యాపార రక్తంతోనే బసవన్న రాతికొమ్ములు సిక్తమయినాయి. ఆ నాయకుల కిరీటాలు బసవన్నల కాలి గిట్టల కింద గిలగిలా కొట్టుకుంటున్నాయి.

ఒకే ఒక్క బసవన్నకు మాత్రం నెత్తురంటలేదు.

ఏమైందేమైంది. ఏం జరిగిందేంజరిగింది.

ఆ ఒక్క నాయకుడూ ఎట్ల తప్పించుకున్నాడు?

చెవులు రిక్కించింది బసవన్న.

చూపు నిగిడ్చింది బసవన్న.

ముక్కు పుటాలెగరేసింది బసవన్న.

వాడు మనిషి వాసనే వెయ్యడు!

అడుగడుగో తెలుగునాడు సరిహద్దులో వాడు!

అనంతపురం జిల్లాను చుట్ట చుట్టి చంకలో పెట్టుకుని కర్ణాటకలో నిమజ్జనం చేయబోతున్నవాడు! అనంతకు తుంగ తప్ప దిక్కేలేదనే మహాసత్యం కనుక్కోవడం కోసమే రెండు దశాబ్దాలు ఎమ్మెల్యేగా ఊరేగినవాడు! తన బెంగుళూరు వ్యాపారాల్ని భద్రం చేసుకోవడానికి కన్నడ కిరీటం కోసం ఆశపడుతున్నవాడు!

ఒక్క కుమ్ము కుమ్మింది బసవన్న.

అంతే!

అతడు నోట్లోంచీ కక్కుకున్న నోట్ల కట్టలు!!!

★★★

యాగంటి బసవయ్య కోనేట్లో మునిగింది. శివుని ముందు మోకరిల్లింది. కళ్ళతో సహా స్థాణువుగా మారింది. బసవడి నుంచి విడుదల పొందినవాడు వరదప్ప. దేవదేవుని ఆనతి మీద రెండవ కర్మమార్గంలోకి ప్రవేశించినాడు.

సూక్ష్మలోకపు పాలవెలుగులో నల్లటి చుక్క ఏర్పడింది. అది కంతగా విచ్చుకొంది. చీకటి సొరంగం మాదిరి ఏర్పడింది. వరదప్ప ఆ సొరంగంలో దూరి జారుతూ జారుతూ వచ్చి – భూగోళం మీద తన పెంకుల కొట్టం దొడ్డి గుమ్మం వెనకాల, ఆవు నొప్పులు పడుతూ దూడను ఈనుతుంటే, ఆ దూడలోంచీ తొలి ఊపిరి తీసుకుని, లేగదూడై భూమ్మీద పడినాడు.

"కోడెదూడ అమ్మా! కోడెదూడ!! రెండో కాడి మోసి, మన చేను దున్నుతుంది" అని వరదప్ప కొడుకు మట్టి కొట్టుకున్న శరీరంతో గంతులేస్తుండగా –

వరదప్ప భార్య, లేత కొబ్బరి వంటి లేగదూడ కాలిగోర్లను గిల్లివేయబోయి అబ్బురపడి ఆగిపోయింది. నమ్మలేనట్లు దూడ కాళ్ళని మరోసారి చేతుల్తో గట్టిగా తడిమింది.

... అవి రాతిగిట్టలు!!!

*తొలుత ఆదివారం వార్త, 12, 19 ఏప్రిల్ 2009 లో ప్రచురితమైనది. .*

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# మాంత్రిక వాస్తవికతలో రైతు "రంకె"



డాక్టర్ వి.ఆర్.రాసాని
98484 43610

అప్పుడెప్పుడో 'గేథె' అనే జర్మన్ రచయిత చేతుల మీదుగా పురుడు పోసుకున్న కథ చెహూవ్, మొపాసా, టాల్ స్టాయి, గోర్కి లాంటి రచయితల చేతుల్లో బలాన్ని పుంజుకుని ప్రపంచ సాహిత్యంలో ఒక ప్రధాన ప్రక్రియలా నిలచిపోయింది. మన గడ్డపైన ఠాగూర్, ప్రేమ్ చంద్, యశ్ పాల్ శర్మ లాంటి మేథావుల చేతుల్లో పరిఢవిల్లి, బండారు అచ్చమాంబ, గురజాడ, శ్రీపాద, చలం వంటి వారిచేత తెలుగు స్వరూపాన్ని సంతరించుకుంది. రా.వి. శాస్త్రి, కొ.కు. మునిపల్లెరాజు, కేతు విశ్వనాథరెడ్డి లాంటి వారి కలం నుంచీ జాలువారే సిరా టానిక్ తో తెలుగులో పరిపుష్టిని పొందింది.

ఆ తర్వాతి తరంలో మధురాంతకం రాజారాం, కె.సభా, ముదిగొండ సుజాత, అల్లం రాజయ్య, స్వామి, రాసాని, పెద్దింటి అశోక్ లాంటి పలువురి ఆధునికుల ఊహల్లో కొత్త కొత్త శిల్ప సౌందర్యాన్ని సంతరించుకుంది తెలుగు కథ.

రానురాను ఈ ఆధునిక కథల్లో వస్తుపరంగా, శైలి శిల్పాల పరంగా అనేక ప్రయోగాలు జరిగాయి. ఈ ఆధునిక కథల్లో ప్రకృతిని మానవీకరించడం, మానవుల్ని ప్రకృతీకరించడం కూడా జరిగింది. దానికి మంచి ఉదాహరణలు, పంచతంత్రం కథల తర్వాత ఆర్వెల్ 'అనిమల్ ఫామ్', రా.వి.శాస్త్రి 'గోవులొస్తున్నాయి జాగ్రత్త' వంటి నవలలు. అదేవిధంగా మానవుల్ని ప్రకృతీకరించినదానికి తెలుగులో చలం రాసిన 'ఓ పువ్వు పూసింది' కథ మంచి ఉదాహరణ. అలాగే ప్రకృతిని మానవీకరించినదానికి రాసాని రాసిన 'శిల్ప సంగీతం' తిరుగులేని ఉదాహరణ. ఆంగ్ల భాషలో ఆల్బస్ హాక్స్ లీ, జేమ్స్ జాయ్స్, శామ్యూల్ బకెట్, గ్రాహం గ్రీన్, బెల్లో,

కాఫ్కా, సార్త్రె లాంటి మేథావులు ప్రయోగించిన అసంబద్ధ శిల్పపద్ధతుల్ని వాడడం, మార్క్వెజ్ లాంటివారు ప్రవేశపెట్టిన మ్యాజిక్ రియలిజం పద్ధతుల్తో కథల్ని రాయడం కూడా వచ్చింది. వీటికి త్రిపుర కథలు, మునిపల్లె రాజుగారి 'దివో స్వప్నాలతో ముఖాముఖి' కథలు మంచి ఉదాహరణలు. బెర్నాల్డ్ బ్రెష్ట్ నాటకపరంగా ఫ్రీజ్ (నిశ్చల స్థితి), అలియనేషన్ (చేర్పులు), హిస్టారిఫికేషన్ (చారిత్రకాంశ సమ్మిళితం) అనే అంశాల్ని తీసుకుని ఎపిక్ థియేటర్ (కావ్య రంగం) సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఇందులోని హిస్టారిఫికేషన్ కు రాసాని రాసిన 'బుసీఫెలస్ నువ్వు అనాథవు కావు' అనే కథ ఉదాహరణగా నిలుస్తుంది. ఇవన్నీ ఈనాటి ఆధునిక కథల్లో శిల్పపరంగా వచ్చిన ప్రయోగాలు. అలాంటి ప్రయోగాలలో మ్యాజిక్ రియలిజం (మాంత్రిక వాస్తవికత) బాగా ఉపయోగించి ఈమధ్యకాలంలో బండి నారాయణస్వామి గారు తెల్లదయ్యం, రంకె అనే రెండు కథలు రాశారు. ఈ రెండింటిలో 'రంకె' కథ పలువురి ప్రశంసల్ని, పలు బహుమతుల్ని అందుకుంది. ఈ కథలను ప్రసిద్ధ నాటక రచయిత అయిన వల్లూరు శివప్రసాద్ గారు అదే పేరుతో నాటకంగా కూడా రాసి ఎన్నో బహుమతుల్ని అందుకున్నారు. కాబట్టి ఈ కథా నిర్మాణ, నేపథ్య విశిష్టతలను గురించి చర్చించుకోవడం చాలా అవసరమనిపించింది.

ఒక రైతు మరణించిన తర్వాత ఆతని ఆత్మ పడిన ఆత్మఘోషే ఈ రంకె కథ... ఆ రైతు రాయలసీమ వాడయితే ఇంక చెప్పేదేముంది! నిత్యం వచ్చే కరువులతో సంసారం సాగడానికి చేసే వ్యవసాయం కరువుల పాలైపోయి రైతు అప్పుల బారిన పడితే, ఆ సమయానికి చినుకులు రాల్చని మబ్బులు వట్టిపోయిన ఆవులా రాల్చే రెండు నీటి చినుకులపై ఆశతో చేసే వ్యవసాయమే జూదమైపోతే ఇక ఆ రైతుకు శరణ్యం ఆత్మహత్యే. అలా ఆత్మహత్య చేసుకున్న సీమరైతు వరదప్ప ఆత్మ పడిన ఘోషను ఒక మాంత్రిక వాస్తవిక శైలిలో ఈ కథను నడిపించిన తీరు అద్భుతమనిపిస్తుంది. అటు మేఘాలు, ఇటు అప్పులవారు, మార్కెట్టు మాయాజాలం, ఎరువులవారు, వ్యాపారులు, ప్రైవేటు వ్యవస్థలు, ప్రభుత్వ



> తన పొలంగట్టునున్న వేపచెట్టు కింద దయ్యంలాగా కూర్చొని చూస్తూ తన భూమిని అప్పిచ్చిన కొంజేటి నారాయణశెట్టి కొట్టేయలేదు కదా అనుకుంటాడు.

ఆలోచనలు అన్నీ మోసం చేస్తుంటే, వరదప్ప పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటాడు. అలా ఆత్మహత్య చేసుకున్న ఎనిమిదవ రోజున కళ్ళు తెరిస్తే అతను దేవలోకంలో వుంటాడు. కళ్ళు తెరిచి "నేను చచ్చిపోయి ఇప్పటికి ఎనిమిది దినాలయ్యింది" అని అనుకోవడంతోనే కథ ఆరంభమవుతుంది. అక్కడ ముంచెత్తుకొస్తున్న వెలుతురు. ఆ వెలుతురునే అతను శ్వాసిస్తుంటాడు. అతని హృదయంలో భూలోకంలో లేని చల్లటి చిత్తశాంతి కలుగుతుంటుంది. ఆ చిత్తశాంతికి అతను 'హమ్మయ్య! నేను మంచిపనే చేసినా'ననుకుంటాడు. అతని ముందర దేవదూతలు ప్రత్యక్షమై అతన్ని స్వర్గానికి పంపరు. అప్పుడు దేవుడు వచ్చి దేవదూతలతో 'రైతులకు ప్రత్యక్షంగా స్వర్గానికి ప్రవేశముండగా మీరెందుకు అతన్ని అడ్డగిస్తున్నారం'టాడు. 'ఇతను పుడమిపైన పూర్తి సేవలందించకుండానే అప్పుల్ని, బాధల్ని భార్యాబిడ్డలకొదిలేసి మధ్యాంతరంగా ఇక్కడి కొచ్చేసాడు' అంటారు. అప్పుడు వరదప్ప ఎవరెవరు తనను ఎలా ఎలా మోసం చేశారో చెప్పబోతుండగా దేవుడు "నీకు తెలిసిందంతా నాకూ తెలుసయ్యా..అంతా కలిసి నిన్ను మోసం చేస్తే, నువ్వు నీ భార్యాబిడ్డల మీద బరువు మోపి నువ్విట్లా హాయిగా చేతులూపుకుంటూ స్వర్గానికి రావడం న్యాయమా?" అని, భూమ్మీద నీ భార్యాబిడ్డలు పడుతున్న బాధలు చూసింతర్వాత నేను చేసింది న్యాయమేనని నీకు అనిపిస్తే అప్పుడు నిన్ను స్వర్గానికి పంపుతానంటాడు. వెంటనే వరదప్ప ఎదురుగా వెలుగు చుక్క పడి, అది చిల్లిగా మారితే అతని రూపం అందులో కలిసిపోయి భూలోకానికొస్తాడు. తన పొలంగట్టునున్న వేపచెట్టు కింద దయ్యంలాగా కూర్చొని చూస్తూ తన భూమిని అప్పిచ్చిన కొంజేటి నారాయణశెట్టి కొట్టేయలేదు కదా అనుకుంటాడు. తనను అప్పులపాలు చేసిన బోరుబావి కనిపిస్తుంది. దాంతో అతను జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోతాడు. ఆ తర్వాత ఎదురుగా పొలంలో భార్య విత్తనాలు వేసే గొర్రును భుజానేసుకొని మోస్తుంటే పదహారేండ్ల కూతురు విత్తన గింజల్ని మోయలేక మోస్తూ విత్తుతుంటే, ఆరో తరగతి చదువు ఎగ్గొట్టి కొడుకు ఒక ఎద్దును, తల్లికి మరోవైపున కట్టి గొర్రును ఈడుస్తుంటే కొడుకు

మేడి పట్టుకొని నడుస్తుంటాడు. ఆ దృశ్యం చూసి అతని మనసు వికలమైపోతుంది. అదయింతర్వాత ఆతని భార్య వీధి వీధి తిరిగి పూలు, కూరగాయలు ఎత్తుకొని వేశ్యాగృహం దగ్గరికి కూడా పోయి వాటిని అమ్ముకుని వస్తుంటుంది. తన కుటుంబం మరీ పేదరికంలో పడిపోయివుంటే చూసి భరించలేక 'నేను తప్పు చేశాను' అంటూ మధనపడిపోయి తిరిగి దేవుడి దగ్గరికి వెళ్ళిపోతాడు వరదప్ప. 'నా తప్పు తెలుసుకున్నాను. నన్ను తిరిగి భూలోకంలోకి పంప'మంటాడు. దేవదేవుడు సరేనంటాడు. దాంతో ఆతని ఆత్మ యాగంటి బసవన్నలో ఆవహించి, పైకి లేచి రంకెలు వేస్తూ పదునాల్గు బసవన్నలుగా మారిపోయి, రైతుల్ని మోసం చేసే వ్యాపారుల్ని, రాజకీయ నాయకుల్ని కుమ్మి కుమ్మి, వారి నోళ్ళలోనుంచీ నోట్ల కట్టల్ని కక్కిస్తుంది. చివరికి దేవదేవుని దయతో వరదప్ప ఆత్మ ఆతని ఇంటి ఆవుకు లేగదూడగా పుడుతుంది. మోసగాళ్ళను శిక్షించడానికన్నట్లు ఆ లేగదూడకు రాతి గిట్టలు పుట్టివుంటాయి. ఇదీ రంకె కథలో సారాంశం.

> **ఏ ప్రభుత్వమొచ్చినా ఓట్ల ఆకర్షణ పథకాల గురించే ఆలోచిస్తుంటుంది కానీ రైతుల కష్టాల గురించి పట్టించుకోదు.**

ఈ కథలో సీమగడ్డన సంభవించే నిత్య పౌరుషులు, రైతుల అప్పుల అరుపులు, ఆత్మహత్యలు నిత్యం జరిగే వాస్తవాలు. ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆ రైతు కుటుంబం అనుభవించే కష్టాలు నిష్ఠుర సత్యాలు. ఇవన్నీ ప్రభుత్వాలు అనుకుంటే పరిష్కారమయ్యేటివే. కానీ ఏ ప్రభుత్వమొచ్చినా ఓట్ల ఆకర్షణ పథకాల గురించే ఆలోచిస్తుంటుంది కానీ రైతుల కష్టాల గురించి పట్టించుకోదు. నిరంతరం మాయమాటలు చెప్తూ, మోసాలు చేస్తూ సిరులు మూటగట్టుకుంటున్న రాజకీయ నాయకులను, సామాన్యులను దోచుకునే దళారులను నిత్యమూ మనం చూస్తూనే వుంటాం. రైతుల బాధలను, ఆత్మహత్యలను చూసి చలించిన ఎందరో రచయితలు సీమ కరువుల్ని, అప్పులను, బాధలను వర్ణిస్తూ రైతు ఆత్మహత్యల్ని చిత్రిస్తుంటారు. కానీ ఆ రైతు మరణం తర్వాత ఆతని కుటుంబం చావలేక, బతకలేక ఎంత నరకాన్ని అనుభవిస్తుందో చిత్రించిన రచయితలు అరుదు. స్వామి ఆ అరుదైన వారిలో మొదటిగా లెక్కింపదగినవారు.

ఇక కథానిర్మాణ విషయానికొస్తే ఇది పక్తు మాంత్రిక వాస్తవికతతో రైతు ఆత్మహత్యను చిత్రించడమే గాక, ఆ సమస్యల పరిష్కారాన్ని కూడా సూచించడం జరిగింది. ఆ పరిష్కారం కూడా ఆ మ్యాజిక్ రియలిజం శైలిలోనే తిరుగుబాటుతో సూచించడం జరిగింది. నిజానికి మ్యాజిక్ రియలిజం అంటే ఏమిటి? అన్న ప్రశ్న రావచ్చు. మ్యాజిక్ అంటే ఊహించని అద్భుతాన్ని చూపించడం. రచనాపరంగా చెప్పాలంటే అద్భుతరసంతో వాస్తవాలను చిత్రించడమే మ్యాజిక్ రియలిజం.

ఆత్మ, పరమాత్మ, దేవుడు, స్వర్గం, నరకం, మరుజన్మలు అనేవి హిందువులు నమ్మే సనాతన నమ్మకాలు. ఆ నమ్మకాలను ఆధారం చేసుకుని వరదప్ప ఆత్మ కాంతిరూపంలో దేవలోకానికి వెళ్లడం, దేవుళ్ళతో మాట్లాడడం, దేవుడి దయతో అతను తిరిగి భూలోకానికి వచ్చి అదృశ్యరూపంలోనే తన కుటుంబ సభ్యుల బాధల్ని చూడడం, తను ఆత్మహత్య చేసుకుని తప్పు చేశాననీ, తిరిగి తనను భూలోకంలోకి పంపమని వేడుకోవడం, దయతో దేవుడు ఆతన్ని భూలోకంలోకి పంపడం, అతను యాగంటి బసవన్నలోకి ప్రవేశించి, బహు బసవన్నలుగా మారిపోయి మోసకారులను అంతం చేయడం, ఆ తర్వాత ఆతను భూలోకంలో పెంచిన తన ఆవు గర్భంలోనే దూడగా, రాతి గిట్టలతో పుట్టడం....వంటివన్నీ ఒక మ్యాజిక్ లా సాగిపోవడం ఈ కథలో వున్న మ్యాజిక్ రియలిజం...

ఈ కథను చదవడం ఆరంభించిన పాఠకున్ని గుక్క తిప్పుకోలేని ఆతృతతో చదివించేవిధంగా చేయడంలో ఈ మ్యాజిక్ రియలిజం ఈ 'రంకె' కథను ఫలవంతం చేసింది. తెలుగు కథాసాహిత్యంలో ఒక ఉత్తమ కథగా నిలబెట్టింది. అంతేగాక మ్యాజిక్ రియలిజం ఎలా వుంటుందో రచయితలకు తెలియజేయడంలోను 'రంకె' కథ సఫలీకృతమైంది. ఇంత మంచి ఉత్తమకథను అందించినందుకు బండి నారాయణస్వామి గారి పేరు తెలుగు సాహిత్యంలో ఒక ధృవతారగా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

# కవి రేడు
# మన గురజాడ..!

శ్రీ జి.సూర్య నారాయణ ✆ 6281725659

అప్పారావు గురజాడ కవి
వాడుక భాషతో గొప్పగా కట్టె
ఆధునిక కవిత్వంపు మేడ..!

కొత్త పాతల మేలు కలయికతో
ముచ్చటగా అల్లెను ముత్యాల సరాలు
తెలుగుతల్లి మెడలోన వేసే దేశభక్తిగా..!

గిడుగు వారికి చేదోడుగా ఉండి
వాడుక భాషను వేడుక చేసెను
సామాజిక సంస్కరణలకు దిద్దుబాటు
చేసిరి అక్షర కరవాలాలతో..!
మంచి చెడ్డలను రెండు



కులాలుగా విభజించిరి
మంచిని మాలగా ధరిస్తానని
బహిరంగంగా ప్రకటించిరి.!

దేశమంటే మట్టి కాదోయ్ అంటూ
మనుషులు చేసిన దేవుళ్లను
ఎలుగెత్తి చూపాడు
కన్యాశుల్కంతో పూర్ణమ్మ వ్యథను
కళ్లకు కట్టినట్లు కరుణతో చిత్రించాడు..!

ప్రేమనిచ్చినా ప్రేమ వచ్చునని
అమలిన గంగ ప్రేమకు లంగ రెత్తాడు
మహాకవులకాయన మార్గదర్శి అయ్యాడు.!

తిక్కన గంటం లోని తెలుగుదనం
వేమన కలంలోని హేతు సంవాదం
గురజాడ లోని నవకవితకు భావ
విప్లవం..!

తోకచుక్కలను నింగిలో కొట్టి పారేసి..
పొగ చుట్టలతో మేఘాలు సృష్టించి
అక్షరాకాశంలో వేగుచుక్కగా
వెలుగుతున్నాడు కవిరేడు మన గురజాడ..!

# తెలుగు, గుజరాతీ అనుబంధాలు - ఒక పరామర్శ



శ్రీ అంబల్ల జనార్దన్
88503 49858

గుజరాతీ తెలుగు అనుబంధాలకు నాలుగున్నర శతాబ్దాలకుపై చరిత్ర ఉంది. శాతవాహనులు మన 'అమరావతి' రాజధానిగా పరిపాలన సాగించినపుడు, వారి రాజ్యం గుజరాత్ వరకు వ్యాపించి ఉండేది. అప్పుడు, వ్యాపార నిమిత్తం వెళ్లిన తెలుగువారు అక్కడే స్థిరపడి, తమ కార్యకలాపాలు కొనసాగించారు. అలాగే కొన్ని వైష్ణవ కుటుంబాలు మత ప్రచారానికై గుజరాత్ వెళ్లి, అక్కడే తమ మతాలు స్థాపించారని చరిత్ర చెబుతోంది. బర్మాలోని సంక్షోభం కారణంగా మన దేశానికి వలస వచ్చిన తెలుగువారిలో కొందరు గుజరాత్ లో తమ గూడును ఏర్పరచుకున్నారని కూడా అంటారు. అలాగే, తెలుగునాడులో మొఘల్ రాజులు తిష్ఠ వేసినపుడు, కొందరు తెలుగువారు ప్రాణభయంతో గుజరాత్ లో తలదాచుకుని, అక్కడే స్థిరపడ్డారని ఐతిహ్యం.



గత చరిత్ర మాట ఎలా ఉన్నా, పందొమ్మిదవ శతాబ్దపు చివర నుంచి, గుజరాత్ కు తెలుగువారి వలసలు పెరిగాయనేది యదార్థం. నిజాం పాలనలో రజాకార్ల ఆగడాలకు తట్టుకోలేక, తెలంగాణ ప్రాంతపు కార్మికులు ఉపాధికై పొరుగు రాష్ట్రమైన బొంబాయిలోని సోలాపూర్, నాగ్ పూర్, చంద్రపూర్, పుణే, ముంబయి, అహమద్ నగర్ నగరాలకు తరలి వెళ్ళారు. అప్పుడు

> **పొట్టచేతబట్టుకుని వచ్చిన తెలుగు కార్మికులకు గుజరాత్, ఉపాధి అవకాశాలు కల్పించింది.**

తెలంగాణలో ఏర్పడ్డ తీవ్రకరువు పరిస్థితులు కూడా తెలుగువారిని వలసబాట పట్టించాయి. ఆ తర్వాత, గుజరాత్ లోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పబడ్డ బట్టల మిల్లులు, అప్పటి బొంబాయి రాష్ట్రంలోని తెలుగు నేత పనివారిని అక్కునచేర్చుకున్నాయి. అలా తెలుగు నేత కార్మికులు, ఇప్పటి మహారాష్ట్రలోని వివిధ నగరాల నుండి గుజరాత్ బాట పట్టారు. నైపుణ్యం, నిజాయితీ తమ అమ్ములపొదిలో కూర్చుకున్న తెలుగు పద్మశాలి సామాజిక వర్గానికి గుజరాత్, ఆశ్రయమైంది. సూరత్, జాంనగర్, బరోడా, నవ్ సారీ, బిల్లీమోరా, గణ్ దేవీ, ఖంభాత్, కలోల్ ఇలా బట్టల మిల్లులున్న అన్ని నగరాల్లోని బట్టల మిల్లుల్లో తెలుగువారు నిలదొక్కుకున్నారు. బట్టల మిల్లుల స్వర్ణ కాలంలో అహమదాబాద్ 'మాంచెస్టర్ ఆఫ్ ద ఈస్ట్' గా వినుతికెక్కింది. ఆ ఖ్యాతిలో మన తెలుగు కార్మికుల వాటా కూడా ఉంది.

పొట్టచేతబట్టుకుని వచ్చిన తెలుగు కార్మికులకు గుజరాత్, ఉపాధి అవకాశాలు కల్పించింది. మగవారు బట్టల మిల్లుల్లో, ఇతర కర్మాగారాలలో కుదురుకుంటే, ఆడవారు బీడీలు చుట్టే పనిచేస్తూ వేణ్ణీళ్లకు చన్నీళ్లలా కుటుంబ పోషణకు తోడ్పడ్డారు. నిరక్షరాస్యులైన ఆ కార్మికులు తమ మాతృభాషను మరచిపోకూండా, ఇంట్లో తెలుగే మాట్లాడేవారు. తమ పిల్లలకు తెలుగు నేర్పాలని తాపత్రయపడి సొంత ఖర్చుతో తెలుగు పాఠశాలలు కూడా నెలకొల్పారు. ఆ తర్వాత ప్రభుత్వం వాటిని నడిపేలా ప్రయత్నాలు చేశారు. ఏడవ తరగతి వరకు మాత్రమే ఉన్న ఆ పాఠశాలల విద్యార్థులు, అటు తర్వాత మరాఠీ, హిందీ, గుజరాతీ, ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాలల్లో చదివేవారు. అది పిల్లలకు భారంగా ఉండేది. ఇప్పటి తరం, గుజరాతీ మాధ్యమ పాఠశాలల్లోనో, లేక గుజరాతీ ఒక భాషగా ఉన్న ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాలల్లోనో స్కూల్ ఫైనల్ వరకు చదువుతున్నారు. గుజరాతీలో, గుజరాతీ పిల్లలకు దీటుగా ప్రావీణ్యం సంపాదించి, మంచి గుర్తింపు పొందుతున్నారు. ఇప్పటి తెలుగు కుటుంబాల పిల్లలు గుజరాతీతో, గుజరాతీ వారితో ఎంతగా మమేకం అయ్యారంటే, వారికి తెలుగు మాట్లాడడం కూడా రాని పరిస్థితి ఉంది.

## గుజరాత్ లోని వివిధ ప్రాంతాల్లో తెలుగు సంస్థలు:

ఉపాధి అవసరాలు తీరగానే, తమ సంస్కృతిని, సాంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి తెలుగువారు సంఘటితమై వివిధ సంస్థలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం మేరకు గుజరాత్ లో తెలుగువారి ప్రప్రథమ సంస్థ 'పద్మశాలి సమాజ్ సేవా సంఘ్' తేది 03-03-1935, శివరాత్రి పర్వదినాన అహమదాబాద్, రఖియాల్ ప్రాంతంలోని పరమానంద్ చాల్ లో శ్రీ వెంకట్ రావ్ గోరంట్ల గారు అధ్యక్షులుగా, శ్రీ విఠల్ సిద్ధం కార్యదర్శులుగా మొదలైంది. ఆ తర్వాత తేది 09-09-1939 అహమదాబాద్ లోనే శ్రీ పెంటప్ప చిట్యాల్ గారి అధ్యక్షతన "అఖిల పద్మశాలి జ్ఞాతి సంస్థ" స్థాపించబడింది.



అదే సంస్థ కాలక్రమంలో విస్తరించి, ప్రస్తుతం పదకొండువేల చదరపు అడుగుల ప్రాంగణంలో మార్కండేయ మందిరం నిర్మించింది. సంస్థ ఆధ్వర్యంలో సమూహ వివాహాలు, పండుగలు ఆ ప్రాంగణంలోనే జరుగుతాయి. అహమదాబాద్ లోని పద్మశాలీయులే కాకుండా మొత్తం గుజరాత్ లోని తమ కులబాంధవులను ఒకచోటచేర్చి, గుజరాత్ రాష్ట్రంలో తాము ఎదురుకుంటున్న ఇబ్బందులపై చర్చించడానికి "గుజరాత్ పద్మశాలి మహాసభ" ఏర్పాటయింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు మూడు మహాసభలు జరిగాయి. 1983 లో అహమదాబాద్ లో జరిగిన ప్రథమ మహాసభలకు శ్రీ దాసి నర్సయ్య గారు అధ్యక్షత వహించగా, శ్రీ మెటికెల్ చంద్రశేఖర్ గారు ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సూరత్ లో 1988 లో జరిగిన రెండవ మహాసభలకు శ్రీ సామల ఎల్లయ్య స్వాగతాధ్యక్షులుగా పనిచేశారు. 2005 లో అహమదాబాద్ లో జరిగిన తృతీయ గుజరాత్ ప్రాంతీయ మహాసభలకు శ్రీ దాసి నర్సయ్య గారు స్వాగతాధ్యక్షులుగా ఉండి, శ్రీ బొమ్మెర గంగాధర్ గారు స్వాగత కమిటీ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించారు. అలా గుజరాత్ లోని తెలుగువారు, పరాయి రాష్ట్రంలో తమ ఉనికికి గుర్తింపు తెస్తున్నారు. గుజరాతీవారితో మమేకమవుతూనే తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటున్నారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా గుజరాత్ లోని తెలుగువారు చురుగ్గా

పాల్గొన్నారు.అప్పుడుగౌతంరెడ్డినాయకత్వంలో కొన్ని తెలుగు సంఘాలు ఏర్పడ్డాయి. ఆ తర్వాత 1946 లో అవి "అహమదాబాద్ ఆంధ్ర మహాసభ" లో విలీనమయ్యాయి. మాస్టర్ దుర్గయ్య అధ్యక్షులుగా, శ్రీ మట్టికుంట సత్యనారాయణగారు కార్యదర్శులుగా సంస్థ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. తెలుగు సాహిత్య, సాంస్కృతిక, సంప్రదాయ పరిరక్షణకై శ్రమించారు.

**గుజరాత్ మొత్తంలో ఏడు లక్షల తెలుగు ప్రజలు ఉంటే అందులోని సింహభాగం సూరత్ లోనే స్థిరపడ్డారు.**

ఇక సూరత్ పట్టణానికి వస్తే, అక్కడ ఒక మినీ తెలుగు ప్రాంతం నెలకొన్న భ్రాంతి కలుగుతుంది. గుజరాత్ లో అత్యధికంగా తెలుగువారు ఉన్న ప్రాంతం ఇది. గుజరాత్ మొత్తంలో ఏడు లక్షల తెలుగు ప్రజలు ఉంటే అందులోని సింహభాగం సూరత్ లోనే స్థిరపడ్డారు. అక్కడ కొన్ని చోట్ల దుకాణాలకు తెలుగు బోర్డులు కనిపిస్తాయి. తెలుగు మాటలే వినిపిస్తాయి. మనం తెలుగు రాష్ట్రంలో ఉన్నామా? అనే సందేహం కలిగిస్తాయి. అక్కడ తెలుగు వారివి 40 సంస్థలు ఉన్నాయని అంచనా. అందులో కొన్ని పద్మశాలి సంఘాలు కాగా, 1959 లో శ్రీ నాయుడుగారి అధ్యక్షతన ఏర్పడ్డ "ఆంధ్ర అసోసియేషన్", 1991 లో స్థాపించబడిన "తెలుగు సమాజం", 1997 నెలకొల్పబడిన " తెలుగు సాంస్కృతిక సమితి", 2007 లో శ్రీ పి.వి. ఎస్. శర్మ గారు తెలుగువారి సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ అభ్యున్నతికై ఏర్పాటు చేసిన "తెలుగు ఫౌండేషన్ (గుజరాత్)", పేర్కొనదగ్గవి. ఇవే కాక తెలుగు సంస్థల సమాఖ్యగా "సూరత్ తెలుగు మిత్రుల సంస్థ" కూడా ఆవిర్భవించింది.

పాకిస్తాన్ సరిహద్దుకు దగ్గరలో ఉన్న కాండ్లా, కచ్ ప్రాంతంలో దాదాపు అరవై వేల మంది తెలుగువారు నివసిస్తున్నారని అంచనా. ముఖ్యంగా బర్మా నుండి, శ్రీకాకుళం ప్రాంతం నుండి వలస వచ్చిన తెలుగువారు కాండ్లా పోర్ట్ నిర్మాణ సమయంలో అక్కడికి వెళ్లి, అక్కడే స్థిరపడ్డారు. వారు కూడా 1970 లో శ్రీ రామకృష్ణా రెడ్డి నాయకత్వంలో " కచ్ఛ్ అభ్యుదయ సేవా సంఘం", శ్రీ రెడ్డి, డాక్టర్ శ్యాంసుందర్ గారి నాయకత్వంలో 1992 లో "కచ్ఛ్ ఆంధ్ర సేవా సమాజం" స్థాపించి తెలుగువారి ఆధ్యాత్మిక, విద్యావిషయ, సామాజిక, సాంస్కృతిక పురోభివృద్ధికి పాటు పడుతున్నారు. అక్కడకూడా అన్ని తెలుగు సంస్థలు కలిసి, "తెలుగు అసోసియేషన్" సమాఖ్యగా జతగూడాయి.

స్వాతంత్ర్యానంతరం బరోడాలో ఆంధ్రుల రాకకు ముఖ్య ఆకర్షణ అక్కడి పారిశ్రామిక అభివృద్ధి. గుజరాత్ రిఫైనరీ , O N G C , I P C L వంటి భారీ పరిశ్రమలు రోజువారి కూలి నుండి ఉన్నత పదవిలో సాంకేతిక నిపుణుల వరకూ బరోడాకి తరలి వెళ్లడానికి దోహదపడాయి . పూర్వం బరోడాలో కోటీస్ ఫోటో గ్రాఫర్స్ అనే ఒక ఫోటో స్టూడియో ఉండేది. జర్మని లో శిక్షణ పొందిన సరస్వతి గారు బరోడా సంస్థానంలో రాయల్ ఫోటోగ్రాఫర్ గా ప్రసిద్ధి చెందారు. వేళ్ళమీద లెక్కించ దగిన సంఖ్య నుండి తెలుగువారి సంఖ్య, కొన్ని వేల సంఖ్యకు చేరడంతో 1964 లో "బరోడా ఆంధ్ర సమితి"ని ఏర్పాటు చేసి రిజిస్టర్ చేసారు.అనతి కాలం లోనే స్థానిక మరియు ఆంధ్ర కళాకారులతో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకొంటూ తెలుగు ప్రజల వికాసానికి వినోదానికి కృషిచేసింది– ఆ సమితి. ఆ తర్వాత, స్థానిక కళాకారులతో మూడు రోజుల పాటు తెలుగు నాటక పోటీలు జరుపుకొనే స్థాయికి ఎదిగింది. 1996 నాటికి బరోడా ఆంధ్ర సమితి, రైల్వే స్టేషన్ సమీపం లో ఒక సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకొంది. బరోడా తెలుగు వారు ఇప్పుడు బరోడా నగరం అన్నిమూలలా విస్తరించి ఉన్నారు.

గుజరాత్ లో అత్యంత వేగవంతంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం భరూచ్ జిల్లా. అనేక భారీ పరిశ్రమలు ఇప్పటికే తమ ఉత్పత్తి జరుపుతుండగా మరికొన్ని పరిశ్రమలు వివిధ స్థాయి లలో నిర్మాణంలో ఉన్నాయి. అంతకు ముందు నుండీ స్థిరపడిన ప్రవాస ఆంధ్రులకు కొత్తగా వచ్చి చేరుతున్న అనేక మంది ఆంధ్రులు జత కలవటంతో ఆ ప్రాంతం తెలుగు వారితో నిండి పోయింది. 2009, డిసెంబర్ నెలలో భరుచ్ ప్రాంత ప్రవాస తెలుగు ప్రజల వినోద, సాంస్కృతిక వికాసం మరియు సాహిత్య అభ్యున్నతి కోసం శ్రీ కే ,సత్యనారాయణ గారు అధ్యక్షులు గాను, శ్రీ రాజారాం గారు కార్యదర్శి గాను "నర్మదా తెలుగు అసోసియేషన్ " ఏర్పాటు చేసారు. ఆ సంస్థ ఆధ్వర్యం లో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు మరియు తెలుగు పండగలను ఎంతో ఉత్సాహం గా జరుపు కుంటున్నారు .

అలా గుజరాత్ లోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ తెలుగువారు, తమ భాషను కాపాడుకుంటూ, సంక్రాంతి, ఉగాది, బతుకమ్మ, దసరా లాంటి తమ పండుగలను సామూహికంగా జరుపుకుంటూ తెలుగు రాష్ట్రాలనుండి సాహితీవేత్తలను, కళాకారులను రప్పించి, వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తమ సంప్రదాయ, సాంస్కృతిక, సాహిత్య సంపదను

పరిరక్షించుకుంటున్నారు.అలాగేగుజరాతీవారిగర్బా,ఉత్తరాయణ్(సంక్రాంతి) పండుగులలో పాల్గొంటూ వారిలో కలిసిపోతున్నారు.

### గుజరాత్ లో తెలుగువారి ఆధ్వర్యంలో నడుస్తున్న దేవాలయాలు:

మనది భక్తి సంప్రదాయం. మనం ఉన్న చోట దేవాలయం ఉండాల్సిందే. మన ఇష్టదైవాన్ని పూజించుకునే అవకాశం కావాల్సిందే. అది మన దేశంలోని ఏ ప్రాంతమైనా కానీయండి లేక అమెరికాలోని పిట్స్ బర్గ్ ఐనా అవనివ్వండి. గుజరాత్ దీనికి మినహాయింపు కాదు. అహమదాబాద్, సూరత్ లలో పద్మశాలీయుల కులదైవమైన శ్రీ మార్కండేయ స్వామి వారి ఆలయాలుండగా, తెలుగువారి ఆరాధ్యదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాలు గాంధీధాం, బరోడా, అంజార్, కచ్ఛ్, సూరత్ లలో మన తెలుగు సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.

అహమదాబాద్ లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం గుజరాత్ రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. దాదాపు రెండు ఎకరాల విస్తీర్ణంలో అత్యంత శోభాయమానంగా నిర్మింపబడ్డ ఈ ఆలయం, 2007 లో అప్పటి గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రస్తుత దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోది, మరియు బదరీనాథ్ పీఠం శంకరాచార్యులవారి కరకమలాల ద్వారా ప్రారంభింప బడింది. ఇది తెలుగు వారికేకాక లక్షలాది ఇతర భాషిక భక్తులకు పవిత్ర దేవాలయంగా భాసిల్లుతోంది.

### గుజరాత్ లో తెలుగు పాఠశాలలు:

గుజరాత్ లో అల్పసంఖ్యాకులమైన మనకు తొలినాళ్లలో తెలుగు పాఠశాలలు లేక మనవారు చాలా ఇబ్బంది పడ్డారు. గణదేవి, అహమదాబాద్, సూరత్ లాంటి కొన్ని చోట్ల, ప్రజలే సంఘటితమై తమ సొంత ఖర్చుతో పాఠశాలలు నెలకొల్పారు. ఆ తర్వాత రాజకీయంగా ఒత్తిడి తెచ్చి, వాటిని ప్రభుత్వం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఒకప్పుడు తెలుగు పాఠశాలల్లో పదివేలకు పైగా విద్యార్థులు ఉండేవారంటే, అప్పటి తల్లిదండ్రులకు తమ మాతృభాషపట్ల ఎంత మమకారం ఉండేదో అర్థమఔతుంది. కాలానుగుణంగా ప్రాథమ్యాలు మారాయి. ఇంగ్లీషు మోజులోపడి, తెలుగు ప్రభుత్వ పాఠశాలలకు హాజరయ్యేవారి సంఖ్య తగ్గింది. దాంతో ప్రభుత్వ తెలుగు పాఠశాలలు మూతపడ్డాయి. కచ్ఛ్ మరియు సూరత్ లో మాత్రం కొన్ని ప్రభుత్వ తెలుగు పాఠశాలలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి.

### గుజరాత్ రాజకీయాల్లో తెలుగువారు:

"నీరూ, నీరూ నీ రంగేంటి?" అంటే "దేంట్లో కలిపితే అదే నా రంగు" అందట. అలాగే మన తెలుగువారు ఎక్కడ ఉంటే అక్కడివారిలో కలిసిపోతారు. అలా అని వారు తమ ఉనికిని కోల్పోరు. ఇంట్లో, తమవారితో తెలుగుదనాన్ని పంచుకుంటూనే బయటివారితో మాత్రం వారి భాషతో, యాసతో మమేకం అవుతారు. గుజరాత్ లోని తెలుగువారు దానికి మినహాయింపు కారు. క్విట్ ఇండియా ఉద్యమంలోనే కాదు, ఆ తర్వాత చెలరేగిన 'మహా గుజరాత్' ఉద్యమంలో కూడా తెలుగువారు సక్రియ పాత్ర పోషించారు. బొంబాయి రాష్ట్రం నుండి విడిపోయి మహా గుజరాత్ ఏర్పడాలని 1956 లో శ్రీ ఇందూలాల్ యాజ్ఞిక్ గారి నాయకత్వంలో మొదలైన ఆ ఉద్యమంలో శ్రీ నారాయణ్ చిట్యాల్ గారు పాల్గొని సాబర్మతి జైలుకు గూడా వెళ్లారు. ఆ తర్వాత, 'మహా గుజరాత్ జనతా పరిషద్' పార్టీ తరపున అహమదాబాద్ పురపాలక ఎన్నికల్లో పోటీ చేసి, గుజరాత్ లో ప్రప్రథమ తెలుగు మునిసిపల్ కార్పొరేటర్ గా ఎన్నికయ్యారు. "పాల సరఫరా కమిటి" సభ్యునిగా ఎంపికై, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ అంబాలాల్ కోట గారు రెండు సార్లు మునిసిపల్ కార్పొరేటర్ గా ఎన్నికై తెలుగువారికేకాక, తన నియోజకవర్గంలోని ప్రజలందరికి ఎనలేని సేవలందించారు. వారు కొన్ని కమిటీలకు అధ్యక్షులుగా కూడా ఉన్నారు.

అలాగే తెలుగు యువకెరటం శ్రీ దేవల్లపల్లి నాగేశ్ గారు కూడా అహమదాబాద్ మునిసిపల్ కార్పొరేటర్ గా ఎన్నికై, తన ప్రజాసేవ ద్వారా అందరి మనసుల్లో చోటు సంపాదించుకున్నారు. వారు హాస్పిటల్ కమిటీ అధ్యక్షులుగా కూడా ఎంపికయ్యారు. నవసారి పురపాలక సంఘంలో శ్రీ కాడగి మహదేవ్ మరియు శ్రీ వాసి విఠ్ఠల్ గార్లు మునిసిపల్ కార్పొరేటర్లుగా సేవ లందించారు. గుజరాత్ లో అత్యధిక తెలుగు జనాభా ఉన్న సూరత్ లో మనవారు ఓ వెలుగు వెలిగారు. ఒకప్పుడు అయిదారు తెలుగు కార్పొరేటర్లు సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ లో కార్పొరేటర్లుగా ఉండేవారు. అయితే అదంతా గతం. ఇప్పుడు మనవారు పార్టీల ఝుండాలు మోయడానికే తప్ప, పదవులకు పనికి రావడం లేదు. ఇప్పటి యువత, రాజకీయాల్లో తమ భవిష్యత్తును చూసుకోవడం లేదు. సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ లో కార్పొరేటర్ గా పని చేసిన శ్రీ పీ.వీ.ఎస్. శర్మగారు తాను స్థాపించిన "తెలుగు ఫౌండేషన్ (గుజరాత్)" సంస్థ ద్వారా, తెలుగువారి రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికై పాటుపడుతున్నారు. కాలక్రమంలో తెలుగు యువత, గుజరాత్ రాజకీయాల్లో రాణిస్తారని ఆశిద్దాం.

## గుజరాత్ లో స్థిరపడ్డ వైష్ణవ కుటుంబాలు:

కొన్ని వైష్ణవ కుటుంబాలు మత ప్రచారానికై గుజరాత్ వచ్చి, అక్కడే తమ మతాలు స్థాపించారని చరిత్ర చెబుతోంది. వారు స్థానిక ప్రజలతో ఎంతగా మమేకమై పోయారంటే, ఎవరైనా చెబితేనే కాని, వారిని తెలుగువారిగా గుర్తించలేము. అలా అని వారు తెలుగు సాంప్రదాయాలను అటకెక్కిచ్చారనుకుంటే మనం పప్పులో కాలేసినట్టే. ఈ సందర్భంలో శ్రీ వల్లభాచార్యగారి గురించి ప్రస్తావించుకోవాలి. వీరు ఆచార్య చతుష్టయంలో ఒకరు. శ్రీ వల్లభాచార్యులవారి శిష్య పరంపర గుజరాత్ లో స్థిరపడి ఆనాటి నుండి ఈనాటి వరకు తెలుగు వెలుగులు పంచుతూనే ఉన్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వీరు వివాహ నిమిత్తం ఆంధ్ర దేశం నుండి తెలుగు పిల్లలను తెచ్చుకుంటున్నారు తప్ప ... వర్ణ, భాష, సంకరం చేయడం లేదు. వారందరూ ఇంట్లో ఖచ్చితంగా తెలుగులోనే మాట్లాడుతారు. తమ జీవితాల్లో తెలుగు సాంప్రదాయాలను పాటిస్తారు. బయటివారితో గుజరాతీలో వ్యవహారాలు నడిపినా తెలుగువారితో తెలుగులోనే మాట్లాడుతారు.

## గుజరాత్ లో తెలుగువారి ముద్ర:

ఉద్యోగరీత్యా గుజరాత్ కు వచ్చిన తెలుగు ఐ.ఏ.ఎస్. ఐ.పీ.ఎస్. అధికారులు ఎంతో నైపుణ్యంతో ప్రభుత్వ వ్యవహారాలను చక్కదిద్దారు. మంత్రులైన తమ రాజకీయ పెద్దల మన్ననలను చూరగొన్నారు. కొందరు గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా కూడా పనిచేసి, పరిపాలనలో తమదైన ముద్రను వదిలారు. ప్రజల్లో కూడా వారికి మంచి పేరు వచ్చింది. సూరత్ మునిసిపల్ కమిషనర్ గా సేవలందించిన శ్రీ చంద్రశేఖర్ గారు, అత్యంత అస్తవ్యస్తంగా ఉన్న సూరత్ పట్టణ రూపురేఖల్ని పూర్తిగా మార్చివేశారు. వారి చలవవల్ల, ఇప్పుడు సూరత్, మంచి నివాసయోగ్య నగరంగా మారింది. ఇప్పటికీ అక్కడి ప్రజలు వారిని తలచుకుని కృతజ్ఞతలు తెలుపుతారు. సూరత్ లో ఎంతో మంది తెలుగువారు బట్టల పరిశ్రమలో పని చేస్తున్నారు. అలాగే బట్టల వ్యాపారంలో కూడా మంచి పరపతి సంపాదించారు. ఒకప్పుడు వ్యాపారస్తులు సూరత్ వచ్చి వస్త్రాలు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు, సూరత్ లో స్థిరపడ్డ తెలుగువారు, మనవారికి అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తూ, ఫోన్ ద్వారా లావాదేవీలు జరిపి, ట్రాన్స్ పోర్ట్ లో బట్టలు పంపే ఏర్పాటు చేసి, మనవారికి శ్రమ, ఖర్చు తగ్గిస్తున్నారు.

### గుజరాత్ కి వలస వెళ్లే తెలుగు గంగ పుత్రులు:

ప్రతి సంవత్సరం ఆగస్ట్ లో, శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాల నుండి వేల మంది మత్స్యకారులు గుజరాత్ లోని వేరావల్, భావ్ నగర్, పోర్బందర్ ఓడరేవులకు వలస వెళ్తారు. మార్చ్ దాకా అక్కడ అత్యాధునిక పడవల్లో చేపలు, రొయ్యలు పట్టే పనిచేసి తిరిగి తమ నెలవులకు వస్తారు. ఆంధ్ర ప్రదేశ్ తో పోలిస్తే గుజరాత్ లో వారు మూడింతల ఆదాయం సంపాదిస్తారు అందుకే ఆ వలసలు. తెలుగు వారి నైపుణ్యానికి అబ్బురపడే గుజరాతీ సేఠ్లు, మంచి బోనస్ కూడా ఇస్తారు, కాబట్టి తెలుగువారు గుజరాత్ కు పోవడానికి మొగ్గు చూపుతారు.

### తెలుగు రాష్ట్రాల్లో గుజరాతీవారు:

తెలుగు గుజరాతీ అనుబంధాలు ఒకవైపునుండే కాదు, రెండు వైపులనుండి బలపడ్డాయి. ఉపాధికై తెలుగువారు గుజరాత్ బాట పట్టినట్టే, గుజరాతీవారు వ్యాపార అవకాశాలకై తెలుగు రాష్ట్రాలను ఆశ్రయించారు. తెలుగు రాష్ట్రాల అన్ని ప్రాంతాల్లో మనకు గుజరాతీలు తారస పడతారు. సహజంగా వణికులైన గుజరాతీవారు స్టీల్ పాత్రలు, బంగారు ఆభరణాలు, హార్డ్ వేర్, లామినేట్లు, ప్లైవుడ్ మొదలగు వస్తువుల వ్యాపారాలు తెలుగు రాష్ట్రాల్లో చేస్తూ, మనలో కలిసిపోయారు. హైద్రాబాద్ శివార్లలోని వందల ఎకరాల భూముల్లో ఒకప్పుడు, గుజరాతీలకు చెందిన ద్రాక్ష తోటలు ఉండేవి. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో గుజరాతీలు బీడీ పరిశ్రమకు ఊతమిచ్చారు. మన లక్షలాది ఆడపడచులకు ఉపాధి కల్పించారు. ఆ పరిశ్రమ నిర్వహణకు నమ్మకస్తులైన తమ ప్రాంతపు గుజరాతీ మానేజర్లను నియమించడంతో కొన్ని వందల గుజరాతీ కుటుంబాలు బీడీ పరిశ్రమ ఉన్న చోట్ల స్థిరపడ్డాయి. వారి పిల్లలు తెలుగు స్కూల్లో చదివి తెలుగును ఒంటబట్టించుకున్నారు. వారెంతగా మనలో కలిసిపోయారంటే, వారు తెలుగులో మాట్లాడితే మనం, వారు గుజరాతీలని గుర్తుపట్టలేనంతగా!

### ఉపసంహారం:

తొలినాళ్లలో తెలుగు గుజరాతీ అనుబంధాలు వాణిజ్య, ఉపాధి పరంగా ఉండినా, ప్రస్తుతం పరిస్థితి మారింది. ఇప్పుడు గుజరాత్ లో ఉన్న తెలుగువారిలో దాదాపు ముప్పావు వంతు ప్రజలు, గుజరాత్ లో పుట్టి పెరిగినవారే. వారిలో చాలా మందికి తెలుగు రాష్ట్రాల్లోని తమ మూలాల

గురించి అస్సలు అవగాహన లేదు. అందుకే వారు, 'తెలుగు మాతృభాషగా ఉన్న గుజరాతీలం' అని చెప్పుకోవడానికి ఇష్టపడతారు. ప్రస్తుత తరంలో చాలా మందికి తెలుగు మాట్లాడం కూడా రాదు. గుజరాత్ లో ఉన్న తెలుగువారిలో ఇరవై శాతం మందికి తెలుగు అక్షరాస్యత ఉండొచ్చేమో? అయినా, వారు తెలుగువారమని చెప్పుకోవడానికి సంకోచించరు. ఈ పరిస్థితి మారాలి. గుజరాత్ లో తెలుగు మౌఖిక భాషగానైనా నిలవాలి. వీలైనంతమంది, తెలుగు చదవడం, రాయడం కూడా నేర్చుకోవాలి. 'రాష్ట్రేతర తెలుగు సమాఖ్య' స్థాపనకై అహోరాత్రాలు శ్రమించి, జూన్, 2015 లో అహమదాబాద్ లో "రాష్ట్రేతర తెలుగు సమ్మేళనం" దిగ్విజయంగా నిర్వహించిన శ్రీ పి.వి.పి.సి. ప్రసాద్ గారిని కొనియాడడానికి మాటలు చాలవు. వారు అంతటితో తృప్తి పడకుండా, దేశ నలుమూలలల్లో రాష్ట్రేతర తెలుగు సమాఖ్య తరఫున సాహితీ సాంస్కృతిక సదస్సులు నిర్వహిస్తూనే ఉన్నారు. తెలుగువారి ఐక్యతకు, తెలుగు భాష ప్రాచుర్యానికి వారు చేస్తున్న కృషికి జోహార్లు. తెలుగు భాషపై విపరీత మమకారమున్న శ్రీ ప్రసాద్ గారు, 2016 అక్టోబర్ లో రెండు రోజులపాటు గుజరాతీ సాహిత్య అకాడెమీ వారి సంయుక్త ఆధ్వర్యంలో "రాష్ట్రేతర తెలుగు సాహిత్యోత్సవం2016" సూరత్ లో సదస్సు నిర్వహణకు కూడా చాలా కష్టపడ్డారు. వారి ఆ చొరవ, తెలుగు గుజరాతీ సంబంధాల పటిష్టతకై దోహదం చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆ సందర్భంలో పేరెన్నికగన్న గుజరాతీ కవుల, రచయితల రచనలను తెలుగులోకి అనువాదం చేయించి, "గుజరాతీ సాహిత్యం – ఒక విహంగ వీక్షణం" అనే 221 పేజీల గ్రంథాన్ని గుజరాతీ సాహిత్య అకాడెమీ ద్వారా ప్రచురించారు. అందులో ఈ వ్యాసకర్త, గుజరాతీ నుంచి తెలుగులోకి అనువదించిన రచనలు కూడా చోటు చేసుకున్నాయి. మన సాహిత్య, సాంస్కృతిక, సంప్రదాయ పరిరక్షణకై గుజరాత్ లోని వివిధ ప్రాంతాల్లో ఎందరో 'ప్రసాద్'గార్ల అవసరం ఉంది.

ఈ పత్ర తయారీలో శ్రీ పి.వి.పి.సి. ప్రసాద్ గారి "గుజరాత్ గడ్డపై తెలుగు బిడ్డ" వ్యాసం, శ్రీ మెటికెల్ చంద్రశేఖర్ గారు పంపిన "గుజరాత్ పద్మశాలి మహాసభ తృతీయ ప్రాంతీయ మహాసభల" సావనీర్ ఎంతో ఉపయోగ పడ్డాయి. వారికి నా కృతజ్ఞతలు.

**అనువాద కథ**

# నా భూమి చదరమా?



(తత్వం, సిద్ధాంతం, నమ్మకం, వాస్తవం –
వీటన్నిటినీ అధిగమించి ' సత్యా'న్ని అన్వేషించే
మనిషి బుద్ధి శక్తి తార్కిక మథనం)

కన్నడ మూలం :
డి.ఎం . సిద్దీఖ్ కథ "నన్న భూమి చప్పటె యే"

శ్రీ ప్రతాప్ రాజులపల్లి
✆ 97698 55645

అదొక విశాలమైన పరీక్షా గది. గది నిండా వరుసగా బీరువాలు. వాటిల్లో వివిధ విషయాలకు సంబంధించిన రకరకాల పుస్తకాలు. సంశోధనా ఆధారాలు, పాత ఫైళ్లు, మ్యాపులు, వైజ్ఞానిక సామాగ్రి..... ఇలా జ్ఞాన సముపార్జనను సానుకూలం చేసే ఇంకా ఎన్నో వస్తువులు పేర్చ బడి వున్నాయ్. గది లో ఒక మూలన ఖగోళ వీక్షణకు వీలుపడేందుకు గాజు గోళం అమర్చిన తెరచిన కప్పు. దానికి నేరుగా క్రింద ఎత్తైన వేదిక మీద రకరకాల దూరదర్శన సామర్థ్యం వున్న టెలిస్కోపులు వుంచబడ్డాయ్. అదొక సుసజ్జిత మైన జ్ఞాన కోశాగారమే! అభ్యర్థులు వీటన్నిటి సహాయంతో తమ సమాధానాన్ని కనుక్కోవచ్చు. గది మధ్యలో వృత్తాకారపు ఖాళీ స్థలం. అక్కడొక మేజా, కుర్చీ. మేజా మీద ఓ లావుపాటి గ్రంథం, పెన్ను. ఖాళీ కాగితాలు, వాటిని కలిపి పెట్టడానికి కావలసిన పేపర్ పిన్నుల బాక్స్. మేజా మధ్యలో సీల్ చేయబడి వుండిన ఓ గోధుమ రంగు కవర్.

మొదటి అభ్యర్థి : అతడు మెల్లిగా గది లోకి ప్రవేశిస్తాడు. బీరువాల వైపుగా అడుగులు వేస్తూ, నేరుగా గది మధ్య వున్న మేజా వద్దకు చేరుతాడు. ఆతని వెనుక తలుపు మూసి, వెలుపలి నుండి తాళం వేసిన శబ్దం వినిపిస్తుంది. మేజా పై వున్న కవర్ ను చేతిలోకి తీసికొని దాని మీద ముద్రించబడిన వాక్యాలు చదువుతూ అవాక్కయ్యాడు !

కాలావధి : 10 సంవత్సరాలు
బహుమానం : 1 కోటి రూపాయలు ★

★ సరియైన సమాధానం వ్రాసిన వారికి బహుమానాన్ని 10 సంవత్సరాల తరువాతనే ఇచ్చి సన్మానించడం జరుగుతుంది.

సూచన : అభ్యర్థులు తమ గుర్తు చీటీ క్రమ సంఖ్య ను జవాబు పత్రం లో నిర్దేశించబడిన గడి లో తప్పక వ్రాయ వలసింది.

'ఏందబ్బా అంతటి మహా పరీక్ష?' అనుకుంటూ, కవర్ సీల్ ను నిదానంగా తీసి అందులో వున్న తెల్ల కాగితాన్ని బయటికి తీసి చూస్తే అందులో వున్నది ఒకే ప్రశ్న!

ప్రశ్న : భూమి ఏ ఆకారంలో వుంది ? నిరూపించండి.



ముక్కున వేలేసుకున్నంత పని జేసి, సంశయంగా 'అరే ! ఇంత సరళ మైన ప్రశ్నకు ఇంత పెద్ద మొత్తం బహుమానమా!!?? 10 సంవత్సరాలు తల బ్రద్దలు కొట్టు కోవాల్సింది ఏముంది ఇందులో?' అనుకుంటూ కూర్చోబోతున్న ఆతని ధ్యాస మేజా మీద ప్రక్కనే వున్న గ్రంథం వైపు మళ్లింది. అది భూమి గురించిన పుస్తకం అని తెలిసికోవడానికి అతనికి ఎక్కువ సమయం పట్టలేదు. 'అంటే!? ఇందులో నాకు తెలిసిన దానికి విరుద్ధంగా ఏమైనా ఉందా?' అని ఆదుర్దా గా దాన్ని తీసికుని, తనకు ముందే తెలిసిన ఏదో విషయాన్ని వెదికే వాడి లాగా గబ, గబా పుటలు తిరిగేశాడు. కొన్ని నిమిషాల్లోనే తాను నిరీక్షించినది చూసి కనులు విప్పారి, ముఖం పై విజయ దరహాసం. వెంటనే పెన్ను తీసికొని వ్రాయడం మొదలెడతాడు.

"భూమి గుండ్రంగా వుంది. చిన్నప్పటి నుండి నన్ను కన్నవాళ్ళు, ఉపాధ్యాయులు దీన్నే నేర్పించారు. నేను పుట్టి పెరిగిన అక్షరాస్య సమాజమూ ఈ సిద్ధాంతాన్నే అంగీకరిస్తోంది. అవన్నీ కాక ఇక్కడ ఉంచిన గ్రంథం కూడా అదే వాదాన్ని ఆమోదిస్తోంది."

ఇంత వ్రాసి ఆతడు నిట్టూర్పు వదులుతూ పెన్ను క్రింద పెట్టే లోగా ఠక్కని ఏదో జ్ఞాపకం వచ్చి, కాగితపు పై తుది లో వున్న గడి లో తన క్రమ సంఖ్య రాసి ముగించాడు. ‘హూ! .... బహుమానం లభించడానికి ఇంకా 10 ఏళ్ళు వేచి యుండాలి. సరే, ఓ పెద్ద మొత్తం బీమా చేసినట్లు ‘అన్న ఒప్పుదల ఓ వైపు, ‘అయినా అంత వరకూ ఈ పాడు బ్రదుకు బ్రదకడానికి, మిగిలిన వాళ్ళ లాగానే సుఖ, సౌభాగ్యాలు కావాలంటే కష్ట పడాల్సిందే ! ‘అన్న తిరస్కార భావన మరో వైపు. వచ్చిన దారి లోనే వెనక్కి వెళ్లి తలుపు తట్టి, బరువుగా అడుగులు వేస్తూ గది నుండి వెలుపలికి వెళ్ళిపోయాడు.

ఈ సారి అతని ధ్యాస మేజా మీద వుంచిన పేపర్ పిన్నుల పెట్టె మీదకు మళ్లింది. ఏదో ఓ జాడ దొరికినట్లు ఎదురుగా వున్న ఆ గ్రంథాన్ని చేతిలోకి తీసికొని చదవసాగాడు.

రెండవ అభ్యర్థి : ఇతను గది లోనికి రెండు అడుగులు వేశాడో లేదో, ఎదురుగా వున్న దృశ్యాన్ని చూసి కను బొమలు ఎగరేశాడు. కలయజూస్తే, అతడి అభిరుచి కి తగిన పుస్తకాలు, కళాకృతులు, వైజ్ఞానిక పరికరాలు ....... అన్నీ వున్నాయ్. అలాగే కళ్ళు వెడల్పు చేసి ఆస్వాదిస్తూ మైమరిచినట్లయి, అంతలో వచ్చిన పని జ్ఞప్తి కొచ్చి, గది మధ్యన వున్న మేజా వైపు నడిచాడు. మేజా మీద అదే గ్రంథం, ప్రశ్న పత్రం ప్రక్కనే వెనుకటి అభ్యర్థి జవాబు పత్రం! సేద దీర్చుకుంటూ కూర్చొని, ఒక్క నిమిషం ఆలోచనలో పడిపోయాడు. ‘వా! ఇంత బాగా అమర్చబడిన గది! ప్రశ్నకు పైపెచ్చుగా ప్రక్కలోనే ఈ గ్రంథం, వెనుకటి అభ్యర్థి జవాబు పత్రం కూడా చూసే అవకాశం! ఐనా, ఈ అన్నిటి సహాయమే లేకుండా ప్రాథమిక తరగతి విద్యార్థి సైతమూ ఠక్కని బదులు చెప్పగలిగే చాలా సులభమైన ప్రశ్న!?? ఒకటి, రెండు నిమిషాల తరువాత తన ఆలోచనల నుంచి బయట పడి మళ్ళీ చుట్టూ చూశాడు. ఈ సారి అతని ధ్యాస మేజా మీద వుంచిన పేపర్ పిన్నుల పెట్టె మీదకు మళ్లింది. ఏదో ఓ జాడ దొరికినట్లు ఎదురుగా వున్న ఆ గ్రంథాన్ని చేతిలోకి తీసికొని చదవసాగాడు.

ముఖచిత్రమే చాటి చెప్పినట్లు అది భూమి గురించి సవిస్తరంగా వ్రాయబడ్డ విశ్వకోశము. భూమి కొలతలు, తూకం, విస్తీర్ణత వంటి సూక్ష్మమైన విషయాల నుండి జీవులు, ప్రకృతి, వాతావరణం, నైసర్గిక వైచిత్ర్యాలు; వాద,

సిద్ధాంతాలు ...... ఇలా అన్నీ అందులో వున్నాయ్. వీటన్నిటినీ చదువుతూ, అందులో ప్రస్తావించబడిన ఇతర విజ్ఞుల, ఖగోళ, తత్వ శాస్త్రజ్ఞుల పుస్తకాలను గది లోనే వున్నగ్రంథాల నుండి వెదకి తీసి, ఒకటొకటిగా వాటి అధ్యయనం చేయసాగాడు. కొన్ని గ్రంథాలు చాలా సరళంగా వున్నాయి. ఇంకొన్ని గణితం ద్వారా మిగతా గ్రహాల ఆకారం, భ్రమణం, కదలికల లెక్కాచారం తో భూమి ఆకారం, చలనాలను ఎలా నిర్ధారించవచ్చు అని వివరించేవి. అలా ఎన్నో రోజులు, నెలలు గడిపిన పిమ్మట, తాను చదివి,

> **గదిలో మరో మూల ఖగోళ వీక్షణానికై వున్నవేదికపైకెక్కి టెలీస్కోప్ సహాయంతో గ్రహాలను, రోదసిలో ఇతర పరిసరాలను చూస్తూ, అధ్యయనం చేయ సాగుతాడు.**

నేర్చుకున్నదాన్ని ప్రయోగాల ద్వారా కనుక్కోగలమా? అన్న విషయం పై ధ్యాస పెట్టాడు. గదిలో మరో మూల ఖగోళ వీక్షణానికై వున్నవేదిక పైకెక్కి టెలీస్కోప్ సహాయంతో గ్రహాలను, రోదసిలో ఇతర పరిసరాలను చూస్తూ, అధ్యయనం చేయ సాగుతాడు. ఇలా రెండు, మూడేళ్ళ సుదీర్ఘ దర్శనం, అధ్యయనం తరువాయి ఓ నిర్ధారానికి వచ్చి పెన్ను చేతికి తీసికొంటాడు. జవాబు పత్రం లో పై తుదిన వున్న గడి లో తన క్రమసంఖ్య ను వ్రాసి :" వెనుకటి అభ్యర్థి వ్రాసిన జవాబు సరియే ఐనా, నిరూపణ ప్రగాఢంగా లేదన్న లోటు ఎత్తి కనిపిస్తుంది. దీనికి కారణం ఆ జవాబు 'నమ్మకం' అనే పునాది పై ఆధార పడి వుంది. నమ్మకం అన్నది మనుష్యులలో మాత్రం కనిపించే కొన్ని గుణాల్లో ఒకటి, నిజమే! కాని, సత్యాన్వేషణలో అది మనుష్యులను పీడించే మహా దౌర్బల్యం. ఉదాహరణకు, ఆ వ్యక్తికి చిన్నప్పటి నుండి భూమి ఆకారం చదరం అని నేర్పించి వుంటే కూడా, కోటి రూపాయల కోసం ఈ గ్రంథంలో వ్రాసిందే సరియయిన జవాబు అని అనుకునే వాడు. లేదా ఈ గ్రంథం కూడా 'భూమి చదరంగా వుంది 'అని చెప్పి ఉంటే, దాన్నే మళ్ళీ అప్పచెప్పేవాడు. నమ్మకం అన్నది అలాంటిది. ఒక వ్యక్తి తన కు లభించిన సమాచారాన్ని ఆధారంగా చేసికొని ఏదైనా, ఎలా కావాలన్నా నమ్మగలడు. దానికి, వాస్తవానికి సంబంధం ఉండాలన్నదేమీ లేదు. ఒక్క మాట లో చెప్పాలంటే భూమి ఆకారం వాస్తవం. అది గుండ్రంగా ఉందనో, చదరంగా ఉందనో మనం నమ్మినా, వాస్తవం మారదు.

> ఇక్కడున్న ప్రతి వస్తువూ మనిషి వైచారికా సామర్థ్యాన్ని, బుద్ధిశక్తిని ఉద్దీపనం చేయగల్గినవే.

" ఇక సహజంగా మనకు కలిగే ప్రశ్నేమిటంటే, వాస్తవాన్ని తెలిసికొనే దారి ఏది?" చాలా సులభం. గెలీలియో అన్నట్లు 'జగత్తు మనతో సంభాషిస్తుంది. అది మనతో సంభాషించే భాష గణితం'. అంటే మనం చూసే జగత్తు వెనక ఒక సంతులన వ్యవస్థ దాగి వుంది. ఈ వ్యవస్థ ను ఒక నిర్దిష్టమైన లెక్కాచారం వల్ల అర్థం చేసికోవచ్చు. ఈ రహస్యాన్ని ఛేదించడానికా అన్నట్లు, మనుష్యులలో మాత్రమే కనిపించే ఒక అత్యద్భుత సాధనమే బుద్ధి శక్తి ! బుద్ధి శక్తి గురించి ఇంత ఖచ్చితంగా ఎందుకు వాదిస్తున్నానంటే, భూమి పైన వున్న మాను, మాకు, ఇతర జీవులు – భూమి ఆకారం గురించి గాని, సూర్యుని పరిమాణం గురించి గాని ఖాతరు చేయలేదు. ఆ ఆవశ్యకత కూడా వాటికి ఉన్నట్లు లేదు. వాటి జీవన శైలి కూడా ఉనికి, సంతానోత్పత్తి ఈ రెంటి వెంటే తిరుగుతున్నట్లున్నాయ్. పెద్ద, పెద్ద తిమింగలాలైన, సూక్ష్మాతి సూక్ష్మమైన బ్యాక్టీరియా ఐనా, మనిషితో పోలిస్తే, వాటి పుట్టుక, ఉనికి, బతుకు, చావు చాలా అనాయాసంగా జరిగిపోతాయ్. చెట్లు కూడా ఆ విషయంలో పరిపక్వత చెందాయ్. మనిషయినా అంతే! ఇదే ప్రకృతి లో భాగమయిన అతను, ఒక జీవిగా తన ఆహారం, ఉనికి, సంతానాభివృద్ధి స్వాభావికంగానే కనుగొనేవాడు. దానికి బుద్ధి గాని, ఆ స్థాయి వైచారికా సామర్థ్యం గాని అవసరమైనట్లు గోచరించదు. అలాగయితే, ఆహారం, సంరక్షణ, సంతానాభివృద్ధి –వీటన్నిటినీ అధిగమించి ఆలోచించగల సామర్థ్యమే బుద్ధిశక్తి అని తేలుతుంది. అందువల్ల, ఈ విశిష్ట సామర్థ్యాన్ని సక్రమంగా ఉపయోగించి, వాస్తవాన్ని తెలిసికొనే ప్రయత్నం చెయ్యాలి గాని, కేవలం నమ్మకానికి ఓడిపోవడం నిర్లక్ష్యపు పరమావధి! ఇక ఈ గదిని కాస్త జాగ్రత్తగా అవలోకిస్తే, ఇక్కడున్న ప్రతి వస్తువూ మనిషి వైచారికా సామర్థ్యాన్ని, బుద్ధిశక్తిని ఉద్దీపనం చేయగల్గినవే. అన్నిటినీ మించి, ప్రకటించిన బహుమానం, సూచించిన కాలావధి, అడిగిన ప్రశ్న–ఇవన్నీ అభ్యర్థి విమర్శనాత్మక దృక్పథాన్ని పరీక్షిస్తున్నాయే గాని, అతని నమ్మకాన్ని కాదు ! అందువల్ల, నా అధ్యయనం ......

ఇలా తన సుదీర్ఘ అధ్యయనం ద్వారా కనుగొన్న దాన్ని చాలా సంయమనంతో దాఖలు చేశాడు. పెన్ను క్రింద పెట్టి, జవాబు వ్రాసిన కాగితాల దొంతరకు పిన్ను పెట్టి, మొదటి అభ్యర్థి జవాబును ధ్యాసతో చూశాడు. అతడి కళ్ళల్లో బహుమానం పట్ల ఆశ గాని, దాని కోసం ఇంకా కొన్ని ఏళ్ళు వేచి వుండాలే అన్న వ్యధగానీ లేవు; వాస్తవంతో పెనవేసుకున్న వైచారికా దృక్పథం మాత్రమే కనిపిస్తోంది; గదిలో ప్రవేశించడానికి ముందు లేని గాంభీర్యత వుంది. లేచి నిల్చొని మళ్ళీ ఒకసారి గది నంతా కలయ జూసి, తృప్తిగా ఓ నిట్టూర్పు విడిచి వెలుపలికి వెళ్ళిపోయాడు.

**గది లోని ప్రశాంతతను భంగ పరుస్తూ, అతడి అడుగుల సవ్వడిని గది లోని ప్రతి పుస్తకమూ, వస్తువూ ప్రతిధ్వనించి నట్లయ్యింది.**

మూడవ అభ్యర్థి : అతన్ని మొట్ట మొదటగా ఆకర్షించింది ఆ గదిలోని ప్రశాంతత. లోనికి వస్తూనే చిరు దరహాసంతో, నాటకీయ శైలిలో 'నేనొచ్చేశాను' అన్నట్లు తన రెండు చేతులూ ప్రక్కకి చాచి, గది చుట్టూ చూశాడు; మధ్యనే వున్న మేజా వద్దకు నడిచాడు. గది లోని ప్రశాంతతను భంగ పరుస్తూ, అతడి అడుగుల సవ్వడిని గది లోని ప్రతి పుస్తకమూ, వస్తువూ ప్రతిధ్వనించినట్లయ్యింది. మేజా మీద ప్రశ్న పత్రం, అదే గ్రంథం, ప్రక్కనే మొదటి ఇద్దరు అభ్యర్థులు వ్రాసి ఉంచిన జవాబు పత్రాలు– మొదటిది ఒక్క పుటకు పరిమిత మైతే, రెండవది ఒక పుస్తకం పరిమాణం లో వుంది. అతను ప్రశ్న పత్రాన్ని చేతికి తీసికొని, దిటవు గా చూస్తూ, కుర్చీలో కూర్చున్నాడు. దాన్ని మేజా మీద పెట్టి, కొద్దిగా లేచి నిల్చొని కుర్చీని మేజా కు మరింత దగ్గిరగా లాక్కుని, ముందుకు వంగి మొదటి అభ్యర్థి జవాబును చదివాడు. ఆతని ముఖం మీద ఓ చిరునవ్వు మెరిసి మాయమైంది. అది ఆ జవాబు ముగ్ధతకా లేక అభ్యర్థి మౌఢ్యానికా తెలియదు. మెడ తిప్పి, రెండవ అభ్యర్థి జవాబు ను చూస్తాడు. అది 30–40 పుటల పొత్తం. దాన్ని తీసికొని కుర్చీలో వెనక్కి వ్రాలి విశ్రాంతి గా చదువుతాడు.

అదొక సుదీర్ఘమైన అధ్యయనము మరియు సంశోధనపు దాఖలా. అందులో ప్రాచీన కాలం నుంచి ఇంత వరకూ భూమి ఆకారం పై వాద,

వివాదాల పట్ల చర్చ వుంది. తన వ్యక్తిగత ఖగోళ వీక్షణము నుండి కనుగొన్న ఆధారాలూ వున్నాయ్. కొన్ని గంటలు వాటన్నిటినీ చదివి, అందులో ప్రస్తావించిన పుస్తకాలను, దస్త్రాలను తెచ్చి మేజా పై పేర్చి, అలసినట్లై, నడుం మీద ఒక చేయి ఉంచి, మరో చేత్తో తల నిమురుకుంటూ కూర్చున్నాడు. కొద్ది రోజులు వాటి ని అధ్యనం చేసిన తరువాత కూడా ఏదో కొరత. అతని బుద్ధి తన అధ్యయనాన్ని, వీక్షించిన దృశ్యాలను ఒప్పుకున్నప్పటికీ,

> ఏదో పీడకల నుండి భయపడి లేచినట్లు, పరుగున రెండవ జవాబు పత్రాన్ని తీసికొని ఆ పంక్తికై వెదుకులాడాడు.

'ఇంకా ఏమో వుంది' అన్న ఓ చిన్న భావన బాధిస్తోంది. అదే ఇంతవరకూ తనను లాక్కొచ్చింది. కానీ దాన్ని పెడ చెవిన పెట్టే ప్రయత్నం విఫలమయ్యింది. విసుగు చెంది, కాస్త విశ్రాంతి తీసికునేందుకు వెన్నును వెనక్కి చాచి, ఆవులిస్తూ, కప్పు వైపు చూస్తూ రెండు చేతులతో కళ్ళు రుద్దుకున్నాడు. ఆలా రుద్దుకునే వేళ, ఆ జవాబు పత్రం లోని ఒక పంక్తి కళ్ళ ముందు అగుపించి, తక్షణం మాయమౌతోంది. ఏదో పీడకల నుండి భయపడి లేచినట్లు, పరుగున రెండవ జవాబు పత్రాన్ని తీసికొని ఆ పంక్తికై వెదుకులాడాడు. ఒక నిర్దిష్ట పుటలో ఆతని రెండు కళ్ళూ కేంద్రీకృతమవుతాయ్. ఆ పుటలో రెండవ అభ్యర్థి తన ఖగోళ వీక్షణాన్ని పాయింట్ బై పాయింట్ వివరిస్తూ ..... ' భూమి నుండి రోదసి లో వున్న ఇతర ఆకాశ కాయాలను టెలిస్కోప్ సహాయంతో చూసినప్పుడు, అవి గుండ్రంగా వున్నాయన్నది స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఒక నిర్దిష్ట మైన దూరాన్నుంచి భూమిని చూస్తే అది కూడా గుండ్రంగా ఉండడం కన్పిస్తోంది. దీన్ని చదవడం తో అతని ఆయాస మంతా మాయమై, మేజా మీద వున్న ఆ పెద్ద గ్రంథాన్ని తెరిచి దాని విషయ సూచిక లో తనకు తోచిన టాపిక్ ను వెదక దొడిగాడు. అతని కళ్ళు, వాటి సహాయకుడి లాగా చూపుడు వేలు – విషయ సూచిక పైనుంచి క్రింది వరకూ వేగంగా కదిలాయి. ఆ టాపిక్ పుట సంఖ్య ను వెదకి తెరచి, అందులో వున్న విషయాలను మననం చేసి, అదే విషయం గురించి ఇతర గ్రంథాలను సంప్రదించి, ఒక కాగితం పై వ్రాసి ఉంచుకున్నాడు. అలా తనకు కావలసిందల్లా వ్రాసుకున్న తరువాయ, ఆ కాగితాన్ని చేతిలోకి తీసికొని నేరుగా గది వెలుపలికి వెళ్లే పోయాడు. మేజా మీద ఆతను చదువుతూ వుండిన పుట అలాగే తెరిచే వుంది. దాని శీర్షిక

'అంతరిక్ష యానం ... '.

క్రమేణా 6–7 సంవత్సరాలు గడచి పోయాయి. ఆ గది లో మరో సారి అలజడి – ఈ సారి మారుతున్న అతని ఉచ్ఛ్వాస, నిశ్వాసాల వేగపు స్థాయి, లయబద్ధంగా గుండె చప్పుడూ, ఆ మందహాసం, చెప్పకనే చెపుతున్న అతని స్థితి – అంతే కాని ఆతని అడుగుల సడి వల్ల కాదు. లోనికి వస్తూనే, మొదటి సారిగా గదికి మరో మూల వున్న కిటికీ వైపు దృష్టి మరలుతుంది. దాని దగ్గరగా నడచి, కిటికీ తెరుస్తాడు. చల్లని చిరుగాలి అతని ముఖాన్ని సోకుతూ గది లోకి వీచింది. నిర్జీవ కాయానికి జీవం నింపినట్లు, ఆ చల్లని గాలికి గది లోని ప్రతి వస్తువూ స్పందించాయి. కొన్ని నిమిషాలు అలాగే వెలుపలికి చూస్తూ చల్లగాలికి అడ్డంగా నిలబడతాడు. కళ్ళు మూసికొని ఓ దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, తిరిగి మేజా వైపు నడిచాడు. మెల్లిగా పెన్నును చేతికి తీసికొని జవాబుపత్రం పై రాయ తొడుగుతాడు.

> కళ్ళు మూసికొని ఓ దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, తిరిగి మేజా వైపు నడిచాడు. మెల్లిగా పెన్నును చేతికి తీసికొని జవాబు పత్రంపై రాయ తొడుగుతాడు.

"వేసిన ప్రశ్న కు బదులు చెప్పే ముందు, మొదటే వ్రాయబడిన మొదటి రెండు జవాబులు రేకెత్తించిన ప్రశ్నలకు సమాధానం వెదకడం ఇక్కడి నియమం అన్పిస్తోంది. వుండనీ ! నేను చూసిన ప్రకారం, మొదటి రెండు జవాబులూ ఆయా అభ్యర్థి కి తగినట్లు వున్నాయ్. మొదటి ది మనుష సహజ మైన బెనెఫిషియల్ శాటిస్ఫాక్షన్ (Beneficial satisfaction ) పరిణామం వల్ల. అంటే, ఇలా చెబితే ఈ రీతి లభిస్తుంది. ఆలా చేస్తే ఆ రీతి ప్రతిఫలం లభిస్తుంది – అనే లాభాపేక్ష మనోభావం తో వ్రాసినది. 'నమ్మకం' అన్నది సహజంగా రూప కల్పన చెందేది ఈ మనోస్థితి లోనే. అందువల్ల, మొదటి జవాబు బహుమానానికి సంబంధించింది గాని, ప్రశ్నకు సంబంధించింది కాదు. అలాంటి సమాధానాన్ని సత్యంగా ప్రమాణీకరించడం సాధ్యం గాదు.

"రెండవ సమాధానం విచార దృక్కోణం లో ఎక్కువ సబబైనది. ప్రశ్న దిక్కునే తన వైచారికా సామర్థ్యపు వైపు తిప్పితే దొరికే లోతైన జవాబు, గాంభీర్యత ఆ జవాబు పత్రం లో వుంది. అందులో వాస్తవానికి సంబంధించిన వైచారిక సంబంధమూ, నిఖరమైన లెక్కాచారమూ వున్నాయి. కానీ, ఒకే ఒక్క

కొరత! అదేమిటంటే విచార దృక్పథం తో చూస్తే, ఈ గది లో భూమి చదరంగా ఉందని వాదించే గ్రంథాలు, వాటిని నిరూపిస్తూ ఇతర విజ్ఞుల అధ్యయన దాఖలాలను ఒదగించి ఉంటే, జవాబు రూపు రేఖలే బహుశా వేరే రకంగా వుండేవేమో ! ఎందుకంటే, అందులో వున్నది భూమి ఎందుకు చదరంగా లేదు అనే ఇతర వాదనల సమర్థనే కానీ, తాను కనుగొన్న పరమ సత్యమేమీ లేదు. కొన్నిసార్లంతే. కొన్ని ప్రశ్నలు ఎదురైనప్పుడు బుద్ధి మొదటే ప్రచారం లో వున్న, అప్పటికే విని, తెలిసికొన్న విషయాల గురించి మద్దతును వెదుకుతుందే గాని, 'సత్యం' ఏమిటి అని శోధించే ప్రయత్నం చాల అరుదు.

భూమి ఆకారాన్ని గురించిన సత్యమేమిటి? దీనికి ప్రత్యుత్తరం ఇచ్చే ముందు, సత్యం ఏమి టన్నది అర్థం చేసికోవాలి.

అందువల్ల, రెండవ జవాబు విచార సంతుష్టి తో కనుగొన్న సమాధానం అనొచ్చేమో ! అయితే, 'నమ్మకం 'తో పోలిస్తే, వైచారికత తన కు అర్థమైన వాస్తవాన్ని స్వీకరిస్తూ, పాత వాటిని తిద్దుకుంటూ మెరుగయ్యేది. అది ముందుకు వెళ్లి సత్యం తో సంబంధం ఏర్పరుచుకోవాలి. అది దాని గుణం. లేదా అది కనుగొనింది ఒక జడ సిద్ధాంతంగానే మిగిలి పోతుంది .

"అలా అయితే, భూమి ఆకారాన్ని గురించిన సత్యమేమిటి? దీనికి ప్రత్యుత్తరం ఇచ్చే ముందు, 'సత్యం' ఏమి టన్నది అర్థం చేసికోవాలి. అలతి పాటి మాటల్లో చెప్పాలంటే 'సత్యం' ఒక, వాదం కాదు, సిద్ధాంతం కాదు, తత్వశాస్త్రమూ కాదు. ఇవన్నీ సత్యాన్ని అర్థం చేసికోవడానికి మనిషి చేసే ప్రయత్నాల్లో భాగాలే ! 'సత్యం' అన్నది ఒక స్థితి. మనిషి వున్నా, లేకున్నా, దాన్ని గురించి తెలుసుకున్నా, తెలుసుకోక పోయినా ఆ స్థితి అస్తిత్వం లో ఎలాంటి మార్పూ ఉండదు. ఇదే వైచారిక వాస్తవానికి, సత్యానికి వున్న బహుముఖ్యమైన వ్యత్యాసం. వైచారికం నిచ్చెన లాంటిది. దాని సహాయం తో మనిషి ఒక నిర్దిష్టమైన ఎత్తుకు చేరవచ్చు. లేదా చేరిన ఎత్తు కనుగుణంగా అతడు చూసిన వాస్తవానికి భాష్యం వ్రాయవచ్చు. కానీ, సత్యమన్నది సంపూర్ణంగా కొరుకుడు పడే విషయం కాదు. అది అతడు చేరిన ఎత్తు కాదు, అతని గ్రహణసామర్థ్యాన్ని అనుసరించి అవగతమయ్యేది."

నాకు తెలియని ఒక నేను ఉన్నానా? ఇలా నా అంతరాళాల లోతున వెదికితే పరిచయ మయ్యేది ఆ గొప్పమైన నేను.

"అంటే, నేను మార్చవలసింది జవాబును, దాని సమర్ధనను కాదు. ప్రశ్నను గ్రహించే రీతిని. మొట్టమొదటిగా, ఇక్కడ అడగబడిన ప్రశ్న సంబోధించింది నన్ను. ఎవరు నేను ? ఈ ప్రశ్నకు సాపేక్షికంగా, ఒక క్రమ సంఖ్య ? లేదు ముందే జవాబు తెలిసిన నమ్మకమా? కొత్త సమర్ధనను వెదకే బుద్ధిమంతతయా? ఈ దేహమా? మనస్సా?? లేక, ఈ రెండిటి సంగమమా? పేరా? భావనలా?? పరిచయమా?? కాదు. ఇవన్నీ తెలిసో, తెలియకో నన్నంటుకుని వున్నవి మాత్రమే! అలా అయితే, వీటన్నిటినీ మీరి, నాకు తెలియని ఒక 'నేను' ఉన్నానా? ఇలా నా అంతరాళాల లోతున వెదికితే పరిచయ మయ్యేది ఆ గోప్యమైన 'నేను'. ఆ 'నేను' పైన చెప్పిన అన్నిటికీ వెలుపల వున్న ఒక అస్తిత్వం. ఇంకా సరళంగా చెప్పాలంటే, అన్నింటినీ గ్రహించాలనే ఓ 'మోహం', 'హఠం'– ఆ 'నేను' అంతరాంతరాళం లో సదా జాగృతమైన 'ఇంకా ఏదో వుంది' అనే ప్రతిధ్వని. "మనిషి అన్ని సంశోధనలకు, అన్వేషణలకు, భాష, నైపుణ్యాలకు, కళ, సాహిత్యాలకు, భావనలకు, ఆశా, ఆకాంక్షలకు మూలమే ఈ మోహం. వైచారికత లేదా బుద్ధిమంతత కూడా ఈ అంతరాళపు 'నేను' కనుగొన్న ప్రబలమైన అభివ్యక్తీకరణ! అయితే ఈ మోహం నమ్మకం, వాద–సిద్ధాంతాలు, తత్త్వశాస్త్రం లేదా బుద్ధి – ఇవన్నిటితో తృప్తి చెందదు. దాన్ని తృప్తి పరిచే ఒకే ఒక మార్గం 'సత్యం'. సత్యాన్ని గ్రహించే వరకు ఆ మోహం ఊరుకోదు. ఇదే మనిషి విశిష్టత. అతడికి మాత్రమే వున్న స్వాతంత్ర్యం. సత్యాన్ని ప్రజ్ఞాపూర్వకంగా, దాని నిజ రూపంలో గ్రహించ గలిగిన, జుల్లుకోగలిగిన అవకాశం."

"నేను చేసింది అదే! ప్రశ్న దిక్కును మార్చడం – అంతరాళం లోని నా వైపు. ఒక క్షణం తరువాత జవాబు తెలియదనిపించింది. ఈ గదిలో వున్న వాటన్నిటినీ చదివి, అధ్యయనం చేసిన తరువాత కూడానా ? అనుకున్నాను. మరోసారి సావకాశంగా అవలోకించాను. 'అవును! నిజంగా తెలియదు!' ఒక్కటొక్కటిగా అంతవరకూ భూమి గురించి విన్న, చదివిన, తెలిసికొన్న అన్ని నమ్మకాలు, వాదనలు, సిద్ధాంతాలు కరగి పోయి ఓ రకమైన ఖాళీ అవస్థ. ఏం

చేయాలో తోచక కొట్టుమిట్టాడుతుంటే, పాత కుప్ప నుండి లేచిన ధూళిలాగా 'బుద్ధి' చైతన్యం తో లేచి కూర్చుంది. దాని కిప్పుడున్న ఒకే ఒక ఉద్దేశ్యం సత్యం కనుగునే దారి సుగమం చేయడం. అదీ మొదటి సారి. నమ్మకం, వైచారికత, వాస్తవత – మొత్తానికి ఈ గది వెలుపల వున్న సాధ్యతలతో ప్రయోగానికి దిగింది. మళ్ళీ గతాన్ని నెమరు వేసికొన్నాను. కఠినమైన దైహిక, మానసిక పరిశ్రమ తో బాహ్యాకాశపు యానం చేసే సదవకాశం నాదయ్యింది. ఈ పదేళ్ల జీవితంలో చాలా నిరీక్షణతో వేచియున్న ఆ దినం అత్యంత ఉత్సాహంగా ఎదురొచ్చింది. ఆ దినం నేనున్న స్పేస్ షటిల్ బాహ్యాకాశపు వైపు వెడలి పోయింది. కొన్ని గంటల ప్రయాణం తరువాత మాకై నిర్ధరించబడిన ఆ కక్ష చేరాము. ఆదేశానుసారం, బాహ్యాకాశపు ఉడుపులు మళ్ళీ పరీక్షించి, గురుత్వ రహిత స్థితి లో తేలుతూ నౌక నుండి బయటికి వచ్చాము. ఆ నల్లని పారదర్శక, నిర్వాత వాతావరణాన్నుంచి స్వంత ఉనికినే మరిచి తేలుతూ ఓ కొత్త ఆనందాన్ని అనుభవిస్తుంటే, సహ యాత్రికుడు నీ వెనకేముందో చూడు అన్నట్లు వేలితో సైగ చేశాడు. మెల్లిగా మొత్తం దేహాన్నే ఆ వైపు త్రిప్పి చూస్తే......!!"

" అదిగో అక్కడ....... చిమ్మ చీకటి నేపథ్యం లో మెరుస్తోంది భూమి! కెంపు లాగ !! కన్నుల చల్లగ చేసే ఆ నీలి సాగరాలను మోస్తూ, వ్యాపకమైన కంది, ఆకుపచ్చ కలసిన నేల ..... చెదరిన వెండి మబ్బులు .... నేను ముందంటే నేనే ముందంటూ ఒకదాని వెనుక ఒకటి పరుగులు తీసే రాత్రింబవళ్ళు! ఆహా!! ఆ దృశ్యకావ్యాన్ని అనుభవించడానికి ఈ రెండు కళ్ళూ చాలవు. దానికి నేపథ్య సంగీతమా అన్నట్లు, జ్ఞాపకాల లోతుల నుండి పెల్లుబికి మది లో మెదిలిన పర్వత శిఖరాల గుయ్ గొట్టే గాలి, అంబరాన్ని చుంబించే పర్వత సాలుల జాలువారే ఝరుల ఝంఝూనిలం, జ్వాలాముఖి విస్ఫోటార్భాటము, నదుల కలరవము, పక్షుల కిల, కిలలు, పిల్లల గల, గల నగవులు – ఆ సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తున్నాయ్ ."

"చటుక్కున జ్ఞాపకమొచ్చి, నేను తెచ్చుకున్నవాటిని వెదక సాగాను. అరే! ఎక్కడా? కన్పించడం లేదేం!! ఎక్కడికెళ్లాయ్?? ఆ దేశాలు? భాషలు? వర్ణాలు? వేషభూషణాలు?? ద్వేషాలు?? యుద్ధాలు?? చావు, నోవులు?? ఇత్యాది, ఇత్యాది. ఎక్కడ అవన్నీ?? ఎంతాశ్చర్యం, అవేవీ లేవు. మంచిదే అయ్యింది, లేదంటే భూమి ఇక్కడినుండి కూడా కురూపి గా కన్పించేదేమో!! కానీ,

వాటన్నిటినీ మోస్తూ కూడా ఎంత ప్రశాంతంగా వుంది భూమి ! తన చుట్టూ విశాల నిర్వాతం లో తనను తాను మరచిన ధ్యాని లా !!"

"అలా తేలుతూ ఆ దృశ్యంలో మైమరిచినప్పుడు, నా అస్తిత్వం జ్ఞప్తికొచ్చి.... అందులో నేను కూడా ఓ భాగమేగా?! ఆ మన్నులో ఓ పెల్ల! నాలో ప్రవహించే రక్తం, ఊపిరి, నీరు, ఎముకలు-మాంసం అన్నీ ఆ మట్టిలోనివే ! అవును, దాని రూపాంతరమే, ఏ సంశయమూ లేదు!! అలాగైతే ...... అలాగైతే, నేను భూమిని చూస్తున్నానా? లేక, భూమి తన్ను తానే చూస్తోందా అనే విచిత్రమైన ఆలోచన మెదిలిన ఆ క్షణం !! ఆ క్షణం, ఎవరికీ ఏమీ చెప్పాల్సిన అవసరం లేదు. ఎవర్నీ ఏమీ అడిగే ఆవశ్యకత కూడా లేదు. అన్నీ అన్నిటినీ గ్రహిస్తాయి. ఒకదానికొకటి స్పందిస్తాయ్. వాటిదే అయిన భాషలో ! ఎద లోపల వీచే చల్ల గాలి, వెన్నెముకలో చక్కిలిగిలి, విద్యుత్ స్పర్శ తాకినట్లు చైతన్యం పొందిన ప్రతి కణం, ఆర్ద్రమైన కళ్ళు, వణకుతున్న నాలిక, గద్గద మైన కంఠం నుండి అవ్యాజంగా వెలువడిన 'అద్భుతం... అత్యద్భుతం, సార్థకం, ధన్యమీ జీవితం' అన్న ఉద్గారం." రాయడాన్ని నిలిపి, తనకు తెలియకుండానే కాగితం పై తొలికిన ఆనందబాష్పాన్ని , నిదానంగా తుడిచి మళ్ళీ రాయడం సాగించాడు.

> నేను భూమిని చూస్తున్నానా? లేక, భూమి తన్ను తానే చూస్తోందా అనే విచిత్రమైన ఆలోచన మెదిలిన ఆ క్షణం !!

" ఇలా భాషలో వెలిబుచ్చలేని కొన్నిటిని, కేవలం అనుభూతి పొందగలిగిన మరి కొన్నిటినీ, నా పూర్తి అస్తిత్వాన్నే నింపుకున్న సత్యమే నా ప్రత్యుత్తరం! ప్రశ్నే మరచి, నన్ను సంపూర్ణంగా తనలో లీనం చేసికొన్న అనుభూతిగా తోచింది భూమి ఆకారం! అన్ని వాద - వివాద సిద్ధాంతాలు భగ్గని, బుగ్గి ఐనట్లు, నా అస్తిత్వం పై నిశ్చలమైన ముద్ర వేసింది, నాలో సదా తొణికిసలాడే, స్వయంగా నేనే మార్చలేని వాస్తవమైంది సమర్థన."

"ఇవన్నీ ఏవీ లేని పక్షాన నా భూమి ఆకారం చదరమా??"

పెన్నును క్రింద ఉంచి , జవాబు రాసిన కాగితాన్ని మేజా పై వుంచుతాడు.

'ట్రింగ్...ట్రింగ్.......' అంటూ బెల్ దీర్ఘంగా మ్రోగింది. ఇచ్చిన

కాలావకాశం ముగిసిందని తెలుపడానికి. అతను లేచి నిల్చొని అదే ఉత్సాహంతో, సంతృప్తి తొణికే మందహాసంతో గది బయటికి వెళతాడు. అతను వెడలిన వెంటనే , వెనుక శాశ్వతంగా మూసివేయడం జరిగింది . కానీ, గది మరో అంచున వున్న కిటికీ మాత్రం తెరచే వుంది. తెరచిన కిటికీ నుండి వీచిన చల్ల గాలికి, మేజా మీద వున్న జవాబు పత్రాల కొసలు సముద్రపు అలల లాగా, పైకి లేచి, మొత్తం కాగితాలే అలా గాలిలో కొంచెం దూరం తేలి నేల వ్రాలాయ్. చెదరిన మూడు జవాబు పత్రాల పై తుది అంచులో ఎత్తి కనిపిస్తోంది – అభ్యర్థుల క్రమ సంఖ్య. ఏంటవి ! ఆ మూడు క్రమ సంఖ్యలూ ఒకటే !!!

★★★★★

నా స్థితి కూడా మొదటి అభ్యర్థి దశ లో వుండి, నా వద్ద ప్రత్యుత్తరాల రాశియే పడివుంది. నేనెన్నడూ అడగని ప్రశ్నకు, పేర్చి వుంచిన ప్రత్యుత్తరాలు. ప్రశ్నించే తంటాకే పోకుండా, ప్రత్యుత్తరపు గుణం, రంగు, రుచి ఏవీ అనుభవానికి రాని, చప్పగా కుప్పగా పడి వున్న జవాబుల. ‘ నాకు జవాబు ముందే తెలుసు ‘ అనే భ్రమతో ఊపిరాడకుండ గొంతు నొక్కి చంపిన ప్రశ్నల రుద్ర భూమి బహుశా చాలా దూరమే వ్యాపించి వుంది. కానీ, జీవితం లో అడిగి తీరవలసిన కొన్ని ప్రశ్నలు అప్పుడప్పుడు సమాధి నుండి లేచి ఎదురొచ్చి భయోత్పాతానికి గురి చేస్తాయ్. పైకి జవాబు తెలుసనే ఓ పిచ్చి హఠం. అంతరాళం లో ఆ జవాబు అనుభూతి కోసం తెలియని తొక్కిసలాట. సహించ లేక ఓ రోజు ఈ సందిగ్ధాన్నుంచి బయట పడేందుకు నిర్ధారించాను. ఒక్కొక్క సమాధినీ త్రవ్వి , జవాబు తో పాతిపెట్టి మొత్తం నేలనే పచ్చదనాన్ని పరిచి చల్లని అడవిగా చేసేందుకు పందెం కట్టాను. ఎలాగైతేనేం, ధైర్యం చేసి నా కోసమే ఓ ప్రశ్న పత్రిక తయారు చేశాను.

| | | |
|---|---|---|
| పరీక్షా గది | : | జీవితం |
| కాలావకాశం | : | చనిపోయే లోపు |
| అనుకూల పరికరాలు | : | బ్రహ్మాండం , దేహం , బుద్ధి , మనస్సు , నా ఉనికి |
| బహుమానం | : | సత్యం |
| ప్రశ్న | : | దేవుడున్నాడా? నిరూపించు! |

# ఓగు



**శ్రీ సిరికి స్వామినాయుడు**
✆ 94940 10330

ఆ సమాధి వేపు వెళ్లకండి
ఆమెనలా సుదీర్ఘ నిదురలో యింకి పోనివ్వండి
ఎన్నెన్ని నిదుర లేని రాత్రుల్ని మోసుకు తిరిగిందో..
ఎన్నెన్ని సర్ప పరిష్వంగాల మధ్య నలిగి పోయిందో..
ఆమెనలా నేలమ్మ ఒడిలో సేదదీర నివ్వండి
దీర్ఘతమస్సులో యింకి పోనివ్వండి !

యిన్నేళ్లూ – శాంతికీ అశాంతికీ మధ్య ..
విశ్రాంతిలేని రేయంబవళ్ల మధ్య .. ఆమె
అత్తరు పూసుకున్న గత్తరగత్తర అంగళ్ల మధ్య
ఓ ఆకలిబొమ్మలా ..
ఎవరెవరో చేదుకుపోతున్న ఊరుమ్మడి బావిలా ..
ఊరవతల ఒంటి స్తంభం కింద కదలాడే ఓ ఒంటరి నీడలా ..
పెళ్లిళ్లూ పేరంటాళ్లూ పిల్లలూ .. బతుకులో
ఏ అచ్చటా ముచ్చటాలేని ఓ ఒంటరి మొజ్జులా .. !

ఆమె .. ఒక నడచే వల్లకాడు
రేయంతా వెలిగీ పొద్దు దూరేసరికి పాలిపోయే వేగుచుక్క
అంగలార్చే బేపులదాడిలో ఎంగిలి విస్తరై చిరిగి
తిరిగి కన్నీటి సూదులతో తనువును కుట్టుకుంటూ ..
చీకటి ఆకాశాన్ని చీరగా చుట్టి

అరువుదెచ్చుకున్న ఎరువు అందాలారబోసీ ..
పెదాలమీద మసకబారిన నెలవంకను నిలుపుకొనీ
విరిసిన సాయంసంధ్యలో.. సన్నజాజులు చిందులాడే వేళ ..
ఒకానొక సుదీర్ఘమైన ఎదురుచూపులో ..
కాళరాత్రుల మధ్య కరిగిపోయే కొవ్వొత్తిలా ..
బతుకు .. నిర్ధాక్షణ్యంగా చీకటిలోయల్లోకి నెట్టేసాక
అనివార్యమై ..
సాలెగూడులో చిక్కిన పురుగులా సారాన్ని కోల్పోయి ..
చివరకు చీకిపారేసిన చెరకుపిప్పిలా మిగిలిపోయి .. !



విటునికీ విటునికీ మధ్య విరామంలో..
మంచం మీద మూల్గుతున్న ముజ్జుకు మందులిచ్చి
రతికీ రతికీ మధ్య ..
రాత్రి గాయాల సలుపులకు పసరు పూసుకొని
పక్కసర్దే లోపు .. పసిపిల్లకి పాలు కుడిపి
కాసులకొమ్మకు చిక్కిన బగిడిపిట్టై కొట్లాడుతూ ..
ఎన్నెన్ని ఆకలికళ్లకు ఆహారమయ్యిందో..
ఎన్నెన్ని పశువులగిట్టల కింద నలిగిపోయిందో ..

ఎన్నెన్ని స్ఖలనసముద్రాలను యీదికొచ్చిందో..
ఎన్నెన్ని కవోష్ణకాసారాల్ని చల్లార్చిందో .. యివాల
యిలా చావుగాలికి నేలరాలిన పువ్వులా
అలసి అలా నేలమ్మ ఒడిలో నిదురపోతోంది !

నీ రేటెంతని అడిగిన వాళ్లే తప్ప
పేరైనా అడగని చిత్తకార్తె కాలంలో ..
మల్లెలవాసన తప్ప
మనసువాసనే తెలియని మదమెక్కిన పశువులతొక్కిడిలో ..
ఆమెతో పడక సుఖాన్ని పొందిన వారేగానీ ..
ఆ కళ్లవెనుక చీకటిపొరల్ని చూసిన వారేరీ ?
వేనవేల వీర్యపునదుల్ని తనలో కలుపుకున్న కడలి ఆమె
రెక్కలల్లారుస్తూ రాంపోతులు తిరిగేవేళ
చీకటి మధువు తాగి చిందేసిన రాత్రులలో ..
రోజుకో వెన్నెలరేకును కోల్పోయిన కన్నీటి కలువ ఆమె
కదులుతున్న కట్టె ఆమె .. కాలుతున్న మొజ్జు ఆమె !

తన దేహంమీంచి
ఎందరెందరినో  తీరని దాహాల తీరం దాటించీ ..
పందులు తొక్కిన బురదనేలై  తవతవలాడుతూ ..
ఎందరెందరో రుచిచూసిన ఎంగిలి కంచమై ..
ఆకలిముందు వివస్త్రగా మారి
బందెలదొడ్లో  శీలాన్ని అమ్మకానికి పెట్టీ ..
తీరంతెగిన ఒంటరి ఓడలా .. చివరకిలా
బతుకుచెట్టు నుండిలా ఎండుటాకులా రాలిపోయీ..
ఆమె సమాజం చేసిన ఓ గాయం ..
తడారని కన్నీటి గేయం !!

# త్యాగయ్య, అన్నమయ్య రచనలలో సామాజిక ధోరణి



డాక్టర్ సత్యసాయి కొవ్వలి
98194 83562

తెలుగు వాగ్గేయకారులలో ముఖ్యులయిన త్యాగరాజు, శ్యామశాస్త్రి, అన్నమయ్య, రామదాసు, క్షేత్రయ్య కేవలం భక్తి ప్రధానంగా కీర్తనలు రాసి ఆలపించారు. అత్యధిక సంఖ్యలో కీర్తనలు రాసిన త్యాగయ్య, అన్నమయ్యలు వారి భక్తితో పాటు తత్కాలీన సామాజిక రుగ్మతలు, పోకడలు, మానవ సంబంధాలు, వ్యవహారాలపై తమ ఆలోచనలను తమ రచనల ద్వారా వ్యక్త పరిచారు. వీరి కీర్తనలను ఉదాహరిస్తూ వారు తమ సామాజిక బాధ్యతను ఏ రకంగా తమ రచనలో చూపించారో ఈ వ్యాసంలో వివరించాను. సామాజిక బాధ్యత అంటే సంఘంలో దురాచారాలను ఎత్తిచూపడం, సాటివారికి తన అనుభవాల దృష్ట్యా మార్గ నిర్దేశం చేయడం, తన విద్యని ఇతరులకి నిస్వార్థంగా నేర్పడం ఇత్యాదులు మాత్రమే కాకుండా 'సులభముగా కడతేరను సూచనలను తెలియజేయడం' కూడా. అంటే, లౌకిక చింతనతో పాటు పరలోక చింతనకు మార్గం చూపే ప్రయత్నం కూడా సామాజిక బాధ్యతే. త్యాగయ్య కీర్తనలు ఉన్నత మానవతా విలువలను చాటిచెప్పే ఆధునిక పాఠాలు. వారి కీర్తనలు సంగీతపు పొరల మాటున దాగి ఉన్న జ్ఞాన గుళికలు.

## కాకర్ల త్యాగబ్రహ్మం (త్యాగరాజు)



4 మే 1767 –6 జనవరి 1847 మధ్య కాలంలో జీవించిన త్యాగరాజస్వామి వారు నాదోపాసనే జీవితాశయంగా చేసుకుని తన 80 సంవత్సరాల సుదీర్ఘ జీవిత ప్రయాణంలో కొన్ని వేల కీర్తనలు రచించారు. సంగీత త్రిమూర్తులలో ప్రముఖులైన ఈయన

తన జీవితాన్ని రాముని సేవకై అంకితం చేసి కేవలం ఉంఛవృత్తితో జీవనం గడిపారు. ఆ విధంగా భక్తికి, వైరాగ్యానికి, నాదోపాసనకి, నిర్మోహత్వానికి ప్రతీకగా జీవించి తన జీవితమే ఒక ప్రబోధముగా నిరూపించిన మహనీయుడు ఆయన.

అందరికీ సంగీత జ్ఞానం అలవర్చుకోవడం సాధ్యం కాదు అని తెలిసి అందరూ పాడుకోగల ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు, భజన సాంప్రదాయ పద్ధతిలో కీర్తనలు ఆయన స్వరపరిచారు.

త్యాగరాజ స్వామి వారు తమ అనేక రచనలలో మనసుని సంబోధిస్తూ ఆత్మ ప్రబోధానికి ఎక్కువ విలువ ఇచ్చారు. ఈ ధోరణిలో ఇతరులకి బుద్ధి చెప్పడం కేవలం ఎవరిని నొప్పించకుండా వారిని సంస్కరించడానికి ప్రయత్నించడం అని అనిపిస్తుంది. 'మనసా ఎటులోర్తునే'[1], 'నిధి చాలా సుఖమా'[2], 'సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము కలదే మనసా'[3] అని తనని తాను ప్రశ్నించుకున్నా అవన్నీ మనకు ఇచ్చిన సందేశాలే. వాటిలో ముఖ్యమైనవి నాదోపాసన చేయమని, భక్తి కలిగి ఉండమని. 'నాదలోలుడై బ్రహ్మానందమందవే'[4], 'ప్రాణానల సంయోగము వల్లా ప్రణవనాద సప్తస్వరములే బరగా– మోక్షము కలదా'[5], అని చెప్పినా, 'భజన చేయరాదా'[6] అని సలహా ఇచ్చినా, 'భజనపరులకేల దండపాణి భయము'[7] అని ధైర్యం చెప్పినా మనకి ఆయన ఉపదేశించదలచినది భక్తి మరియు సంగీత జ్ఞానం అలవర్చుకోమని. అందరికీ సంగీత జ్ఞానం అలవర్చుకోవడం సాధ్యం కాదు అని తెలిసి దయతో అందరూ పాడుకోగల ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు, భజన సాంప్రదాయ పద్ధతిలో కీర్తనలు ఆయన స్వరపరిచారు.

త్యాగరాజ స్వామి వారు ఆ రోజుల్లోనే హేతుబద్ధంగా ఆలోచించిన గొప్ప యాక్టివిస్ట్. 'యజ్ఞాదులు సుఖమనువారికి సములజ్ఞానులు కలరా?'[8] అని ప్రశ్నించి యజ్ఞాలు చాలా ముఖ్యము అనుకునే ఆ రోజుల్లోనే తన తిరుగుబాటు ధోరణి ప్రదర్శించారు. జన్మవాసనలు, విషయాసక్తిలో తగిలి శ్రీరాముని తెలియక యజ్ఞ్యాదులు సుఖం అనుకోవడం అజ్ఞానమని ఆయన అభిప్రాయం. సుజ్ఞానం కావాలంటే మనమేం చేయాలో తత్వముపదేశించిన మహర్షి ఆయన. 'అనురాగము లేని మనసున సుజ్ఞానము రాదు'[9], అని ఒక చోట చెప్తే 'శాంతము

లేక సౌఖ్యం లేదని'[10] ఇంకో కృతిలో చెప్పారు.

'మనసు స్వాధీనమైన ఆ ఘనునికి మరి మంత్ర తంత్రము లేల?'[11] అని చెప్పిన స్వామి వారు 'మనసు నిలప శక్తి లేకపోతే మధుర ఘంట విరుల పూజేమిసేయును'[12] అని మనస్సును అదుపులో పెట్టుకో లేకపోతే మన నిత్య పూజలు నిరర్థకమని తెగేసి చెప్పారు. కర్మకాండకి ప్రాధాన్యమిస్తూ నిత్యం ఎన్నో పూజలు చేస్తూ సతమతమవుతున్న నవయుగ భక్తులకి చురకలు వేసినట్టు స్వరబద్ధంగా చెప్పిన సూటిమాట ఇది. ఘన దుర్మదుడు చేసే పుణ్య నదీ స్నానం, సోమిదమ్మ సొగసుకాంద్రను కోరితే సోమయాజి స్వర్గార్హుడవడని, కామ క్రోధాలు వదలకుండా చేసిన తపస్సు దండగని ఆయన ఈ కీర్తనలో విశదీకరించారు.

> ఎంత నేర్చినా ఎంత చూసినా ఎంత వారలైనా కాంతదాసులే అని మానవ బలహీనతని ఎత్తి చూపిన కీర్తన ఈ రోజుకీ వర్తిస్తుంది.

'ఎంత నేర్చినా ఎంత చూసినా ఎంత వారలైనా కాంతదాసులే'[13] అని మానవ బలహీనతని ఎత్తి చూపిన కీర్తన ఈ రోజుకీ వర్తిస్తుంది. అందులో పరహింస, పరభామ, పరధనాల పట్ల అనురక్తి, పరమానవాపవాదం, పరజీవనం, వీటి కోసం అబద్ధం ఆడటం వంటి బలహీనతలను ఉటంకిస్తూ నిరసిస్తారు. 'శివ శివ శివ యనరాదా'[14] అన్న కృతిలో కామాదుల తెగం గోయమని కామవర్ధని రాగంలో చెప్పడం ఆయన చమత్కారం. వీటినుండి విముక్తి ఏదయ్యా అంటే, 'సంతతంబు శ్రీకాంత స్వాంతసిద్ధాంతమైన మార్గ చింత' చేయడం. అలాగే ఎన్ని విద్యలు నేర్చినా పెద్దల సుద్దులు వినకపోతే 'బుద్ధి రాదు బుద్ధి రాదు'[15] అని కూడా చెప్పారు. బుద్ధి తెచ్చుకోవాలంటే ధర్మం చేయడం కన్నా అనన్య చిత్తభక్తుల వాగమృత పానము, పురాణ పఠనం కన్నా మానుషావతార చరిత మర్మజ్ఞుల జతగూడటం, యోగాభ్యాసం కన్నారామదాసుల చెలిమి చేయడం మిన్నయని అని ఉద్బోధించారు.

ఆడంబరాలు, డాంబికాలను త్యాగరాజు ఇష్టపడలేదు. బయట ఒకటి లోపల ఒకటి ఉండకూడదని, గొప్పతనముకై ఆశ, కుత్సిత విషయ పిపాసలు వదలక, మెప్పులకై భజన చేసే పద్ధతిని విమర్శిస్తూ 'అది కాదు భజన, మనసా'[16] అని వివరించారు. అలాగే 'తెలియలేరు రామ భక్తి మార్గమును'[17]

అనే కీర్తనలో భక్తి లేకుండా హడావిడి చేస్తూ, తమ వేష భాషలతో పైకి గౌరవనీయులుగా చలామణి అవుతూ డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్న వారి గురించి జాలి పడతారు. నిగూఢమైన భావంతో కూడిన ఈ కీర్తనలు ఈ కాలపు బాబాల, స్వామీల పోకడలను ఎండగట్టేవిగా ఉంటాయి. భజన, భక్తి అనే విషయాల పట్ల అభ్యుదయ దృక్పథం కలిగి ఉన్న వాగ్గేయకారుడు త్యాగయ్య.

> ప్రస్తుతం జాతకాలు గ్రహశాంతుల పేరిట ఎన్ని అరాచకాలు జరుగుతున్నాయో మనకు తెలుసు. జాతకాల వంటి వాటిని నమ్ముకోవడం అనవసరమని ఆనాడే బోధించారు.

త్యాగరాజ స్వామి తలుచుకుంటే, తనకి ఉన్న విద్వత్తుతో, రాజుల ఆదరణతో అత్యంత ధనవంతుడై ప్రాపంచిక సుఖాలను అనుభవించి ఉండేవారు. కానీ నిధి సుఖమేకాదని రాముని సన్నిధిని మాత్రమే ఆయనవలె కోరుకోవడం మానవమాత్రులు చేయలేని పని. 'నాదుపై పలికేరు నరులు'[18] అన్న కీర్తనలో 'జానెడు ఉదరమునింప నొరుల పొగడితినా' అని నిలదీస్తారు. ఇదే భావం 'దుర్మార్గ చరాధముల దొర అనజాలరా'[19] అని రంజనిలో రంజకంగా చెప్పారు. ఆ కృతిలో సరస్వతిని అమ్మనని, ఖలుల నెచటా పొగడను అని వక్కాణించారు.

ఈరోజు మనం చూస్తున్న మత భేదాల లాగే ఆ రోజుల్లో కూడా ద్వైత అద్వైతాల మధ్య, శివ కేశవుల మధ్య భేదాలు ఎంచి కత్తులు నూరుకునేవారని మనం విన్నాం. త్యాగరాజ స్వామి వారు తమ కీర్తనల్లో వీటిని చర్చించారు. 'ద్వైతము సుఖమా అద్వైతము సుఖమా[20] అని తీవ్రంగా ప్రశ్నించారు. 'ఏవరని నిర్ణయించిరిరా, నిన్నెట్లు ఆరాధించితిరా-శివుడనో, మాధవుడనో, కమలభవుడనో, పరబ్రహ్మమనో'[21] అని ప్రశ్నించడంలోనే అందరూ సమానం అనే భావన కలిగించడం ఒక విశేషం. త్యాగరాజస్వామి గారు శివకేశవులను సమానంగా భావించే వారిని గౌరవించారు.

ప్రస్తుతం జాతకాలు గ్రహశాంతుల పేరిట ఎన్ని అరాచకాలు జరుగుతున్నాయో మనకు తెలుసు. 'గ్రహబలమేమి శ్రీరామానుగ్రహబలమే బలము'[22] అని జాతకాల వంటిని నమ్ముకోవడం అనవసరమని ఆనాడే బోధించారు.

త్యాగరాజ స్వామివారి కృతులన్నీ ఒక యెత్తు, వారి పంచరత్న కీర్తనలు ఒక యెత్తు. వాటిలో ఒకటి 'దుడుకుగల నన్నే దొరకొడుకు బ్రోతురా'[23] 'కడు దుర్విషయా కృష్టుడై గడియ గడియకు నిండారు దుడుకు గల నన్నే దొర కొడుకు బ్రోచురా'... ఆయన కీర్తనలన్నిటిలోనూ ఉన్న ప్రబోధాల సారాంశం ఈకీర్తన అని చెప్పచ్చు.

### తాళ్ళపాక అన్నమయ్య

భక్తి, శృంగారము, ఆధ్యాత్మికత వంటి భావాలతో పుంఖానుపుంఖలుగా సుమారు 32 వేల కీర్తనలు తెలుగు, సంస్కృతాలలో రాసిన గొప్ప వాగ్గేయకారుడు, తాళ్ళపాక అన్నమయ్య. తన కీర్తనలలో సమాజంలోని చెడుని ఎత్తి చూపించిన మొదటి వాగ్గేయకారుడు ఆయన. సుమారు 95 సంవత్సరములు (22 మే 1408 – 4 ఏప్రిల్ 1503) జీవించిన ఆయన భక్తుడు, మహర్షి, వాగ్గేయకారుడు, సామాజికోద్ధారకుడు, పదకవితా పితామహుడు.



సర్వమానవ సమానత్వాన్ని అత్యున్నతంగా ప్రతిపాదించిన అన్నమయ్య కీర్తన బహుశః 'తందనానాపురే తందనానా అహే... బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే'[24] అన్నది. ఈ కీర్తనలో అన్నమయ్య హీనాధిక భేదాలు లేకుండా అందరిలోనూ ఉండే అంతరాత్మ పరమాత్మ అయిన ఆ శ్రీహరియే అని తాత్త్విక చింతనను జానపద శైలిలో ప్రపంచానికి అందించాడు. ఎండా–నీడా, రాత్రి–పగలు, నిద్ర, సుఖం, భూమి ఇవన్నీ రాజుకి–బంటుకి, బ్రాహ్మణుడికి –ఛండాలుడికి, జీవులకి –దేవతలకి, కుక్కకీ–ఏనుగుకి, అందరికీ ఒకే రకంగా వర్తిస్తాయని నొక్కి వక్కాణించాడు. అనేక కీర్తనలు జానపద శైలిలో వ్రాసిన ఆయన జానపదకవితా పితామహుడు కూడా. అందుకే ఆయన కీర్తనలు జనబాహుళ్యం లోకి బాగా చొచ్చుకు పోయాయి.

అన్నమయ్య కూడా, త్యాగయ్య లాగ, నరస్తుతి చేయడానికి నిరాకరించాడు.

అందువల్ల చెరసాల పాలయ్యాడు కూడా. 'హరినామము కడు నానందకరము'[25] అని హరినామ విశేషాన్ని, బంధవిముక్తి మార్గాన్ని తెలిపాడు. 'అప్పులేని సంసారమైన పాటే చాలు – తప్పులేని జీతం ఒక్క తారమైన చాలు'[26] అన్న పాటలో మనిషి ఎంత నిరాడంబరంగా ఉండొచ్చో నిరూపిస్తాడు. 'వట్టియాసలకు లోనై వదలక తిరిగాడేవు[27]', అన్న ఇంకొక కీర్తనలో ఈ సంసారబంధంలో మనిషి ఎలా కూరుకుని పోతాడో కళ్ళకి కట్టినట్లు చూపిస్తాడు. అలాగే చావు, పుట్టుక, పుణ్యం, పాపము వంటి వాటి మధ్య జీవితం ఎంతటి నాటకమో 'నానాటి బతుకు నాటకం'[28] అని ఎరుకబరుస్తాడు. 'మోహము విడుచుటె మోక్షమది దేహమెరుగుటే తెలివీనదే'[29] అన్న కీర్తనలో మోక్షము, తెలివి, పరము, కలిమి, కులహీనత, మలినము, నరకము, సుకృతములను సులభముగా నిర్వచిస్తూ ఆత్మవిద్య బోధిస్తాడు. 'భారమైన వేపమాను పాలు పోసి పెంచినాను – తీరని చేదేకాక తీయనుండేనా'[30] అన్న ఇంకో కీర్తనలో కుక్కతోక వంకర తీయలేమని, తేలుని ఎంత ప్రేమతో కోకలో పెట్టుకున్నా కుట్టక మానదని, ఘోరమైన ఆసలు కూడా ఎంత వేంకట విభుని కృప ఉన్నా ఒక పట్టాన పోవని చెప్పాడు.

> కులప్రమేయం లేకుండా ఎవ్వరైనా హరిని తెలుసుకోవచ్చని
> -ఏ కులజుఁడేమి యెవ్వఁడైననేమి-
> అన్న కీర్తనలో వివరించాడు.

త్యాగరాజు వలె అన్నమయ్య కూడా పరనింద, పరభామల వలపు, జీవహింస, దారాసుత సేవలో సమయము వృథా చేసుకోవడం వంటి వాటిని తన కీర్తనలలో నిరసించాడు. కులప్రమేయం లేకుండా ఎవ్వరైనా హరిని తెలుసుకోవచ్చని 'ఏ కులజుఁడేమి యెవ్వఁడైననేమి'[31] అన్న కీర్తనలో పరనింద చేయకుండుట, భూతదయ, ఆత్మతత్వాన్ని ఎరుగుట, హరినెరిగిన వారి లక్షణాలు అని వివరించాడు.

పరమాత్మ తత్వాన్ని అత్యంత మనోహరంగా చిత్రించిన వాగ్గేయకారుడు అన్నమయ్య. ఎవ్వరు ఎలా భావిస్తే అలాగే పరమాత్మ ఆవిష్కరించబడతాడని 'ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమే నీవు'[32] అని భగవంతుని తత్వాన్ని గొప్పగా చెప్పాడు. 'పురుషోత్తముడ నీవు, పురుషాధముడ నేను'[33] వంటి కీర్తనలలో దోషాలు తనకే ఆపాదించుకుని, తనని తాను తక్కువ

చేసుకుని సుగుణాలన్నీ శ్రీనివాసుడికి అన్వయించి ఆయన్ని అధికుడిని చేయడం భక్తిలో ఒక నైపుణ్యం. ఒక లౌక్యం. ఒక విశేషం.

త్యాగరాజు, అన్నమయ్యల జీవితమే ఒక బోధన. వారి కలం నుండి వచ్చిన ప్రతి మాట ఒక బాట. ప్రతిపాట ఒక పాఠం. వినయం ప్రతిబింబించే త్యాగయ్య గారి మాటల్లోనే చెప్పాలంటే 'ఎందరో మహానుభావులు– అందరికీ వందనములు'.

## ఈ వ్యాసంలో ఉదహరించిన కీర్తనల పూర్తి పాఠం

1. మనసా ఎటు లోర్తునే – మలయమారుతము – రూపకము

పల్లవి : మనసా ఎటులోర్తునే నా మనవిని చేకొనవే ఓ ॥మ॥

అను పల్లవి: దినకరకుల భూషణుని – దీనుఁడవై భజనఁజేసి
దినముఁ గడుపమనిన నీవు –వినవదేల గుణవిహీన ॥మ॥

చరణము : కలిలో రాజస తామస గుణములు – గలవారి చెలిమి
కలిసిమెలసి తిఱుగుచు మఱి – కాలము గడపకనే
సులభముగాఁ గడతేరను – సూచనలను దెలియఁజేయు
ఇలను త్యాగరాజుమాట – వినవదేల గుణవిహీన ॥మ॥

2. నిధి చాలా సుఖమా –కల్యాణి – త్రిపుట (– చాపు)

పల్లవి: నిధిచాల సుఖమా రాముని సన్నిధిసేవ సుఖమా నిజముగఁ బల్కు మనస ॥ని॥

అను పల్లవి: దధి నవనీత క్షీరములు రుచో దాశరథీ ధ్యానభజన సుధారసము రుచో ॥ని॥

చరణము(లు) :
శమ దమ మను గంగాస్నానము సుఖమా కర్దమ దుర్విషయ కూపస్నానము సుఖమా
మమత బంధవయుత నరస్తుతి సుఖమా సుమతి త్యాగ రాజనుతుని కీర్తన సుఖమా ॥ని

3. సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము కలదే –ధన్యాసి – దేశాది

పల్లవి: సంగీతజ్ఞానము భక్తివినా సన్మార్గము గలదె మనసా ॥సం॥

అను పల్లవి: భృంగి నటేశ సమీరజ ఘటజ మతంగ నారదాదు
లుపాసించే ॥సం॥

చరణము(లు):
న్యాయాన్యాయము దెలుసును జగములు – మాయామయమనె దెలుసును దుర్గుణ
కాయజాది షడ్రిపుల జయించే – కార్యము దెలుసును త్యాగరాజునికే ॥సం॥

4. నాదలోలుడై బ్రహ్మానందమందవే మనసా' –కల్యాణ వసంత – రూపక

పల్లవి : నాదలోలుఁడై బ్రహ్మానందమందవే మనసా ॥నా॥..

అను పల్లవి : స్వాదుఫలప్రద సప్తస్వరరాగనిచయసహిత ॥నా॥..

చరణము(లు):
హరిహరాత్మ భూ సురపతి శరజన్మ గణేశాది
వరమౌను లుపాసించరే ధర త్యాగరాజు తెలియు ॥నా॥.

5. మోక్షము కలదా – సారమతి – దేశాది

పల్లవి: మోక్షముగలదా భువిలో జీవ – న్ముక్తులు గానివారలకు ॥మో॥

అను పల్లవి: సాక్షాత్కార నీసద్భక్తి – సంగీతజ్ఞానవిహీనులకు ॥మో॥

చరణము(లు) :
ప్రాణానల సంయోగము వల్ల ప్రణవనాదము సప్తస్వరములై బరగ
వీణావాదనలోలుఁడౌ శివమనోవిధ మెఱుఁగరు త్యాగరాజ వినుత ॥మో॥

6. భజన చేయరాదా –అఠాణ – రూపకం

పల్లవి: భజన సేయరాదా? రామ ॥భజన॥

అను పల్లవి: అజ రుద్రాదులకు సతత మాత్మ మంత్రమైన రామ ॥భజన॥

చరణము(లు):
కరకు బంగారు వల్వ కటి నెంతో మెరయగ

చిరు నవ్వులు గల మొగమును చింతించి చింతించి ॥భజన॥

అరుణాధరమున సురుచిర దంతావళిని
మెరయు కపోల యుగమును నిరతమునను దలచిదలచి ॥భజన॥

బాగుగ మానస భవ సాగరమునను తరింప
త్యాగరాజు మనవిని విని తారకమగు రామనామ ॥భజన॥

7. భజనపరులకేల దండపాణి భయము–సురటి – రూపకము

పల్లవి : భజనపరులకేల దండ – పాణి భయము మనసా! రామ॥భ॥

అను పల్లవి: అజ రుద్ర సురేశుల – కాస్థానమొసంగు రామ ॥భ॥

చరణము(లు):
అండకోట్ల నిండిన కో – దండిపాణి ముఖమును హృత్
పుండరీకమునఁజూచి – పూజ సల్పుచు
నిండుప్రేమతోఁ గరంగు – నిష్కాములకు వరవే
దండ పాలు దాసుఁడైన – త్యాగరాజుసేయు నామ ॥భ॥

8. యజ్ఞాదులు సుఖమనువారికి సములు అజ్ఞానులు కలరా? – జయమనోహరి – ఆది

పల్లవి : యజ్ఞాదులు సుఖమను వారికి సమ
మజ్ఞానులు గలరా? ఓమనసా ॥యజ్ఞాదులు॥

అను పల్లవి : సుజ్ఞాన దరిద్ర పరంపరుల
సురచిత్తులు జీవాత్మ హింసగల ॥యజ్ఞాదులు॥

చరణము(లు) : బహు జన్మంబుల వాసన యుతులై
అహి విష సమ విషయాకృష్టులై
బహిరాననులై త్యాగరాజు
భజియించు శ్రీరామునికిఁ దెలియక ॥యజ్ఞాదులు॥

9. అనురాగము లేని మనసున సుజ్ఞానము రాదు – సరస్వతి – రూపకం

పల్లవి : అనురాగము లేని మనసున సుజ్ఞానము రాదు అ..

అను పల్లవి : ఘనులైన యంతర్జ్ఞానుల కెఱుకేగాని అ..

చరణము(లు):
వగవగగా భుజియించువారికి తృప్తియౌరీతి
సగుణధ్యానముపైని సౌఖ్యము త్యాగరాజనుత అ..

10. శాంతము లేక సౌఖ్యము లేదు– సామ – ఆది

పల్లవి : శాంతములేక సౌఖ్యములేదు – సారసదళనయన ॥శాం॥

అను పల్లవి : దాంతునికైన వే – దాంతునికైన ॥శాం॥

చరణము(లు):

దారసుతులు ధన ధాన్యము లుండిన – సారెకు జప తప
సంపదగల్గిన ॥శాం॥

యాగాదికర్మము లన్నియుఁజేసిన – బాగుగ సకలహృద్భావముఁ
దెలిసిన ॥శాం॥

ఆగమశాస్త్రము లన్నియు జదివిన – భాగవతులనుచు బాగుగఁ
బేరైన ॥శాం॥

రాజాధిరాజ శ్రీరాఘవ త్యాగ – రాజవినుత సాధురక్షక తనకుప ॥శాం॥

11. మనసు స్వాధీనమైన ఆ ఘనునికి మరి మంత్ర తంత్రము లేల? –
శంకరాభరణము – రూపకము

పల్లవి: మనసు స్వాధీనమైన యా ఘనునికి మఱి మంత్రతంత్రము
లేల ॥మ॥

అను పల్లవి: తనువు తానుగాదని యెంచువానికి తపసు చేయనేల
దశరథబాల ॥మ॥

చరణము(లు) : అన్ని నీవనుచు యెంచినవానికి యాశ్రమ భేదములేల

కన్నుగట్టు మాయలని యెంచువానికి కాంతల భ్రమలేల
దశరథబాల ॥మ॥

ఆజన్మము దుర్విషయ రహితునికి గతాగత మికనేల

రాజరాజేశ నిరంజన నిరుపమ రాజవదన త్యాగరాజ వినుత ॥మ॥

12. మనసు నిలప శక్తి లేకపోతే మధుర ఘంట విరుల పూజేమిసేయును – ఆభోగి – ఆది

పల్లవి: మనసునిల్ప శక్తిలేకపోతే మధురఘంటవిరుల పూజేమి జేయును? మ..

అను పల్లవి: ఘనదుర్మదుఁడై తా మునిగితే కావేరి మందాకిని యెటు బ్రోచును? మ..

చరణము(లు):

సోమిదమ్మ సొగసుగాండ్రఁ గోరితే సోమయాజి స్వర్గార్హుఁడౌనో?
కామక్రోధుఁడు తపంబొనర్చితే గాచి రక్షించునో? త్యాగరాజనుత! మ..

13. ఎంతనేర్చిన ఎంతజూచిన –సింధుధన్యాసి – దేశాది (ఉదయరవిచంద్రిక – దేశాది)

పల్లవి : ఎంతనేర్చిన ఎంతజూచిన
ఎంతవారలైన కాంతదాసులే ॥ఎం॥

అను పల్లవి:సంతతంబు శ్రీకాంతస్వాంత సిద్ధాంతమైన మార్గ చింతలేని వా ॥రెం॥

చరణము(లు):

పరహింస పరభామాన్యధన పరమానవాపవాద
పరజీవనమ్ముల కనృతమే భాషించేరయ్య త్యాగరాజ నుత ॥ఎం॥

14. శివ శివ శివ యనరాదా –పంతువరాళి – ఆది

పల్లవి : శివశివ యనరాదా ఓరీ శివ..

అను పల్లవి : భవభయబాధల నణచుకోరాదా శివ..

చరణము(లు):

కామాదుల దెగకోసి పరభామల పరుల ధనముల రోసి
పామరత్వము నెడబాసి అతినీమముతో బిల్వార్చన జేసి శివ..

సజ్జనగణముల గాంచి ఓరి ముజ్జగదీశ్వరులని మతి నెంచి
లజ్జాదుల దొలగించి తన హృజ్జలజమునను తా పూజించి శివ..

ఆగమముల నుతియించి బహు బాగులేని భాషలు చాలించి
భాగవతులతో పోషించి ఓరి త్యాగరాజ సన్నుతుడని యెంచి శివ..

15. బుద్ధిరాదు బుద్ధిరాదు –శంకరాభరణం – చాపు

పల్లవి: బుద్ధిరాదు బుద్ధిరాదు పెద్దల సుద్దులు వినక ॥బుద్ధి॥

అను పల్లవి: బుద్ధిరాదు బుద్ధిరాదు భూరి విద్యల నేర్చిన ॥బుద్ధి॥

చరణము(లు):

ధాన్యధనములచేత ధర్మమెంతయుఁ జేసిన యనన్య చిత్తభక్తుల
వాగమృతపానము సేయక ॥బుద్ధి॥

మానక భాగవతాది రామాయణములు చదివిన మానుషావతారచరిత
మర్మజ్ఞుల జతఁ గూడక ॥బుద్ధి॥

యోగము లభ్యసించిన భోగములెంతో కల్గిన త్యాగరాజనుతుఁడౌ రామ
దాసుల చెలిమి సేయక ॥బుద్ధి॥

16. అది కాదు భజన, మనసా –యదుకుల కాంభోజి – ఆది

పల్లవి : అది కాదు భజన మనసా! ॥అది॥

అను పల్లవి : ఎదలో నెంచు టొకటి ప – య్యెద గల్గినచో నొకటి ॥అది॥

చరణము:

గొప్ప తనముకై యాస కుచ్ఛిత విషయ పిపాస
మెప్పులకై బహు వేస మిడి ఉప్ప తిల్లెదరు; త్యాగరాజ వినుత! ॥అది॥

17. తెలియలేరు రామ భక్తి మార్గమును' – ధేనుక – దేశాది

పల్లవి : తెలియలేరు రామ భక్తిమార్గమును ॥తె॥

అను పల్లవి : ఇల నంతట తిరుగుచుఁ గలువరించేరేగాని ॥తె॥

చరణము(లు) :

వేగలేచి నీట మునిఁగి భూతిబూసి వేళ్లనెంచి వెలికి శ్లాఘనీయులై
బాగపైక మార్జన లోలులై రేగాని త్యాగరాజవినుత ॥తె॥

18. నాదుపైఁ బలికేరు నరులు – మధ్యమావతి – జంప

పల్లవి : నాదుపైఁ బలికేరు నరులు

అను పల్లవి : వేదసన్నుత భవము వేఱు జేసితి ననుచు ॥నా॥

చరణము(లు) :

పంచశరజనక ప్రపంచమునఁ గల సుఖము – మంచువలె ననుచు
మది నెంచితిగాని
పంచుకొని ధనము లార్జించుకొని సరియెవ్వ – రంచు మఱి గతియు
లేదంచుఁ బల్కితినా ॥నా॥

దినము నిత్యోత్సవమ్మున కాసఁ జెందితినా – మనసునను నిల్లు యొకటని
యుంటిగాని
అనుదినము యొరులమేలును జూచి తాళలే – కను రెండు సేయవలె
ననుచుఁ బల్కితినా ॥నా॥

ప్రాణమేపాటి యని మానమే మేలంటి – గాని శ్రీరామ పరమానంద జలధి
శ్రీనాథకులములో లేనిదారిని బట్టి – జానెఁడుదరము నింప నొరులఁ
బొగడితినా ॥నా॥

ఆజానుబాహుయుగ శ్రీజానకీపతి ప – యోజాక్ష శ్రీత్యాగరాజనుత చరణ
ఈ జగతిలో నిన్నుఁ బూజించువారి న – వ్యాజమునఁ బ్రోచే సురాజ
నీవాఁడైన ॥నా॥

19. దుర్మార్గచరాధములను – రంజని – రూపక

పల్లవి : దుర్మార్గచరాధములను దొరనీవనజాలరా దు..

అను పల్లవి : ధర్మాత్మక ధనధాన్యము దైవము నీవై యుండగ ॥దు॥

చరణము(లు) :
పలుకుబోటిని సభలోన పతితమానవులకొసఁగే
ఖలుల నెచ్చట పొగడని శ్రీకర త్యాగరాజ వినుత ॥దు॥

20. ద్వైతము సుఖమా – రీతిగౌళ – ఆది
పల్లవి : ద్వైతము సుఖమా అద్వైతము సుఖమా ॥ద్వై॥

అను పల్లవి : చైతన్యమా విను సర్వసాక్షీ వి
స్తారముగాను దెల్పుము నాతో ॥ద్వై॥

చరణము(లు):
గగన పవన తపన భువనాద్యవనిలో
నగధరాజ శివేంద్రాది సురలలో
భగవద్భక్తవరాగ్రేసరులలో
బాగ రమించే త్యాగరాజార్చిత ॥ద్వై॥

21. ఎవరని నిర్ణయించిరిరా – దేవామృతవర్షిణి – దేశాది
(ఖరహరప్రియ – ఆది)

పల్లవి : ఎవరని నిర్ణయించిరిరా ని
న్నెట్లారాధించిరిరా నర వరు ॥లె॥

అను పల్లవి:శివుఁడనో మాధవుడనో కమల
భవుఁడనో పరబ్రహ్మమనో ॥ఎ॥

చరణము(లు):
శివమంత్రమునకు మా జీవము మా
ధవమంత్రమునకు రాజీవము ఈ
వివరముఁ దెలిసిన ఘనులకు మ్రొక్కెద
వితరణగుణ త్యాగరాజ వినుత ని ॥న్నె॥

22. గ్రహబలమేమి – రేవగుప్తి – దేశాది
పల్లవి : గ్రహబలమేమి శ్రీరామానుగ్రహబలమే బలము ॥గ్రహ॥
అను పల్లవి : గ్రహబలమేమి తేజోమయ విగ్రహమును ధ్యానించు వారికి
నవ ॥గ్రహ॥

చరణము(లు):
గ్రహపీడల పంచపాపముల నాగ్రహములు గల కామాదిరిపుల నిగ్రహము
జేయు హరిని భజించు త్యాగరాజునికి రసికా గ్రేసరులకు ॥గ్రహ॥

23. దుడుకు గల నన్నే దొర కొడుకు బ్రోచురా ఎంతో – గౌళ – ఆది
దుడుకు గల నన్నే దొర కొడుకు బ్రోచురా ఎంతో |

కడు దుర్విషయా కృష్టుడై గడియ గడియకు నిండారు ॥దుడుకు॥

శ్రీ వనితా హృత్కుముదాబ్జ వాఙ్మానస గోచర ॥దుడుకు॥

సకల భూతముల యందు నీవై యుండగ మదిలేక పోయిన ॥దుడుకు॥

చిరుత ప్రాయమున నాడే భజనామృత రసవిహీన కుతర్కుడైన ॥దుడుకు॥

పర ధనముల కొరకు పరుల మది కరగ– బలికి కడుపు నింప దిరిగినట్టి ॥దుడుకు॥

తన మదిని భువిని సౌఖ్యపు జీవనమే యనుచు సదా దినములు గడిపిన ॥దుడుకు॥

తెలియని నటవిట క్షుద్రుల వనితలు స్వవశమౌట కుపదేశించి సంతసిల్లి
స్వరలయంబు లెరుంగకని శిలాత్ముడై సుభక్తులకు సమానమను ॥దుడుకు॥

దృష్టికి సారంబగు లలనా సదనార్భక సేనామిత ధనాదులను దేవది దేవ
నెర నమ్మితిని గాకను పదాబ్జ భజనంబు మరచిన ॥దుడుకు॥

చక్కని ముఖ కమలంబును సదా నా మిదిలో స్మరణ లేకనే దుర్మదాంధ–
జనుల కోరి పరితాపములచే దగిలి నొగిలి దుర్విషయ దురాశలను
రోయలేక సతత మపరాధినై చపల చిత్తుడనైన ॥దుడుకు॥

మానవతను దుర్లభ మనుచు నెంచి పరమానంద మందలేక మద మత్సర
కామ లోభ మోహులకు దాసుడై మోసబోతి గాక మొదటి
కులజుడగుచు భువిని

శూద్రుల పనులు సల్పుచునుంటినిగాక నరాధములను చేరి సారహీన
మతములను సాధింప దారుమారు ॥దుడుకు॥

సతులకై కొన్నాళ్ళాస్థికై సుతులకై కొన్నాళ్ళు ధన తతులకై తిరిగితి నయ్య
త్యాగరాజాప్త ఇటువంటి ॥దుడుకు॥

24. తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా తందనాన ॥పల్లవి॥
బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటె పరబ్రహ్మమొకటే పరబ్రహ్మమొక్కటే ॥తంద॥

కందువగు హీనాధికములిందు లేవు అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే అందరికి శ్రీహరే అంతరాత్మ
॥తంద॥
నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే అండనే బంటునిద్రదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే ఛండాలుడుండేటి సరిభూమి యొకటే ॥తంద॥
అనుగుదేవతలకును అలకామసుఖ మొకటే ఘనకీటపశువులకు కామసుఖ మొకటే
దిన మహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే వొనర నిరుఁబేదకును వొక్కటే అవియు ॥తంద॥
కొరలి శిష్టాన్నములు గొను నాఁకలొకటే తిరుగు దుష్టాన్నములు దిను నాఁకలొకటే
పరగ దుర్గంధములపై వయువు నొకటే వరుసఁ బరిమళముపై వాయువు నొకటే ॥తంద॥
కడగి యేనుఁగుమీఁదఁ గాయు యెండొకటే పుడమి శునకముమీఁదఁ బొలయు నెండొకతే

25. కడుఁబుణ్యులను పాపకర్ములను సరిఁ గావ జడియు శ్రీవేంకటేశ్వరు నామ మొకటే ॥తంద॥

హరినామము కడు నానందకరము
హరినామము కడు నానందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా ॥పల్లవి॥
నలినాక్షుని శ్రీ నామము –కలి దోష హరము కైవల్యము
ఫలసారము బహుబంధ మోచనము – తలఁచవో తలఁచవో తలఁచవో మనసా ॥హరి॥
నగధరు నామము నరక హరణము – జగదేక హితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము – పొగడవో పొగడవో పొగడవో మనసా ॥హరి॥
కడఁగి శ్రీ వేంకటపతి నామము –బడిబడినే సంవత్కరము
అడియాలంబిల నతి సుఖ మూలము –తడవవో తడవవో తడవవో మనసా ॥హరి॥

26. అప్పులేని సంసార మైన పాటే చాలు తప్పులేని జీతమొక్క తారమైనఁ
జాలు ॥అప్పులేని॥

కంతలేని గుడిశొక్క గంపంతయినఁ జాలు చింతలేని యంబలొక్క
చేరెఁడే చాలు

జంతగాని తరుణి యేజాతైన నదె చాలు వింతలేని సంపదొక్క
వీసమే చాలు ॥అప్పులేని॥

తిట్టులేని బ్రదుకొక్క దినమైన నదె చాలు ముట్టులేని కూడొక్క
ముద్దెఁడే చాలు

గుట్టుచెడి మనుకంటే కొంచెపు మేలైనఁ జాలు వట్టి జాలిఁ బడుకంటే
వచ్చినంతే చాలు ॥అప్పులేని॥

లంపటపడని మేలు లవలేశమే చాలు రొంపి కంబమౌకంటే
రోయుటే చాలు
రంపపుఁ గోరిక కంటే రతి వేంకటపతి పంపున నాతనిఁ జేరే
భవమే చాలు ॥అప్పులేని॥

27. వట్టియాసలకు లోనై వదలక తిరిగాడేవు

వట్టియాసలకు లోనై వదలక తిరిగాడేవు
బట్టబయలు యీసంసారంబని గుట్టు దెలియలేవు ప్రాణీ ॥వట్టి॥

చాల నమ్మి యీ సంసారమునకు సోలి సోలి తిరిగేవు
బాలయవ్వనప్రౌఢల భ్రమఁబడి లోలుఁడవై తిరిగేవు
మేలుదెలియ కతికాముకుండవై మీఁదెఱఁగక తిరిగేవు
మాలెమీఁద పరు వెందాఁకా నీ మచ్చిక విడువఁగ లేవు ॥వట్టి॥

మానితముగ దురన్నపానముల మత్తుఁడవై వుండేవు
నానావిధముల దుష్కర్మంబులు నానాటికి నాటించేవు
మేనిలోని యేగురు నార్గురును మిత్రులనుచు నమ్మేవు
ఆనందంబున నాకర్మమునకు అధిపతులని తెలియఁగ లేవు ॥వట్టి॥

పామరివై దుర్వ్యాపారమునకు పలుమారునుఁ బొయ్యేవు
వేమరు దుర్జనసంగాతంబులు విశ్రామమనుచు నుండేవు

ప్రేమముతో హరిదాసులపై సంప్రీతి నిలుపఁగా లేవు
తామసమతివయి వేంకటనాథుని తత్వ మెఱఁగఁగా లేవు ॥వట్టి॥

28. నానాఁటి బదుకు నాఁటకము

నానాఁటి బదుకు నాఁటకము – కానక కన్నది కైవల్యము ॥పల్లవి॥

పుట్టుటయు నిజము పోవుటయు నిజము నట్టనడిమి పని నాఁటకము
యెట్టనెదుటఁ గలదీ ప్రపంచమును కట్టఁగడపటిది కైవల్యము ॥నానాఁ॥

కుడిచే దన్నము కోక చుట్టెడిది నడుమంత్రపు పని నాఁటకము
వొడిఁ గట్టుకొనిన వుభయకర్మములు గడి దాఁటినపుడే కైవల్యము॥నానాఁ॥

తెగదు పాపమును తీరదు పుణ్యము నగినగి కాలము నాఁటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరుఁ డేలిక గగనము మీఁదిది కైవల్యము॥నానాఁ॥

29. మోహము విడుచుటే మోక్షమది

మోహము విడుచుటే మోక్షమది

దేహ మెఱుఁగుటే తెలివీ నదే ॥మోహము॥

ననిచిన తన జన్మముఁ గర్మముఁ దనపనియు నెఱుగుటే పరమ మది
తనకు విధినిషేధములుఁ బుణ్యముల ఘనత యెఱుగుటే కలిమి యది
॥మోహము॥

తఱిఁ దఱిఁ బ్రేమపు తల్లిదండ్రులను యెఱఁగనిదే కులహీన తది
చఱులఁ బొరలి యాచారధర్మములు మఱచినదే తన మలిన మది
॥మోహము॥

కమ్మరఁ గమ్మరఁ గామభోగములు నమ్మి తిరుగుటే నరక మది
నెమ్మది వేంకటనిలయుని దాసుల సొమ్మయి నిలుచుట సుకృత మది
॥మోహము॥

30. భారమైన వేఁపమాను పాలువోసి పెంచినాను

భారమైన వేఁపమాను పాలువోసి పెంచినాను

తీరని చేఁదే కాక తియ్యనుండీనా ॥భారమైన॥

పాయఁదీసి కుక్కతోఁక బద్దలువెట్టి బిగిసి చాయ కెంత గట్టిగాను చక్కనుండీనా

కాయపు వికారమిది కలకాలముఁ జెప్పినా పోయిన పోకలేకాక బుద్ధి వినీనా ॥భారమైన॥

ముంచి ముంచి నీటిలోన మూల నానఁ బెట్టుకొన్నామించిన గొడ్డలి నేఁడు మెత్తనయ్యీనా
పంచమహాపాతకాలబారిఁ బడ్డ చిత్తమిది దంచి దంచి చెప్పినాను తాఁకి వంగీనా ॥భారమైన॥

కూరిమితోఁ దేలుఁదెచ్చి కోకలోన బెట్టుకొన్నా సారె సారెఁ గుట్టుగాక చక్కనుండీనా

వేరులేని మహిమల వేంకటవిభుని కృప ఘోరమైన ఆస మేలుకోర సోఁకీనా ॥భారమైన॥

31. ఏ కులజుఁడేమి యెవ్వఁడైననేమి
ఏ కులజుఁడేమి యెవ్వఁడైననేమి ఆ కడ నాఁతడె హరి నెఱిగినవాఁడు ॥ఏ కులజు॥

పరగిన సత్యసంపన్నుఁడైనవాఁడే పరనింద సేయఁ దత్పరుఁడు గానివాఁడు

అరుదైన భూతదయానిధియగువాఁడే పరులు దానేయని భావించువాఁడు ॥ఏ కులజు॥

నిర్మలుఁడై యాత్మనియతి గలుగువాఁడే ధర్మతత్పరబుద్ధిఁ దగిలినవాఁడు
కర్మమార్గములు గడవనివాఁడే మర్మమై హరిభక్తి మఱవనివాఁడు ॥ఏ కులజు॥

జగతిపై హితముగాఁ జరియించువాఁడే పగలేక మతిలోన బ్రతికినవాఁడు

తెగి సకలము నాత్మ దెలిసినవాఁడే తగిలి వేంకటేశుదాసుఁ డయినవాఁడు ॥ఏ కులజు॥

32. ఎంత మాత్రమున ఎవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
ఎంత మాత్రమున ఎవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరములెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు ॥పల్లవి॥
కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలఁతురు మిము శైవులు తగిన భక్తులును శివుఁడనుఁచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁడనుచు ॥ఎంత॥
సరి నెన్నుదురు(???) శాక్తేయులు శక్తి రూపు నీవనుచు
దరిశనములు మిము నానావిధులను తలఁపుల కొలఁదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలచినవారికి నల్పంబవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁడవు ॥ఎంత॥
నీవలనఁ గొరతే లేదు మరి నీరుకొలఁది తామెరవు
ఆవల భాగీరథి దరిబావుల ఆజలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్న దైవమని
యీవల నే నీ శరణనియెదను యిదియే పరతత్త్వము నాకు ॥ఎంత॥

33. పురుషోత్తముడ నీవు పురుషాధముడ నేను
పురుషోత్తముడ నీవు పురుషాధముడ నేను
ధరలో నాయందు మంచితన మేది ॥పురుషో॥
అనంతాపరాధములు అటు నేము సేసేవి – అనంతమయినదయ అది నీది
నిను నెఱగకుండేటినీచగుణము నాది – నను నెడయకుండేగుణము నీది
॥పురుషో॥
సకలయాచకమే సరుస నాకు బని – సకలరక్షకత్వము సరి నీపని
ప్రకటించి నిన్ను దూరేపలుకే నా కెప్పుడూను – వెకలివై ననుగాచేవిధము
నీది ॥పురుషో॥
నేర మింతయును నాది నేరు పింతయును నీది – సారెకు నజ్ఞాని
నేను జ్ఞానిని నీవు
యీరీతి శ్రీ వేంకటేశ యిట్టె నన్ను నేలితివి – ధారుణిలో నిండెను
ప్రతాపము నీది ॥పురుషో

# శాస్త్ర ప్రకాశిక

## క్షీరదాల ఘ్రాణేంద్రియ వ్యవస్థ ఎలా పని చేస్తుంది ?- వైద్య రంగంలో 2004 సంవత్సరపు నోబెల్ పరిశోధన



డాక్టర్ చాగంటి కృష్ణ కుమారి
✆ 98851 63304

రకరకాల వాసనలను పసిగట్టగల్గడంతో పాటూ, ఆయా ప్రత్యేక వాసనల తీపి/చేదు జ్ఞాప కాలను మన మెదడు ఎలా గుర్తుపెట్టుకొనగలుగుతోంది? ఆ ఫలానా వాసన మనకి ఎదురై నప్పుడు దానితో లంకె గల గత కాలపు ఆ ఫలానా అనుభూతి తిరిగొచ్చి మన మెదడులో మెదులుతుంది కదా! ఇది ఎలాగో మన ఊహకు ఏమాత్రమూ అందని సంగతి. అవునా? ఘ్రాణేంద్రియ జ్ఞానము గురించి తెలుసుకోవాలన్నఆసక్తి వున్నట్లైతే 2004 సంవత్సారానికి వైద్యవిభాగంలొ నోబెల్ బహుమానాన్ని పొందిన పరిశోధనా వివరాలలోకి కుతూహలంతో తొంగిచూడక తప్పదు. అప్పుడు కొంతమేరకైనా అవగాహనకు రాగలుగుతాము.



Linda B. Buck
HHMI investigator at
Fred Hutchinson Cancer
Research Centre



Richard Axel
HHMI investigator at
Columbia University College
of Physicians and Surgeons

2004 వైద్య శాస్త్ర నోబెల్ బహుమానాన్ని ఘ్రాణేంద్రియ వ్యవస్థ పనితీరుపై సాధించిన వినూత్న అధ్యయన ఫలితాలకు హోవార్డ్ హ్యూస్ మెడికల్ ఇన్స్టిట్యూట్ (Howard Hughes Medical Institute) పరిశోధకులైన అమెరికన్ జీవశాస్త్రవేత్తలు లిండా.బి. బక్ ; రిచార్డ్ ఆక్సెల్ అందుకొన్నారు. వాసన కారక రసాయన అణువుల గ్రాహకాలను, ఘ్రాణేంద్రియ వ్యవస్థను కనుగొన్న ఘనత వీరిది. వరుసగా నిర్వహించిన పలు ప్రయోగాల ద్వారా అణుస్థాయి వివరాలతో ఘ్రాణ ప్రతి స్పందనలు ఎలా పనిచేస్తాయో,1991 లో వీరు వివరించగలిగారు. 23సంవత్సరాలనంతరం వీరి ఈ కృషికి 2004లో నోబెల్ లభించింది.

ఉన్నత ప్రమాణాల జీవనశైలికి ఘ్రాణేంద్రియ వ్యవస్థ చాలా ముఖ్యమైనది.

జీవులన్నీతమపరిసరాలలోనున్న పదార్థాలను అవి వెదజల్లే వాసనద్వారా పసిగడతాయి. అప్పుడే పుట్టిన క్షీరద శునక శిశువుకు తన తల్లి చనుమొనను గుర్తించగలగడంలో దాని ఘ్రాణ నాడీ వ్యవస్థదే కీలకపాత్ర. వాసన పసిగట్టడం ద్వారానే అది తల్లి చనుమొనను చేరు కొంటుంది. మనము పాచి పట్టిన ఆహార పదార్థాన్ని దాని నుండి వచ్చే దుర్వాసన తెలియడం వల్ల గుర్తించగలుగుతాము; అలాగే కొన్ని వందల వేల రకాల వాసనలను గుర్తించ గలము.ఘ్రాణ నాడీ వ్యవస్థ పనిచేయడమాగిపోతే అది చాలా ప్రమాదమైన వైకల్యమే అవుతుంది.!ఉదాహరణకి వంట ఇంటిలో గ్యాస్ లీకై మండి పోయేంత దాక కూడా దాని వాసనను గుర్తించ లేని స్థితి ప్రమాదానికి దారి తీస్తుందికదా!

వాసనల గుర్తింపులో మన ముక్కుని మెదడుతో కలుపుతున్న లింకు ఏమిటి?



ఒక పూవుని మనము వాసన చూస్తున్నప్పుడు ఆ పూవు లో గల వాసన కారకాలైన రసాయనఅణువులు గాలి ద్వారా మనముక్కును చేరి,విద్యుత్ సంకేతాలను పుట్టించి మెదడుకు చేర వేస్తాయి. మెదడులో చాలా ప్రదేశాలు విద్యుత్తుత్తేజితాలుకాగా,ఆ ఒకానొక పూవునూ, దాని వాసనను మెదడు నమోదు చేసి వుంచుతుంది. సంక్లిష్టమైన ఈ ప్రక్రియ జరిగే తీరును వివరించగల 2004 సంవత్సర నోబెల్ గ్రహీతలు కనుగొనిన అంశాలను ముచ్చటించు కొనేముందు మన

ఘ్రాణేంద్రియ వ్యవస్థకు సంబంధించిన కొన్ని పదాలను పటము–1లో చూస్తూ పరిచయం చేసుకొందాం.




పటము–1  ఘ్రాణేంద్రియ వ్యవస్థ (The olfactory system)

1. నాశికా సూక్ష్మ కణమయ పొర (nose epithelium) ముక్కు కన్నానికి ఎగువ వెనుక భాగాన వున్న కణజాలము. ఇది వాసన తెలియజెప్పడంలో పనిచేసే భాగము.

2. ఘ్రాణ గ్రాహక రకాలు లేదా వాసన గ్రాహకాల రకాలు (olfactory receptor types): నాడీ కణాలలో వుండే ఘ్రాణ గ్రాహకాలు.( వాసనను గ్రహించునవి) ఇవి వాసన కారక రసాయన అణువులతో సంకర్షణ చెంది ఆ సంకర్షణను విద్యుత్ సంకేతాలుగా అనువదిస్తాయి.ఈ సంకేతాలు మెదడుకు వెళతాయి.

3. రక్తకేశనాలికల గుత్తి (glomerulus) ఇది మెదడులోని విస్పష్టమైన సూక్ష్మ నియంత్రణా ప్రాంతము (distinct micro domain) ఇక్కడకు కణాలు నాడీ ప్రక్రియలను నేరుగా చేరవేస్తాయి. పటము–1 లో మూడు రక్తకేశనాలికల గుత్తులున్నాయి((glomeruli)

4. ఘ్రాణ లసునము(olfactory bulb): మెదడులో గల గుండ్రని కణజాలము.ఇది వాసన గురించిన సమాచారాన్ని అందుకొని తదుపరి ప్రక్రియను నిర్వహిస్తుంది. మెదడులోని మొట్టమొదటి ఘ్రాణ సమాచార ప్రసార స్థానము.( పటములో పసుపు పచ్చగా సూచించిన భాగము.)

5. వాసన కారకములు (odorants) ఇవి వాసన గల, ఆవాసనను విడుదలచేసే రసాయన అణువులు ఉదాహరణకి గులాబి పువ్వులో వున్న బీటా అయనోన్(Beta-ionone ) పదార్థము ఆపువ్వు కిగల ప్రత్యేక వాసనకి కారణము.
6. వాసన కారకముల గ్రాహక జన్యువులు(odorant receptor genes)
7. మిట్రల్ కణాలు (mitral cell) ఇవి ఒక రకపు నాడీకణాలే. ఇవి ఘ్రాణ లసునములొ వుంటాయి
8. ఆక్సాన్ లు అనగా నాడి పోగులు (Axons) ఇవి విద్యుత్ సంకేతాలను ఒక నాడి కణం నుండి మరొక నాడీకణానికి చేరవేస్తాయి
9. మస్తిష్క వల్కలం(brain cortex) మెదడులోని కణజాలపు బయటి పొర
10. జన్య నియమావళి (Genetic code) ఒకానొక ప్ర త్యేకమైన ప్రోటీన్ ను ఎలా తయారుచేయాలో కణానికి చెప్పే జన్య నిర్దేశము

నాశికా సూక్ష్మ కణమయ పొర (nose epithelium)

నాశికా సూక్ష్మ కణమయ పొర లో సుమారు 5 మిలియనుల ఘ్రాణ నాడి కణాలు వుంటాయి. ఇవి సమాచారాలను మెదడులోని ఘ్రాణ లసునానికి (olfactory bulb) నేరుగా చేరవేస్తాయి. ఒక వాసన, నాడీ కణాన్ని వుత్తేజపరిచినపుడు, దాని సంకేతము నాడీ పోగుల (Axons) ద్వారా వెళుతూ ఘ్రాణ లసునము దగ్గరకు చేరుతుంది. ఇక్కడ నుండి మెదడు లోని కణజాలపు బయటి పొర అయిన మస్తిష్క వల్కలం, లింబిక్ వ్యవస్థ (మెదడులోని ఒక భాగం) దగ్గర ప్రసారమవుతాయి. మస్తిష్క వల్కలం(brain cortex) స్పృహలో వచ్చే ఆలోచనలను నిర్వహిస్తుంది. లింబిక్ వ్యవస్థ భావోద్రేకాలను పుట్టిస్తుంది. నాడీ వ్యవస్థలో ఘ్రాణ గ్రాహక కణాలు మాత్రమే నేరుగా బాహ్యప్రపంచంతో సంబంధం కలిగి వున్న నాడీకణాలు.

## ఘ్రాణ గ్రాహకాలు ( వాసన గ్రాహకాలు)

మన ఘ్రాణ గ్రాహక కణాలు ఏవో కొన్ని వాసనలకే అత్యంత ప్రత్యేకతను/ విశిష్టత లక్షణము ప్రదర్శిస్తాయి (పటము -2). మెదడులోని విస్పష్ట మైన

సూక్ష్మ నియంత్రణా ప్రాంతమైన రక్తకేశనాలికల గుత్తి (glomerulus) దగ్గరకి కణాలు నాడీ ప్రక్రియలను నేరుగా చేరవేస్తాయి. ఈ ప్రాంతమే మెదడులోని తొలి ఘ్రాణ భాగము.

ఘ్రాణ గ్రాహక కణాలు తమ రకానికి సరిసమానమైన రకపు వాసన గ్రాహకాన్ని ,అదే రకానికి చెందిన రక్తకేశనాలికా గుత్తి లోకే నాడీ ప్రక్రియను పంపుతాయి.




పటము–2

మూడు రకాల వాసనకారక అణువులను మూడు రంగులలో సూచించారు. అలగే వాటికి అనుబంధమైన రంగులతోనే సూక్ష్మరక్త కేశనాళికా గుత్తులను (glomeruli) సూచించడాన్ని గమనించండి. ఆకుపచ్చ ప్రాంతాన్ని పెద్దదిగా చేసి వుంది.

ఘ్రాణ లసునము (olfactory bulb)లోనున్న ( పటములో పసుపురంగులో చూపిన భాగము) సూక్ష్మ నియంత్రణా ప్రాంతమైన రక్తకేశనాలికల గుత్తి నుండి సమాచారము మెదడులోని ఇతర భాగాలకు ప్రసారమవుతుంది. అక్కడ వేర్వేరు ఘ్రాణగ్రాహకాలనుండి వచ్చిన సమాచారాన్ని కలుపుతూ ఒక ఆకృతి తయారవుతుంది. అందుకే వేసవిలో మనం చూసిన మల్లెల వాసన తరువాత మనకి మరెప్పుడో జ్ఞప్తికి వస్తుంది. నాశికా సూక్ష్మ కణమయ పొర పైన కనీసము పది వెంట్రుకలవంటి శైలికలు ( cilia) కణతలంలోని శ్లేష్మం (mucus) లోకి దూరి వుంటాయి. ఈ

శైలికల లోనె గ్రాహక ప్రోటీన్ లు ( receptor proteins) వుంటాయనీ అవి వాసన కారక అణువులను గుర్తించి ,బంధించి తద్వారా కణాన్ని ఉత్తేజపరచి అది మెదడుకు సంకేతాలను పంపేలా చేస్తాయనీ ఈ శాస్త్రవేత్తల జంట భావించింది.




పటము: 3

ఘ్రాణవ్యవస్థ రకరకాల ఆకృతులలోనూ, సైజులలోనూ వున్నవాసనకారకాణువులకు ఎలా ప్రతిస్పందించుతుంది? మెదడు ప్రతిస్పందనలను అందుకొని వేర్వేరు వాసనల మధ్య తేడాను గుర్తించి ఏవాసనను ఆ వాసనగా ఎలా గుర్తు పెట్టుకొంటుంది అన్న ప్రశ్నలకు సమాధానం పొందడానికి గ్రాహక ప్రోటీన్ లే కీలకమైనవి అని ఆక్సెల్ అన్నారు.





పటము : 4

రకరకాల ఆకృతులలోనూమ్ పరిమాణాలలోనూ ఉన్న వాసనకారకాణువులకు కొన్ని ఉదాహరణలు. ఒక మహిళ పీలుస్తున్న అణువుల ఆకృతులను చూడండి.

గ్రాహక ప్రోటీన్లకై నేరుగా వెతుకులాట మొదలుపెట్టే కన్నా నాశికాసూక్ష్మకణమయ పొరలో ఆయా ప్రత్యేక ప్రోటీన్లను ఏర్పరచడానికి నిర్దేశాలను ఇచ్చే జన్యువులకై వేటాడం సమంజసమనుకొన్నారు ఈ శాస్త్రవేత్తలు. ఆదిశగా తమ పరిశోధనను కొనసాగించారు.

ఆక్సెల్, బక్ వివిధములైన వాసన గ్రాహకాలకి జెనిటిక్ కోడ్ ఇచ్చేవి మన జన్యువులలో మూడు శాతం జన్యువులున్నాయని ఈ జన్యు పరివారం లో సుమారు 1000 భిన్నమైన జన్యువులున్నాయని అణు సాంకేతికత పద్ధతిని వీరు కనుగొన్నారు. అణు సాంకేతికతను వాడుతూ ఆవిష్కరించిన తొలి ఇంద్రియ జ్ఞానము ఘ్రాణేంద్రియ జ్ఞానము. ఒక వాసన గ్రాహకము వాసనగల పదార్థంవల్ల వుత్తేజితమైనప్పుడు ఘ్రాణ గ్రాహక కణంలో విద్యుత్ సంకేతాన్ని ప్రేరేపించి దానిని నాడీ ప్రక్రియలద్వారా మెదడుకు పంపుతుంది. మొదట ప్రతి ఒక్క వాసన గ్రాహకము G ప్రోటీనును★ ఉత్తెజపరుస్తుంది; దానితో జత కలుపుతుంది. G ప్రోటీను cAMP# ఏర్పడడానికి ఉద్దీపననిస్తుంది. దూత అణువైన ఈ cAMP అయాన్ చానళ్లను ఉత్తేజపరచగా అవి తెరుచుకొని కణము ఉత్తేజితమవుతుంది.

చాలా పెద్ద పరివారముగల వాసన గ్రాహకాలు G ప్రోటీన్ కపుల్డ్ రెసెప్టార్స్ (GPCR)★కి చెందుతాయని ఈ శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

అన్ని వాసన గ్రాహకాలూ ప్రోటీనులకే సంబంధించినవైనప్పటికీ, అవి కొన్ని వివరాల దగ్గర విబేధిస్తాయి.అందుకే అవి విభిన్నమైన వాసన అణువులకు ప్రేరేపితమవుతాయి. ప్రతి ఒక్క గ్రాహకములో అమైనో ఆమ్లాల గొళుసు వుంటుంది. ఇది కణ త్వచంతో (కణం చుట్టూ ఉండే సన్నని పొర) గట్టిగాపట్టుకొని వుంటూ ఏడుసార్లు దానిని దాటుతుంది.(పటము–5)




పటము –5 (a,b,c)

ఈ గొలుసు ఎక్కడ వాసనకారకానికి బంధం ఏర్పరచవచ్చో అక్కడ దానిని తగిలిస్తుంది. ఇది జరిగినప్పుడు, గ్రాహక ప్రోటీను ఆకారంలో మార్పురాగా అది G ప్రోటీన్ ఉత్తేజితానికి దారితీస్తుంది. ఘ్రాణ సూక్ష్మ కణమయ పొరకి (olfactory epithelium)సంబంధించిన ఈ అతి పెద్ద జన్యు కుటుంబంలో కొన్ని వందల వేర్వేరు జన్యువులుంటాయి.ఇవి గ్రాహకాణు వులకు నిర్దేశాలను ఇస్తాయి. ఈ రోజున క్షీరదాలలో వుండే మొత్తము జన్యువులలో ఇవి మూడు శాతం వున్నాయని శాస్త్రవేత్తలందరికి తెలుసు.

ఒకానొక ఘ్రాణ గ్రాహక కణానికి ప్రత్యేకముగా ఒక రకపు ఘ్రాణ గ్రాహక జన్యువే! (పటము: 3 ను పరిశీలించండి) ప్రతీ ఘ్రాణ గ్రాహక కణము ఒకటంటే ఒకటే రకపు వాసన గ్రాహకం గురించి చెపుతుంది. అని ఆక్సెల్, బక్ నిరూపించారు.ఈ విధంగా ఎన్ని రకాల ఘ్రాణ గ్రాహక కణాలున్నాయో అన్నివాసన గ్రాహకాలున్నాయి.

foot note:★G proteins, also known as guanine nucleotide-binding proteins, are a family of proteins that act as molecular switches inside cells, and are involved in transmitting signals from a variety of stimuli outside a cell to its interior) ★G protein-coupled receptors (GPCRs), also known as seven-(pass)-transmembrane domain receptors,7TM receptors, heptahelical receptors, serpentine receptors, and G protein-linked receptors (GPLR), form a large group of evolutionarily related proteins that are cell surface receptors that detect molecules outside the cell and activate cellular responses. They are coupled with G protein.
# cAMP =Cyclic AMP (cyclic adenosine monophosphate.)

ఒక ఘ్రాణగ్రాహక కణము నుండి వస్తున్న విద్యుత్సంకేతాలను నమోదు చేయడం ద్వారా,ప్రతీ కణము కూడా ఏదో ఒక వాసన పదార్థఅణువుకు మాత్రమే స్పందించదనీ అటువంటి ఆ అణువుతోసంబంధంవున్న ఇతర అణువులకూ (వాటి వాసన గాఢతలలో చిన్నతేడాలు గలవి)స్పందిస్తుందని తెలియవచ్చింది.

బక్ పరిశోధనాబృందం ఒకానొక ప్రత్యేక వాసనకారకంతో ఒకానొక

ఘ్రాణ గ్రాహకణపు సున్నితత్వాన్ని పరీక్షించి చూసి,ఆ కణంలో ఏ ఘ్రాణ గ్రాహక జన్యువు వున్నదో తెలుసుకొనగలిగారు.అలా ఒకకణము తీసికొని పోయే ఒకానొక గ్రాహకాన్ని,ఒకానొక ప్రత్యేకమైన వాసనకు స్పందించే వైనంతో ముడి పెట్టగలిగారు .

చాలావాసనలలో అనేక వాసన కారక అణువులుంటాయి. ప్రతీ వాసనకారకాణువూ చాలా ఘ్రాణ గ్రాహకాలను ఉత్తేజపరుసుంది.అందువల్ల ఇవన్నీ కలిసిన 'కోడ్' తో ఒక వాసనాకృతి (odorant pattern)ఏర్పడుతుంది. (అతుకులబొంతలొ తయార్రైన రంగుల డిజైన్ లా) మనము సుమారు 10,000 రకాల వాసనలను గుర్తించి గుర్తుపెట్టుకొనగలగడానికి గల మూల మిదే!

ఘ్రాణ గ్రాహక కణాలు ఘ్రాణ లసునము లోని సూక్ష్మ ప్రాంతాలను ఉత్తేజపరుస్తాయి. అయితే, ప్రతీ ఘ్రాణ గ్రాహక కణము ఒక వాసన కారక జన్యువు నే తెలియజేయడము శాస్త్రవేత్తలు ఊహించని విషయము.( పటము–3) ఆక్సెల్, బక్ జీవశాస్త్రవేత్తలు తమ పరిశోధనను ఇంకా కొనసాగించారు. మెదడులో తొలి సమాచార ప్రసార స్థానాన్ని నిర్ణయించగలిగారు. ఘ్రాణ గ్రాహక కణము తన నాడీ ప్రక్రియలను ఘ్రాణ లసునానికి పంపుతుంది. అక్కడ 2000 సుస్పష్టమైన సూక్ష్మరక్తకేశనాలికల గుత్తులుంటాయి. ఆవిధంగా ఘ్రాణ గ్రాహక కణాలకు రెండు రెట్లు సూక్ష్మ రక్తకేశనాలికల గుత్తులుంటాయి. ఆక్సెల్, బక్ లిరువురూ ఎవరికివారుగా చేసిన ప్రయోగాలద్వారా ఒక రకానికి చెందిన గ్రాహకాలను తీసికెళుతున్న కణము మొత్తము అన్నిటినీ అదే రకానికి చెందిన సూక్ష్మ రక్తకేశ నాళికల గుత్తులదగ్గరకే పోయి కూర్చుతుందని కనుగొన్నారు. వారు అత్యాధునిక మైన జన్యు సాంకేతికపరిజ్ఞానాన్ని వాడుతూ ఈ ప్రక్రియలో గ్రాహకాల పాత్రను ఎలుకలో ప్రదర్శించి చూపారు.ఈ ఫలితమువల్ల సూక్ష్మ రక్తకేశనాళికల గుత్తులు తమదీ అయిన ప్రత్యేకతను / విశిష్టతను ప్రదర్శిస్తాయని కూడా మరో మాటు తేటతెల్లమయింది. వీరి పరిశోధనను ఇక్కడతో ఆపలేదు. నాడీ కణాలలో దీని తరువాత స్థాయికి చెందిన మైట్రాల్ కణాలతో(mitral cells)#ఈ ప్రక్రియల సంబంధానికై సోధించారు. ప్రతీ మైట్రాల్ కణము ఎదో ఒక సూక్ష్మ రక్త కేశనాళికనే ఉత్తేజపరచడాన్ని గుర్తించారు.ఈ విధంగా సమాచార ప్రాసారం లో ప్రత్యేకత కొనసాగింది.పొడవైన నాడీ ప్రక్రియల ద్వారా మైట్రాల్ కణాలు మెదడులో పలు ప్రాంతాలకు సమాచారాన్ని చేరవేస్తాయి.ఈ

కణసంకేతాలు మస్తిష్క వల్కలం లో నిర్ణీత స్థానాలను చేరుకొంటాయి.అక్కడ రకరకాల ఘ్రాణ గ్రాహకాలు కలసి ఆఫలానా వాసనకు అభిలాక్షణికమైన ఆకృతిగా రూపొందగా,ఆ ఆకృతి వివరించే ఆవాసన యొక్క అనుభూతి ని పొంది క్షీరదాలు దానిని గుర్తించ గలుగుతాయి అని ఈ శాస్త్రవేత్తలు చెప్పగలిగారు .

Foot Note #Mitral cells are neurons that are part of the olfactory system. They are located in the olfactory bulb in the mammalian central nervous system.

## క్షీరదాలలో తేడాలు

మనుషులలో వున్నదానికన్నా కుక్కలలో సూక్ష్మ రక్తకేశనాలికల వైశాల్యము 40 రెట్లు ఎక్కువ ( పటము–6లో ఎరుపు రంగులో సూచించిన భాగాలు )ఆక్సెల్, బక్ పరిశోధించిన ఎలుక జాతిలో వెయ్యి వేర్వేరు రకాలకు చెందిన ఘ్రాణ గ్రాహకాలున్నాయి.మనుషులలో ఇవి ఎలుకలకన్నా తక్కువ .




పటము –6

References

1. Buck, L. and Axel, R. (1991) Cell, vol. 65, 175–187.
2. https://www.nobelprize.org/prizes/medicine/2004/7428
3. https://www.nobelprize.org/prizes/medicine/2004/buck/documentary

4. https://www.nobelprize.org/prizes/medicine/2004/press-release/
5. https://www.nobelprize.org/prizes/medicine/2004/summary/
6. https://www.hhmi.org/news/richard-axel-and-linda-buck-awarded-2004-nobel-prize-physiology-or-medicine
7. https://pubmed.ncbi.nlm.nih.gov/15646858/
8. https://kids.frontiersin.org/articles/10.3389/frym.2022.1022504

Illustrations: Annika Rohl, Bengt Gullbing

# గురజాడ
# రచనలలో
# భాషా విశేషాలు

# గురజాడ కథలు - నిర్మాణ కుశలత, భాషా సౌరభం



డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి
6302 738 678

గురజాడ మొత్తం ఐదు కథలు రచించారు. వాటిలో నాలుగు కథలు తెలుగులో రచించారు. అవి దిద్దుబాటు, మీ పేరేమిటి?, మెటిల్డా, మతము -విమతము. "Stooping to raise" అనే కథ1904వ సంవత్సరంలో, భారతీయ జీవితాన్ని ప్రతిబింబిస్తూ 5000 పదాలకు మించని కథలను పంపమని రాసిన లండన్ లోని మాక్స్ పెంబర్టన్ అనే ఆయన కోరికపై గురజాడ ఆంగ్లంలో రాసినది(1). సమకాలీన సంఘ సంఘ సంస్కరణోద్యమాన్ని విమర్శిస్తూ రాసిన కథ ఇది. దీన్ని "సంస్కర్త హృదయం" పేరుతో అవసరాల సూర్యారావు 1951లో తెలుగులోకి అనువదించారు.

ఇదే గురజాడ మొదటి కథ. ఇది విదేశీయుల కోసం విదేశీయుడు కోరితే రాసిన కథ. ఆయన మొదటి కవిత ఆంగ్లంలో రాసినట్లుగా, కథ కూడ ఆంగ్లంలోనే రాయడం విశేషం.



గురజాడ రచనా పద్ధతే ప్రత్యేకంగా ఉంటుంది. శిల్పి శిలను చెక్కి, చెక్కి ఏ లోపమూ లేకుండా పరిపూర్ణంగా, సుందరమైన శిల్పంలా తయారయ్యేదాకా శ్రమించేటట్లు, గురజాడకు తన ప్రతి రచన పట్ల అంత శ్రద్ధ, తపన కనిపిస్తాయి. ఒకసారి రాసి,

అచ్చయ్యాక, దానిని అలా వదిలేయరు. మళ్ళీ మళ్ళీ మార్పులు, చేర్పులు ఉంటే చేస్తారు. భాషలో మార్పులు తెస్తారు. అలా గురజాడవి రెండు కూర్పుల రచనలు కొన్ని ఉన్నాయి. కన్యాశుల్కం (నాటకం), దిద్దుబాటు (కథ), పూర్ణమ్మ, (కవిత), రెండు సార్లు రాసినవి. ప్రచురించిన గురజాడ రచనల సంపుటాలలో 1,2 సంఖ్యలు ఇవ్వటం వల్ల,',★ 'ఈ గుర్తు ఇవ్వటం వల్ల తొలి ఏదో, మలి ఏదో తెలుస్తుంది (2). అయితే కన్యాశుల్క నాటక రచనకు తప్ప మిగతా వాటికి రెండు కూర్పుల రచనా కాలం మధ్య తేడా తెలియట్లేదు.

గురజాడ కథలలోని నిర్మాణ విశిష్టత, భాషా సౌరభం ఒక్కొక్క కథని విశ్లేషిస్తూ వివరిస్తాను.

### దిద్దుబాటు:

దిద్దుబాటు కథను గురజాడ 1910 ఫిబ్రవరిలో 'ఆంధ్ర భారతి లో' ప్రచురించారు. ఇది సరళ గ్రాంధికంలో ఉంది. దీనిని మళ్ళీ పూర్తిగా వ్యావహారికం లోకి మార్చి రాసారు. ఇతివృత్తం రెండిటిలో సమానమే. రెండవసారి రాసిన రచనకు "కమలిని"అని పేరు పెట్టి కథానాయికకు ప్రాధాన్యత నివ్వటం, ప్రధాన పాత్ర పేరు పెట్టటం కనిపిస్తుంది.

రోజూ ఆలస్యంగా ఇంటికి వస్తున్న భర్తని చదువుకున్న భార్య, దారిలో పెట్టటానికి, చిన్న ఉత్తరం ద్వారా అతనిలో మార్పు తేవటానికి చేసిన ప్రయత్నమే దిద్దుబాటు కథ.

రెండవసారి రాసిన కథలో చేసిన భాషా సంబంధమైన మార్పుల వల్ల వాక్యాలు అర్థవంతంగా, కథలో సందర్భానికి తగినట్లు ఔచిత్యవంతంగా ఉన్నాయి.

### వాక్య నిర్మాణంలో మార్పులు.

1. "అంత జేబు నుండి అగ్గిపెట్టె తీసి పుల్ల వెలిగించెను" (తొలి కూర్పు)
   "బల్ల మీద తడివి అగ్గిపెట్టె తీసి ఒక పుల్ల వెలిగించాడు". (మలి కూర్పు

   గోపాల్రావు, చీకట్లో కమలిని కోసం వెతుకుతూ బల్ల మీద అగ్గిపెట్టె కోసం తడివి వెలిగించటం సమంజసంగా ఉంది. అప్పటికే ఇంటి నడవ లోనించి లోపలికి వచ్చి అక్కడెక్కడా దీపం లేదే అనుకుంటాడు. తర్వాత అగ్గిపెట్టె కోసం వెతుకుతాడు. జేబులోనే ఉంటే ఇంట్లోకి వచ్చిన వెంటనే వెలిగించేవాడు.

2. “నిశ్చేష్టుడై చేతి నుండి అగ్గిపుల్ల రాల్చేను” (తొలి కూర్పు).
“నిశ్చేష్టుడై పోయాడు. చేతి నుండి అగ్గిపుల్ల రాలింది” (మలికూర్పు)

మంచం మీద కమలిని కనపడక పోవటం వల్ల నిశ్చేష్టుడై పోయి చేతి నుండి అగ్గిపుల్ల అప్రయత్నంగా నేల మీద పడటం సహజం గా ఉంది.

3. ”అమ్మగారా ఎక్కడుంటారు బాబూ!గదిలో పడుకున్నారు”(తొలి కూర్పు).
“ఎక్కడుంటారు బాబూ!అమ్మగారు గదిలో తొంగున్నారు బాబు”(మలికూర్పు).

రెండవ సారి రచన లో నౌకరు రాముడి భాష పూర్తిగా మారింది. పాత్రోచిత భాష ను ప్రవేశపెట్టారు.

4. “అంతట మంచం క్రింద నుండి అమృత నిష్యందిని యగు కల కల నగవును కరకంకణముల హృద్యారావమును విననయ్యెను” (తొలి కూర్పు).

“అంతలో మంచం కింద నుంచి అమృతం వొలికే కల కల నవ్వు మనోహారియైన నూపురముల రొద విననయ్యెను” (మలి కూర్పు).

వాక్యం పూర్తిగా వ్యావహారికం లోకి మార్చారు. మలి రచనలో కొన్ని వాక్యాలు అదనంగా పెరిగాయి.

నౌకరు రాముడి కూతురి చదువు గురించి మాట్లాడుతూ గోపాల్రావు “మీ వాళ్ళ కంటె దానికి ఎంత నాగరికత వచ్చిందో చూడు.” చదువు మనుషుల్లో నాగరికత తెస్తుందని గురజాడ సూచిస్తున్నారు.

నౌకరు రాముడి పద ప్రయోగం లో మార్పులు :

| తొలి కూర్పు | మలి కూర్పు |
|---|---|
| యింటున్నాది | కొంపలున్నాది |
| పడుకున్నారు | తొంగున్నారు |
| అంతవారు | అంతోరు |
| చెప్పలేను | సెప్పజాలను |
| ఆడారు | ఆడోరు |
| చదువు | సదువు |

గురజాడ దిద్దుబాటు రచించేనాటికే కన్యాశుల్కం మలికూర్పు రచన పూర్తయింది. భాషకు సంబంధించి, ఉచ్చారణకనుగుణంగా కన్యాశుల్కం లో ఎన్నో ఆసక్తికరమైన మార్పులు చేసారు. ఇటువంటి మార్పులు దిద్దుబాటులోనూ కన్పిస్తాయి.

## రెండక్షరాలు కలిపి రాయటం :

| తొలి కూర్పు | మలికూర్పు |
|---|---|
| గోపాలరావు | గోపాల్రావు |
| రేపటినుంచి | రేపట్నుంచి |
| రాముడిని | రాముణ్ణి |

పదాది ఎ' స్థానం లో 'య' కారం, ఒ స్థానం లో 'వ 'రావటం

| | |
|---|---|
| ఎంత | యెంత |
| ఒంటిగంట | వంటి గంట |

మ కారం వ కావటం, అరసున్న రావటం

| | |
|---|---|
| లగ్నమై | లగ్నవై ( |
| రాముడు | రావు(డు |
| యేమిటి | యేవి(టి |

పదాంత' ము 'వర్ణం అనుస్వారం కావటం

| | |
|---|---|
| గడియారము | గడియారం |
| దీపము | దీపం |
| గుమ్మము | గుమ్మం |

ఇంకా 'బడు', 'వలె' వంటి ప్రాచీన గ్రాంధిక రూపాలు పూర్తిగా వ్యవహారికంలోకి మలికూర్పులో మారాయి.

| | |
|---|---|
| తెరవబడలేదు | తెరవలేదు |
| మనిషి వలె | మనిషి లాగా |

'తెరవలేదు' అనటంలో మనిషి ఇంట్లో ఉండి తలుపు కావాలనే తెరవలేదనే అర్థం స్ఫూరిస్తుంది. ఇంట్లో కమలిని ఉంది కాని తలుపు తెరవలేదు. ఇలా మలి కూర్పు దిద్దుబాటు లో మార్పు లన్నీ అర్థవంతంగా ఉండి కథ గొప్పదనాన్ని, సౌందర్యాన్ని మరింత పెంచాయి.

## దిద్దుబాటు – కథా నిర్మాణం

దిద్దుబాటు చిన్న కథ. చిన్న సంఘటన  మూడే పాత్రలు కథ జరిగిన కాలం కొన్ని నిముషాలు పట్టి ఉంటుంది. ఏకాంకికగా మలచటానికి అవకాశమున్న చక్కని కథ. గురజాడ ప్రతి కథ ఒక్కొక్క విధమైన ప్రారంభం, ముగింపులతో ఉంటుంది. అలాగే, దిద్దుబాటు కథా ప్రారంభమే ఆసక్తికరంగా ఉంటుంది. అర్థరాత్రి సమయం లో కథ ప్రారంభమవుతుంది. గోపాల్రావు ఇంటికి వచ్చి 'తలుపు, తలుపు 'అంటాడు. కాని తలుపు తట్టడు. తడితే వెంటనే తెరుచుకుని ఉండేది. ఈ విషయం తర్వాత పేరా లో తెలుస్తుంది. గోపాల్రావు రాగానే గోడ గడియారం గంట వినిపిస్తుంది. అప్పటిదాకా అతనికి సమయం గురించి స్పృహ ఉండదు. ఒంటిగంట అయిందని తెలుసుకున్నాక అతని స్వగతంలో ఆ పాత్ర స్వభావం తెలుస్తుంది. కథలో పాత్రే తన పరిచయం చేసుకుంటాడు.

తరవాత పేరాలో రచయిత చెప్పటం ప్రారంభ మవుతుంది. గోపాల్రావు తలుపు తోస్తే తీసే ఉంటుంది. లోపలికి వెళ్లి అంతా వెతికి ఎవరూ కనిపించక మళ్ళీ వీధిలోకి వెళితే నౌకరు రాముడు కనిపిస్తాడు. ఇక్కడ నుంచి కథ అంతా సంభాషణ రూపంలో నడుస్తుంది. గోపాల్రావు నౌకరును భార్య ను గురించి ప్రశ్నిస్తాడు. సరైన సమాధానం రాక నౌకరును కొట్టి విచారం తో ఆలోచిస్తూ కుర్చీలో కూర్చుంటాడు. ఎదురుగా టేబుల్ మీద కమలిని ఉత్తరం కనిపిస్తుంది.

ఉత్తరం చదివాక పశ్చాత్తాపంతో భార్యను వెంటనే పుట్టింటి నుంచి తీసుకునిరమ్మని నౌకరుతో చెపుతాడు. భర్తలో పూర్తి మార్పు వచ్చిందని గ్రహించాక అంతవరకూ మంచం కింద దాక్కుని ఈ సన్నివేశాన్నంతా చూసిన కమలిని పైకి వస్తుంది.

ఈ కథలో భర్తను మార్చటానికి కమలిని ఎంతో జాగ్రత్తగా పథకం వేస్తుంది. పరిస్థితులతో రాజీ పడకుండా, చదువుకున్న యువతి ఎలా ప్రవర్తించాలో ఈ కథ లో కమలిని ద్వారా గురజాడ చూపించారు. కథ జరుగుతున్నంత సేపు కమలిని అక్కడే ఉందన్న స్పృహ పాఠకులకు కలగదు. ఇలా ప్రారంభం, ముగింపు కొత్త పద్ధతిలో గురజాడ నిర్వహించారు(3).

రెండు కూర్పులలో ఉత్తరంలో భాష మారలేదు. ఆ కాలం నాటి లేఖా రచన దీని వల్ల తెలుస్తోంది.

## మీ పేరేమిటి?

దిద్దుబాటు తర్వాత గురజాడ మీ పేరేమిటి? అనే పెద్ద కథను రచించి 1910 ఏప్రిల్, మే, జూన్ 'ఆంధ్ర భారతి' లో ప్రచురించారు. ఈ కథలో విజయనగర మాండలిక పదాలు కనిపిస్తాయి.

లావు =ఎక్కువ, మోస్తరు =పద్ధతి, ఖాయిదా=కట్టడి చేయటం, సాయిలా పాయిలా =ఆడుతూ పాడుతూ కలిసి మెలిసి ఉల్లాసంగా ఉండటం, పికరు=జాడ, గావంచా=అంగవస్త్రం, కోవిల=గుడి, ఆడదాయి =స్త్రీ మొదలైనవి.

ఈ కథలో వర్ణనలు ఉన్నాయి. భావుకత ఉంది.

గురువుగారు, శిష్యులు డాబా మీద సమావేశమైనప్పుడు వర్ణన :

"చిన్న గాలి రేగి తోటలో కొబ్బరి మట్టలు అల్లాడటం ఆరంభించాయి. యెదట దేవుడి కొండ బ్రహ్మాండమైన మహా లింగము వలె చీకటిని చీల్చుకుని మిన్నుముట్టి మనిషి యొక్క అత్యల్పత ను సూచించుచు, యెదో చెప్పరాని చింతను, భీతిని కలుగజేయుచుండెను. దేవతలు పూజ చేసిన దివ్యకుసుమముల వలె చుక్కలు శిఖరము చుట్టు చెదిరి వెలిగెను ". కళ్ల ముందు దృశ్యం ప్రత్యక్షమైన అనుభూతి నిస్తుంది ఈ వర్ణన.

### మీ పేరేమిటి? కథా నిర్మాణం:

ఇది గురజాడ మిగతా కథలకు భిన్నమైనది. ఎక్కువ మంది పాత్రలతో ఒక గ్రామం గ్రామమంతా ఈ కథలో పాల్గొంటుంది. కథ అప్పటికప్పుడు జరిగినదికాక ఉపోద్ఘాతంతో ప్రారంభమవుతుంది. ఇది సంభాషణ రూపంలో మత చర్చలతో ఉంటుంది. ప్రాచీన పౌరాణిక కథల్లో ఒక వ్యక్తి కథ చెపుతుంటే అందరూ కూర్చుని వింటూ ఉంటారు. ఆ పద్ధతి లో నడచిన కథ 'మీ పేరేమిటి'?(4)

ప్రారంభంలో శాస్త్రులు, శిష్యులు సమావేశమై మాట్లాడుకుంటుండగా, "నేను" అనే వ్యక్తి పాత్రల పరిచయం చేస్తాడు. అప్పటికి పదేళ్ల నుంచి వాళ్ళు అలా కలుసుకుంటున్నారని చెపుతాడు.

వీళ్లంతా ఉన్న ఊరికి కొంత దూరంలో రామగిరి అనే పుణ్య క్షేత్రం ఉంది. ఆ ఊళ్ళో శాయన్న భుక్త అనే వ్యక్తి ఉంటాడు. ఆయన శాస్త్రులకు శిష్యుడు. ఒకసారి వీళ్లంతా కలిసి రామగిరి వెళ్లి శాయన్న భుక్త ఇంట్లో కలుస్తారు. శాయన్న భుక్త కథ చెపుతుండగా అప్రయత్నంగా పాత్రలు, సంభాషణలు ప్రవేశిస్తాయి. పాత్రలు ప్రవేశించాక శాయన్న భుక్త కథ చెపుతున్నాడనే స్పృహ పాఠకులకు ఉండదు.

మళ్ళీ సంభాషణల్లో పాత్రలన్నీ నిష్క్రమించాక, శాయన్న భుక్త ప్రవేశించి శైవులు, వైష్ణవులు గుండం తొక్కటం తాను చూసానని తర్వాత కథా భాగాన్ని వివరిస్తాడు. కథా నిర్మాణంలో ఇది కొత్త పద్ధతి. జరిగిపోయిన ఒక విషయాన్ని ఒక వ్యక్తి వివరించటం మొదలు పెట్టాక పాత్రలు రావటం, మాట్లాడటం చివరలో మళ్ళీ మొదట చెప్పిన వ్యక్తే దాన్నే ముగించటం ఈ కథ లో కనిపిస్తుంది.

శాస్త్రులు మాటతో మొదలైన కథ ఆయన మాట తోనే ముగుస్తుంది. శాస్త్రులు భాష లో సాంప్రదాయకత కనిపిస్తుంది. రామి నాయుడు, సారధి నాయుడు పాత్రోచిత మాండలిక భాష మాట్లాడుతారు. వర్ణనల్లో కవిత్వ లక్షణాలు కనిపిస్తాయి.

## మెటిల్డా

ఈ కథ రచనా కాలం తెలియదు. పూర్తి వ్యవహారిక భాష లో నడిచిన కథ. ఇందులోను మాండలిక పదాలు ఉన్నాయి.

నేస్తం=స్నేహం, పెరడు =ఇంటి వెనక భాగం, పెనిమిటి =భర్త, గొప్పుతవ్వు =చెట్ల పాదుల కోసం తవ్వటం,బరి =బడి.

అర మినుటు=అరనిముషం, ఆయను=అవుతుంది వంటివి కొత్త ప్రయోగాలు. మ కారం స్థానం లో వ (రావటంవంటి ప్రయోగాలు ఈ కథలోనూ ఉన్నాయి).

గస్తు, హమేషా, చమన్ వంటి పర భాషా పదాలు వాక్యాలకు కొత్త అందాన్నిస్తాయి.

మెటిల్డా పాత్ర వర్ణనలో భావుకత, భాషలో సరళత ఉండి ఆమె రూపం చిత్ర పటంలో చిత్తరువులా పాఠకుల కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. ఉదాహరణకి

"పసుపు రాసుకుని స్నానమాడి పైని బంగారు చాయలు దేరిన మేని సొంపు నెమలి ఫింఛము వలె ఒడలును కమ్మి చెదరిన తలకట్టు, బావి నుండి నీరు తోడుతూ వొక్కొక్కతరి తలయెత్తి యిటు అటూ చూసిన కన్నుల తళుకు, మోము అందమూ నా కన్నుల కట్టినట్టు వుండి మరతునన్న మరపురాకపాయను".

మెటిల్డా కథా నిర్మాణం :

ఉత్తమ పురుషలో నేను అనే వ్యక్తి చెపుతున్న కథ మెటిల్డా. ఐదు భాగాలుగా విభజించి రాసిన కథ. మొదటి భాగంలో నేను అన్నవ్యక్తి మెటిల్డాను చూస్తాడు. ఒకసారి చూసాక ఆకర్షితుడై కాలేజీకి వెళ్ళేటప్పుడు రోజూ ఆమె ఇంటి వైపు చూస్తూ వెళ్తాడు. అతడు విద్యార్థి. ఆమె గృహిణి.

రెండవ భాగంలో మెటిల్డా వివరాలు సేకరిస్తాడు. ఆమె భర్త నిరంకుశత్వంలో ఉందని గ్రహిస్తాడు. మూడవ భాగం దీనికి పొడిగింపు. ఒకరోజు మెటిల్డా ఇంటివైపు చూస్తూ నెమ్మదిగా వెళుతుంటే ఆమె భర్త చూసి పిలిచి తిడతాడు. నాలుగవ భాగంలో మెటిల్డా తన జోలికి రావద్దని ప్రాధేయపడుతూ ఉత్తరం రాసి వంట బ్రాహ్మణుడితో పంపుతుంది. ఆ ఉత్తరం చూసాక వెళ్ళిపోవటమా, అక్కడే వుండి మెటిల్డా భర్తలో మార్పు తెచ్చి, ఆమెను కాపాడటమా అని మిత్రునితో ఆలోచిస్తాడు. ఇంతవరకు కథ సూటిగా నడుస్తుంది.

ఐదవ భాగంలో 'నేను' అనే అతనిని, మిత్రుని మెటిల్డా భర్త తన ఇంటికి పిలిచి వారు తనకు చాలా ఉపకారం చేసారని, తను ఇప్పుడు భార్యను బాగా చూసుకుంటున్నట్లు చెపుతాడు. కథ సుఖాంత మవుతుంది.

నాలుగు, ఐదు భాగాలమధ్య మిత్రుడు, 'నేను' అనే వ్యక్తి కలిసి మెటిల్డా భర్తను ఏ విధంగా మార్చారన్నది ఉండాలి. అది కథ లో లేదు.

ఇందులో మొత్తం ఆరు పాత్రలు. భర్త కు పేరు లేదు. ముసలి పులి అనే అంటారు. భర్త అక్కకు పేరు లేదు. వంట బ్రాహ్మణుడికి పేరు లేదు. 'నేను' అనే వ్యక్తికి పేరు లేదు. మెటిల్డా, రామారావు వీరిద్దరే పేర్లున్న పాత్రలు.

భార్య ను పేరు పెట్టి భర్త ఎప్పుడూ పిలవలేదు. ఏమే, ఔనే అనే సంభోదనలే!రామారావు మాటల్లో ఆమె మెటిల్డా అని తెలుస్తుంది.

"మెటిల్డా" అంటే గొప్ప బలం, శక్తి అని అర్థం. మెటిల్డా పాత్ర అవసరాన్ని బట్టి జీవన పోరాటంలో తన శక్తిని, సాహసాన్ని ప్రదర్శించ గలదని చెప్పటానికి గోథిక్ సాహిత్యం లోని మెటిల్డా అర్థాన్ని గురజాడ వారు తీసుకున్నారు(5).

నాడు అణచివేతకు గురైన స్త్రీ పరిస్థితి కి ప్రతిబింబం మేటిల్డా.

## మతము - విమతము :

ఈ కథ రచనా కాలం తెలియదు. దీనికే పెద్ద మసీదు అని మరో పేరు. క్రీ.శ.16వ శతాబ్దానికి చెందిన చారిత్రకాధారాలతో రచించిన కథ ఇది. ఒకటో, రెండో గ్రాంధిక పదాలు తప్ప,

పూర్తి వ్యావహారిక భాష లో నడిచిన కథ. భాయీ, సైతాన్క ఘర్ వంటి హిందీ పదాలు ముస్లిం పాత్రతో పలికించటం సహజాతి సహజం గా అనిపిస్తుంది.

కథ అంతా సంభాషణా రూపంలో ఒక ఏకాంకిక లా నడిచింది. కథ లో ఒక్క వాక్యం మాత్రం రచయిత చెప్పినట్లు తోస్తుంది.

"అంతట తలయెత్తి చూడ సంజ చీకటి లో నెలి వెలుగు కమ్మిన పడమటి ఆకాశమున దూసి రెండు మసీదు స్తంభముల కళ్ళ యెదుట నిలిచెను".

ఇందులో నెలి అన్నది నెల కావచ్చునేమో!నెల వెలుగు, అంటే వెన్నెల. సూర్యాస్తమయ సమయం లో సంధ్య చీకటిలో వెన్నెల పరచుకుంటున్నప్పుడు,ఆకాశాన్ని చీల్చుకుంటూ రెండు మసీదు స్తంభాలు కళ్ళ ముందు కనిపించాయి అని అర్థం చేసుకోవచ్చు.

చిరు చీకటి లో ముందు అస్పష్టంగా కనిపించిన మసీదు స్తంభాలు మళ్ళీ పరికించి చూస్తే స్పష్టంగా కనిపించాయి.

గ్రాంధికం లో దరియ అనే పదం సమీపం, ఆ వైపు అనే అర్థాలలో ఉంది.

"తూర్పున నుండి పట్టణము దరియ వచ్చుచుండిరి "అని గురజాడ ఈ పదాన్ని వాడారు.

అలాగే 'కొంత తడవు'అనే పదం --కొంత సేపు 'అనే అర్థం లో ఉంది.

'మ 'స్థానం లో వ(ంవాడటం ఇతర కథలు, రచనలలో లాగా ఈ కథ లోను ఉంది.

'గోపురం కోసవాఁ,' పెద మావఁ, చిన మావఁ, మాయవైఁపోయింది, మొదలైన పదాల్లో అరసున్న ఉంది.

కాసీ, దేసం వంటి పదాల్లో 'శ' కి బదులు స 'ఆ' పాత్ర ఉచ్చారణ కనుగుణంగా ప్రయోగించారు.

కోవిల – గుడి

బోధపడదు–అర్థం కాదు

లావు–ఎక్కువ, వంటి విజయనగర మాండలిక పదాలు ఈ కథలో ఉన్నాయి.

### కథా నిర్మాణం :

కథ సూటిగా, వెనక ముందు లకు వెళ్లకుండా పూర్తిగా సంభాషణ రూపంలో నడిచింది. మంచి కొస మెరుపు ఉన్న చిన్న కథ.

నారాయణ భట్టు తన శిష్యుడు పుల్లం భోట్ల తో తన ఊరు శ్రీకాకుళం వచ్చి అక్కడ కోవెల గోపురం కనిపించక నిరాశ పడుతుంటే ఆ గోపురం స్థానం లో రెండు మసీదు స్థంభాలు కనిపిస్తాయి.

మత నమ్మకాలను హేతు వాద దృష్టితో విమర్శించటం ఈ కథ లో కనిపిస్తుంది. దేవాలయం స్థానంలో మసీదు ఎలా ఏర్పడిందో తెలుసుకోవటానికి ఇద్దరూ మసీదు దగ్గరకు వెళతారు. అక్కడ కనిపించిన ముస్లిం వ్యక్తి సమాధానాలు క్లుప్తంగా ఉంటాయి. ఆ గుడి దగ్గర ఉండే తమ బంధువులు చేబ్రోలు వారు ఏమైందీ తెలుసుకోవాలనుకున్న నారాయణ భట్టుకు ఆ ముస్లిం వ్యక్తే తన మేనల్లుడు అని తెలిసి నిశ్చేష్టుడవటంతో కథ ముగుస్తుంది.

గురజాడ కథలన్నీ నాటకీయంగానే ఉంటాయి. దిద్దుబాటు కథలో కన్యాశుల్కం లో లాగానే అంతర్నాటకం వుంది. 'మెటిల్డా' కథ చివరలో ముసలి భర్త, తన భార్య వెంట పడుతున్నాడని అనుమానించే నేను అనే పాత్రని కూర్చోబెట్టి సంభాషించే తీరు నాటక సన్నివేశాన్ని తలపిస్తుంది. 'మీ పేరేమిటి'? కథ ప్రారంభమే సంభాషణ తో మొదలవుతుంది. గుండం తొక్కటం కోసం వైష్ణవ భక్తులంతా ఎవరికి వారు వెనక్కి తప్పుకుంటుంటే,

రంగాచార్యులు గుండం తొక్కటానికి సిద్ధమవుతున్నప్పుడు కోడలు నాంచారమ్మ ఒక చేత్తో దీపం, మరో చేతిలో సూర కత్తి పట్టుకుని మామగారి రెక్కలు పట్టుకున్నవారిని బెదిరించే వీర రూపం నాటకం చూస్తున్నట్లే ఉంటుంది కాని కథ చదువుతున్నట్లు ఉండదు.

'మతము విమతము' కథయితే పూర్తి సంభాషణ ల్లోనే ఉంది; ఒక ఏకాంకిక చూసిన అనుభూతి నిస్తుంది.

తెలుగులో గురజాడ రాసిన కథలు నాలుగే! అయితేనేం, రాశి కన్న వాసిలో ఘనం!అద్భుతమైన కథకుడు మన గురజాడ!

## అధో జ్ఞాపికలు

1. మార్క్స్ పెంబర్టన్ గురజాడకు రాసిన లేఖ,

   లేఖలు–గురజాడ అప్పారావు – సంకలితము – అవసరాల సూర్యారావు, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ 1958
2. గురజాడ రచనలు – కథానికలు – విశాలాంధ్ర ప్రచురణాలయం – విజయవాడ 2018
3. గురజాడ అప్పారావు సృష్టించిన దిద్దుబాటు ఆలోచనత్మాకంగా, వాస్తవికత కు దగ్గరగా సంక్షిప్తంగా అందమైన ప్రారంభంతో, ఆశ్చర్యకరమైన ముగింపుల మధ్య బిగింపబడిన తొలి తెలుగు కథానిక, స్వర్ణాంబ. బి. గురజాడ కథల అనుశీలన, ఎం. ఫిల్ సిద్ధాంత గ్రంథం, పేజీ 41,శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి. (చెంగల్వ రామలక్ష్మి సిద్ధాంత గ్రంధం నుండి)
4. 'తక్కిన కథా శిల్పాలకన్నా ఈ కథ లోని శిల్పం సంకీర్ణ మైనది ఆ సంకీర్ణత ఐతిహాసిక శిల్పంలోని సంకీర్ణత 'చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం –గురజాడ తొలి కొత్త తెలుగు కథలు, అనంతపురం,1985, పేజీ 60.(చెంగల్వ రామలక్ష్మి సిద్ధాంత గ్రంధం నుండి)
5. తులసి, చాగంటి –మెటిల్డా గురజాడ బహుముఖ ప్రజ్ఞా దీపిక –వసి వాడని సాహిత్యం గురజాడ కథా మంజరి, ఎమెస్కో ప్రచురణ, విజయవాడ, హైదరాబాద్ 2022.

## ఉపయుక్త రచనలు :


1. లేఖలు –గురజాడ అప్పారావు –సంకలితము –అవసరాల సూర్యారావు, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ 1958.
2. గురజాడ రచనలు–కథానికలు–విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ 2018
3. వసి వాడని సాహిత్యం గురజాడ కథా మంజరి, ఎమెస్కో ప్రచురణ, విజయవాడ, హైదరాబాద్ 2022.
4. రామలక్ష్మి, చెంగల్వ –గురజాడ అప్పారావు రచనలు : భాషా సాహిత్య సామాజికాంశాల పరస్పర సంబంధం –పీహెచ్ డి సిద్ధాంత గ్రంథం– శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి 1990.

# గురజాడ గ్రాంథిక ప్రయోగాలు



డాక్టర్ డి.చంద్రశేఖర రెడ్డి
✆ 98661 95673

తెలుగువారి సమాజచరిత్ర ఆధునిక యుగారంభంలో నవయుగ వైతాళికులు కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి. ఈ ముగ్గురు మహనీయులు తెలుగువారి జీవితాలను ఎంతో ప్రభావితం చేశారు. ముగ్గురూ అసమాన ప్రతిభావంతులు. ముగ్గురి రంగాలూ భిన్నంగా కన్పించినప్పటికీ వారి కృషి ఏకోన్ముఖంగా సాగింది.

కందుకూరి వీరేశలింగం తక్కిన ఇద్దరి కంటే వయస్సుల్లో పెద్దవాడు. ఆయన పేరు చెప్పగానే సంఘసంస్కరణే స్ఫురిస్తుంది. అది ఆయన ప్రధాన కార్యరంగం. ఆయన విస్తృతమైన సాహిత్యాన్ని సృజించాడు. ఆయన సాహిత్యమంతా సంఘసంస్కరణకు సాధనం మాత్రమే. ఆయనది సంఘసంస్కరణ దృష్టి. తక్కినదంతా దాన్ని బలపరిచేది. ఇది కాక ఆయన సృజించిన సాహిత్యం గణనీయంగానే ఉన్నప్పటికీ కందుకూరి – సంఘసంస్కరణ అన్నవి అవిభాజ్యాలుగా మారాయి.

వయస్సులో ముగ్గురిలో చిన్నవాడు గిడుగు రామమూర్తి. గిడుగు అనగానే వ్యావహారిక భాషావాదం స్ఫురిస్తుంది. ఆయనను వ్యావహారిక భాషోద్యమ పితామహుడుగా భావిస్తారు. మూడు దశాబ్దాలకు పైగా వ్యావహారిక భాషోద్యమానికి ఆయన అంకితమైపోయాడు. ఆయన ప్రసంగాలు, చర్చలు, రచనలు అన్నీ ఈ దిశగానే సాగాయి.





గురజాడ అప్పారావు కందుకూరి కంటే పధ్నాలుగేళ్లు చిన్నవాడు, గిడుగు కంటే కొన్ని నెలలు పెద్దవాడు. గిడుగు రామమూర్తికి సన్నిహిత మిత్రుడు. సంఘసంస్కరణవాది, గొప్ప రచయిత, వ్యావహారిక భాషావాది. మూడు రంగాలలోను కార్యశీలి. నిజానికి ఆనాటి తెలుగు సమాజంలో ఇంతటి మేధాసంపన్నుడు మరొకరు లేదు.

కందుకూరి సంస్కర్త. బహుశా సంఘసంస్కరణకే తన జీవితాన్ని అంకితం చేసినందున కందుకూరి సంస్కరణకు ప్రతీక అయ్యాడు. అట్లాగే వ్యావహారిక భాషోద్యమానికి గిడుగు ప్రతీక అయ్యాడు.

గురజాడ ఈ ఇద్దరి లక్షణాలతో పాటు మహాకవిగా, నాటకకర్తగా అసాధారణ ప్రతిభ చూపించాడు. కందుకూరి లాగానే గురజాడ కూడా సంస్కర్త. కాని కందుకూరికీ గురజాడకూ సంఘసంస్కరణ విషయంలో ఒక భేదం ఉంది. కందుకూరి వీర సంస్కరణవాది. సాంఘిక దురాచారాల పట్ల ఆయనకు తీవ్రమైన అసహనం. ఆ విషయంలో ఆయనలో ఎటువంటి మెతక వైఖరీ లేదు. దురాచారాలకు కారణాలు కాని, వాటికి పాల్పడినవారి బలహీనతలు, అనవగాహనలు కాని ఆయనకు పట్టవు. ఎటువంటి సానుభూతీ ఉండదు. కాని గురజాడ గొప్పమనిషి. హృదయవాది. క్షమాగుణం కలిగినవాడు. దురాచారాల పట్ల తిరస్కారమే తప్ప వ్యక్తుల పట్ల అంత అసహనం లేదు. బలహీనతలను అర్థం చేసికోగలిగినవాడు. మనుషుల హృదయాలలో పరివర్తనను కోరుకున్నవాడు. విమర్శించినా, హేళన చేసినా పరివర్తన తేవడానికే. దురాచారాలకు బలి అయిన వారి పట్ల గురజాడకు గొప్ప సానుభూతి. వారి బాధ ఆయన బాధ.

ఇక వ్యావహారిక భాషావాదానికి వస్తే గిడుగు, గురజాడలు కలిసే ముందుకు నడిచారు. ఇక్కడ వీరిద్దరికీ ఉన్న ప్రధానభేదం గురజాడ సృజనాత్మక రచయిత కావడం, గిడుగు కాకపోవడం. వ్యావహారిక భాష విషయంలో ఇద్దరి అభిప్రాయాలూ సమానమే. ఇద్దరి వాదాలూ సమానమే. గురజాడ మరణించే వరకు ఇద్దరూ కలిసే నడిచారు. గురజాడ తర్వాత గిడుగు

మరో పాతికేళ్లు జీవించడం వల్ల వ్యావహారిక భాషోద్యమానికి ఆయనొక్కడే నాయకుడుగా మిగిలిపోయాడు. తన జీవితకాలంలో కూడా గురజాడ సంస్థానం పనుల్లోనూ, సంస్థానానికి సంబంధించిన కోర్టు కేసుల్లోనూ మగ్నమై ఉన్నాడు. ఇది కూడా గురజాడ భాషాసాహిత్య కృషికి కొంత అవరోధమే. ఈ అన్ని కార్యకలాపాలతో, అనారోగ్యంతో గురజాడ చేసిన సమాజ, భాష, సాహిత్య సేవ – ఆయన జీవితకాలాన్ని కూడా పరిగణనలోనికి తీసికొంటే అల్పపరిమాణమైనదేమీ కాదు, ఇక ప్రమాణాని కొస్తే అది అత్యున్నతమనే చెప్పవలసి ఉంటుంది.

**వాస్తవానికి గ్రాంథిక భాష వ్యావహారిక భాష నుండి ఏర్పడే రూపమే. వ్యావహారికం జనవ్యవహారంలో ఉంటుంది. గ్రాంథికం గ్రంథాలలో ఉంటుంది.**

గ్రాంథిక వ్యావహారిక భాషావాదాల చరిత్ర తెలిపే ప్రత్యేక గ్రంథాలే ఉన్నాయి. ఈ వివాదంలో ఏది గ్రాంథిక భాష, ఏది గ్రామ్యం అనే చర్చ ఒక వైపు, ఎవరిది సరైన గ్రాంథికం అన్నది మరో వైపు సాగింది. వాస్తవానికి గ్రాంథిక భాష వ్యావహారిక భాష నుండి ఏర్పడే రూపమే. వ్యావహారికం జనవ్యవహారంలో ఉంటుంది. గ్రాంథికం గ్రంథాలలో ఉంటుంది. ఈ రెండింటికీ మధ్య చాలా దూరం ఏర్పడినప్పుడు, కాలక్రమంలో భాషావసరాలు మారినప్పుడు, రచనా భాషలోనూ మార్పు రావడం సహజం. ఒకవైపు కావ్యరచనల వంటి పండిత సాహిత్యం గ్రాంథికరూపాన్ని అనుసరిస్తూ ఉంటే, మరోవైపు సామాన్యుల కోసం చేసే రచనలు వ్యావహారిక రూపాన్ని అనుసరిస్తాయి.

అసలు సమస్య విద్యార్థులు చదువుకొనే, రాసే భాష. తెలుగు బోధనా మాధ్యమంగా పూర్వం లేదు. యూరోపియన్లు తమ పరిపాలనావసరాల కోసం నేర్చుకొనే తెలుగు గ్రాంథికమయితే వారికి ప్రయోజనం చేకూరదు. జనసంపర్కంలో వారు భాష ఉపయోగించాలి కాబట్టి వాడుక భాషే వారికి అవసరం. అందువల్ల వారు భాష నేర్చుకోవడానికి ఉపయోగించే వాచకాలు, వ్యాకరణాలు, నిఘంటువులు వాడుక భాషలోకి, లేదా దానికి దగ్గరగా వచ్చాయి.

పాఠశాల వ్యవస్థ జనసామాన్యానికి అందుబాటులోకి వచ్చినప్పుడు

పాఠశాల వాచకాలు, పిల్లలు వ్యాసాలు రాసే భాష విషయం చర్చకు వచ్చింది. అప్పటికే యురోపియన్లు తెలుగు నేర్చుకోవడానికి వాచకాలు వగైరా అర్ధగ్రాంథికం, వ్యావహారికాలలో వచ్చాయి. విద్యావిధానం సార్వజనిక విద్యావిధానమయ్యేటప్పటికి పాఠశాల వాచకాలు, విద్యార్థుల రచనా భాష చర్చలోకి వచ్చాయి.

వ్యావహారిక భాషావాదానికి గురజాడ కృషి రెండు విధాలుగా సాగింది. ఒకటి సైద్ధాంతికమయితే, రెండవది ఆచరాణాత్మకం.

**వ్యావహారిక భాషావాదానికి గురజాడ కృషి రెండు విధాలుగా సాగింది. ఒకటి సైద్ధాంతికమయితే, రెండవది ఆచరాణాత్మకం.**

వ్యావహారిక భాషకు లక్షణమూ, లక్ష్యమూ కూడా ఆయన అందించాడు. గిడుగు వ్యావహారిక భాషావాదానికి ఉద్యమరూపం ఇచ్చిన తర్వాత ఆయన వాదాన్ని సమర్థిస్తూ గురజాడ 'గ్రామ్య శబ్ద విచారణ', 'వాడుక భాష – గ్రామ్యము' అనే రెండు వ్యాసాలు రాశాడు.

మద్రాసు విశ్వవిద్యాలయం కాంపోజిషన్ కమిటీ అనే ఒక సంఘాన్ని నియమించింది. గ్రాంథిక వాదులు మెజారిటీలో ఉన్న ఈ సంఘంలో గురజాడ సభ్యుడు. ఈ సంఘం గ్రాంథిక భాష పక్షాన తీర్మానం చేయగా గురజాడ తన అసమ్మతిని తెలుపుతూ 'The minute of dissent to the report of the Telugu composition Subcommittee" అన్న సుదీర్ఘవ్యాసం రాశాడు. దీన్ని వ్యాసం అనడం కంటే ఒక సిద్ధాంత గ్రంథం అనడం సమంజసం. గురజాడ పరిశోధనకూ, వాదపటిమకూ ఇది ఉదాహరణగా నిలుస్తుంది. ఈ అసమ్మతి పత్రం గురజాడ జీవితకాలం చివరిదశలో వచ్చింది.

గురజాడ వ్యావహారిక వాదానికి చేకూర్చిన బలం తన సృజనాత్మక రచనల ద్వారా. దాదాపుగా సృజనాత్మక సాహిత్యం గురజాడ అడుగుజాడలను అనుసరించిందనవచ్చు. అంతకు ముందు వాడుక భాషలోనూ, వాడుకభాషకు దగ్గరి రూపంలోనూ రచనలున్నప్పటికీ, వాడుక భాషను సమర్థించేవారు కూడా ఉన్నప్పటికీ, నాటకాలలో పాత్రోచిత భాష పేరిట 'నీచ' పాత్రలకు 'గ్రామ్య' భాషను వాడినప్పటికీ మొదటిగా ఉత్కృష్ట సాహిత్య రచనలను వ్యావహారిక భాషలో వెలువరించిన వాడు నిస్సందేహంగా గురజాడే.

తన కంటే ముందు ఎంత వాడుక భాషా సంప్రదాయమున్నప్పటికీ గ్రాంథిక భాషా సంప్రదాయంలో పుట్టిపెరిగి, ఆ రచనలే చదివి రచయితలైన వారు ఆ గ్రాంథిక ప్రభావాన్ని పూర్తిగా వదిలించుకోవడం దుష్కరమే. గ్రాంథికరూపాలు వారి నిత్య వ్యవహారంలోనూ జీర్ణించుకుపోయి ఉంటాయి. వాడుక భాషలోనూ అవి వచ్చి చేరుతూ ఉంటాయి. పదజాలం అంతా అదే కాబట్టి కొన్నిసార్లు ఒక పదరూపం గ్రాంథికమో, వ్యావహారికమో గుర్తించడం కూడా కష్టమే. గురజాడ తర్వాత ఒక శతాబ్దం పైగా గడిచినా ఇప్పటి రచయితలు, ఉపన్యాసకులు కూడా గ్రాంథిక ప్రభావం నుంచి బయట పడలేదు. కావున, మరియు, యొక్క వంటి ప్రయోగాలు విస్తారంగానే కనిపిస్తున్నాయి. గురజాడ సమకాలంలో గిడుగు కూడా దీనికి అపవాదమేమీ కాదు.

గ్రాంథిక ప్రయోగాలు పద్యానికీ, వచనానికీ కొంత భిన్నంగా ఉంటాయి. నేటికీ పద్యసాహిత్యం గ్రాంథికంలోనే ఉంటున్నది.

గ్రాంథిక ప్రయోగాలు పద్యానికీ, వచనానికీ కొంత భిన్నంగా ఉంటాయి. నేటికీ పద్యసాహిత్యం గ్రాంథికంలోనే ఉంటున్నది. ఎక్కడయినా వ్యావహారిక ప్రయోగాలు దొర్లవచ్చు, విసంధి రూపాలు కనిపించవచ్చు, అరసున్నలూ, బండి 'ఱ'లు కనిపించకపోవచ్చు, కాని మొత్తంగా పద్యరచనలు ప్రయోగంగా వాడుక భాషలో రాసినవి తప్ప అన్నీ గ్రాంథికంలోనే ఉంటున్నాయి.

గేయ రచనలలోనూ గ్రాంథిక వ్యావహారిక మిశ్ర రచన సర్వసాధారణమే. సినిమా పాటల్లో కూడా ఈ ధోరణి కనిపిస్తూనే ఉంటుంది. వచన కవిత్వంలో గ్రాంథిక ప్రయోగాలు అంత తరచు కాదు. శుద్ధ వచనరచనల్లో ప్రస్తుత కాలంలో స్థూలంగా వాడుక భాషే కనిపిస్తుంది. గ్రాంథిక ప్రయోగాలు అరుదుగా కనిపిస్తాయి.

గురజాడ రచనల్లో – ఆయనెంత వ్యావహారికవాది అయినా – గ్రాంథిక రూపాలెంత వరకు కనిపిస్తాయో స్థాలీపులాక న్యాయంగా చర్చించడం ఈ వ్యాసలక్ష్యం.

గురజాడవారి పద్యకృతులన్నీ గ్రాంథికంలోనే ఉన్నాయి. వాటిని ప్రత్యేకంగా పరిశీలించవలసిన అవసరంలేదు.

'ముత్యాల సరములు'లో తెల్లవారెను, కదలబారెను, పలుక సాగెను, కూసెను, చూసెను, వీచెను, ఉంటిని, వ్రేలుచున్, అరసితిన్, ఉబ్బెదున్ వంటి గ్రాంథిక క్రియారూపాలున్నాయి. మందుట, మార్చుట వంటి భావార్థక క్రియారూపాలు వాడాడు.

> దిద్దుబాటు లో రచయిత కథనం గ్రాంథికంలోను, సంభాషణలు పాత్రోచిత వ్యావహారికంలోనూ ఉంటాయి.

క్రొమ్మెరుంగులు జిమ్మగా, నీటను గ్రుంకెచుక్కలు వంటి సరళాదేశ సంధులూ కనిపిస్తాయి, సరళాదేశరహితంగానూ కనిపిస్తాయి. పోయి యచ్చుట, డబ్బదెనుబదియేండ్ల కొకతరి వంటి యడాగమాలూ ఉన్నాయి: పదాదిలో అచ్చుబదులు యకారరూపాలూ కనిపిస్తాయి, యెల్లలోకము వొక్కయిల్లై వంటివి. పలుకక యుండు, ఇంతయగునని వంటివి సర్వసాధారణం. నలువనేరిమి కంతు యిది యన వంటి చోట్ల ఉత్వం మీద సంధి జరగక యడాగమం రావడం వింతే కాని, గురజాడ తాల వ్యాచ్చులతో మొదలయ్యే పదాలు చాలావరకు యకారంతోనే వాడడం వల్ల ఇటువంటి ప్రయోగాలు. దూర బంధువు యితడు, మెట్టు యిది మొదలైనవెన్నో. వీటిలో ఆయన పదరూపాన్నే యితడు, యిది అని తీసికొన్నాడనీ, ఇక్కడ యడాగమం కాదనీ అర్థం చేసికోవాలి.

సమాపక క్రియారూపాలు భూత, వర్తమాన, భవిష్యత్తద్ధర్మాలు గ్రాంథిక రూపాలే విరివిగా కనిపిస్తాయి.

కావుత, కాంచుత వంటి గ్రాంథిక ఆశీరర్థకాలు కూడా కనిపిస్తాయి.

ఇక గురజాడ కథానికలను చూద్దాం.

'దిద్దుబాటు'లో రచయిత కథనం గ్రాంథికంలోను, సంభాషణలు పాత్రోచిత వ్యావహారికంలోనూ ఉంటాయి. కథానాయకుడి సంభాషణల్లో కొంచెం గ్రాంథిక ధోరణి ఉంటుంది. 'మతము: విమతము' లేదా 'పెద్దమసీదు' కథలో కూడా రచయిత కథనం గ్రాంథికంలో పాత్రలు తమకుచితమైన వ్యావహారికంలో మాట్లాడతాయి.

మెటిల్డా కథ ఒక పాత్ర చెప్పేకథ. మొత్తం వ్యావహారికమే. గురజాడ కథలన్నిటిలోనూ పెద్దది 'మీపేరేమిటి?' కథంతా వ్యావహారికంలోనే సాగింది.

కలదు, కలవు వంటి రెండు మూడు గ్రాంథిక ప్రయోగాలు, సంభాషణల్లో ఒకటి రెండు వాక్యాలలోనూ గ్రాంథిక ఛాయలున్నాయి.

గురజాడ వ్యాసాలన్నీ వ్యావహారికంలోనే ఉన్నాయి. అక్కడక్కడా గ్రాంథిక క్రియలు కనిపిస్తూ ఉంటాయి. ఉదా: 'ఆంధ్ర కవితాపిత–2'లో కనబడుచున్నారు, ఎరిగి యుంటిని, వ్రాయబడియున్నవి వంటి ప్రయోగాలు చూడవచ్చు. 'ముత్యాల సరాల లక్షణము'లో నేను చదివితిని, ముప్పు వచ్చుచున్నది వంటివి.

గురజాడ నాటకాలు. ఆయన వాడుక భాషలోనే రాశాడు. పాత్రోచితభాషను ప్రయోగించాడు.

ఇక గురజాడ నాటకాలు. ఆయన వాడుక భాషలోనే రాశాడు. పాత్రోచితభాషను ప్రయోగించాడు. కాబట్టి భాషాపరమైన వైవిధ్యం స్పష్టం. ఎక్కడయినా గ్రాంథిక ప్రయోగాలు దొర్లినా ఆ పాత్రల సంస్కారంగా గుర్తించాల్సి ఉంటుంది. అయితే నాటకంలో నాటకకర్త చేసే సూచనలుంటాయి. తక్కినదంతా పాత్రల భాషణే. 'కన్యాశుల్కం' తొలి ప్రచురణ పీఠికలో గురజాడ తాను వాడుతున్న భాషాలక్షణాన్ని చెప్పుకున్నాడు. 'I clothed the play in the spoken dialect, not only that it is better intelligible to the stage-going public than the literary dialect, but also from a conviction that it is the proper comic diction for Telugu'.

'It has been remarked that the use of what is wrongly termed the vulgar tongue mars the dignity of a literary production, but that is a piece of criticism which one need not heed at the present day when the progress of the Science of Language has established better standards for judging the quality and usefulness of tongues than the whims of Grammarians of old linguistic strata.'

రెండవ కూర్పు పీఠికలో గురజాడ తెలుగు నాటకరంగ పరిస్థితులతో పాటు వ్యావహారిక భాషా ప్రాముఖ్యాన్ని కూడా చర్చించాడు.

'I cannot understand how modern writers fail to

see the merits of Spoken Telugu, its softness which elicited the admiration of foreigners, and its range of expression.'

బిల్హణీయం, కొండు భట్టీయం నాటకాల్లోనూ రచయిత సూచనలు కన్యాశుల్కం మలికూర్పునే అనుసరించాయి.

నాటకంలో రచయితకున్న అవకాశం పాత్రప్రవేశ సూచనాదులలోనే. కన్యాశుల్క నాటకంలో ఈ సూచనలు గ్రాంథికంలో ఉన్నాయి. కారణం ఊహించవలసిందే. తొలి మలి కూర్పుల్లో కొన్ని ఉదాహరణలు చూడండి: మొదటి అంకంలో:

| | |
|---|---|
| తొ.కూ. | వెంకటేశ్వర్లు ప్రవేశించుచున్నాడు. |
| మ. కూ. | వెంకటేశం ప్రవేశించును |
| తొ.కూ. | అని నిష్క్ర మించుచున్నాడు |
| మ.కూ. | వెంకటేశం నిష్క్రమించును |

ఈ సూచనల్లో ఎక్కువ భాగం తొలిప్రతిలో వర్తమానంలో ఉంటే, మలిప్రతిలో భవిష్యత్తద్ధర్మంలో ఉన్నాయి.

బిల్హణీయం, కొండు భట్టీయం నాటకాల్లోనూ రచయిత సూచనలు కన్యాశుల్కం మలికూర్పునే అనుసరించాయి.

వాస్తవానికి నాటకాలలో ఈ సూచనల భాగం గ్రాంథికంలో (కనీసం క్రియాపదాలు) ఎందుకుండాలో అర్థం కాదు. గురజాడ జీవితకాలంలోనే అచ్చయ్యాయి కాబట్టి తరువాతి కాలంలో ప్రదర్శకులు చేర్చినవి అనుకోవడానికి వీల్లేదు. దానికి ప్రత్యేక ప్రయోజనమేమీ లేదు. కనీసం నా ఊహకందే కారణమేదీ కనిపించదు. కాకపోతే కొన్ని కథల్లో రచయిత కథనం దీనికి ఆదర్శమేమో!

గేయాలలో పదరూపాలలోనూ కొన్ని గ్రాంథిక ప్రమోగాలు కనిపిస్తాయి. వ్రేలు, ప్రాత, ప్రాలు, క్రుంకు, మ్రోగు, క్రాగు మొదలైనవి పదాది సంయుక్తంలో రేఫ ఉన్నరూపాలు. వీటిలో చాలా వాటిలో రేఫ లోపిస్తుంది, వ్రాత, వ్రాలు వంటి వాటిలో వకారం లోపిస్తుంది. కవిత్వంలో ప్రాచీన రూపాలు కొనసాగడం

రేఫకు గాని, వకారానికి గాని లోపం రాకపోవడం సాధారణమే. కొన్ని పదాలు ఉదా: ప్రమందు వంటివి. వీటిలో ఏ హల్లూ లోపించడానికి వీల్లేదు. పదమే గ్రాంథికమని వదిలి పర్యాయపదాన్ని వాడవలసి వస్తుంది.

ఆయా కాలాల రచయితల రచనలను ముఖ్యంగా కవిత్వ రచనలను పరిశీలిస్తే గురజాడలో విరళంగా కనిపించే ఈ గ్రాంథిక రూపాలు ఎంతో ప్రచురంగానూ కన్పిస్తాయి.

ముందే చెప్పుకున్నట్లు పారంపరిక భాషాప్రయోగంలో బహురూపత సాధారణమే. మార్పు రాకపోవడం, మార్పువచ్చిన రూపంతో పాటు, రాని రూపమూ వాడుకలో ఉండడం, పాతరూపం పూర్తిగా తొలగిపోయి మారిన రూపమే వాడుకలో ఉండడమనే మూడు దశలూ ఉంటాయి. గురజాడ కాలం సంధికాలం. అన్ని రకాల రూపాలూ ఉంటాయి. గురజాడ కృషి స్పృహతో కూడుకున్నది. తానేమి రాస్తున్నాడో దాని స్పృహ, చైతన్యం ఆయనకుంది.

ఈ వ్యాసంలో చూపించిన ప్రయోగాలు ఆయన సమకాలంలోనూ, అనంతర కాలంలోనూ ఎందరో రచయితలలో కనిపించేవే. ఆయా కాలాల రచయితల రచనలను ముఖ్యంగా కవిత్వ రచనలను పరిశీలిస్తే గురజాడలో విరళంగా కనిపించే ఈ గ్రాంథిక రూపాలు ఎంతో ప్రచురంగానూ కన్పిస్తాయి. ముందే చెప్పినట్లు పద్యకవిత్వరూపం మాండలిక పదాలు అక్కడక్కడా, ప్రాచీన వ్యాకరణ లక్షణాలను ఉల్లంఘించిన రూపాలు – ముఖ్యంగా సంధి, సమాసాది ప్రక్రియలలో – స్థూలంగా కనిపించినప్పటికీ, గత వెయ్యేళ్లలో పెద్దగా మారలేదు. వర్తమానంలోనూ అదే రీతిలో కొనసాగుతూ ఉంది. భవిష్యత్తులో మరికొంత కాలమూ అలాగే కొనసాగవచ్చు.

గురజాడ మేధావి (intellectual) అనీ, తెలుగు సాహిత్యాన్ని ఆధునికత వైపు మళ్లించిన వైతాళికులలో మొదట పేర్కొనదగినవాడనీ, తరువాతి రచయితలకు భాషా విషయంలో మార్గదర్శకుడు కావడమేకాక, వ్యావహారిక భాషోద్యమానికి వెన్నెముకగా నిలిచిన వాడనీ మరోసారి ఉద్ఘాటిస్తూ ఈ వ్యాసం ముగిస్తున్నాను.

# తెలుగుజాడ గురజాడ



ఆచార్య అయినవోలు ఉషా దేవి
✆ 85005 24879



ఆధునిక తెలుగు సాహిత్య వికాసంలో గురజాడను వేగుచుక్క అనీ, దార్శనికుడు అనీ ఎందరో సాహితీవేత్తలు గుర్తించారు. తన ఏభై మూడు సంవత్సరాల తన జీవిత కాలంలో, ఎన్నో వత్తిడులు ఎదుర్కొన్నప్పటికీ, రచనా రంగంలో విడవకుండా కొత్త కొత్తగా అనేక అంశాలపై, అనేక రకాల ప్రక్రియల్లో, అనేక విధాలైన భాషా రూపాలలో తెలుగు, ఆంగ్ల భాషల్లో (సుమారు ముప్పై ఏళ్ళ పైచిలుకు) రాశారు. ఆయన రచనలపైనా, దృక్పథాల పైనా గత నూరేళ్ళకు పైగా వచ్చిన సాహిత్య చర్చను క్రోడీకరించడం ఎంతో కష్టం. ఎందుకంటే అంత పెద్ద ఎత్తున ఆయన గురించీ, ఆయన సాహిత్యం గురించీ అనేక రకాల చర్చలూ, విశ్లేషణలూ జరిగాయి. కానీ ఆయన రచనల్లోని భాషను గురించి ఏవో కొన్ని వ్యాఖ్యలు తప్ప ఒక స్పష్టమైన అవగాహన ఏర్పడేలా విశ్లేషించిన వారు తక్కువ. ఈ వ్యాసం ఆయన తన రచనల్లోవాడిన భాషనూ, ఆయన భాషా దృక్పథాన్ని వివరించి, విశ్లేషించే ప్రయత్నం చేస్తుంది. ఈ క్రమంలో తెలుగు భాష పరిణామ నేపథ్యం గురించి క్లుప్తంగా తెలుసుకోవడం అవసరం.

### తెలుగు భాష పరిణామం: నేపథ్యం

ఏ కవి, రచయిత అయినా, తన రచనల్లో ఉపయోగించే భాష తాను ఎంపిక చేసుకున్న వస్తువుకు అనుగుణంగా ఉండే విధం గానే ఎంపిక చేసుకుంటాడు. ఎందుకంటే సమాజంలో వాడుకలో ఉన్న ప్రతి భాషా కూడా ఒకే మూస విధానంలో ఉండకుండా, అందులోని మనుషులు, గుంపుల వలెనే ఎన్నో

రకాల వైవిధ్యాలతో కూడుకుని ఉంటుంది. అనేక సంవత్సరాలుగా వ్యాకర్తలూ, భాషా శాస్త్ర వేత్తలు, సాహితీ వేత్తలూ ఈ విషయం గుర్తించారు. మాట్లాడే భాషల్లో ఉండే ప్రాంతీయ (భౌగోళిక) భేదాలూ, సామాజిక/ సాంఘిక/వర్గ భేదాలూ, వైయక్తిక భేదాలు ఉన్నాయన్న విషయాన్ని శాస్త్రీయంగా గుర్తించి, అధ్యయనం చేసిన ఎందరో ఆధునిక భాషా శాస్త్ర వేత్తలు వాటన్నింటినీ విశ్లేషించి ఎన్నోగ్రంథాలు రాశారు. వారందరిలోకీ మనకు తెలిసినంతలో ఆద్యుడని చెప్ప దగ్గ వ్యాకర్త సంస్కృత భాషకు "అష్టాధ్యాయి" అనే మహా సూత్ర వ్యాకరణం రాసిన పాణినిగా పండితులు గుర్తించారు.

రచయితలు, వ్యవహర్తలు, కవులు వాడే ఈ భాషా వైవిధ్యాల గురించి తెలుగు భాషకు సంబంధించినంత వరకూ గుర్తించిన మొదటి వ్యాకర్త 13 వ శతాబ్దానికి చెందిన మూలఘటిక కేతన. ఆయన తన ఆంధ్ర భాషా భూషణము అనే వ్యాకరణ గ్రంథంలో మూడు ప్రధాన తెలుగు భేదాలను వివిధ సందర్భాలలో ప్రస్తావించారు: (i) కవులు రాసే కావ్య భాష (పద్యాలు 62, 65, 160) (ii) అందరూ వాడే భాష ( పద్యాలు 64, 161), (iii) వాడకూడని/ తెగిడే చోట వాడే గ్రామ్య భాష (26,27) అని చెప్పి వీటికి ఉదాహరణలు కూడా ఆయన ఆయా చోట్ల ఇచ్చారు (ఉషా దేవి, 2009 & 2014). ఆయన తర్వాత అనేక మంది వ్యాకరణ, అలంకార శాస్త్ర వేత్తలు కూడా ఈ వైవిధ్యాలను గురించి రాసారు. అన్నింటిలోకి ఆధునికంగా చాలా ప్రాచుర్యం పొందిన బాల వ్యాకరణంలో కూడా పరవస్తు చిన్నయ సూరి వీటిని వివరిస్తూ కేవలం తన వ్యాకరణంలో సూత్రీకరించిన విధంగానే రచనా భాష ఉండాలన్న భావన కల్పించి, నిర్దేశించారు. భాష పట్ల అనేక మంది పాశ్చాత్యుల వ్యాకరణ నిఘంటు రచనల నేపథ్యం, వాటిలో వాళ్ళు గుర్తించి ప్రతిపాదించిన వ్యవహార రూపమే, మారిన కాల పరిస్థితులకు సరి అయినదన్న వాదాన్ని ఈయన పరోక్షంగా ప్రతిపాదించి వ్యాకరణాన్ని(లక్షణం), నీతి చంద్రికనూ (లక్ష్యం) రాశారు. తెలుగు నేర్చుకున్న అనేక మంది పాశ్చాత్యులు వారు గమనించిన తెలుగు భాషలో సాహిత్య భాషకూ, అంటే తమకు పండితులు నేర్పే భాషకూ, ప్రజలు వివిధ ప్రాంతాలలో మాట్లాడే భాషకూ మధ్య తేడాలను, అంతరాలనూ గమనించి తమ వ్యాకరణ, నిఘంటువులలో వాటిని వివరించి చూపారు. వాడుక లేదా వ్యావహారిక భాష లోనే ప్రజలకు విద్య, పరిపాలన, న్యాయం అందించాలనే వాదాలతో పాశ్చాత్యుల (విలియం బ్రౌన్ 1818, ఏ. డి. కాంప్బెల్ 1821, సి. పి. బ్రౌన్ 1853/56 మొదలైన వారు) రచనలు

ప్రాచుర్యం పొందుతున్న దశలో వచ్చిన పరవస్తు చిన్నయ సూరి బాల వ్యాకరణం ప్రభావం తెలుగు భాషా వేత్తలను, పండితులను రెండు వర్గాలుగా విభజించింది. దాంతో కొందరు సాహితీ వేత్తలు గ్రాంథిక భాషా వాదులుగానూ, మరి కొందరు భాషా సాహితీ వేత్తలు వ్యవహార భాషా వాదులుగానూ భాషను గురించి పెద్దఎత్తున చర్చించి రాసిన వ్యాసాలు, పుస్తకాలలో ఎన్నో వాదోప వాదాలు, దూషణ భూషణలు చెలరేగాయి (రాధాకృష్ణ 1973).

ఆధునికతకు ముఖ్యమైనవని గుర్తించిన మూడింటిలో విద్య విషయంలో గెలుపు సాధించి విద్యావ్యవస్థపై ఆధిపత్యం సంపాదించుకున్న గ్రాంథిక వాదాన్ని నిరసిస్తూ గురజాడ ఆంగ్లం లో 'Dissent note' ( అసమ్మతి పత్రం) రాసినప్పటికీ అప్పటి ప్రభుత్వాలు విద్యా రంగంలో వ్యవహార భాష అమలు గురించి ఏ చర్యలూ కూడామరికొన్ని దశాబ్దాల వరకూ చేపట్టలేక పోవడం వల్ల విద్యారంగం పై 1960ల వరకూ గ్రాంథిక వాద ఆధిపత్యమే చెల్లింది.

ఈ వాదాలలో వ్యవహార వాదం సమర్థిస్తూ గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులు గార్లు అనేక రచనలు చేసారు. తమ తమ అధ్యయనాల నేపథ్యంలో శాస్త్రీయవిధానంగా అనేక దేశాలలో అమలవుతున్నవాడుక భాషా విధానాన్ని గుర్తించి, వ్యవహార భాషా వాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ఇరువురూ ఎంతో కృషి చేశారు. కానీ ఇద్దరిలో గురజాడ తెలుగును విభిన్న సృజనాత్మక అంశాలలో ఏ యే సందర్భాలలో ఎంత వైవిధ్య భరితంగా నిత్య జీవితానికి, సహజత్వానికి ఎంత దగ్గరగా ఉండేలా రాయవచ్చో తానే స్వయంగా రాసి దారి చూపారు. ఆ విధంగా వారిద్దరూ లక్ష్యం ఒకటే అయినా రెండు విభిన్న మార్గాలు ఎంచుకున్నారు.

తెలుగు భాషా పరిణామక్రమం పరిశీలిస్తే, తెలుగు వ్యవహార రూప వినియోగం ప్రాచీన కాలం లో ఎలాగైతే శాసనాలలోనూ, వ్యాఖ్యానాలలోనూ, కైఫీయత్తులలోనూ, ఉత్తరాలలో ఉన్నదన్న విషయమూ, కావ్యాలలోనూ, ఇతర గ్రంథ రచనల్లోనూ గ్రాంథికంలో ఉన్నసంగతీ గుర్తించి సోదాహరణంగా చూపించారు. అయితే 1850-1950 మధ్య కాలం లో కొందరు సరళ గ్రాంథికం అంటూనూ, శిష్ట వ్యావహారికం అంటూ రాసి కొత్తవైన 'మధ్యే' మార్గాలు చూపే ప్రయత్నాలు చేసారు. గురజాడ గారు కూడా ఈ మార్గం లో కొన్ని రచనలు చేసారు, కానీ తరువాతి కాలం లో సరళ, శిష్ట అనే మాటలు రెండూ వదిలి వాడుక/వ్యవహార భాష తెలుగు వారి జీవన వ్యవహారం నుండి

స్వీకరించారు. ఈ వ్యవహారభాష అనేది కూడా తెలుగు వాళ్లందరూ ఒకే రకంగా వాడరని గుర్తించి, ఆయా పాత్రల సామాజిక, ప్రాంతీయ నేపథ్యాల భాషనే సజీవం చేయడం వల్ల గురజాడ ఇతర అన్ని రచనలను మరిపించేంతగా కన్యాశుల్కం నాటకం ప్రథమ స్థానంలో, సాహిత్యం చదివే జనం లోనూ, నాటకం చూసే ( చదవని) జనం లోనూ నిలిచి పోయిందని చెప్పవచ్చు.

### ఆధునిక తెలుగు

పైన వివరించిన విధంగా, విద్యారంగం లో గ్రాంథిక వాదులది పైచేయి అయిపోవడంతో, గ్రాంథిక భాష చాలా సంవత్సరాలు విద్యా వ్యవస్థలో నిలిచి పోయింది, కానీ సామాజికంగా వార్తా పత్రికలలోనూ, సినిమాలలోనూ, ఆధునిక కవిత్వం,నవలలు, కథలూ వంటి అనేక సాహిత్య ప్రక్రియల్లోనూ వ్యవహార భాష అనేక రూపాలలో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఇవన్నీ వచన రూపాలు. అంటే, పద్యరచనా ప్రాధాన్యం తగ్గిపోయి, వచనంలో రాయడం అనే పరిణామం వల్ల వ్యవహార భాష వినియోగం తప్పనిసరి అయింది. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర అధ్యయనం చేసే వారందరూ వీటిని గుర్తించారు.

ఇట్లాంటి పరిస్థితుల్లో 1950ల తర్వాత తెలుగు భాషా చరిత్ర, పరిణామం, వాడుక, వినియోగాలపై పరిశోధనలు పెరిగాయి. ఈ విషయంలో సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీల కృషి చెప్పుకోదగ్గది. అందువల్ల తెలుగులోని ప్రాంతీయ ( భౌగోళిక) మాండలికాలు ( భద్రిరాజు కృష్ణమూర్తి , 1961), బూదరాజు రాధాకృష్ణ సంపాదకత్వం లో తెలుగు అకాడమీ వారు చేపట్టిన క్షేత్ర పర్యటనల వల్ల ( 1970 మొదలుకొని) ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ జిల్లాల వారీ భాషా బులెటిన్ల ఆధారంగా ప్రాంతీయ, సామాజిక భాషా భేదాల స్వరూప స్వభావాలు వెలుగులోకి వచ్చి తెలుగు భాషా వైవిధ్యాలు, వాటి లక్షణాలు చాలా మటుకు తెలియ వచ్చాయి.

### గురజాడ రచనలు, భాషా వైవిధ్యం

ప్రాంతీయ, సామాజిక భాషా భేదాల స్వరూప స్వభావాలు, తెలుగు భాషా వైవిధ్యాలు, వాటి లక్షణాలు గురజాడ తన రచనల ద్వారా తెలియచేశాడు. గురజాడ అప్పారావు గారికి తెలుగు భాష పై ఉన్న అవగాహనా తీరు తెన్నుల్ని అర్థం చేసుకోవటానికి పైన చెప్పిన చారిత్రక భాషా పరిణామ నేపథ్య పరిచయం

తప్పనిసరి. తెలుగు భాష లోని పైన చెప్పుకున్న వైవిధ్యాలన్నీ గురజాడ తన రచనల్లో ప్రయోగాత్మకంగా చూపించారు.

గురజాడ అప్పా రావు గారు ఆధునిక తెలుగు భాషా సాహిత్యాల పై ఎంతో కృషి చేసి తన ఆలోచనలతో, అవగాహనతో ఎంతో ముందు చూపు తో అధునాతన శాస్త్రీయ, మానవీయ దృక్పథాలను తరువాతి తరాల వారు ఆలోచించేలా, ముందుకు కొనసాగేలా అందించిన వారు. “అడుగు జాడ గురజాడ” అని కొనియాడబడ్డారంటే ఆయన వస్తువు, కథనం, శైలీ వంటివన్నీ సమాజం పైనా, సాహితీవేత్తల పైనా తనదైన ముద్ర వేసిందని అర్థం. వీటన్నింటికీ ఆలంబన, బాహ్య వ్యక్తీకరణ ఆ రచయిత, కవి వాడిన భాష. అనేక మంది సాహితీ వేత్తలు చారిత్రకంగా ఇంచుమించు గా నన్నయ నుండి చిన్నయ వరకూ ఒకే విధమైన భాషారూపాన్ని ఎక్కువగా వాడారు. కానీ గురజాడ రచనలన్నీ చదివితే వాటిలోని భాషా వైవిధ్యం తెలుస్తుంది.

గురజాడ సమగ్ర రచనల సంపుటి ‘గురుజాడలు (గోపాల కృష్ణ సం.2012) గ్రంథం ప్రకారం గురజాడ రచనా వ్యాసంగం మొదటి రెండు రచనలు – కుకూ( కుక్కూ) సారంగధర రెండూ ఆంగ్ల భాషలో రచించడంతో ప్రారంభమైంది ( 1882& 1883). 1892 లో మొదటి కన్యాశుల్కం (బహుశా చిత్తు ప్రతి) తయారై ప్రదర్శన కూడా జరిగింది. ఆ తర్వాత క్రమంగా ప్రకాశిక పత్రిక, కన్యాశుల్కం ముద్రణ (1897), కొండుభట్టీయం ( 1906), నీలగిరి పాటలు (1907), కన్యాశుల్కం మలి కూర్పు (1909), దిద్దుబాటు కథ ( 1910), బిల్హణీయం మొదటి భాగం 1910), మీ పేరేమిటి కథ (1910), ముత్యాలసరము గేయం, కాసులు, డామన్ పితియస్, లవణ రాజు కల అన్ని ఒకే సంవత్సరంలో ప్రచురితం అయ్యాయి (పైవన్నీ1910 లో). బిల్హణీయం ( రెండవ భాగం) (1911),కన్యక (1912), పూర్ణమ్మ ( 1912?), సుభద్ర (పద్య కావ్య రచన, 1913?), దేశభక్తి ( 1913), దించు లంగరు (1914), లంగరెత్తుము ( 1915?) అనేవి వరుసగా తర్వాత ప్రచురితం అయ్యాయి.

వీటిలో కన్యాశుల్కం పూర్తి నాటకమే కాక బాగా ప్రాచుర్యం పొంది అనేక ప్రదర్శనలతో బాటు అనేకానేక వ్యాసాలు, విమర్శలు, వ్యాఖ్యానాలు పొందిన, పొందుతున్న రచన. కొండుభట్టీయం ముందే రాసిన నాటకమైనా అది అసంపూర్ణం. మూడవ నాటకం బిల్హ ణీయం. గురజాడ తెలుగు జాడ

అనడం ఎందుకంటే ఆయన తెలుగులో వివిధ రకాల రచనలకు చూపిన మార్గం వల్ల. అంటే,ఆయన తెలుగు భాషా దృక్పథం తెలుసుకోవాలంటే మనం మొదట ఆయన తెలుగులో రాసినవన్నీ చదివి వాటిలో ఆయన వాడిన భాషను గుర్తించాలి. తర్వాత తెలుగు భాష గురించి ఆయన ఇంగ్లీషులోనూ తెలుగులోనూ వ్యక్తం చేసిన అభిప్రాయాలూ, ఆలోచనలూ గమనించాలి. అప్పుడే తెలుగు గురించిన గురజాడ జాడలు మనకు తెలిసి వస్తాయి.

**గురజాడ రచనల వర్గీకరణ:**

గురజాడ రచనలను భాషా వినియోగ రీత్యా ఈ కింది విధంగా వర్గీకరించవచ్చు.

i) ఇంగ్లీషులో రాసినవి ii) గ్రాంథికభాషలో రాసినవి. iii ) వ్యావహారిక భాషలో రాసినవి iv) సరళ గ్రాంథికంలో రాసినవి. ( సరళ గ్రాంథికం అనే మాట ఆ రోజుల్లో ప్రాచుర్యంలో ఉండేది. గురజాడ కొన్ని రచనలు అటు పూర్తి గ్రాంథికమూ, ఇటు వ్యావహారికమూ కాకుండా మధ్యే మార్గంగా కనిపిస్తాయి). ఈ వ్యాసంలో ఇంగ్లీష్ లో రాసిన రచనల గురించి చర్చించడంలేదు. గురజాడ తెలుగులో రాసిన వివిధ రచనలలోని భాషా లక్షణాలను గురించే ఈ వ్యాసం వివరిస్తుంది. ఆయా రచనలలోని భాష దృష్ట్యా గురజాడ రచనలను ఈ కింది విధంగా వర్గీకరించవచ్చు.

**ఇంగ్లీషులో రాసినవి:**

* Cuckoo (1882) (poem)
* Sarangadhara (1883) (poem)
* Songs of Blue Hills (1907) ( Translations of his own Telugu poems ' నీలగిరి పాటలు')
* Preface to Harishchandra play (1897)
* Preface to KanyaaSulkam (1909)
* Diaries
* My own Thoughts (pp. 827-984)
* Minute of Dissent

గ్రాంథిక తెలుగులో రాసినవి:

వ్యవహార భాషావాది అయిన గురజాడ గ్రాంథిక భాషలో కూడా రాశాడా అని ఆశ్చర్యం కలగవచ్చు కానీ గురజాడ కీర్తనల వంటి ఆరు నీలగిరి పాటలను, ఒక అసంపూర్ణ పద్యకావ్యాన్ని రాశారు. ఇవే కాక కింద ఉదహరించిన మరో కొన్ని పద్య రచనలు కూడా చేసారు.

నీలగిరి పాటలు(ఆరు పాటలు)

సుభద్ర (సంప్రదాయ కవితలు)

సమస్యాపూరణం

మాటల మబ్బులు

మెరుపులు

ఋత శతము

వీటిలోని భాష గురించి క్లుప్తంగా ఇక్కడ చూడవచ్చు.

నీలగిరి పాటలు చదివితే గురజాడకు మంచి సంగీత జ్ఞానం ఉందని తెలుస్తుంది. తన పాటలకు ఆయన రాగాలు, తాళాలు వివరించారు; అంతేగాక చక్కని ప్రాచీన గ్రాంథిక భాషలో రాయడం ఆశ్చర్యకరం.

మచ్చుకు ఒక ఉదాహరణ:

సుందరతరమీ నీల నగము – అంటే ఈ నీలి పర్వతం ఎంత అందంగా ఉందీ అని. బృందారక ముని బృంద సేవితము 'దేవతలు మునులతో సేవింప బడేది' అని. బృంద – బృంద అని ప్రాసాలంకారం కూడా వేశారు.

కావ్య భాషా పదాలు వ్యావహారికభాషకు భిన్నం గా ఉంటాయి; గురజాడ వాటిని చాలా సమర్థవంతంగా, సముచితంగా వాడారు.

గురజాడ కావ్య భాషా పదాలకు కొన్ని ఉదాహరణలు:

మొగుళులు, మచ్చెకంటులు (మత్స్య = మచ్చె – చేపలవంటి కళ్ళున్న వాళ్లు = స్త్రీలు), హ్రదము, కర్పూర తరువులు, ఇక్షధన్వుడు, లేమ(స్త్రీ), చిత్తరువు, పడతి మొదలైనవి.

## గురజాడ కావ్య భాషా క్రియలు:

వింటివె (విన్నావా), వీచెడు (వీస్తోంది), అయ్యెను (అయింది), బ్రోచుతన్ (రక్షించు గాక), చెబుదు, (చెప్తాను), ఉందును, వెల సెను, మెరయును, కొందు (కొంటా (ను)), పరువే(పరువా), ఈవు (నువ్వు), క్రొమ్మెరుంగులు, ఒడయుడు, గృంకె, చదల, కదలబారెను, పది నాళులు (పదినాళ్ళు). వేల్పులలనల కేలి వెలితొగ కరచి (నేర్చి), కరపిరి (నేర్పించారు), యోచించిరో, సరులు (పూలు).

సుభద్ర అనే కావ్యం మూడు భాగాలుగా 'మాటా మంతి' గ్రంథంలో 1939, ఏప్రిల్ లో ప్రచురితమైనది ("గురుజాడలు"). ఇది కూడా అసంపూర్ణ కావ్యం. సంప్రదాయ పద్య కావ్యాలలో వలెనే ఈ రచన ఆయా లక్షణాలనన్నింటినీ కలిగి ఉంది. ఇది చదివితే గురజాడ ఈ గ్రాంథిక భాషా పంథాలో ఇంత చక్కటి, చిక్కటి పద్యాలు రాయడం కూడా ఆయన భాషా పటుత్వాన్ని చూపుతూ మనల్ని ఆనందింప చేస్తాయి. భారతంలోని సుభద్ర పరిణయం, చేమకూరి వెంకటకవి రాసిన "విజయ విలాసం", తాళ్ళపాక తిమ్మక్క రాసిన "సుభద్రా కళ్యాణం" వంటివి గురజాడ తప్పకుండా చదివి ఇది రాసే స్ఫూర్తి పొంది ఉంటారు. ఎక్కువగా కంద పద్యాలు ఉన్న ఈ కావ్యంలో ఇతర పద్యాల్ని కూడా గురజాడ వాడారు. ప్రారంభ పద్యం రైవతక పండుగని సూచిస్తూ మొదలవుతుంది. మొత్తం కావ్యానికి కావ్యమే ఆయన గ్రాంథిక భాషా ప్రయోగ సామర్థ్యానికి అద్దం పడుతుంది. చేమకూరి శైలి వంటి ప్రయోగాలూ కనిపిస్తాయి.

'కంటిని మిము ధన్యుడనను

కొంటిని......'

కంటిని అంటే చూసాను/ కన్నాను అని క్రియార్థం కన్ను + ను అని నామార్థం ( అంటే కంటికి, కంటిని, కంటితో వలె) కాదు.

పెద్ద పెద్ద సమాస ప్రయోగం:

'...... వీనియట్టి నిస్తుల సదసద్వివేకనిధి సూనృతవాక్కుల నాభిరామ సల్లలిత శుభానుభావు విమలాత్ము విచక్షణను నిట్టి వాని...... '

"ఇతనిలాంటి వాణ్ణి చూడలేదు" (ఎరుగము) అంటూ అతని లక్షణాలను

అయిదు విశేషణాలతో వర్ణించాడు బలరాముడు తపసి వేషంలో ఉన్న అర్జునుడిని.

కావ్యాలలో మాత్రమే కనిపించే సంశ్లిష్ట సీస పద్య వాక్యం గురజాడ “సుభద్ర” లో ఇలా కనిపిస్తుంది:

“ఏడు లోకంబుల నేనలేని
విల్లుకాడెవ్వాడటన్న గవ్వడి యనంగ....’
అట్లాగే కావ్యాలలోనే వాడే పద/వాక్య మధ్య క్రియకు ఉదాహరణ:
‘జగదేక విరునకు నే
నగుదును దగ వీరపత్ని నని.....’

అంటే జగదేక వీరుడైన అర్జునునికి నేను సరియైన వీరపత్ని అవుతాను అని... అర్థం.

భాషా పరంగానూ, కథన చమత్కారాల పరంగానూ ఇది పాఠకులని విడువకుండా చదివిస్తుంది.

‘Subject for an Extravaganza’ అని ఒక కవితకి ఆంగ్లంలో పేరు పెట్టి కొంత పరిచయం ఆంగ్లంలో రాసినా, స్త్రీ పురుషులను “He and She” అని పేర్లు లేకుండా సర్వనామాలు వాడినా వారిద్దరి మధ్య జరిగిన సంభాషణలు మాత్రం గ్రాంథిక భాషలోనే, ఒకటి రెండు చోట్ల తప్ప, కొనసాగించారు.

“ He. చదలెల్ల వెదకెనే కొదమ చకోరము
కుదురైన రేవెల్గు కుదిపెనో యేమో”.

అని ప్రారంభ మైన ఈ కవితలో రెండేసి పాదాలు కానీ ఒక్కటిగా మాత్రమే ఉన్న పాదం కానీ ఉన్న సంభాషణలు ఈ కింది వాక్యాలతో ముగుస్తాయి.

“He. నా కాంత వీవైతే నా భాగ్యమెంత?

She. నీ కాంత నయ్యెద నిదే చూడు వింత”.

వీరిద్దరి ప్రశ్న – జవాబుల సంభాషణ చాలా ఆసక్తి కరంగా ఉంటుంది.

“పుష్పలావికలు” అనే ఖండిక శీర్షికే ఆశ్చర్యం కలిగిస్తుంది. లావికలు అంటే అమ్మే యువతులు. పుష్ప లావికలు అంటే పూలమ్మే అమ్మాయిలు.

పూలు కొనే మిషతో విటులు వాళ్ళతో సరసాలాడేవారని కవుల కల్పన. దీన్ని గురజాడ విషయ శీర్షిక చేసి పద్యాలు రాయడం ఆయనలోని భాషా చమత్కార ఆసక్తికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ పుష్పలావికలు లో మొత్తంతొమ్మిది పద్యాలున్నాయి. ప్రబంధ కావ్యాలలో పుర వర్ణన, వర్ణ వర్ణనల సందర్భాలలో ప్రబంధ కవులు ఈ పుష్పలావికలను వర్ణించే వారు. విజయ విలాసములో "వెలది నీదండ వెల యెంత......" వంటి పద్యాలను ఇవి గుర్తు చేస్తాయి. ఉదాహరణకి:

"నీ దండ చిక్కువడెనే
నా దండను చిక్కటన్న నగరే ప్రాజ్ఞుల్
నీ దండ నుంచికొనుమా
వాదుడుగు మటందు రచటి వనితలు విటులన్"

పై రెండు రచనలమీదా చేమకూర వేంకట కవి రచనా ప్రభావం కనిపిస్తుంది. దండ అంటే పువ్వు, దండ అంటే భుజం (జబ్బ, బాహువు) కూడా.

ఉంచుకొనుమా= నువ్వే ఉంచుకో
వాదు+ఉడుగుము =వాదుడుగుము 'వాదం మానేయి'

ప్రాచీనంలో తారు అంటే తాము అని అర్థం. అరపది (పదిలో సగం అయిదు అయిదుమోముల సామి) అంటే అయిదు ముఖాలు కలవాడు – పంచముఖుడు అయిన శివుడు. అతణ్ణి ఒక రెండు మూడు పూలే 'విరియగ' అంటే, పడిపోయేలా చేశాయి. ఎన్నో పూలు ధరించే విరిబోడులు విటులను పడేయడం ఏం వింత? అంటూ రాసిన పద్యం ప్రాచీన కవుల అలంకారిక భాషా శైలిని గుర్తు చేస్తుంది.

ఒక పద్యం లో జాతులు అనే పదానికున్న శ్లేషతో రెండు విభిన్న అర్థాలు స్ఫురింప జేశాడు. ప్రాచీన భాష పై ఎంతో పట్టు ఉంటే తప్ప ఇలా రాయడం సాధ్యమయ్యే విషయం కాదు.

"మాటల మబ్బులు" అనే కవితలో నాలుగు పద్యాలున్నాయి. మబ్బుల వెనుక దాగిన సూర్య చంద్రుల వలె అసలు స్వభావం వేరేగా ఉన్నా పైకి ఎలా ఉంటారో ఈ పద్యాల్లో వర్ణించారు. "మెరుపులు" శీర్షిక కింద ఉన్న ఖండికలో ఆరు పద్యాలలో వేమన పద్యాలను తలపించే పధ్యాలున్నాయి. ఇవన్నీ సంస్కృత శ్లోకాలకు తెనిగింపు అని అవసరాల సూర్యా రావు గారు గుర్తించారట. ఈ

ఖండికలో గురజాడ భాషలోని సూటిదనాన్నీ స్పష్టతనూ గమనించవచ్చు. కొన్ని మంచి లక్షణాలు చెప్పి ఇవి "రావు సుమీ యొకని వలన రావలె తన తోన్", అంటే స్వతహాగా రావాలే కానీ ఇంకొకరు చెప్పితే వచ్చేవి కావని అర్థం. అలాగే, "పికము దాని శిశువుల బెంచు నెగురు దాక నొరుచేన్" అనీ ""కాశి జచ్చె నేని కలుగదు జన్మంబు" అనీ, బంగారమూ, మనిషీ కూడా "నాల్గు రీతుల నాడేం" (నాణ్యం) అవుతాడని సుభాషితాలు రాశారు.

రీవారాణి అప్పలకొండయాంబ ఇచ్చిన సమస్యను పూరించిన పద్యం కూడా గురజాడ గారికి ప్రాచీన భాషపై ఉన్నసాధికారికత, సాహిత్య అభినివేశం తెలియజేస్తుంది.

చివరిది "ఋత శతకము", సత్యవ్రత శతకము అని కూడా పేరు ఉంది. (సరిగ్గా గమనించక పోతే, ఋతు అంటే కాలాల సంబంధం అనుకోగల ప్రమాదం ఉంది). ' సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్ ' అనేది ఈ శతక మకుటం. అయితే ఇందులో నూరు పద్యాలు లేవు. 27 మాత్రమే ఉన్నాయి. ఇందులో చివర పద్యం లో 'ధృతి గురు జాడల నరిగెడు గతి పెద్దలు జూప జనితి----' అన్న వాక్యమే మనసు ఫౌండేషన్ వారి సమగ్ర రచనల పేరుకు స్ఫూర్తి అయివుంటుంది.

గురజాడ రాసిన మిగిలిన అనేక కవితల్లో శిష్ట వ్యవహార భాష, అంటే గ్రాంథికాన్ని, వ్యవహారాన్నికలిపి రాసిన రూపాల కవితలే ఎక్కువ. ముత్యాల సరములు, కాసులు, డామన్, పితియస్, లవణ రాజు కల, ముత్యాల సరము, కన్యక వీటిలో పాడే లక్షణాలు ఉండటం వల్ల భాషా రూపం వైపు దృష్టి ఉండదు. అన్ని ఆలోచింప జేసే, ఆకట్టుకునే కథలే. అన్నింటిలోనూ క్రియా రూపాలు " మించి పాయెను, పలుకసాగేను, గాలి వీచెను, అరసితిన్, తెల్ల వారేను, అదృష్యమాయెను (ముత్యాల సరములు); సింగారమందురు, పసుపు నలదితి, ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును, పన్నితిని, వంటి క్రియా రూపాలతో బాటు, గూరిచి (గురించి, ద్వితీయ విభక్తి), నిచయము, విడెము, వాతెర, నా నేర్చు కొలది (నేను నేర్చుకున్న విధంగా) వంటి గ్రాంథిక పదాలూ (కాసులు) కనిపిస్తాయి.

శిష్ట వ్యవహార భాష విశేషాలకు మరిన్ని ఉదాహరణలు:

డామన్, పితియస్– వన్నెకెక్కిరి మొదలుకొని చూతునంటివి, యిరులు బ్రాకెను (= చీకట్లు పెరిగాయి), ఆసవము, ఆని, యెల్లి, కుడుతురే (తింటారా), కాంచినాడను,మనుజులు

లవణ రాజు కలలో– ఉల్లము, వారువము, పరచెన్, చీరె( పాడినాయి), ఉడు గణంబులు, కావుత, మురువు, నిస్సపత్నము గాన్, వేచియుంటిని, కరపి నాడను, కొమరులను, కంటిన్ (= కన్నాను అంటే పుట్టారు అని), కైకై జేర్చి, గాదిలి పట్టి, గద్దియ మొ.

కన్యకలో–తగటు, తొగల, పరతెంచెన్, మనుచు, వట్టుము, పోయెను, మట్టి కలిసేను, నిలిచెను.

ఈ రచనలను ఇంత వివరంగా చెప్పటం ఎందుకంటే వ్యవహార భాషా వాదిగా గ్రాంథిక వాదానికి వ్యతిరేకంగా ఎంతో పోరాటం చేసిన గురజాడ తానూ గ్రాంథిక భాష లో అవసర మైతే చాలా చక్కగా రాయగలనని చూపేందుకే అనీ, మీకు గ్రాంథిక భాష లో రాయటం రాక వ్యవహారవాదం మొదలు పెట్టారనే అపకీర్తి రాకుండా ఉండేందుకు ఈ రచనలు చేసారని భావించాలి. ఆయన లోని ఈ కోణాన్ని ప్రత్యేకంగా వివరించిన వారు కానీ, వీటిపై విశ్లేషణలు కానీ లేవు కాబట్టి గురజాడ కావ్య భాషా పాండితీ ప్రకర్ష వివరించి చూపటం జరిగింది.

iii వ్యావహారిక భాషలో రాసినవి:

వ్యావహారిక భాష అనేక మంది పాఠకులకు తెలిసిన విషయమే. అయితే వీటిలో వ్యవహారమనేది ఏక సూత్రం కాదు. దానిలోనూ ఎంతో వైవిధ్యం ఉంది. ఆ వివరాలే కింద కనిపిస్తాయి.

వ్యావహారిక భాషలో గురజాడ చేసిన రచనలు:

i) రెండు కథలు

ii) కొన్ని కవితలు

iii) పిల్లల పాటలు

iv) మూడు నాటకాల్లోని అనేక పాత్రల భాష.

v) వ్యాసాలు(మాటా – మంతీ)

### వ్యావహారిక భాషలో రాసిన కథలు

గురజాడ తెలుగులో రాసిన నాలుగు కథల్లో – మీ పేరేమిటి?, మెటిల్డా– కథలలో గత శతాబ్ద కాలంగా రచయితలు వాడుతున్న భాషకు అంటే, భద్రిరాజు కృష్ణమూర్తిగారు "ప్రామాణిక" భాష (2000) అని నిర్వచించిన ఆధునిక భాషకు దాదాపు దగ్గరగా ఉంటుంది.

మెటిల్డా కథలో సంభాషణాలన్ని వ్యవహార భాష లో ఉన్నాయి. " మెటిల్డాను చూశావా?"; "అదిగో, చూసీ చూడనట్టు చూడు"

"నా పెళ్ళాం వేపు చూస్తున్నావా?" ......

చూడలేదూ? .... "చూడు, యెంత సేపు చూస్తావో, యీ ముండ మొహం వేపు యేం..."

""... మీకు నేనేం అపకారం చేసాను?"

"కాఫీ యియ్యి" " మరి నువ్వు వెళ్ళిపో"

ఈ వ్యాసం భాషకే పరిమితం అవడం వల్ల ఈ కథలో నిత్య వ్యవహార జీవితానికి, సహజత్వానికి దగ్గరగా సంభాషణలు ఉండడాన్ని ఎత్తి చూపడం జరిగింది. అప్పటికీ ఇప్పటికీ ఈ భాషా రూపం లో మార్పు లేదు. కథావస్తువుకు భాషా, భాషకు మాట్లాడే తీరూ పరస్పరం దోహదపడి ఇంతకన్నా రసాత్మకంగా రాయడం సాధ్యపడదన్నట్లుగా ఈ కథ రూపొందింది.

మీ పేరేమిటి? కథలో ఎక్కువ భాగం ఆధునిక వచన రచనల్లోని (అంటే పత్రికలు, కథలు, వచన కవితలు, వ్యాసాలు వంటి వాటిలోని) వచనమే కనిపిస్తుంది. వాటిల్లో కొన్ని ఉదాహరణలు:

"అడిగాడు, యిస్తాను, కూచున్నాం, వెయ్యబోతే, తే , ప్రారంభించారు, వూరుకున్నాం, అమ్మజూపాడు, చేసుకుని, తవ్వించడం, చూడనేచూశారు. వెళ్లాం, చేస్తాడు, సాతానోడికియ్యండి, కూచోబెట్టారు, అవుతున్నారు," ఇలాంటి వ్యవహార రూపాలు ఎక్కువగా ఉండగా, "కలవు, వెళ్లివుండును, చెప్పబోవుచున్నాను, అయివుండిరి, వుండెను, వస్తిరి, చూసెను, తెస్తివి, అంటివి" వంటి కొన్ని గ్రాంథిక ప్రయోగాలూ ఉన్నాయి. అంతే కాకుండా ఈ కథ లోని కొన్ని పాత్రలు తమ తమ వైయక్తిక భాష లో ఊళ్ళల్లో మాట్లాడినట్లే మాట్లాడుతారు. ఉదాహరణకు: మీ పేరేమిటి కథలోని రామి నాయుడు అనే

పాత్ర "రావ స్సోవికి మయిమం వుందా లేదా?" (రామస్వామి మహిమ ఉందా) అనీ, "యేం, పల్లకుంటావేం?", "శక్కరం (చక్రం) తోటి వొళ్ళల్లా తెగ్గాల్చటానికి మంతరం (మంత్రం) కద్దా?", "ఆ యిగ్గరవేదో (విగ్రహం ఏదో) సాతానోడి కియ్యండి. ఆడదాయి ( ఆడది = స్త్రీ)తో యవడు మాటాడగల్డు?" వంటి విజయనగరం మాండలికం లో నాయుడి భాషా కూడా ఉంది.

మిగిలిన పాత్రలు కొన్ని, శాయన్న భక్త, రామ్మూర్తి, నేను అనే వక్త వంటి వాళ్ళు సాధారణ వ్యవహారంలోనే, అక్కడక్కడ చిన్న చిన్న తేడాలున్నప్పటికీ, మాట్లాడుతారు.

భాషా వైవిధ్యానికి ముఖ్యమైనవి పైన చెప్పుకున్నట్లుగానే క్రియా రూపాలు. గురజాడ వాడిన పదావళిలో క్రియా రూప భేదాలలో మాత్రం ఎక్కువగా గ్రాంథిక ప్రయోగాలే అయినప్పటికీ అవి అవగాహనా క్లిష్టత కలిగించకుండా ఉంటాయి. మెటిల్డా కథలోకూడా చూశాడు, కనపడేది,చూపించాను, వెళ్ళాను, పిలిచాడు, ఉండు, నడిచేవాణ్ణి, వుండు, వొస్తావా, రావా, చదువుకున్నావ, కాఫీ యియ్యి, పోసుకో, నిలుచుంది, వెళ్లిపో వంటి వ్యవహార రూపాలతో బాటూ బస చేసి ఉంటిని, అనుకుంటిని, మానితివా వంటి గ్రాంథిక ప్రయోగాలూ కొన్ని కనిపిస్తాయి.

## గురజాడ కథలలో శిష్ట వ్యవహార భాష

గురజాడ రాసిన మిగిలిన రెండు కథల్లో శిష్ట వ్యవహార భాషా శైలి కనిపిస్తుంది. దిద్దుబాటు కథ ప్రారంభ వాక్యమే "తలుపు తెరవబడ లేదు" అనే కర్మణి వాక్యం తో ప్రారంభమవుతుంది. తిన్నది, వుంటాను, పరిగెత్తుతూంది, యిచ్చాడు, వెళ్ళాలి వంటి వ్యవహార క్రియలతో బాటు, రెక్క విడబారెను, యేర్పరింప లేదయ్యె, వెలిగించెను క్రమ్మెను, కానరామి, కానవచ్చెను, నిలిచెను, హృద్యారావమును వినవయ్యెనుతో ముగుస్తుంది. ఈ రెండు భాషా భేదాలతో బాటు చదువు రాని పని వాడు రాముని భాషలో పల్లె జనం భాష ఇలా ఉంటుంది: "యేటి సేసినారు బాబూ?, యేటా బాబూ! బాబు నా యీపు పగలేసినారు రందమ్మా అంతాను, ఆడోరు యెజిమాని సేపినట్టల్లా యిని పల్లకుండాలి, సానమ్మ నుంచు గుంతారు". (ఈ భాష మీ పేరేమిటి? లో రామినాయుడు మాట్లాడే భాషే).

మతము, విమతములో కూడా శిష్ట వ్యవహార భాష లేదా సరళ గ్రాంథిక భాష మాత్రమే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ కథ కూడా "విప్పబడుటం జేసి" అనే కర్మణి వాక్యంతోనే ప్రారంభమవుతుంది. వచ్చుచుండిరి, కథాశేషమైంది, చేరిరి, ఉత్తరమిచ్చెను, సమ్మోదముగా పిలిచెను" వంటి సమ్మిళిత భాషే కనిపిస్తుంది.

## గురజాడ కవితలలో వ్యవహార భాష

అలాగే కొన్ని కవితలలో – మనిషి, దేశభక్తి, ఆడపిల్లల పాటలు అనే శీర్షిక తో రాసిన పూర్ణమ్మ, మిణుగురులు– కొన్ని క్రియారూపాలు గ్రాంథికమే అయినా, అవి చాలా సులభంగాఉంటాయి. గ్రాంథిక భాషా క్లిష్టత వాటిలో కనిపించదు.

"మనిషి చేసిన రాయి రప్పకు....
దేవుడెక్కడొ దాగేనంటూ కొండకోనల వెతుకులాడే వేలా?"
"దేశమును ప్రేమించుమన్నా....
యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్......."
పూర్ణమ్మ లో
"మేలిమి బంగరు మెలత ల్లారా... విన్నారమ్మా యీ కథను"
కాసుకు లోనై తల్లీ దండ్రీ, నేనరూ న్యాయం విడనాడీ
...... ముదుసలి మొగుడుకు ముడి వేస్రీ
పిల్లల గీతాలు
బూరుగు చెట్టు చిలుకల తోనూ
ఏమని పలికిందీ?.......
పకపక నవ్వింది
ఏనుగు ఎక్కి మనము ఏ ఉఊరెళదాము?
............ ఏలూరెళదామూ

దేశభక్తి గేయం అంతటా వక్త శ్రోతతో సంభాషిస్తున్నట్లుగా, ప్రతి వాక్యం చివరా ఓయి లేదా యేమోయీ అనే సంబోధనతో ఉండటం వల్ల పాడేందుకు అనుగుణమైన లయ ఏర్పడి ప్రేమించుము, పెంచుము, బాగుపడును, చెప్పకోకు, మొలకెత్తవలెను వంటి అన్ని క్రియలు గ్రాంథిక భాషా ప్రయోగాలే అయినా అర్థం కావడానికి ఏమాత్రం ఇబ్బంది ఉండదు.

## గురజాడ నాటకాలలో ఆధునిక వ్యవహార భాష

పై వాటికి భిన్నంగా కన్యాశుల్కం, కొండుభట్టీయం వంటి నాటకాలలో భాష నిత్యజీవితంలో వివిధ సామాజిక వర్గాలు మాట్లాడే సజీవ భాషగా ఉంటుంది. కొండుభట్టియంలో భాష వ్యవహారమే అయినా దానిలో కన్నా కన్యాశుల్కం లో ఎక్కువగా జన సామాన్య వాడుక భాష కనిపిస్తూ సహజత్వానికి చాలా దగ్గరగా ఉంటుంది. రెండూ చదివితే భేదం అర్థం అవుతుంది.

కన్యాశుల్కంలో సాధారణ వ్యవహార భాషతో పాటూ విజయ నగర/ కళింగ ప్రాంతపు ప్రాంతీయ భేదం తో ఆయా పాత్రల సామాజిక నేపథ్యం ప్రకారం భిన్న భిన్న వ్యవహార భేదాలు కనిపిస్తాయి. నాటకం లోని పాత్రలన్నీ ఆ కాలపు నిత్య జీవితంలో సమాజంలో సాధారణంగా కనిపించే వారే. వీళ్ళల్లో కొంత ఆధునికంగా చదువుకున్న వారూ ( గిరీశం, సౌజన్యారావు, మధురవాణి), కొంత వేదాలు చదివిన వారూ (అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు, కరటక శాస్త్రి), మరికొందరు చదువురాని వాళ్లు (అసిరి, గవరయ్య, వీరేశం) కనిపిస్తారు. వీళ్లలో అసిరి, గవరయ్య, వీరేశం, హెడ్డూ, మునసబు వంటి వాళ్లు ఇంటి భాష/ వైయక్తిక భాష మాట్లాడుతారు (చివరవి ఇద్దరివీ ఉద్యోగాలే అయినా వాళ్ళు కూడా ఇంటి భాషే మాట్లాడుతారు).

ఇవన్నీతెలుసుకోవాలన్నా, అర్థం కావాలన్నా కన్యాశుల్కం పూర్తిగా చదవాలి. ప్రతి పాత్ర ఒక సామాజిక నేపథ్యం ఉన్నదే. అందువల్ల ఒక్కొక్కరిగా వాళ్ళ భాషా విశేషాలు రాస్తే అవి విడి విడి వ్యాసాలవుతాయి. (ఉదాహరణ కు గిరీశం భాషపై వచ్చిన వ్యాసం చూడండి: ఉషా దేవి , 2022). ప్రస్తుతం సాధారణ వ్యవహారానికి భిన్నం గామాట్లాడిన ఇతర భాషా భేదాలను చూద్దాం. అందులో ముఖ్యమైనవి రెండు: కళింగ ప్రాంతీయ భాష ( భౌగోళిక భేదం); సామాజిక/ వర్గ భాష. సామాజిక భాష లో మళ్ళీ రెండు రకాల భేదాలు కనిపిస్తాయి. అవి: బ్రాహ్మణ, బ్రాహ్మణేతర భేదాలు.

ఇవి కాక గురజాడ ఉపయోగించిన ద్విభాషా మిశ్రమాలు రెండు విధాలుగా ఉన్నాయి. 1. తెలుగు, ఆంగ్లం కలిపి మాట్లాడినవి; 2. తెలుగు, ఉర్దూ కలిపి మాట్లాదినవి. సామాజిక భాషా శాస్త్ర పద్ధతుల్లో వీటిని కూడా విశ్లేషించాల్సి ఉంది.

కొన్ని ఉదాహరణలు:

కళింగ భాష నాలుగవ అధ్యాయంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇందులో నిరక్ష రాస్యుల వాడుకలో ఇతరత్రా వాడే పదాలు మార్పులతో పలక బడుతాయి. మచ్చుకు కొన్ని:

స్తానం ( స్నానం), గళాసు/ గలాసు ( గ్లాసు), వుప్పదేశం (ఉపదేశం), ఆస్యాలు (హాస్యాలు), యిన్నాళ్ళాయి (ఇంత కాలం నుండీ/ ఇన్నాళ్ళ నుంచీ), ఏమాచ్చెర్రం (ఏమి ఆశ్చర్యం), యగేశారు (ఎగ వేశారు) వంటివి. ఇలాటి వాటినీ కావ్య భాషా వ్యాకర్తలూ, సాహిత్య కారులూ ' గ్రామ్యం' అన్నారు. ఈ రకంగా మాట్లాడిన వాళ్లు మునసబు, మనవాళ్లయ్య, బైరాగి, కానిస్టేబుల్, హెడ్డు మొదలైన వాళ్లు . వీళ్ళ లో ఒకరిద్దరు పదంలో సహజంగా లేని ర్రావడిని పదాదిన అదనంగా చేర్చడం. ద్రేహం (దేహం), ద్రయ ( దయ), క్రీర్తన (కీర్తన) యీరేచ ( వీరేశ).

బ్రాహ్మణ భాషలో కనిపించే కొన్ని లేఖన, ఉచ్చారణ, పదాల ఎంపిక. గురజాడ బ్రాహ్మణుల వాడుకలో ఉండే భాషలో ముఖ్యమైన భేదాలు కొన్ని వాళ్ళ నోట పలికించారు.

ఉదా:

శ కారం చ కారణంగానూ లేదా  చ కారం శ కారం గానూ మారటం.
చబాష్ (శబాష్ )
ట కార ఉచ్చారణను ష కారం గా పలకటం కనిపిస్తుంది.
యేవిషి ( ఏమిటి), యేమిషండీ  ( ఏమిటండి)
ఇయ్యెడష ( ఇయ్యెడట) కాడష ( కాడట)

ఈ బ్రాహ్మణ భాషలోని ట కు ష వాడటం కొండుభట్టీయపు బ్రాహ్మణుల్లోనూ ఉంది. ఇది కళింగ బ్రాహ్మణ భాషలో ఇప్పటికీ ఉందో లేదో పరిశీలించాలి. కానీ ఇది గోదావరీ పరీవాహక ప్రాంత బ్రాహ్మణ భాష లో ఉందని శ్రీపాద వంటి అనేక రచయితల రచనల ద్వారా తెలుస్తుంది. అయితే ఈ బ్రాహ్మణులు వాడే క్రియల్లో ట కారం ఛ గామారుతుంది.

అంచూవుంచారు, రాసుకుంచున్నాడా, చదువుకుంచున్నాడా; అంచావు ( అంటావు) వంటివి.

ఉర్దూ ప్రభావం వల్ల ఉర్దూ క్రియా రూపలపై ఇంచు/ ఇంచుక్ ( వ్యాకరణ పరిభాషలో) చేరి క్రీయారూపాలు ఏఆర్పడతాయి.

ఉర్దూ క్రియారూపలకు ఉదాహరణలు:

ఉర్దూ పదాలపై తెలుగు యించు, కాలబోధక లింగ, వచన, పురుష ప్రత్యయాలు వాడటం.

గభ్ రానా 'భయపడు' గభరాయింపజేస్తాను, బజాయించేస్తాను, భరాయించి, దౌడాయించండి వంటి క్రియరూపాలు (బజానా, భరానా, దౌడానా మొదలైనవి).

ఈ రెండు నాటకాల లోని భాషకు భిన్నమైనది బిల్హణీయము. ఇది సంస్కృతం లోనూ తెలుగులోనూ రాసిన కావ్యాల ననుసరించి రాసిన నాటకం. ఇది కూడా సరళ గ్రాంథిక, ఆధునిక వ్యవహార భాషలలో ఉండి, మధ్య మధ్య తెలుగు పద్యాలతో, సంస్కృత శ్లోకాల తో కలిసి ఉంటుంది.

గురజాడ రెండు నాటక రచనల్లో ( కన్యాశుల్కం, కొండుభట్టీయం) మిళితమైన ఇంగ్లీష్, ఉర్దూ ప్రభావాల పై మరింత పరిశోధన జరగాలి.

మాటా – మంతీ – 1 లో చేసిన అనేక ప్రస్తావనల్లో పాత గ్రాంథిక భాష లో సరిగ్గా ఎవ్వరూ రాయటం లేదని వాదిస్తూ (గిడుగు గారూ తమ రచనల్లో కూడా ఈ విమర్శలే ఎక్కువగా చేసారు. ఎందుకంటే వీరిద్దరి మీదా గ్రాంథిక వాదులు చాలా విమర్శలు చేసారు) గురజాడ "శిష్టులు యీనాడు వాడుకుంటూ వున్న భాషలో నుంచి కొత్త గ్రాంథిక భాషొకటి కల్పించుకోవలసిందన్నది నా మతం" అని చెప్పినట్లుగానే ఆ భాష లో కూడా కొన్ని రాశారు.

iv) సరళ గ్రాంథికంలో గురజాడ రచనలు

దిద్దుబాటు, మతము – విమతము అనే రెండు కథల్లో మీపేరేమిటి?, మెటిల్డా లకన్నా ఎక్కువగా సరళ గ్రాంథికం కనిపిస్తుంది. అట్లాగే ముత్యాల సరము, కాసులు, డామన్ పితీయస్, లవణరాజు కల,

కన్యక, పూర్ణమ్మ, దించు లంగరు, లంగరెత్తుము, కోరుకొండ ఇవన్నీ కూడా గురజాడ ఈ విధమైన భాషను మార్గదర్శకంగా రాశారని భావించాలి.

రెండు మూడు ఉదాహరణలు:

పలికె నరపతి "మిత్రభావము
సలుపుడిక నీ సఖుడు నీవును..."
ఎవని గూరిచి పాట పాడెనొ?
యెవని నామము ధన్య మాయెనో?
చింత యుడుగుడు – చితిని జొత్తము
తగటు బంగరు చీరె కట్టి
కురుల పువ్వులు సరులు జుట్టి

అన్ని కవితలలోనూ, మిగతా కొన్ని వచన రచనల్లోనూ కూడా ఇట్లా భాషా క్లిష్టత లేకుండా "శిష్ట" / సరళ భాష ను గురజాడ వాడి జనులకు చూపించారు. అయితే భాష ఎవరి ఇష్టాయిష్టాలతో పనిచేయదు. గ్రాంథిక వాదులు ఎంతగా గుండెలు బాదుకున్నప్పటికీ వ్యవహార భాషా వినియోగాన్ని నిలవరించలేక పోయారు. ఆ వాదాన్ని సమర్థిస్తూ రాసిన వారి రాతలన్నీ ఇప్పుడు అప్రస్తుతం, అప్రాసంగికం అయ్యాయి. అట్లాగే సరళ గ్రాంథికం శిష్ట వ్యావహారికం అన్నవి కూడా!

పత్రికల, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వాడే భాష గురజాడ, గిడుగు గార్లు చూపిన మార్గంలో అభివృద్ధి చెందినదే. దీనిలో మార్పులు రావడానికి ఎక్కువ సమయమే పట్టవచ్చు. కానీ, కాలక్రమాన చదువుకున్నవారి భాష , చదువుకోని వారి భాష అన్న భాషా శాస్త్ర వేత్తల విభజన కూడా మారిపోయి సృజనాత్మక సాహిత్యంలో వైవిధ్య భరితమైన ప్రాంతీయ, సామాజిక, వైయక్తిక భేదాల రచనలు స్థానం సంపాదించుకున్నాయి. వీటిని రచయితలు హాయిగా వాడేందుకు మార్గం చూపిన వారుమాత్రం గురజాడ గారే. అదేవిధంగా భాషలకు ఇతర భాషలతో సంపర్కం (Language Contact, see Weinreich, 1962) ఏర్పడ్డప్పుడు ఆదాన ప్రదానాలు ఉండటం అనివార్యం. ఆధునిక తెలుగులో అట్లా అనేక పదాలు ఉర్దూ, ఆంగ్ల భాషల నుండి వచ్చి చేరాయి. భాషా మిశ్రణం (code mixing), ఏకకాలం లొరెండు భాషలు వాడటం ( code switching) లు భాషలో అనివార్యం. గురజాడ కన్యాశుల్కం లో ఈ రెండు భాషల పదాలూ మిళితమై కనిపిస్తాయి.

పైన వివరించిన విధంగా తెలుగు భాష లో ఉన్న అన్ని రకాల వైవిధ్యాలను గుర్తించి, అర్థం చేసుకొని వీలయిన వాటిని ఆయా విషయాలకు, సందర్భాలకు, వ్యక్తులకు అనుగుణంగా వాడటం, తద్వారా ఆయా సామాజిక స్థాయి వ్యక్తుల సహజత్వాన్ని ఆవిష్కరించి సజీవులుగా నిలబెట్టిన వాడు గురజాడనే. అంతకు పూర్వం ఒకరో ఇద్దరో అలా "పాత్రోచిత" భాష అని వాడిన వాటిలో ఇంతటి వైవిధ్యం, విస్తృతి, సహజత్వం, సజీవత్వం అసలు కనిపించవు. పాత్రను వ్యక్తి గా మార్చడానికి భాష నూ, భాష ను ఆయా మనుషుల వలె మలచేందుకు పాత్రలను ఏకం చేసి తన అధ్యయన, అవగాహనలతో "తెలుగు జాడ" ను అందించి 'ఇదిగో ఇది మన తెలుగు' అంటూ చాటి, వినూత్న' అడుగు జాడ' తో మార్గం నిర్దేశించి గురజాడ " గురు జాడ" గా నిలిచి పోయారు.

### ఉపయుక్త గ్రంథ పట్టిక


* ఉషా దేవి, అయినవోలు. 2014. ఆంధ్ర భాషా భూషణము. (మూల ఘటిక కేతన 13 వ. శతాబ్దం). ప్రతిపదార్థ, టీకా తాత్పర్య భాషా శాస్త్ర వ్యాఖ్యాన సహితం. హైదరాబాదు. ఎమెస్కో
* ఉషా దేవి, అయినవోలు. 2023. ఆధునిక తెలుగు పై గిరీశం ప్రభావం. ప్రకాశిక. అంతర్జాల పత్రిక.
* చిన్నయ సూరి, పరవస్తు. 1950. బాల వ్యాకరణము. మద్రాసు: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.
* కృష్ణమూర్తి, భద్రిరాజు. 1962. మాండలిక వృత్తిపదకోశం. వ్యవసాయం. హైదరాబాదు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ
* కృష్ణమూర్తి, భద్రిరాజు. 1974. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాదు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ.
* గోపాల కృష్ణ, పెన్నేపల్లి. ( సం.) 2012. గురు జాడలు. హైదరాబాదు: మనసు ఫౌండేషన్ ( సహ సం. కాళిదాసు పురుషోత్తం, ఎం. వి. రాయుడు
* రాధాకృష్ణ, బూదరాజు. 1972. వ్యావహారిక భాషా వికాసం. విజయవాడ. విశాలాంధ్ర ప్రచురణాలయం.

* Brown, C. P. 1853/57. A Grammar of the Telugu Language. Madras: Christian Knowledge Society Press.
* Brown, William. 1818. A Vocabulary of Gentoo language.
* Campbell. A. D. 1821. A Grammar of the Teloogoo Language.
* Weinreich , U. 1964 Language in Contact. The Hague: Mouton& co.

# కన్యాశుల్కంలో భాషా వైవిధ్యం - ఆంగ్ల అనువాదాల పరిశీలన



డాక్టర్ లక్ష్మి హరిబండి
94418 22213

గురజాడ అప్పారావుగారి అత్యంత ప్రజాదరణ పొందిన నాటకం కన్యాశుల్కం. గురజాడ పేరుకూ కన్యాశుల్కం నాటకానికీ అవినాభావ సంబంధం ఉంది. విడదీయరాని బంధముంది. కన్యాశుల్కాన్ని పరిశీలిస్తే గురజాడ వారు కేవలం ఒక రచయిత గానే కాక ఒక భాషావేత్తగా కూడా కనిపిస్తారు. ఈ నాటకంలో వారు వివిధ పాత్రల మధ్య చూపించిన భాషాపరమైన వైవిధ్యం ఎంతో సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుంది. వారికి అటు గ్రాంథిక భాషలోనూ, ఇటు వ్యవహారిక భాషలోనూ గల పట్టు




మాత్రమే కాక ఆంగ్ల భాషలో కూడా గల ప్రావీణ్యం, పట్టు ఈ నాటకంలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయ్. పాత్రలను బట్టి, వారి వారి విద్య, విజ్ఞానాన్ని బట్టి వారికి తగిన పలురకాల భాషాశైలులను గురజాడ వారు వినియోగించటం ఈ నాటకంలో విశదమవుతుంది. మరీ ముఖ్యంగా కులాల మాండలికాలను కూడా వాడిన విషయం గమనించవచ్చు. బ్రాహ్మణుల, బ్రాహ్మణేతరుల భాషలను పరస్పర వ్యత్యాసంగా చూపించిన విధానం చదువరులను ఆకట్టుకుంటుంది.



కన్యాశుల్కం నాటకంలో చిరకాలం చిరస్థాయిగా నిలిచిపోయేటట్లు మలిచిన పాత్రలు రెండు. ఇందులో ఒకటి 'గిరీశం', రెండవది 'మధురవాణి'. వీరిలో గిరీశంను ఆంగ్లభాషలో ప్రావీణ్యం గల వాడిగా చిత్రీకరించిన విధానం ఈ నాటకం మొత్తానికే హైలైట్‌గా నిలుస్తుంది. అతని సంభాషణ చాలావరకు తెలుగులో ఆంగ్లంను కలిపినట్లుగానో, ఆంగ్లంలో తెలుగును కలిపినట్లుగానో పూర్తిగా code-mix అయి వుంటుంది. పూర్తి వాక్యాలు ఆంగ్లంలో ఉన్నప్పుడు వెనువెంటనే వాటి తెలుగు అనువాదం కూడా ఉంటుంది. అంటే గిరీశం ఆంగ్లంలో పూర్తి వాక్యాలను చెప్పి, వెనువెంటనే వాటిని తెలుగులోకి అనువదించి కూడా చెబుతుంటాడు. అతని సంభాషణలో ఈ విధమైన bilingualism లేదా repetition కనిపిస్తుంది.

అలాగే ఆంగ్లంతో కూడిన code-mixing, code-switchingలతోపాటుగా అక్కడక్కడా కొన్ని దక్కని/ఉర్దూ/ పర్షియన్/ అరబిక్ పదాలు కూడా కనిపిస్తాయి ఈ నాటకంలో ఈ క్రింది ఉదాహరణలు గమనించండి.

ఫిర్ మాన, ముసాయిబ్, నాచ్, సిఫార్సు, కబడదారు, తక్ షీర్, మాఫ్, షా బాష్, అర్జీ, కామాప్, వకీలు, వకాల్తినామా, సాకీను, తర్ఫీదు, పూరా.

నాటి తెలుగు భాషలో వాడుకలో లేని పదం, మనకు పరిచయం లేని పదం ఒకటి ఈ నాటకంలో తారసపడింది. అది 'ఆబోరు'. ఇది అనేకమార్లు నాటకంలో వాడబడింది. వాడిన సందర్భాలను బట్టి దీని అర్థం 'మర్యాద' లేక 'పరువు'గా మనం గ్రహించవచ్చు.

గిరీశం క్యారెక్టర్ ఈ నాటకంలో ఒక ఫ్రాడే ఐనప్పటికీ, అతను వాడిన ఆంగ్లభాష చక్కగా వినసొంపుగా ఉంటుంది. నిజానికి అది అతని భాషగా కాక రచయిత భాషగా కనిపిస్తుంది.

> **కన్యాశుల్కం నాటకంలో ఎన్నో Quotable Quotes ఉన్నాయి. ఇవి తెలుగు భాషలో అంతర్గత భాగమైపోయాయి.**

కన్యాశుల్కం నాటకం చదివితే ప్రపంచం మొత్తాన్ని చదివి అర్థం చేసుకున్న అభిప్రాయం కలుగుతుంది; అనుభవం వస్తుంది. మనుష్యులలోని అన్ని కోణాలూ కనిపిస్తాయి ఈ నాటకంలో. వివిధ రకాల మనుష్యులు, మనస్తత్వాలూ – స్వార్థపరులు, మోసగాళ్ళు, మూర్ఖులు, అతి తెలివి ప్రదర్శించేవాళ్ళు, సజ్జనులు, సచ్ఛీలురు కనిపిస్తారు. ప్రపంచమంతా ఈ మినీ కాన్వాస్ మీద కనిపిస్తుంది. ఈ కారణంగానే ఈ నాటకం రాసి ఇన్ని సంవత్సరాలైనా ఇంకా ఇది ప్రజల నోళ్ళలో నానుతూ చిరస్థాయి గా ఉండిపోయింది.

ఈ నాటకంలో ఒక్కో పాత్రధారి, ధారుడు ఒక ప్రత్యేక కోవకు చెందినవారు. వారు ఆయా కోవలకు ప్రతినిధులుగా నిలుస్తారు. రామప్ప పంతులు, లుబ్ధావధానులు, అగ్నిహోత్రావధానులు, కరకటశాస్త్రి, సౌజన్యారావు, మధురవాణి – ఈ పాత్రలు తెలుగుజాతి ఉన్నంతవరకూ చిరస్థాయిగా నిలిచిపోయే పాత్రలు. ఇకపోతే మధురవాణి, సౌజన్యారావు పంతులు – ఈ రెండు పాత్రలను చాలా విలక్షణంగా తీర్చిదిద్దారు అప్పారావు గారు. ఈ పేర్లను కూడా వారి గుణగణాలను ప్రతిబింబించే విధంగా ఎన్నుకున్నారు గురజాడవారు. గిరీశం పాత్రను మలిచిన విధానం, ఆ పాత్రను ప్రధానపాత్రగా చేసి కథను ఆ పాత్ర చుట్టూ తిప్పటం ఈ నాటకంలో హైలైట్. గురజాడవారు గిరీశం ద్వారా పలికించిన ఆంగ్ల పదాలు, పదబంధాలు, వాక్యాలు, కొటేషన్లు, ఆంగ్ల రచయితల రిఫరెన్సులు ఎంతో సమంజసంగా, క్రియేటివ్‌గా ఉంటాయి. అవి గురజాడ వారి ఆంగ్ల ప్రావీణ్యాన్ని తెలిపేవిగా ఉంటాయి.

కన్యాశుల్కం నాటకంలో ఎన్నో quotable quotes ఉన్నాయి. ఇవి తెలుగు భాషలో అంతర్గత భాగమైపోయాయి. ఇవి తెలియని తెలుగువారెవరూ ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఉదాహరణకు గిరీశం డైలాగులలో ఈ క్రిందివి చాలా పాపులర్ అయిపోయాయి.

“నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్.”

"డామిట్ ! కథ అడ్డం తిరిగింది."

"పొగ త్రాగనివాడు దున్నపోతై బుట్టున్ !"

"అడగ్గానే ఇస్తే వస్తువు విలువ తగ్గిపోతుంది."

ఈ క్రింది ఉదాహరణలు ఇంగ్లీషు-తెలుగు అనువాదాన్ని స్పష్టం చేస్తాయి :

1. బుచ్చమ్మ : అయ్యా మీరు చల్దివణ్ణము తింటారా ?

   గిరీశం : నాటిదిని లీస్టు. యెంతమాత్రమూ అభ్యంతరం లేదు. వడ్డించండి.

2. గిరీశం : నెవ్వర్మైండు బై హోప్పన్నారు. చేస్తే శుద్ధ క్షవరమే గాని తిరుపతి మంగలాడి క్షవరం చెయ్యకూడదు.

3. గిరీశం : ...అన్ని పళ్ళూ నువ్వు మాత్రమే తింటావా యేమిటి ? తింటే స్టమకేక్, కడుపు నొప్పొస్తుంది.

4. గిరీశం : ఎబ్ర్స్టాక్టు ట్రూత్ అనగా శుద్ధ సత్యమనేది సాక్షాత్తూ భగవంతుడితో సమానమైన వస్తువన్నమాట.

5. గిరీశం : డామ్ నాన్సెన్సు – గ్రోస్ సూపర్స్టిషన్ – యీ వెట్టికబుర్లు యే దొర నమ్ముతాడు ?

ఒక ఆసక్తికరమైన euphemism ను గురజాడవారు వాడారు. ఈ క్రింది వాక్యాలను గమనించండి.

కరకట శాస్త్రి : సాలిగ్రామాల వాసన కొట్టుతూంది. యేమిటండోయి – యేకాదశన్నారే!

రామప్పంతులు : వొళ్ళు కారకం చేసి వున్నది. ఔషధంగా పుచ్చుకుంటూ వున్నాను. ఈ మాట యెక్కడా చెప్పకండి.

ఈ వాక్యాలను గమనిస్తే వివరణ అక్కర్లేకుండానే 'సాలిగ్రామాల వాసన' అంటే ఏమిటో స్పష్టంగానే తెలుస్తుంది. మరొకటి 'జైలు'కు బదులు 'మఠ ప్రవేశం' అని వాడటం.

ఆరవస్థలంలో లుబ్ధావధానుల యింటిలోకి హెడ్ కానిస్టేబుల్ ... 

ఉంటుంది. ఇందులో కూడా గురజాడ వారి అద్భుత సృజనాత్మకత, భాషా పరిజ్ఞానం స్పష్టమవుతుంది. మచ్చుకు ఈ క్రింది వాక్యాలు గమనించండి:

ఎ) హవల్దారు : (యోగినితో) పిల్లా హుక్కాలావ్. (హెడ్ తో) భాయీ గుంటూరు శాస్తుల్లు గారి పతా యేమైనా తెలిసిందా ?

బి) హవల్దారు : కుంపిణీ నమక్ తిన్న తరువాత, ప్రాణం వున్నంతకాలం కుంపిణీ బావుటాకి కొలువు చెయ్యాలి. రేపు రుషియాతో యుద్ధం వొస్తే పింఛను ఫిరకా యావత్తూ బుజాన్ని తుపాకీ వెయ్యమాఁ ?

> గురజాడవారు విజయనగరం వాసులు. కాబట్టి వారు వాడిన తెలుగు భాషలో ఆ ప్రాంతపు మాండలికం, ముఖ్యంగా అక్కడివారు వాడే కొన్ని ప్రత్యేకమైన పదాలు అక్కడక్కడా కనిపిస్తూ ఉంటాయి.

అలానే చతుర్థాంకములో శూద్రుడు, బైరాగీ, హెడ్ కానిస్టేబులు, దుకాణదారుడు పాత్రలకు వాడిన తెలుగు భాష కూడా ఎంతో ఔచిత్యంగా ఉంటుంది. వీరికి తెలుగును వాడటం జరిగింది. ఉదాహరణకు ఈ క్రింది వాక్యాలను గమనించండి :

"డబ్బు లచ్చుంటోయ్."

"వుండోశ్ యేడిసినట్టే వుంది."

"ఏమాచ్చెర్రెం, ఏమాచ్చెర్రెం, కాట్లాట మాని ఘానం యినఁదొస్సి, యెట్టిగొల్లోళ్ళు."

"సుక్కేసే వోళ్ళని మా బాగా పోలుస్తావు."

"మా వూరమ్మోరు జగజ్జనని! మా చల్లని తల్లి."

గురజాడవారు విజయనగరం వాసులు. కాబట్టి వారు వాడిన తెలుగు భాషలో ఆ ప్రాంతపు మాండలికం, ముఖ్యంగా అక్కడివారు వాడే కొన్ని ప్రత్యేకమైన పదాలు అక్కడక్కడా కనిపిస్తూ ఉంటాయి. ఉదాహరణకు, 'లావు' అనే పదం 'ఎక్కువ' అనే అర్థంలో చాలాసార్లు వాడబడింది. (ఉదా : ఈ ఊళ్ళో తాగడం లావుగా వున్నట్లు కనబడుతుంది.) అలాగే 'కోవెల' అనే

పదాన్ని 'గుడి' అనే అర్థంలో వాడటం కూడా గమనించవచ్చు.

Feminist perspective కు సంబంధించి ఒక్క విషయం మాత్రం చెప్పక తప్పట్లేదు. ఈ నాటకంలో పాత్రధార్లు, ముఖ్యంగా బ్రాహ్మణుల ధోరణిలో స్త్రీల పట్ల అత్యంత ఏహ్యాభావం, చిన్నచూపు, చులకనభావం కనిపిస్తుంది. ప్రతి చిన్న విషయంలోనూ స్త్రీలను అగౌరవపరచటం ఆనాటి బ్రాహ్మణ సమాజానికి అద్దం పట్టే విషయం అయినా స్త్రీ చదువరులకు కించిత్తు అవమానకరంగా ఉండటం కద్దు. ఈ క్రింది ఉదాహరణలను పరిశీలిస్తే విషయం స్పష్టమవుతుంది.

**ముండ, ఫకీరు ముండ అని తిట్టడం, ఆడముండల కేమి తెలుసు అనడం విరివిగా కనిపిస్తుంది.**

అగ్నిహోత్రావధాన్లు : అదంతా నీకెందుకయ్యా, ఓహో! యిందుకా నన్ను పిలిపించారు. వెధవ ముండన్లేవదీసుకుపోయిన ఫకీర్ వెధవ పక్షాన మాట్లాడతారూ?...

(ఇక్కడ రిఫరెన్స్ అతని స్వంత కూతురు గురించే. నిజానికి ఈ పదం 'ముండ' అనేది చాలా సర్వసాధారణంగా మగవాళ్ళందరూ వాడుతుంటారు ఆడవాళ్ళని ఉద్దేశించి)

'ముండ', 'ఫకీరు ముండ' అని తిట్టడం, 'ఆడముండల కేమి తెలుసు' అనడం విరివిగా కనిపిస్తుంది. వెంకమ్మ తన భర్త అగ్నిహోత్రావధాన్లుతో అంటుంది, "చాలును ప్రయోజకత్వం. తోచినప్పుడల్లా ఆడవాళ్ళను పశువులలాగ బాదడమే కదా ఇప్పటికిన్నీ."

ఈ 'ముండ' అనే పదం అని సర్వసాధారణంగా తమ యింటి ఆడవారికి, భార్యకు, పిల్లలకు, చెల్లెళ్ళకు వాడటానికి కారణం ఆనాటి సమాజంలో బాల్యవివాహాల వలన వైధవ్యం ప్రాప్తించిన ఆడపిల్లలు పుట్టింట్లో తండ్రి చాటునో, అన్నదమ్ముల చాటునో జీవచ్ఛవాలుగా పడి ఉండటం, జీతం, భత్యం లేని పనివాళ్ళుగా సేవచేయటం కారణమై వుంటుంది.

గురజాడవారు బ్రాహ్మణుల భాషాతీరును, ముఖ్యంగా కొన్ని పదాలను పట్టి పట్టి ఉచ్చరించటాన్ని కూడా తమ రచనలో చూపించారు. ఉదాహరణకు



ఈ క్రింది సంభాషణను గమనించండి :

లుబ్ధావధానులు : మణీ ఆర్దరేమిటి ?

అలాగే 'వీణ్ణి', 'అతణ్ణి' వంటి స్పెల్లింగులు కూడా వీరి సంభాషణలలో కనిపిస్తాయి. అలాగే 'నాలుగు గంటలకు' అని ఒక ప్రక్క, రెండో ప్రక్క 'నాలుగు ఘంటలకు' అని వత్తాక్షరాలతో కూడా ఉచ్చారణా భేదాలను స్పెల్లింగ్ ద్వారా చూపించారు గురజాడ వారు.

ఇకపోతే గురజాడవారు word games, puns ఎలా సృష్టించారో కూడా తెలుసుకుందాం.

నాయుడు : (లేచి) తక్ షిర్ మాఫ్ చేస్తే మనవి చేస్తాను.

యీాయన కృష్ణారాయపుర అగ్రహారం కాపురస్తుడు. మలక అగ్నిహోత్రావధాన్లు గారు. మహా (అ)యోగ్యమైన బ్రాహ్మణుడు.

అలాగే చివరి ఘట్టంలో గిరీశం సౌజన్యారావు పంతులుగారి ఇంట్లో ఉన్నప్పుడు బుచ్చమ్మను లేపుకొచ్చిన సంఘటనకు సంబంధించి, బుచ్చమ్మ గురించి చెప్తూ, 'అట్టి స్త్రీరత్నం' అనేసరికి, మధురవాణి మారువేషంలో ప్రవేశిస్తుంది. గిరీశం ఆమెను వెంటనే గుర్తుపడతాడు. ఒక్క క్షణం చెప్పే వాక్యాన్ని 'అట్టి స్త్రీరత్నం' తర్వాత ఆపి ఆమె వైపు చూసి, తెలివిగా దాన్ని 'యిట్టి స్త్రీరత్నం' గా మారుస్తాడు.

అలాగే తెలుగులో మాత్రమే సాధ్యమయ్యే 'వాడికి', 'ఆయనకు' మధ్య contrast కూడా అక్కడక్కడా కనిపిస్తుంది.

ఇప్పుడు ఇక ఈ వ్యాసంలో కన్యాశుల్కం ఆంగ్ల అనువాదాలలో రెండింటిని తీసుకొని వాటిలో తెలుగు మూలంలో ఉన్న ప్రత్యేకతలను అనువాదకులు ఎలా అనువదించారో, రెండింటినీ ఒకదానితో నొకటి, అలాగే మూలంతోనూ పోల్చి చూద్దాం. అయితే ఇక్కడ ముఖ్య ఉద్దేశం రెండు ఆంగ్ల అనువాదాలను compare చేసి ఏది మిన్న అని అంచనా వేయటం కాదు. తెలుగు నాటకాన్ని

ఆంగ్ల భాషలోకి అనువదించేటప్పుడు వారు ఎంచుకున్న పద్ధతులనూ, విధానాలనూ తెలుసుకునే ప్రయత్నం మాత్రమే ఇది. ఈ అధ్యయనానికి తీసుకున్న రెండు అనువాదాల వివరాలు ఈ క్రింద ఇవ్వటం జరిగింది.

1. Kanyasulkam : Translated by C.Vijayashree & T.Vijay Kumar, published by the Book Review Literary Trust, India, in 2002.

2. Girls for sale – Kanyasulkam, A play from colonial India.

*Translated by Velcheru Narayana Rao, published by Indiana university press, Bloomington & Indianapolis, USA, in 2007.*

**ఈ ఇరువురు అనువాదకులు రెండవ కూర్పునే మూలంగా తీసుకున్నారు.**

ఈ ఇరువురు అనువాదకులు రెండవ కూర్పునే మూలంగా తీసుకున్నారు. మొదటి అనువాదం తెలుగేతర భారతీయ పాఠకుల కోసం దేశీయంగా ప్రచురింపబడిన అనువాదం కాగా, రెండవది తెలుగు సాహిత్యానికే మణిమకుటం లాంటి కన్యాశుల్కం నాటకాన్ని విదేశీ పాఠకులకు పరిచయం చేయటానికి చేసిన అనువాదం. ఈ అనువాదాల నేపథ్యం వాటిని సరిగా అర్థం చేసుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

మూలంలో ఉన్న వివిధ భాషాశైలులు, ముఖ్యంగా dialectal variation, caste variation, sociolects,(??) idiolects వంటివి, మూలాన్ని మూలభాషలో, మూల సంస్కృతీ, సాంప్రదాయాలలో లోతుగా నాటుకుపోయేలా చేసినవేవీ ఇంగ్లీషు అనువాదాలలో కనపడవు. ఒక సంస్కృతి నుండి మరొక సంస్కృతికి అనువాదం చేసినప్పుడు ముఖ్యంగా నష్టపోయేవి ఇవే. మూలంలోని rhyme, rhythm లు కూడా అనువాదంలో తీసుకురావడం కష్టం. ఉదాహరణకు మూలంలోని 'పిల్లా ! అగ్గిపుల్ల !', 'ఏం బావా ఎడమ బుగ్గ ఎర్రబారింది' వంటివి అనువాదంలో literal గా అనువదించబడతాయి గాని, rhyme ను తీసుకురావటం కష్టం.

> ఏది ఏమైనా మూలభాష తెలిసినవారికి, మూలగ్రంథం పరిచయం ఉన్నవారికి ఏ అనువాదమూ సంతృప్తి నివ్వజాలదు.

అనువాదాల గురించి చర్చించేటప్పుడు సాధారణంగా చెప్పుకునేది అనువాదంలో మూలానికి జరిగిన నష్టం గురించే. కొన్ని విషయాలలో నష్టం అనువాదంలో అనివార్యమైనప్పుడు దానిని అంగీకరింపక తప్పదు. అయితే కొన్ని, కొన్ని సార్లు అనువాదంలో లాభాంశం (gain )కూడా ఉంటుంది. నష్టపోయినదానికి పరిహారంగా కొంత కొత్తవాటిని అనువాదంలో చేరుస్తూ ఉంటారు. ఏది ఏమైనా మూలభాష తెలిసినవారికి, మూలగ్రంథం పరిచయం ఉన్నవారికి ఏ అనువాదమూ సంతృప్తి నివ్వజాలదు. అనువాదం చేసేది మూలభాషా పరిజ్ఞానం లేనివారి కోసం కదా! మూలగ్రంథం మూల సంస్కృతీ, సాంప్రదాయాలలో లోతుగా వేరూరని సందర్భాలలో అనువాదంలో అంతగా నష్టం ఉండదు. అనువాదకులకు కూడా ఎన్నో పరిమితులుంటాయి. ఆ పరిమితులకు లోబడి అనువాదం చేయాల్సి ఉంటుంది. చాలావరకు మూలభావాన్నీ, దాని సారాంశాన్ని అనువాదంలోకి తీసుకురాగలరు గానీ, మూలంలోని సాంస్కృతికాంశాన్ని (cultural component), సావయవాంశాన్ని/ కళా సౌందర్యాత్మకాంశాన్ని (aesthetic component)నూ విధేయంగా అనువాదంలోకి తీసుకురావటం అసాధ్యం. కాకపోతే అనువాదం ఇలా ఉండాలి, అలా ఉండాలి అని మనం నిర్దుష్టంగా చెప్పలేం.

అనువాదకుల నేపథ్యం, వారి లక్ష్యం,, ఉద్దేశింపబడిన పాఠకులు, వారివారి అభిరుచి మొదలగు విషయాలను బట్టి అనువాదాలు అనేకరకాలుగా చేయవచ్చు. మక్కికి మక్కి అనువాదం అనువాదమే కాదు. అనుసరణలు, అనుసృజనలు, ఆంధ్రీకరణలు వంటి స్వేచ్ఛానువాదాలు కూడా అనువాదాలే. మన తెలుగు అనువాద సంస్కృతిలో నన్నయ్యగారు మొదలుకొని ఈనాటి అనువాదకుల వరకూ అందరూ స్వేచ్ఛానువాదాలకే పెద్దపీట వేశారు. అయితే తెలుగులోకి వచ్చిన అనువాదాలు, తెలుగు నుండి ఇతర భాషల లోకి చేసిన అనువాదాలు చాలావరకు భిన్నంగా ఉన్నాయి. అనువాదాలను

domestication, foreignization లుగా కాక source – oriented, target – oriented గా చూసినప్పుడు చాలామటుకు తెలుగులోకి వచ్చిన అనువాదాలు target – oriented గా, తెలుగు నుండి ముఖ్యంగా ఇంగ్లీషులోకి తెలుగువారయిన అనువాదకులు చేసిన అనువాదాలు source – oriented గా ఉండటం గమనించవచ్చు.

> ఇప్పుడు ఈ రెండు అనువాదాలను సోదాహరణంగా పోల్చి చూద్దాం.

మనం ఈ వ్యాసంలో అధ్యయనం చేస్తున్న రెండు అనువాదాలు కూడా source–oriented గానే ఉన్నాయి. అంటే మూలానికి విధేయంగా ఉంటూ, మూలంలోని అన్ని అంశాలను సాధ్యమైనంత వరకు యథాతథంగా ఇంగ్లీషులో తెలియపరచే ప్రయత్నం చేశారు. అలా అని అనువాదపు చదువతగిన విషయంలో పెద్దగా ఎక్కడా రాజీ పడలేదు. ముఖ్యంగా ఏ అనువాదంలోనైనా, ఇదే అతి పెద్ద సవాలు – మూలానికి విధేయంగా ఉంటూనే అనువాదం అనర్గళంగా, చదువ తగినట్టు గా ఉండేటట్లు చూడటం.

ఇప్పుడు ఈ రెండు అనువాదాలను సోదాహరణంగా పోల్చి చూద్దాం. కన్యాశుల్కం నాటకం అనగానే ముందుగా గుర్తుకొచ్చేది గిరీశం పాత్ర, అతను వాడే ఇంగ్లీషు భాష. ఈ తెలుగు–ఇంగ్లీషు code–mix ను అనువాదంలో అనువాదకులు ఎలా handle చేశారో చూద్దాం. ఆంగ్లానువాదాలలో నాటకం మొత్తం ఆంగ్లంలో ఉంటుంది కాబట్టి ఇలా ముందుగానే మూలగ్రంథంలో ఆంగ్లంలో ఉన్న భాగం కూడా సహజంగానే ఆంగ్లంలో ఉండి మొత్తం text లో కలిసిపోతుంది. తెలుగు మూలంలో ఉన్నట్లుగా code–mix చేసిన భాష ఒక ప్రత్యేకతగా కనిపించదు. మరి అలాంటప్పుడు మూలంలో ఒక ప్రత్యేకతగా నిలిచిన తెలుగు–ఇంగ్లీషు code–mix ను గమ్య భాషా పాఠకులకు ఏవిధంగా తెలియజేయాలి ? దీనికి ఏదైనా ప్రామాణికమైన పద్ధతి ఉందా ? మనం ఎంచుకున్న రెండు అనువాదాలలో అనువాదకులు అవలంభించిన విధానం ఏంటో చూద్దాం.

మొదటి అనువాదంలో అనువాదకులు తమ Translator's Note లో తెలుగు మూలంలో ఉన్న ఆంగ్ల పదాలనూ, వాక్యాలనూ తమ ఆంగ్లానువాదంలో యథాతథంగా వాడి ' ' సింబల్ ద్వారా అవి మూలంలోనే



ఆంగ్లంలో ఉన్నట్లు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మూలంలో ఉన్న ఉర్దూ పదాలను యథాతథంగా ఉంచినట్లు కూడా పేర్కొన్నారు. ఇది మూలంలో ఉన్న తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల మధ్యగల interfaceనూ, అలాగే పాత్రధారుల idiolectనూ తెలుపుతుందని పేర్కొన్నారు.

రెండవ అనువాదం Girls for Sale లో అనువాదకులు, నారాయణరావు గారు వారి 'Note on Translation and Transliteration' లో గిరీశం వాడిన ఇంగ్లీషును తమ అనువాదంలో యథాతథంగా ఉంచినట్లు, అలాగే ఇతర పాత్రధారులకు వాడిన ఇంగ్లీషు పదాలను కూడా యథాతథంగా ఉంచినట్లు, వాటిని Italics లో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే మూలంలో ఉన్న Sanskrit, Hindi, Urdu పదాలను, పాటలను, వాటితోపాటు కొన్ని తెలుగు పదాలను కూడా తమ ఇంగ్లీషు అనువాదంలో యథాతథంగా ఉంచినట్లు, Italics లో mmn పేర్కొన్నారు. ఇటువంటి ఆంగ్లేతర పదాల అనువాదాన్ని Notes లో ఇచ్చినట్లు కూడా పేర్కొన్నారు.

ఇకపోతే ఈ రెండు ఆంగ్ల అనువాదాల మధ్య సామ్యాన్నీ, తేడాలను క్షుణ్ణంగా పరీక్షించటానికి ప్రధానంగా నాటకంలో చివరి ఘట్టమైన 6వ స్థలాన్ని పరిశీలిద్దాం. ఇది సౌజన్యారావు పంతులు గారి యింట్లో జరిగే సన్నివేశం.

1. నుడికారాలూ, జాతీయాలూ, సామెతలు, నానుడిలు (Idiomatic language in general) యే భాష కా భాషకూ, సంస్కృతికీ ప్రత్యేకించి ఉంటాయి కాబట్టి వాటిని ఒక భాష నుండి మరొక భాషకు యథాతథంగా అనువదించటానికి వీలు కాదు. అనువాదకులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మూలంలోని భావాన్ని తెలియజేయవలసి ఉంటుంది. అటువంటప్పుడు వేర్వేరు అనువాదకులు వేర్వేరు మార్గాలను ఎంచుకుంటారు. ఈ క్రింది ఉదాహరణను గమనించండి :

మూలం :

గిరీశం : "...అబద్ధపు సాక్ష్యం వొద్దు. నిజమైన సాక్ష్యం జాగ్రత్త చెయ్యండి" అని హెడ్డు కానిస్టేబులుతో అనేసరికి నాపైని కొండంత కోపడ్డాడండి.

Eng. Tr. 1 :

Girisam : ...I told the Head Constable not to try for false evidence but secure genuine witnesses, he became furious.

మూలంలోని తెలుగు మాటను లిటరల్గా చూడకూడదు. ఇది irritationను, విసుగును చూచిస్తుంది.

Eng. Tr. 2 :

Girisam : ... I tried to tell the Head Constable no false evidence, go get true evidence. But he was furious at my words.

ఈ రెండు అనువాదాలలోనూ 'కొండంత కోప్పడటం' అనేది 'furious'గా అనువదించబడింది. తెలుగులో concreteగా, physical termsలో చెప్పినది ఇంగ్లీషులో generalగా మారిపోయింది.

ఇటువంటిదే మరో ఉదాహరణ గమనించండి :

మూలం : అతగాడెవడు ? వొల్లకాట్లో రావనాధాయ ?

Eng. Tr. 1 : Who is that 'he' ? That anonymous fellow ?

Eng.Tr. 2 : Who is he anyway, Jack in the Jungle ?

మూలంలోని తెలుగు మాటను లిటరల్గా చూడకూడదు. ఇది irritationను, విసుగును చూచిస్తుంది. దీన్ని ఇంగ్లీషులోకి అనువదించటం యథాతథంగా సాధ్యం కాదు కనుక రెండు అనువాదాలలో వేర్వేరు మార్గాలను ఎన్నుకున్నారు అనువాదకులు. మొదటి అనువాదంలో మూలభావాన్ని paraphrase చేయగా, రెండవ అనువాదంలో దానికి ఇంగ్లీషు సమానార్థకాన్ని ఎంచుకోవటం జరిగింది.

అలాగే సౌజన్యారావు గిరీశంతో మాట్లాడుతూ "నిజమైన సాక్ష్యం! యేం సత్యకాలం! నిజమాడేవాడు సాక్ష్యానికి రాడు. సాక్ష్యాని కొచ్చినవాడు నిజమాళ్ళేడు" అంటారు. ఈ వాక్యంలోని 'యేం సత్యకాలం (మనిషివయ్యా)' అనే native expression ను ఇంగ్లీషులోకి అనువదించటంలో రెండు వేర్వేరు మార్గాలను అనుసరించారు అనువాదకులు. మూలంలోని పదానికి గానీ, పదబంధానికి గానీ, నుడికారానికి గానీ సరియైన సమానార్థకం గమ్య భాషలో లేనప్పుడు అనువాదకులు ఎవరి పద్ధతిలో వారు అనువదిస్తారు. ఈ విషయంలో మొదటి అనువాదంలో 'gone are the days' గానూ, రెండవ అనువాదంలో 'what an innocent man are you?' గాను, 'యే సత్యకాలం!' అనేది అనువదించబడింది.

**యేం సత్యకాలం (మనిషివయ్యా) అనే native expression ను ఇంగ్లీషులోకి అనువదించటంలో రెండు వేర్వేరు మార్గాలను అనుసరించారు అనువాదకులు.**

మరొకచోట గిరీశం "వకీళ్ళు అబద్ధాలాడిస్తే, న్యాయం కనుక్కోవడానికి జీతం పుచ్చుకునే జడ్జీ యేం చేస్తాడండీ?" అన్నప్పుడు సౌజన్యారావు "ఉభయ పార్టీలవాళ్ళు ఆడించే అబద్ధాలు చెయ్యి పీకేటట్లు రాసుకుంటారు" అంటాడు.

ఇలా గురజాడవారు పండించిన హాస్యం రెండు అనువాదాలలో వేర్వేరుగా కనిపిస్తుంది. మొదటి అనువాదంలో 'He notes down copiously' గానూ, రెండవ అనువాదంలో literal గా 'He takes notes, until his hand aches' గాను అనువదించబడింది. ఇలా మూలాన్ని, దాని భావాన్ని మక్కికి మక్కిగా అనువదించినా గమ్య భాషా పాఠకులకు అర్థమవుతుందనుకున్నప్పుడు literalగా అనువదించినా ఎటువంటి నష్టం ఉండదు. ఇలాంటిదే మరొక ఉదాహరణ గమనించండి :

సౌజన్యారావు : క్రాసెగ్జామినేషను ఆరంభం అయ్యేసరికి యెంతటి సాక్షీ కవిత్వం ఆరంభిస్తాడు.

ఈ వాక్యంలోని 'కవిత్వం' అనే పదాన్ని మొదటి అనువాదకులు 'fabricating stories' గా దాని భావాన్ని విశదపరచగా, రెండవ

అనువాదంలో యథాతథంగా 'poetry' గా అనువదించారు వేల్చేరు గారు. దీనివలన మూలంలో కొత్తగా, metaphoric గా చెప్పిన విషయాన్ని అలాగే అనువదించటం, దాని అంతర్గత భావాన్ని విప్పి చెప్పకుండా ఉంచటం చాలా సమంజసంగా, మూలానికి న్యాయం చేసే విధంగా ఉంది. ఇలా మూలంలో బహిర్గతంగా చెప్పకుండా, పరోక్షంగా అంతర్గతంగా సూచించిన విషయాన్ని అదేవిధంగా ఉంచటం హర్షణీయం. ఏ అనువాదంలోనైనా మూలంలో implicit గా ఉండే విషయాలు explicit గా చెప్పబడటం సర్వసాధారణమైన మార్పే.

**అనువాదకులు అప్పుడప్పుడూ ఎదుర్కొనే మరో సమస్య ఒకటుంది.**

అనువాదకులు అప్పుడప్పుడూ ఎదుర్కొనే మరో సమస్య ఒకటుంది. ఈ క్రింది వాక్యాలను గమనించండి :

గిరీశం : షేక్ స్పియర్ అన్నాడు కూడా అండి 'వాట్సినే నేమ్?' అని. దానిని నేను చిన్న గీత ముక్కగా తర్జుమా చేశానండి. "పేరులోన నేమి పెన్నిధియున్నది?".

ఇలా తెలుగు మూలంలోనే ఇంగ్లీషు వాక్యం, దాని తెలుగు తర్జుమా ఉండి, తర్జుమా గురించిన ప్రస్తావన ఉన్నప్పుడు దాన్ని ఇంగ్లీషులోకి ఎలా అనువదించాలి? ఈ విషయంలో మనం పరిశీలిస్తున్న రెండు అనువాదాలు ఎలాంటి పద్ధతిని అవలంభించాయో చూద్దాం :

Eng. Tr. 1 :

Girisam : Didn't Shakespeare say 'what's in a name?' I have translated it into a dictum, Sir : 'Is there a treasure in a name?'

Eng. Tr. 2 :

Girisam : Shakespeare said : what's in a name? I translated this line into a line of Telugu verse : 'perulona nemi pennidhi yunnadi.'

ఈ రెండు అనువాదాలు గమనిస్తే మొదటి అనువాదంలో మూలం పూర్తిగా మారిపోయింది. షేక్ స్పియర్ మాటను తిరిగి ఆంగ్లంలోకే paraphrase చేసినట్లుగా ఉంది. మూలానికి చాలా భిన్నంగా ఉంది అనువాదం. అయితే రెండవ అనువాదంలో మాత్రం అనువాదకులు మూలానికి ఎటువంటి నష్టం జరగకుండా అనువదించటం, తెలుగు వాక్యాన్ని యథాతథంగా retain చేయటం చక్కటి ప్రయత్నంగా చెప్పక తప్పదు.

**తల చెడటం అనేది విధవరాలు అనే అర్థంలో వాడటం తెలుగు సంస్కృతికీ, ఆచారానికీ పరిమితమైనది**

కన్యాశుల్కంలో అనేక సన్నివేశాలు ఎంతో హాస్యభరితంగా ఉంటాయి. అలాగే భాషద్వారా కూడా గురజాడవారు హాస్యాన్నీ, చమత్కారాన్నీ పండించారు. మచ్చుకు మూడు ఉదాహరణలు చూద్దాం.

గిరీశం : వాట్, యీమె నీ సిస్టరా ? తల చెడ్డట్లు కనబడుతున్నదే ?

వేంకటేశం : మా అక్కే, జుత్తుకి చవుర్రాసుకోదు.

గిరీశం : తల చెడ్డం అంటే విడో అన్నమాట. చవురు గివురూ జాంతేనయ్.

ఇక్కడ 'తల చెడటం' అనేది 'విధవరాలు' అనే అర్థంలో వాడటం తెలుగు సంస్కృతికీ, ఆచారానికీ పరిమితమైనది కావటం వలన ఇంగ్లీషు అనువాదాలలో తెలుగులో ఉన్నట్లు చమత్కారభరితంగా రాయటానికి వీలు పడదు. కాకపోతే దాని అర్థం తెలుగుమూలంలోనే వివరించబడినది కాబట్టి యథాతథంగా 'తల చెడటం' అనే దాన్ని దాని literal meaning లో వేంకటేశం అర్థం చేసుకున్నట్లుగా అనువదించారు ఇరువురు అనువాదకులు. దాంతో అనువాదాలు పేలవంగా ఉన్నాయి.

Eng. Tr. 1 :

Girisam : What ! She is your sister ? Looks as though her hair has been uncared for ?

Venkatesam : Yes, she is my sister. She doesn't oil her hair.

Girisam : To have ones hair uncared for means widowhood. Oil or Geeyil – forget it.

Eng. Tr. 2 :

Girisam : Is this your sister ? Looks like a case of ruined–hair ?

Venkatesam : Yes, she doesn't comb her hair properly.

Girisam : That's not what I meant. A ruined–hair means a widow, not combing your hair and stuff.

ఈ రెండు అనువాదాలను పరిశీలిస్తే, కొంత మేరకు, రెండవ అనువాదంలో 'a case of ruined hair' అనటంలో మూలానికి న్యాయం జరిగింది.

మరొక సందర్భంలో తెలుగులో గల 'నీ', 'మీ' లేదా 'నువ్వు', 'మీరు' భేదాన్ని ఆధారంగా చేసుకొని గురజాడవారు ఒక చక్కటి సంభాషణను వారి రచనలో జొ ప్పించారు. ఇది హెడ్ కానిస్టేబులుకూ, రామప్ప పంతులుకూ మధ్య జరిగే సంభాషణ.

హెడ్ : నేనెలా వస్తాను నీతోటి, నాకు చాలా పనుంది. ఒక కానిస్టేబుల్ని నీతో పంపిస్తాను.

రామ : (హెడ చెవిలో) నా యింట్లో మాత్రం నకార ప్రయోగం చెయ్యకు, నీకు పుణ్యముంటుంది.

హెడ్ : అదా నీ ఘోష! అలక్కానియి (నిష్క్రమించును)
రామ : (తనలో) అదుగో మళ్ళీ ఏకవచనమే కూస్తాడు.

ఈ సంభాషణ ఇంగ్లీషు అనువాదాలలో ఎలా ఉందో గమనించండి :

Eng. Tr. 1 :

Head : How can I come with you ? I have plenty of other work. I'll send a constable with you.

Rama : (In the Head's ear) Don't use the singular form of address at least in my house, please.

Head : Is that your worry ! Alright, let that be (exits)

Rama : (To himself) There, again he uses the same singular.

Eng. Tr. 2 :

Head : I have things to do. I can't come to the station, pantulu. I'll send a constable to take you.

Rama : (in his ear) I beg you, don't address me without the 'garu' in my house.

Head : Is that the problem ? Whatever you say, pantulu. (exits)

Rama : (To himself) see he still says 'pantulu' and not 'pantulu garu'.

మొదటి అనువాదంలో 'న' కార ప్రయోగాన్ని 'singular form of address' గా అనువాదకులు అనువదించారు. ఇంతకుమించి ఇంగ్లీషులో మరో మార్గం లేదు. అయితే రెండవ అనువాదంలో అనువాదకుడు మూల సంభాషణ ను కొద్దిగా మార్చి, అందులో ఉన్న భావం తెలుగేతరులకు పూర్తిగా అర్థమయ్యేలా ఎంతో స్వతంత్రంగా అనువదించారు. 'నీ', 'మీ' భేదాన్ని 'పంతులు', 'పంతులుగారు' ద్వారా చూపించే ప్రయత్నం చేశారు. కాకపోతే మూలంలో 'న కార ప్రయోగం' అని ఎంతో చమత్కారంగా గురజాడవారు చేసిన ప్రయోగం మూలభాషా పాఠకులను ఆకాంక్షించినట్లు రెండు ఇంగ్లీషు అనువాదాలు గమ్య భాషా పాఠకులను ఆకర్షించలేవు. అవి రెండూ తెలుగులో ఉన్న విషయాన్ని మాత్రమే తెలియజేస్తాయి. కానీ, ఆ విషయాన్ని చెప్పిన వినూత్నశైలిని తెలియపరచలేవు.

ముగింపుగా చెప్పాలంటే మొదటి అనువాదంతో పోలిస్తే రెండవ అనువాదం అనేక సందర్భాలలో మూలానికి దగ్గరగా ఉంది. ముఖ్యంగా మూలంలోని సాంస్కృతిక అంశాలను ఎక్కడా వదిలివేయకుండా అనువదించటం, అవసరమైనవాటికి పుస్తకం చివర 'Notes' ఇవ్వటం చేశారు నారాయణరావు గారు. ఈ అనువాదం విదేశీయులకు మన సాహిత్యాన్నీ, మన సంస్కృతినీ

పరిచయం చేయటానికి ఉద్దేశింపబడినది కాబట్టి అటువంటి విషయాలకు పెద్దపీట వేయటం జరిగింది. ఉదాహరణకు మొదటి అనువాదంలో 273 పేజీలు main text, రెండు పేజీలు glossary ఉన్నాయి. ఈ glossary లో మూలగ్రంథంలోని పదాలను యథాతథంగా అనువాదంలో ఉంచిన వాటి వివరణ 50 entries లో ఉంది. రెండవ అనువాదం 245 పేజీలు (online version) main text తోపాటు చివర 90 పేజీలలో కన్యాశుల్కం నాటకానికి సంబంధించి మాత్రమే కాకుండా తెలుగు భాషకూ, సంస్కృతికీ చెందిన అనేక విషయాలకు వివరణను కూడా ఇంగ్లీషు పాఠకులకు అందజేస్తుంది. మరో రకంగా చెప్పాలంటే వేల్చేరు నారాయణరావు గారి అనువాదం ఒక పాఠ్యపుస్తకం లాగా విశ్వవిద్యాలయాలలో అధ్యయనం చేయటానికి పనికి వస్తుంది. అయితే మనం గమనించాల్సిన ముఖ్య విషయం ఏ అనువాదానికైనా దాని నేపథ్యం, ముఖ్యోద్దేశం, ఎంచుకున్న గమ్యభాషా పాఠకుల వంటి విషయాలు చాలా కీలకపాత్ర వహిస్తాయి. వాటి కనుగుణంగానే అనువాదం రూపుదిద్దుకుంటుంది. మనం పరిశీలించిన రెండు అనువాదాల విషయంలో కూడా ఇవే అంశాలు రెండింటి మధ్య తేడాలకు కారణం.

తెలుగు సాహిత్యానికే మణిమకుటం లాంటి ఉత్తమ గ్రంథం కన్యాశుల్కాన్ని, అది మొదటగా ముద్రితమైన దాదాపు ఒక శతాబ్దం తర్వాత ఆంగ్ల పాఠకులకు అందించాలనే సదుద్దేశ్యం ఎంతో హర్షణీయం. ఇది ఒక రకంగా అటు గురజాడవారికి, ఇటు తెలుగు సాహిత్యానికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆంగ్ల పాఠకుల గుర్తింపు, ఆదరణ తీసుకురావటంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తుంది. ఇలా ఒక సంస్కృతీ, సాంప్రదాయంలో పూర్తిగా కూరుకుపోయిన నాటకాన్ని మరొక భిన్న సంస్కృతీ సాంప్రదాయాలు గల భాషలోకి అనువదించటం అంత సులభమైన పని కాదు. ఈ విషయంలో అనువాదకులు చేసిన కృషి అభినందనీయం. ఈ ఇంగ్లీషు అనువాదాల ఆధారంగా కన్యాశుల్కం నాటకం ఇతర భారతీయ, విదేశీ భాషలలోకి అనువదించబడే అవకాశం కూడా ఉంది. ఆ తరుణం త్వరలోనే వస్తుందని ఆశిద్దాం.

## ప్రధాన ఉపయుక్త గ్రంథాలు :

* పెట్టి ఈశ్వరరావు (సంపాదకులు). 1986. గురజాడ రచనలు – కన్యాశుల్కం.
* హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
* రమణమూర్తి, ఆర్.వి. (సంపాదకులు). 2012. గురజాడ సాహిత్య సర్వస్వం.
* హైదరాబాద్ : డిపార్ట్ మెంట్ ఆఫ్ కల్చర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం & తెలుగు అకాడెమి.
* వేల్చేరు నారాయణరావు, 2007. Girls for sale : Kanyasulkam – A play from colonial India.
* Bloomington & Indianapolis :
* Indiana University Press.

## Other References:

* Baker, Mona and Gabriela Saldana. 2009. Routledge Encyclopaedia of Translation Studies. New York: Routledge.
* Bassnett, Susan. 2014(4th Edition). Translation Studies. New York: Routledge.
* Cronin, Michael. 2017. Eco–Translation. Translation and Ecology in the Age of Anthropocene. New York: Routledge.
* Gentzler, E. 1993. Contemporary Translation Theories. New York: Routledge.
* Katan, David, and Mustapa Taibi. 2021. Translating Cultures: An Introduction for Translators, Interpreters and Mediators. New York: Routledge.
* Venuti, Lawrence. 2017. The Translator's Invisibility. A History of Translation. New York: Routledge.

# గురజాడ గాత్ర హారం, ముత్యాల సరం



డాక్టర్ చేకూరి రామారావు



ప్రతి సాహిత్యంలోనూ, అది లిఖితమైనా, అలిఖితమైనా, నాగరికమైనా, జానపదమైనా, గద్య పద్య భేదాలుంటై. గద్యంలోనూ, పద్యంలోనూ ఉండేది వాక్యాలే అయినా, వాక్యాలు ప్రయోగించే తీరులో భేదం ఉంటుంది. ఆ భేదం ప్రధానంగా పదక్రమాల వరుసలో ఉంటుంది. అసలు సాహిత్య భాషకీ, వ్యవహార భాషకీ మధ్య కూడా కొన్ని భేదాలుంటై. వ్యవహారంలో భాషకు అభిప్రాయ ప్రకటనమే ప్రధానం. సాహిత్యంలో భాషకు అభిప్రాయ ప్రకటనతోపాటు సౌందర్య దృష్టి ఉంటుంది. శాస్త్ర రచనలో సౌందర్య దృష్టికన్నా, అధికంగా విషయ వివరణ, శాస్త్ర సంక్షిప్తత ఉంటాయి. ఈ భేదాలిట్లా ఉండగా గద్యానికీ, పద్యానికీ మధ్యని ఇంకో ప్రధాన భేదం ఉంది. భేదం వర్ణ నిర్మాణ క్రమంలో ఉంటుంది. గద్యంలో వర్ణ నిర్మాణ క్రమానికి సంబంధించి ప్రత్యేకమైన నియమాలుండవు. భాషలో వున్న శబ్దజాలానికి వున్న వర్ణ నిర్మాణ క్రమం తప్ప, సాహిత్య రచయిత ప్రత్యేకంగా పెట్టుకునే నియమాలేవీ ఉండవు. భాషలో శబ్దజాలానికి ఒక్కొక్క భాష ననుసరించి కొన్ని వర్ణ క్రమ నియమాలుంటై. ఉదాహరణకి, నేటి తెలుగు మాటల్లో పదాదిన సంయుక్త వర్ణాలూ, పదాంతంలో దీర్ఘాచ్చులూ ఉండవు. ఈ రెండూ సంస్కృతం మాటల్లో ఉంటాయి. తెలుగు నామాల్లోను, క్రియల్లోను దీర్ఘాచ్చు మొదటి అచ్చుగానే వస్తుంది. ఓ అనే అచ్చు కూడా మొదటి అచ్చుగానే వస్తుంది. తెలుగులో వచ్చే మూడు హల్లుల సంయోగంలో మొదటి హల్లు అనునాసికమై ఉంటుంది. మూడో హల్లు ర, ల అయి ఉంటాయి. ఇట్లా

> పద్య రచనకు, గద్య రచనకు ఇంకో భేదం ఉంది. గద్య రచనలో లేని పాదబద్ధత పద్యరచనలో ఉంటుంది

వర్ణక్రమాల్ని గురించి ప్రతి భాషకు ప్రత్యేకమైన నియమాలుంటై. గద్య రచనలో వీటికి మించిన వేరే వర్ణక్రమ నియమాలు లేవు. కాని పద్య సాహిత్యం అట్లా కాదు. ఈ పై నియమాలున్న పదాల్ని ఎన్నుకున్నా, వీటికంటే భిన్నమైన అక్షర క్రమ నియమాలు పాటిస్తూ పద్యరచన జరుగుతుంది. భాషలో అంతకుముందే ఉన్న నియమాలతోబాటు వేరే అక్షర క్రమ నియమాలను ఏర్పరచుకొన్న రచన అంతా 'పద్య రచనే' అని వ్యవహరించాను. ఈ పద్య రచనకు తెలుగులో మూడు సంప్రదాయాలు ప్రసిద్ధంగా ఉన్నై. అవి : వృత్తాలు, జాతులు, గేయాలు.

పద్య రచనకు, గద్య రచనకు ఇంకో భేదం ఉంది. గద్య రచనలో లేని పాదబద్ధత పద్యరచనలో ఉంటుంది. ఈ పాదాలకు అంతర్నిర్మాణం (Internal Structure) బాహ్యపరిమితి (External limit) అనేవి ఉంటాయి. వీటి భేదాల్ని బట్టి పద్య భేదాలు ఏర్పడతై. వృత్తాల్లో అంతర్నిర్మాణం గురు లఘు క్రమం మీద ఆధారపడి ఉంది. బాహ్య పరిమితి అక్షర సంఖ్య మీద ఆధారపడి ఉంది. వృత్తాల్లో గురు లఘు క్రమం ప్రతి పాదానికీ నిర్దిష్టం. అట్లాగే అక్షర సంఖ్య కూడా. గేయాలు – అంటే మాత్రా ఛందస్సుల్లో అంతర్నిర్మాణం మాత్రా సంఖ్య మీద, లేక మాత్రా సంఖ్యతో ఏర్పడ్డ గణాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ గణాలనే మాత్రా గణాలంటారు. మాత్రా ఛందస్సుల్లో బాహ్యపరిమితి మాత్రాసంఖ్యతో గాని, లేక మాత్రా గణసంఖ్యతో గాని చెప్పొచ్చు. కొన్ని ఛందస్సుల్లో మాత్రా గణ క్రమం ముఖ్యం. సాధారణంగా వృత్తాల్లో సమపాదాలుంటై. మాత్రా ఛందస్సుల్లో సమపాదాలు లేనివి కూడా ఉంటై. జాతుల్లో కొన్ని రకాల అక్షరక్రమాల్ని సహించే గణాల క్రమంతో అంతర్నిర్మాణాన్ని, బాహ్య సరిమితిని చెప్పాల్సి ఉంటుంది. పద్య నిర్మాణంలో వృత్తాలకు అక్షర క్రమ ప్రాధాన్యం వుంది గానీ, గణ ప్రాధాన్యం లేదు. జాతులకు, మాత్రా ఛందస్సులకు గణ ప్రాధాన్యం ఉంది.

గురజాడ అప్పారావుగారు అన్ని రకాల ఛందస్సులను వాడారు. అయితే ఆయన రాసిన వృత్తాలు, జాతులు – 'ఆయన అది కూడా రాయగలడు' అని చెప్పడానికి మాత్రమే పనికి వస్తున్నాయి. ఆయన ప్రధానంగా చెప్పదలుచుకున్నవి,

సందేశాత్మకంగా రచించినవి గేయాల్లోనే ఉన్నవి. నీలగిరి పాటల్లో చతురస్ర గతి, త్రిశ్ర గతి, ఖండనతో నడకల్లో రాసిన పాటలున్నె. వీటికి కూడా అంత ప్రచారం లేదు. ప్రకృతి సౌందర్యోపాసకుడిగా రాసినే ఈ పాటల్లో సందేశ గుణం లేకపోవటం వల్ల వీటికంత ప్రాచుర్యం లభించలేదు.

"ముత్యాలసరాలు" పేరుతో అచ్చె ప్రచారంలో ఉన్న పుస్తకంలో రెండు రకాల ఛందస్సులు వాడారు. అందులో "పూర్ణమ్మ" ఒక్కటే చతురస్రగతిలో ఉంది. మిగతావన్నీ "ముత్యాలసరం" అనే మిశ్ర గతిలో ఉన్నాయ్. ఈ ముత్యాలసరం ఈయన పెట్టిన పేరే. ఈ ముత్యాలసరానికి ఆయన పాటించానని చెప్పుకున్న నియమం సంపూర్ణమైనది కాదు. "మొదటి మూడు పాదములందును 14 మాత్రలుండును, 4వ పాదమున 7 మొదలు 14 వరకు ఉండును. అని చెప్పి ఒక జాతి పార్సీ గజల్ యొక్క నడక ముత్యాల సరాలలో తెచ్చుటకు నే ప్రయత్నించితిని" అని అన్నారు. ముత్యాలసరం నడకతో సరిపోతే గజల్ ను హాఫీస్ రచన నుంచి నారాయణరెడ్డి గారు ఉదాహరించారు. అది కూడా మిశ్రగతిలోనే ఉంది. త్రిశ్ర, చతురస్ర గతుల మిశ్రమమే మిశ్రగతి. అంటే పాదంలో ఉండే 14 మాత్రలూ, 3, 4, 3, 4 మాత్రల గణాలుగా విభక్తమవుతై. ముత్యాలసరానికి ప్రాచీన తెలుగు ఛందస్సుల్లో "వృషభగమన రగడ"కు పోలికలు పూర్వమే వాసిరెడ్డి భాస్కరరావు గారు చూపించారు. "వృషభగతి రగడ"కు అప్పకవి బాహ్య పరిమితే ఇచ్చారు గాని, అంతర్నిర్మాణం చెప్పలేదు. ఆయన లక్ష్యం కవి ప్రయోగభిన్నంగా ఉంది. అనంతుడిచ్చిన లక్షణం ఇంతకన్నా స్పష్టంగా ఉంది. ఆయన లక్ష్యాలూ మిశ్రగతిని పాటిస్తూ ఉన్నె. హరిణగతి రగడ కూడా ఇదే నడక. హరిణగతిని రెట్టిస్తే వృషభ గతి వస్తుంది. గురజాడ అప్పారావుగారు ఈ పోలికని ఎందుకు చెప్పలేదో తెలియదు. కన్నడంలో షట్పదులు మాత్రా ఛందస్సులు. అందులో "భామినీ షట్పది" అనేది మిశ్రగతిలో నడిచే ఆరు పాదాల



పద్యం. (నారాయణరెడ్డి గారు మూడు పాదాలే ఉంటాయనటం ప్రామాదికం) అయితే భామినీ షట్పదిలో 3వ పాదం పెద్దది. సుమారుగా 1½ పాద ప్రమాణం కలిగింది. సరిగ్గా చెబితే 1½ పాదం మీద ఒక గురువు వుంటుంది. ఈ మూడో పాదంలో అధికంగా ఉన్న భాగాన్ని 4వ పాదంగా చెప్పి పద్యం అంతటితో ఆపితే అది "ముత్యాలసరం" అవుతుంది. అయితే ముత్యాల సరంలో 4వ పాదం అన్ని చోట్ల ఒకే రకంగా ఉన్నట్లు లేదు. "లవణరాజు కల", "డామన్ పితియస్" కథల్లో మాత్రం ఆయన ఈ పద్ధతిని సక్రమంగా పాటించారు. మిగతాచోట్ల చాలా ప్రభేదాలున్నాయ్. ఈ రకం నడక 4వ పాదంలో 9 మాత్రలతో సహా ప్రాచీన యక్షగానాల్లోనూ ఉన్నాయ్. ఉదాహరణకు కంఠీరవరాజు యక్షగానాకృతిలో నుంచి ఈ భాగం చూడండి.

మేలుకొనవే చంద్రశేఖర
మేలుకొనవే ఇంద్ర నందిత
మేలుకొనవే ఫాలలోచన
నీలకంఠ హరా !

అయితే ఈ పోలికలను గూడా గురజాడ అప్పారావు గారు ఎందువల్లనో చెప్పలేదు. ఈరకపు నడక జానపద సాహిత్యంలోనూ కనిపిస్తుంది. నా చిన్నతనంలో ఒక గొడ్లకాపరి తన ఎరుకలో ఉన్న సంఘటనను తీసుకొని రచించిన ఈ పాట చూడండి.

ఇరిసినా పొగాకు తీపి
కొత్త కుండలో కల్లు తీపి
కోరినా తిరపమ్మ తీపి
ఇంటి దొరసానేమి తీపండో –

మల్లయ్యదొరలు

ఈ పై గేయంలో గమనించాల్సిన కొన్ని విశేషాలున్నై. మొదటి మూడు పాదాల్లో ఉన్న తీపి అనే మాటలో చివరి అచ్చు హ్రస్వం. అయినా ఉచ్చారణలో దీర్ఘమౌతుంది, మాత్ర ఛందస్సులో పాదాంతంలోగాని, పద్యాంతంలోగాని ఉన్న లఘువును గురువుగా ఉచ్చరించే సంప్రదాయం ఉంది. గురజాడ అప్పారావుగారు పద్యాంతంలో మాత్రమే ఈ సంప్రదాయాన్ని వాడుకున్నారు.

ఉదాహరణకు :

ఎల్ల లోకము ఒక్క ఇల్లై
వర్ణ భేదము లెల్ల కల్లై
వేల నెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియ

ఇందులో చివరి లఘువును గురువుగా ఉచ్చరించాలి. పైన పేర్కొన్న జానపద గేయంలో 'మల్లయ్యదొరలు' అనేది మిగతా పాదాల నడకతో భిన్నమైంది. ఇది ఒకవేళ గేయంలాగ చదివినా పై నడకకన్నా భిన్నంగా చదవాలి. ఇట్లాంటి అధిక భాగాలు అప్పారావుగారి "కన్యక"లో యెక్కువగా కనిపిస్తాయ్. "కన్నెవరత తెంచన్" అన్న నాలుగో పాదం తర్వాత "రాజవీధిని" అనేది అధికంగా చేర్చిన వేరు మాత్రలు. "చెలగ చెలికత్తెల్" అన్న నాలుగో పాదం తర్వాత కూడా "వెంట నడిచిరె" అన్నది అట్లాంటిదే. అయితే ఈ అధిక భాగం కూడా చతురస్రగతిలోనే ఉంది. కాని అన్నిచోట్ల అట్లా లేదు. ఉదాహరణకు ఈ కింది భాగంలో

తడవుచేయక, తల్లడిల్లక
నేడు రేపని గడువు పెట్టక
నెమ్మిగోరితి వేని కన్నియ
నిమ్ము, లేకుంటే – పొమ్ము

ఇక్కడ "పొమ్ము" అనేది అధిక భాగం. ఇట్లాంటి అధిక భాగాలకు "తెలుగు సాహిత్యంలో విప్లవాల స్వరూపం" అనే సిద్ధాంత వ్యాసంలో వెల్చేరు నారాయణరావు ఒక కొత్తరకం వివరణ నిచ్చారు. జానపదాల కథాకథనంలో పాట మధ్యలో అక్కడక్కడ వచనపు తుంటల్ని మధ్యలో ప్రయోగించే సంప్రదాయం ఉందని, ఆ సంప్రదాయాన్నే అప్పారావుగారు ఇక్కడ పాటించారనీ వివరణ. కానీ అధికంగా చేర్చిన "కన్యక" కథలోని ఈ భాగాలు గురజాడ అప్పారావుగారు వచనపు తుంటలుగా భావించాడనటానికి ఆధారం కనపడదు. ఈ అధికభాగం ఒకచోట మూడు మాత్రలుగాను, ఇంకొకచోట 3 + 4 మాత్రలుగాను, మరొకచోట 3 + 4+ 3 మాత్రలుగాను కనిపిస్తున్నది. అంటే ఈ అధికభాగం ఒక పాదంలో ఒక గణంగా కానీ, లేక రెండు గణాలుగా కానీ, లేక మూడు గణాలుగా కానీ కనిపిస్తుంది. అంటే అప్పారావుగారు ముత్యాల సరాల్లో అధికంగా చేర్చిన ముక్కలు ముత్యాల సరంలో ముక్కలుగానే పరిగణించాలిగానీ, వచనంగా పరిగణించడానికి

వల్లపడదని తెలుస్తున్నది. అయితే జానపదుల కథాకథనంలో కూడా పాదాల్లో ఇమడని భాగాల్ని లయాత్మకంగానే చదువుతారను కొంటాను. ఆ సంప్రదాయాన్నే అప్పారావుగారు తన కవిత్వంలో గ్రహించి ఉండొచ్చు.

"నాగరిక కవిత్వంలో జానపదరీతుల్ని ప్రవేశపెట్టి నాగరిక, జానపద కవిత్వాల మధ్య అంతరాన్ని అంతం చేయటమే గురజాడ తెచ్చిన విప్ల వం" అని నారాయణరావు ప్రతిపాదించిన సిద్ధాంతానికి పై వాదం ప్రతిబంధకం కాదు. ముత్యాలసరంలో అప్పారావుగారు సూచించిన భేదాలను 16 విధములుగా నారాయణరెడ్డి గారు విభజించారు. పాదాంతంలోను, పద్యాంతంలోను, (అరుదుగా గణాంతంలోనూ) చివరి లఘువుకు గురువుగా ఉచ్చరించే సంప్రదాయాన్ని గ్రహిస్తే ఇన్ని భేదాలుండవు. ఈ భేదాల్ని నాలుగు రకాలుగా విభజించవచ్చు. (1) సంపూర్ణంగా సమపాదాలున్నవి. (2) నాలుగో పాదంలో 3 గాని, 3 +4+ గురువు కానీ, 3 + 4+ 3 + గురువు కానీ ఉన్నవి. (3) నాలుగో పాదం అయిన తర్వాత కొంత అధిక భాగం ఉన్నవి. (1) పాదాదిన ఒక గురువు అధికంగా ఉన్నవి. ఈ నాలుగో పద్ధతి చాలా అరుదుగా కనిపిస్తున్నది.

దేశాభిమానము నాకు కద్దని
వట్టిగొప్పల చెప్పుకోకోయ్

అనే చోట దే అనేది పాదాదిన చేర్చిన అధిక గురువు. బహుశా దీనికి కూడా వెతికితే జానపద గేయాల్లో మూలం కన్పించొచ్చు. శ్రీశ్రీ ఈ బాణి గురజాడ నుంచే గ్రహించాడో లేదో చెప్పలేంగాని, పూర్తిగా 20 పాదాల గేయమొకటి "హారతి" అనే పేరుతో 1980లో రచించాడు. ఉదాహరణగా అందులో కొంతభాగాన్ని గ్రహించండి :

ఈ తామసీ నిశ్శబ్ద హృది మన
కియ్యరకు స్వాగతముగా
శ్వేత స్మితామృత శిశిర వీచీ
కరము లొలయించగా

ఈ గేయంలో బేసి పాదాల్లో 16 మాత్రలు, సరి పాదాల్లో 12 మాత్రలు ఉన్నాయి. అంటే సరి పాదాల్లో 2 మాత్రలు తరిగి బేసి పాదాల్లో రెండు మాత్రలు పెరిగినయ్యన్న మాట. ఇది మిశ్రగతి నడక కాబట్టి తరిగింది సరిపాదాల చివర అనీ, పెరిగింది బేసి పాదాల మొదట అనీ సులభంగా గ్రహించవచ్చు.

ఇక ముత్యాలసరంలో సహజంగా కవులు పాటిస్తున్నా, విమర్శకులు స్పష్టంగా చెప్పని ఒక లక్షణం ఉంది. మిశ్రగతి గణాలలో అనులోమగతి వచ్చే గణాలే కాని, విలోమగతి వచ్చేగణాలు వాడకూడదు. అంటే 3 మాత్రల గణానికి లగం కానీ, 4 మాత్రల గణానికి జగణం కాని ముత్యాలసరంలో ఇమడదు. అయితే గురజాడ అప్పారావుగారు అరుదుగా లగం వాడిన ఘట్టాలున్నై.

'మతం వేరైతేను ఏమోయ్'

అనే పాదంలో మొదటి మూడు మాత్రలు లగంగా విభక్త మవుతుంది. కాని 4 మాత్రల గణ స్థానంలో జగణం వేసిన ఉదాహరణలు నాకు లభించలేదు. ఒక గురజాడే కాదు, ముత్యాల సరం వాడిన ప్రసిద్ధ కవు లెవ్వరూ అట్లా వాడలేదు. దానికి కారణం ఊహించడం సులభమే. 3, 4 క్రమంలో ఉండాల్సినచోట జగణం వేస్తే 4, 8 గా విభక్త మవుతుంది. జగణంలో మధ్య గురువుంటుంది. కనుక ఉనికి ఆ గురువు మీదనే ఉంటుంది. అప్పుడు గురువుకి పూర్వం ఉన్న లఘువు పూర్వగణంతో చేరి 3 + 4 కు బదులుగా 4 + 3 క్రమం కన్పించి మిశ్రగతికి భంగం వస్తుంది. లగం వాడినందువల్ల 'విలోమగతి' వస్తుంది కానీ మిశ్రగతికి భంగం కలుగదు. 'విలోమగతి' ప్రియుడైన శ్రీశ్రీ రాసిన ముత్యాల సరాల్లో ఈ 'లగం' ప్రయోగం అధికంగా కనిపిస్తుంది. ['The snows of yester year' అనే పద్యంలో శ్రీశ్రీ ఇట్లాంటి వాడుక ఎక్కువ చేశాడు.]

ముత్యాలసరం నడకలో గురజాడ అప్పారావుగారు చూపించిన అందాలు చాలా ఉన్నాయి. అవి :

1. గణాంత విరామం పాటించటం వలన :

అల్ల పింఛము ఎత్తినంతనె
వెల్ల గుర్రం బొకటి అంచల
పల్లటీల్ పస నొడయ నుల్లము
కొల్ల గొని వచ్చెన్

ఇక్కడ మొదటి రెండు పాదాల్లో గణాంత విరామం గమనింపదగింది. అంతేకాక చిన్న పద్యం కావటం వలన ఇందులో ఉపయోగించిన ప్రాస, వృత్తాల్లో నియమంగా వాడిన ప్రాసకన్నా అనుప్రాసగా భాసిస్తూ పద్యానికి అలంకారాన్ని తెచ్చింది.

2. మధ్య విరామం వల్ల :

పట్టవలెరా దీని బలిమిని
కొట్టవలెరా మరుని రాజ్యం
కట్టవలెరా గండెపెండం
రసిక మండలిలో

3. పాదాంత విరామం లేనివి :

పట్టమే లే రాజ ! బలిమిని
పట్టవలెనా నీదు సొమ్మే
కాద కన్నియి నీవు కోరుట
కన్న మరి కలదా –

వైశ్యజాతికి వన్నె

4. ప్రాస :

ఇంతకు ముందే చెప్పినట్లుగా "ముత్యాలసరం" చిన్న పద్యం కనుక ఇందులో ఉపయోగించే యతి ప్రాసలు వృత్తాల్లాగా కాకుండా పద్యానికి అనుప్రాస ఇచ్చే అందాన్ని ఇస్తుంది. అందులో ద్విత్వ ప్రాసం, బిందుయుక్త ప్రాసం, పద్యం నడకకి అందంగా ఉంటయ్. "లవణరాజు కల" లో ఇటువంటివి చాలా ఉన్నె. మొదటి మూడు పద్యాలూ ఇందుకుదాహరణగా గ్రహించవచ్చు. ఒకటి మాత్రం ఉదహరిస్తాను.

నిండు కొలువున లవణు డను రా
జుండె జాలికు డొకడు దరిజని
దండినృప ! ఒక గండు గారడి
కలదు కనుమనియెన్.

ఇట్లా గురజాడ అప్పారావుగారు మాత్రా ఛందస్సులో మిశ్రగతి నడకను గ్రహించి దాన్ని ముత్యాల సరంగా తీర్చిదిద్దారు. శ్రీశ్రీ అన్నట్లుగా ఈ ఛందస్సులో పూర్వ కవు లెవరు రచించినా ముత్యాల సరం గురజాడ అప్పారావు గారిదే.

"పెద్ద కొండలు, నదులు, వృక్షాలు, నా మాటలు – ఇవా ప్రజకు ధైర్య సాహసాలు, ఉత్తేజమూ కలిగించేవి? అన్ని కాలాలలోనూ ఇవి స్థిరంగా ఉండేవే. ఒక్కో యుగంలో ఒక్కో జాతి ప్రజలు ఆయా ప్రదేశాల్లో ఉంటారు. వారిలో మహానుభావులు, వారి గుణాలు, జాతి జీవితం – ఇవే వర్ణనీయమైనవి. ప్రజలలో చైతన్యం లేవగొట్టేవివే."

– గురజాడ

# గురజాడ గురజాడ

రచన : శ్రీ తుంబలి శివాజీ

గురజాడ గురుజాడ గురిజాడవోయీ..
తిరమైన మార్గాల తిరుగాడవోయీ...
మనిషినే మనిషిగా మనమనే మహితుని
మాననీయుని, నిత్య మననీయునీ తెలిసి... ||గురజాడ||

1) తోటివారికి కొంత తోడుపడమను వాని
మేలు చేసేవాడు మెరుగని తలపోయు
దేశమంటే మనిషి, దేశభక్తిని తలచి
ద్వేషమంటనినాడు తేజమును గాంచునను ||గురజాడ||

2) గతుకుల గతమును గమనించుకొని సాగి
ఉజ్జ్వలభవితకై ఉరకమను గీతాన
జాగు సేయక జనులు జాగృతిని అందుకొని
చెట్టపట్టాల్ పట్టి చెలిమిగా నడవమను ||గురజాడ||

3) మంచి పెంచేలాగ, మనసు పంచే లాగ
శ్రమకు విలువను పెంచి శ్రద్ధగా బ్రతకమను
ఒకరికొకరై నిలుచుటే సత్య ప్రేమని
వినువీధి వినుదాక విశ్వప్రేమను చాటు ||గురజాడ||

4) పదుగురాడే మాట పలుకుతేనెలమూట
నలుగురీ నడదారి నయమౌను స్నేహమున
కులమత భేదాలు కూడదని వాక్రుచ్చి
మానవత్వమె విశ్వమతమని చాటేటి ||గురజాడ||

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 4 | సంచిక 4 అక్టోబర్-డిసెంబర్ 2024

మమత-సమత-మానవత
www.gurajada.org



## మనిషి

మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయి రప్పల
కన్న కనిష్టం

గాను చూస్తా వేల, బేలా ?
దేవు(డెకడో దాగెనంటూ
కొండ కోనల వెతుకులాడే
వేలా ?

కన్ను తెరిచిన కానబడడో ?
మనిషి మాత్రుడి యందు లేడో ?
యెరిగి కోరిన కరిగి యీడో
ముక్తి ?